శ్రీశ్రీ సినిమా పాటలు
రూ॥180/-
పేజీలు:180



నవచేతన పబ్లిషింగ్ హౌస్
నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ (నాగోల్),
హైదరాబాద్-68. ఫోన్: 040-29884453/54
E-mail: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
బ్యాంక్ స్ట్రీట్(ఆబిడ్స్),హిమాయత్‌నగర్,
బండ్లగూడ(నాగోల్)- హైదరాబాద్
హన్మకొండ.



www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★★★


‘పిఎం-కిసాన్’ మరో ఐదేళ్లు పొడిగింపు

రూ. 3.15 లక్షల కోట్లు కేటాయింపు

‘ప్రధానమంత్రి సూర్య సరోవర్ యోజన’కు రూ.5,070 కోట్లు

రూ.84,084 కోట్ల విలువైన ‘సముద్ర మంథన్’ ప్రాజెక్టుకు కేంద్ర కేబినెట్ ఆమోదం

07


సంపుటి 09, సంచిక: 242 | శనివారం | 01-08-2026 | ఖమ్మం
Published from: **Khammam, Hyderabad, Karimnagar, Mahabubnagar**
పేజీలు: 12+8 | వెల రూ. 5.00




## రాష్ట్రంలో మరోసారి ‘సర్’ పొడిగింపు

10 వరకు ఇంటింటి పరిశీలనకు అవకాశం

ఇప్పటికే 77 శాతం ప్రక్రియ పూర్తి

ప్రజాపక్షం/హైదరాబాద్

రాష్ట్రంలో కొనసాగుతున్న ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో ఇంటింటి పరిశీలన గడువును భారత ఎన్నికల సంఘం మరోసారి పొడిగించింది. ఆగస్టు 3తో ముగియాల్సిన ఈ గడువును ఆగస్టు 10 వరకు పెంచుతూ శుక్రవారం నిర్ణయం వెలువడింది. ఓటర్ల జాబితా సవరణకు తొలుత జూలై 24 వరకు గడువు నిర్ణయించగా, అనంతరం దానిని ఆగస్టు 3 వరకు పొడిగించారు. తాజాగా మరోసారి గడువు పెంచడంతో ఆగస్టు 10 వరకు ఇంటింటి పరిశీలనతో పాటు ఎన్యూమరేషన్ ఫారమ్‌ల సమర్పణకు అవకాశం లభించింది.

**77 శాతం పూర్తయిన సర్వే**

రాష్ట్రవ్యాప్తంగా తరువాయి 12లో

## ఆగస్టులోనూ లోటు

● మలిదశ వర్షాకాలంలో సాధారణంకన్నా తక్కువ వర్షపాతం
● ఆగస్టు-సెప్టెంబరులో దేశవ్యాప్త సగటు వర్షపాతం 94 శాతం లోపు ● జూన్, జులై నెలల మధ్య కాలానికి సంబంధించి 13 శాతం లోటు వర్షపాతం : ఐఎండి అంచన

**న్యూఢిల్లీ :** ఆగస్టు, సెప్టెంబర్ వరకు సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదువుతుందని ఐఎండి అంచనా వేసింది. రైతులు పంటలు వేసే వేళ భారత వాతావరణ శాఖ శుక్రవారం తన నెల వారీ అంచనాలు వెల్లడించింది. వర్షాకాల మలి దశ రుతుపవన వర్షాలు సాధారణంగా కంటే తక్కువగా కురిసే అవకాశం ఉందని పేర్కొంది. ఆగస్టు, సెప్టెంబర్ కాలంలో దేశవ్యాప్త వర్షపాతం దీర్ఘకాలిక సగటు (ఎల్‌పిఎ)లో 94 శాతం కంటే తక్కువగా ఉండే అవకాశం ఉంది. 1971 నుంచి 2020 వరకు చారిత్రక డేటా ప్రకారం, ఆగస్టు—సెప్టెంబర్ కాలానికి దేశవ్యాప్త సగటు వర్షపాతం (ఎల్‌పిఎ) 422.8 మి.మీ.గా ఉంది. వాతావరణ శాఖ డైరెక్టర్ జనరల్ డాక్టర్ మృత్యుంజయ్ మహాపాత్ర మాట్లాడుతూ, ‘ఆగస్టు—సెప్టెంబర్ కాలంలో దేశంలోని చాలా ప్రాంతాల్లో సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదు అవుతుంది. అయితే దక్షిణ భారతదేశంలోని కొన్ని ప్రాంతాలు, మధ్య భారతదేశం, వాయువ్య భారతదేశంలోని ఉత్తర ప్రాంతాలు, తూర్పు, ఈశాన్య భారతదేశాల్లో మాత్రం సాధారణం నుంచి సాధారణం కంటే ఎక్కువ వర్షాలు కురిసే అవకాశం ఉంది’ అని తెలిపారు. దేశవ్యాప్తంగా ఆగస్టు నెలలో కూడా వర్షపాతం సాధారణం కంటే తక్కువగా ఉంటుందని ఐఎండి అంచనా వేసింది. 1971—2020 గణాంకాల ప్రకారం, ఆగస్టు నెలలో దేశంలో వర్షపాతం ఎల్‌పిఎ 254.9 మి.మీ.గా ఉంది. ప్రస్తుతం, జూన్, జులై నెలల మధ్య కాలానికి సంబంధించి 13 శాతం లోటు వర్షపాతం నమోదైంది. జూన్ నెలాఖరు నాటికి ఈ లోటు తరువాయి 8లో

## టామ్‌కామ్‌దే బాధ్యత

● ఉద్యోగాలకు శిక్షణ, మేళాలు, పాస్‌పోర్ట్, ఉద్యోగ అవకాశాలు కల్పించేవరకు దగ్గరుండి చూసుకోవాలి
● ‘శక్తి’ శాఖ సమీక్షలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
● కార్మికులను విదేశాలకు తరలించే ఏజెంట్లు, వారు పంపించే కార్మికుల వివరాలు నమోదు
● టామ్‌కామ్‌కు సిఇఒగా మాజీ ఐఎఫ్ఎస్ అధికారి నియామకం ● డిమాండ్‌కు తగినట్లు నర్సింగ్ కళాశాలలు, యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీలో రీసెర్చ్ సెంటర్ ఏర్పాటు చేయాలని సూచన




ప్రజాపక్షం/హైదరాబాద్

విదేశాల్లో ఉద్యోగాలకు అవసరమైన శిక్షణ, ఉద్యోగ మేళాలతో పాటు ఉద్యోగార్థులకు అవసరమైన పాస్‌పోర్ట్, వివిధ దేశాల్లో వారికి ఉపాధి అవకాశాలు కల్పించే బాధ్యతను తెలంగాణా ఓవర్‌సిస్ మ్యాన్‌పవర్ కంపెనీ లిమిటెడ్ (టామ్‌కామ్) తీసుకోవాలని తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి అన్నారు. ‘శక్తి శాఖ’పై ఆ శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామితో కలిసి సిఎం రేవంత్ రెడ్డి శుక్రవారం సమీక్ష నిర్వహించారు. ఉత్తర తెలంగాణ నుంచి పెద్ద సంఖ్యలో కార్మికులు మధ్య ప్రాచ్య దేశాలకు వెళుతుంటారని, ఈ క్రమంలో వారు ఏజెంట్ల చేతిలో మోసపోయి ఇబ్బందిపడుతున్నారని సిఎం తెలిపారు. ఉపాధి నిమిత్తం విదేశాలకు వెళ్లే వారికి పాస్‌పోర్ట్‌లు ఇప్పించడంతో పాటు వారు వెళ్లే దేశాల్లోని మ్యాన్‌పవర్ కంపెనీలతో ఒప్పందాలను టామ్‌కామ్ చేసుకోవాలని సిఎం సూచించారు. విదేశీ కంపెనీలతో టామ్‌కామ్ ఒప్పందం చేసుకోవడం ద్వారా అక్కడకు వెళ్లిన వారికి ఏవైనా ఇబ్బందులు ఎదురైతే చర్చలు జరపడానికి, వారికి న్యాయం చేయడానికి వీలుంటుందని సిఎం అభిప్రాయపడ్డారు. కార్మికులను విదేశాలకు తరలించే ఏజెంట్ల వివరాలు సేకరించి వారు పంపించే ప్రతి వ్యక్తి వివరాలు నమోదు చేయాలని సిఎం సూచించారు. ఈ వ్యవహారాల పర్యవేక్షణకు టామ్‌కామ్‌కు మాజీ ఐఎఫ్ఎస్ అధికారిని సిఈఓగా నియమిస్తామని సిఎం ప్రకటించారు. ఉద్యోగార్థులకు లైట్ మోటార్ వెహికల్, హెవీ మోటార్ వెహికల్ డ్రైవింగ్‌లోనూ శిక్షణ ఇప్పించాలని ఆయన సూచించారు.

**స్కిల్ యూనివర్సిటీల్లో రీసెర్చ్ సెంటర్ ఏర్పాటు**


యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీలో నూతన ఆవిష్కరణలకు అవసరమైన రీసెర్చ్ సెంటర్ ఏర్పాటు చేయాలని సిఎం రేవంత్ రెడ్డి సూచించారు. జర్మనీ, జపనీస్, కొరియన్, చైనీస్, రష్యన్ తదితర భాషలు నేర్చుకునేందుకు వీలుగా స్కిల్ యూనివర్సిటీలో ప్రత్యేక విభాగాన్ని నెలకొల్పాలన్నారు. విదేశీ భాషలు నేర్పేందుకు స్థానికంగా ఆ భాషలో పట్టున్న వారితో తరువాయి 8లో

## జూడోలో భారత్‌కు రెండు స్వర్ణాలు





**గ్లాస్గో:** కామన్వెల్త్ క్రీడల్లో భారత్ పతకాల వేట కొనసాగుతోంది. తాజాగా మరో 2 స్వర్ణాలు భారత్ ఖాతాలో వచ్చి చేరాయి. జూడో 48 కిలోల మహిళల విభాగంలో అస్మిత దే పసిడి కొల్లగొట్టి చరిత్ర సృష్టించింది. జూడో క్రీడలో బంగారు పతకం సాధించిన తొలి భారత క్రీడాకారిణిగా రికార్డు నెలకొల్పింది. ఫైనల్‌లో కెనడాకు చెందిన హీడి క్యాచ్‌ను 21 తేడాతో ఓడించి ఆమె ఈ ఘనత సాధించింది. మరోవైపు జూడో 60 కిలోల పురుషుల విభాగంలో హర్ష్ సింగ్ కూడా స్వర్ణం సాధించాడు. ఫైనల్ పోరులో ఆస్ట్రేలియాకు చెందిన జాషువా కట్జ్‌పై విజయ బావుటా ఎగరేశాడు.



## సనత్‌నగర్ టిమ్స్‌కు మర్రి చెన్నారెడ్డి పేరు

ఇన్‌చార్జి డైరెక్టర్‌గా నరేంద్ర కుమార్, డిఎంఇగా వాణి నియామకం

ప్రజాపక్షం/హైదరాబాద్

రాష్ట్రంలోని తెలంగాణ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ సనత్‌నగర్‌కు (టిమ్స్) మాజీ ముఖ్యమంత్రి ‘డాక్టర్ మర్రి చెన్నారెడ్డి’గా పేరును రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నది. టిమ్స్ ఇన్‌ఛార్జ్ డైరెక్టర్‌గా ప్రస్తుత మెడికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ డాక్టర్ నరేంద్ర కుమార్, డీఎంఈగా డాక్టర్ వాణిని నియమించింది. ఈ మేరకు రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ ముఖ్యకార్యదర్శి డాక్టర్ క్రిస్టియాన జెడ్ చొంగ్తు మూడు వేర్వేరు ఉత్తర్వులను జారీ చేశారు. ప్రస్తుతం డిఎంఇగా ఉన్న డాక్టర్ ఎ. నరేంద్ర కుమార్ శుక్రవారంతో పదవీవిరమణ చేయనున్న నేపథ్యంలో, ఆయన సుదీర్ఘ పరిపాలనా అనుభవాన్ని దృష్టిలో పెట్టుకుని ఆయనను డాక్టర్ మర్రి చెన్నారెడ్డి టిమ్స్ తరువాయి 12లో

## హైడ్రా కమిషనర్ బదిలీపై సిఎస్‌కు ఆదేశం

56 పేజీల తీర్పు విడుదల చేసిన హైకోర్టు






ప్రజాపక్షం/హైదరాబాద్

వ్యక్తుల ఆధిపత్యం కంటే చట్టబద్ధ పాలనకే ప్రజాస్వామ్యంలో ప్రాధాన్యం ఉంటుందని హైకోర్టు స్పష్టం చేసింది. కోర్టు ఆదేశాలను ఉద్దేశపూర్వకంగా ఉల్లంఘించడం న్యాయవ్యవస్థ అధికారాన్నే సవాలు చేసినట్లేనని పేర్కొంది. హైడ్రా కమిషనర్ ఏ.వి.రంగనాథ్‌పై నమోదైన కోర్టు ధిక్కరణ కేసులో జస్టిస్ జూకంటి అనిల్‌కుమార్ ఇచ్చిన 56 పేజీల తీర్పు ప్రతి శుక్రవారం అందుబాటులోకి వచ్చింది. న్యాయపాలనపై తరువాయి 8లో

## పార్లమెంట్ ఉభయసభల్లో ప్రతిష్టంభన

**హోంమంత్రి సభకు రావాలని విపక్ష సభ్యుల పట్టు**

● విద్యార్థులు, యువతపై అమానుష దాడికి సంబంధించి అమిత్ షా ప్రకటన చేయాలని డిమాండ్ ● ముందస్తు ప్రణాళికతోనే ప్రతిపక్ష సభ్యులు గందరగోళం సృష్టిస్తున్నాయని స్పీకర్, చైర్మన్ అసహనం
● ప్రతిపక్ష నినాదాల మధ్య జనన మరణ ధృవీకరణ బిల్లు ఆమోదం

**న్యూఢిల్లీ :** నీట్ పేపర్ లీక్‌పై ఢిల్లీలో విద్యార్థులు, యువత చేపట్టిన ‘పార్లమెంట్ మార్చ్’ సందర్భంగా వారిపై పోలీసుల అమానుష దాడికి వ్యతిరేకంగా పార్లమెంట్ ఉభయల్లో విపక్ష ఎంపిలు తమ పట్టుబిగించాయి. కేంద్ర హోంమంత్రి సభకు రావాలని, విద్యార్థులు, యువతపై ప్రాణాంతక ఆయుధాలతో దాడికి ఎవరు అనుమతించారో సమాధానం చెప్పాలని శుక్రవారం కూడా డిమాండ్ చేశాయి. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ఉభయసభలను విపక్ష ఎంపిలు హోరెత్తించారు. సభా కార్యక్రమాలను ముందుకు సాగనివ్వలేదు. ఇతర అంశాలపై కూడా సభలను స్తంభింపజేశారు. దీంతో ఉభయసభలు పలుమార్లు వాయిదా పడుతూ వస్తూ చివరకు సోమవారానికి స్పీకర్, చైర్మన్ వాయిదా వేశారు. అయితే ప్రతిపక్ష ఎంపిల నిరసనలు, ఆందోళనల మధ్యే శుక్రవారం జనన మరణాల నమోదు (సవరణ) బిల్లు, 2026ను ఆమోదించారు. కాగా ఉదయం లోక్‌సభ ప్రారంభమైన వెంటనే నీట్ పేపర్ లీక్, ఆందోళన చేస్తున్న విద్యార్థులపై పోలీసుల అణచివేతకు వ్యతిరేకంగా ప్రతిపక్ష సభ్యులు నినాదాలు చేయడంతో లోక్‌సభ కార్యకలాపాలను మధ్యాహ్నం వరకు వాయిదా వేశారు. ప్రతిపక్ష సభ్యులు ముందస్తు ప్రణాళికతోనే సభా కార్యకలాపాలకు అంతరాయం కలిగించారని లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా అన్నారు. కాంగ్రెస్ నాయకురాలు ప్రియాంక గాంధీ వాద్రా ప్రశ్న అడగడానికి నిలబడుతున్నారు, కానీ ప్రతిపక్ష సభ్యులు ప్రశ్నోత్తరాల సమయాన్ని కొనసాగనివ్వడం లేదు అని అన్నారు. రాజ్యసభలోనూ విపక్ష ఎంపిలు నినాదాలు కొనసాగించారు. శుక్రవారం ఉదయం 11 గంటలకు సమావేశమైన కొద్దిసేపటికే సభ ఆగస్టు 3వ తేదీకి వాయిదా పడింది. సభ కార్యకలాపాలు ప్రారంభమై, పత్రాలను తరువాయి 8లో




## అయోధ్య విరాళాల చోరీపై పార్లమెంట్ వద్ద స్కిట్

అతిథి పాత్రలో ప్రతిపక్షనేత రాహుల్ గాంధీ

‘చందా చోర్’పై ఎంపిల విన్నూత ప్రదర్శన

అయోధ్యలో రామాలయంలో విరాళాల చోరీపై ప్రతిపక్ష ఎంపిలు పార్లమెంట్ ఆవరణలో వరుసగా రెండవ రోజు కూడా నిరసన ప్రదర్శన నిర్వహించారు. కాషాయ వస్త్రాలు ధరించిన స్వతంత్ర ఎంపి పప్పు యాదవ్, ఇతర ప్రతిపక్ష ఎంపిలతో కలిసి శుక్రవారం రామ మందిరంలో విరాళాల దొంగతనంపై ఆందోళన చేశారు. విరాళాల దొంగతనం, అలాగే జూలై 20న జరిగిన పార్లమెంట్ మార్చ్ సందర్భంగా విద్యార్థి ఆందోళనకారులపై పోలీసుల అణచివేతకు వ్యతిరేకంగా జరిగిన ఈ నిరసనలో కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, మాజీ పార్టీ అధినేత రాహుల్ గాంధీ పాల్గొన్నారు. హోం మంత్రి అమిత్ షా రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ, సభా కార్యకలాపాలకు ఆయన గైర్హాజరును ఇండియా కూటమి ఎంపిలు ప్రశ్నించారు. పార్లమెంట్ మకర ద్వారం ముందు నిరసన తెలుపుతూ, చట్టసభ సభ్యులు ‘అమిత్ షా ఇస్తిఫా దో’, ‘అమిత్ షా సదన్ మే ఆవో’, ‘చందా చోర్, గద్దీ ఛోడ్’ వంటి నినాదాలు చేశారు. అయితే పార్లమెంట్ విరాళాల చోరీపై ఒక వినూత్న స్కిట్‌ను ప్రదర్శించారు. కాషాయ వస్త్రాలు ధరించి, ఓ సన్యాసి వేషంలో వచ్చిన పప్పు యాదవ్ పార్లమెంట్ పరిసరాల్లో కూర్చొని విరాళాలు తరువాయి 8లో

## రేపు మధ్యాహ్న భోజన పథకం వర్కర్ల రాష్ట్ర 3వ మహాసభలు

ప్రజాపక్షం/హైదరాబాద్

తెలంగాణ రాష్ట్ర మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ (ఎఐటియుసి) రాష్ట్ర 3వ మహాసభలు రేపు(ఆగస్టు 2)న ఉదయం 10 గంటలకు హైదరాబాద్‌లోని ఎఐటియుసి రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించనున్నట్లు యూనియన్ నాయకులు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మహాసభలను జాతీయ మధ్యాహ్న భోజన పథకం అధ్యక్షురాలు డాక్టర్ బి.వి. విజయలక్ష్మి ప్రారంభించనున్నారు. ముఖ్య అతిథులుగా సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం, ఎఐటియుసి రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి ఎం. నరసింహ పాల్గొని ప్రసంగించనున్నారు. రాష్ట్రవ్యాప్తంగా మధ్యాహ్న భోజన పథకం వర్కర్లు ఎదుర్కొంటున్న సమస్యలు, భవిష్యత్ కార్యాచరణ, సంఘం బలోపేతం, కార్మికుల హక్కుల పరిరక్షణ తదితర అంశాలపై మహాసభలో చర్చించి కీలక తీర్మానాలు చేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. జిల్లాల నుంచి యూనియన్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరై రాష్ట్ర 3వ మహాసభలను విజయవంతం చేయాలని తెలంగాణ రాష్ట్ర మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ (ఎఐటియుసి) రాష్ట్ర కమిటీ విజ్ఞప్తి చేసింది.



## 19 ఏళ్ల తర్వాత కోల్‌కతాకు తస్లీమా నస్రీన్

‘నా సొంతదేశానికి తిరిగి వచ్చినట్లుంది’అని వ్యాఖ్య

**కోల్‌కతా :** ప్రవాసంలో ఉన్న బంగ్లాదేశ్ రచయిత్రి తస్లీమా నస్రీన్ దాదాపు 19 సంవత్సరాల సుదీర్ఘ కాలం తర్వాత శుక్రవారం కోల్‌కతాకు తిరిగి వచ్చారు. తాను ఇప్పటికీ తన సొంత నగరంగా భావించే కోల్‌కతా నగరానికి రావడం ‘ఒక భావోద్వేగ భరితమైన అనుభూతి’ అని తస్లీమా అభివర్ణించారు. పశ్చిమ బెంగాల్‌లోని నూతన బిజెపి ప్రభుత్వం హయాంలో రాజకీయ ప్రాధాన్యతను సంతరించుకున్న శనివారంనాటి ఒక సాహిత్య కార్యక్రమానికి ముందురోజైన శుక్రవారం రచయిత్రి తస్లీమా నస్రీన్ ఇక్కడికి చేరుకున్నారు. నేతాజీ సుభాష్ చంద్రబోస్ అంతర్జాతీయ విమానాశ్రయంలో ఆమెకు స్వాగతం పలకడానికి విచ్చేసిన వారికి తస్లీమా చేతులు జోడించి వినమ్రంగా నమస్కరించారు. ‘నేను ఇక్కడకు తిరిగి రావడం నాకు చాలా సంతోషంగా ఉంది’అని తస్లీమా వారిని ఉద్దేశించి అన్నారు. ఆమె తరువాయి 12లో

## ఉగ్ర గోదావరి

● భద్రాచలం వద్ద 2వ ప్రమాద హెచ్చరిక జారీ ● 49 అడుగులకు చేరిన వరదనీరు ● అర్ధరాత్రికి 52 అడుగులకు చేరుకునే అవకాశం
● ఇసుక ర్యాంపులో చిక్కుకున్న కూలీలు, లారీ డ్రైవర్లను రక్షించిన అధికారులు ● ర్యాంపులోనే 40 లారీలు

ప్రజాపక్షం/భద్రాచలం

భద్రాచలం వద్ద గోదావరి ఉగ్రరూపం దాలుస్తోంది. కడపటి వార్తలు అందే సమయానికి గోదావరి నీటి మట్టం 47 అడుగులకు చేరుకుంది. 11,44,645 క్యూసెక్కుల నీరు దిగువకు విడుదలవుతోంది. దీంతో అధికారులు రెండో ప్రమాదహెచ్చరిక జారీ చేశారు. ఈ వరద ప్రవాహం మరింత పెరిగిన అర్ధరాత్రికి 52 అడుగల వరకు చేరుకునే అవకాశం ఉందని కేంద్ర జలవనరుల సంఘం అధికారులు తెలిపారు. ఎగువన కురుస్తున్న భారీ వర్షాలకు గోదావరికి వరద పోటెత్తింది. ఛత్తీస్‌గఢ్ కురుస్తున్న వర్షాలకు తెలంగాణలోని చర్ల మండలంలోని తాలిపేరు ప్రాజెక్టులోకి భారీ వర్షపు నీరు వచ్చి చేరడంతో అధికారులు తాలిపేరు గేట్లు ఎత్తి నీటిని దిగువకు విడుదల చేశారు. గడిచిన రెండు రోజులుగా తాలిపేరు నుండి సుమారు 2 లక్షల క్యూసెక్కుల నీరు గోదావరిలో కలిసింది. ఎగువన వరద ప్రవాహం ఉండటంతో మరింతగా వరద పెరిగే అవకాశం ఉన్న తరువాయి 8లో




## వారం పాటు వర్షాలు

ప్రజాపక్షం/హైదరాబాద్

రాష్ట్రంలో వచ్చే వారం రోజుల పాటు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. శుక్రవారం సాయంత్రం విడుదల చేసిన బులెటిన్‌లో రాష్ట్రవ్యాప్తంగా పలు ప్రాంతాల్లో వర్షాలు నమోదయ్యే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. శుక్రవారం నుంచి శనివారం వరకు రాష్ట్రంలోని కొన్ని ప్రాంతాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. శనివారం నుంచి తరువాయి 8లో

## నిరాయుధీకరణకు హమాస్ ఓకె

గాజా యుద్ధానికి ముగింపు దిశగా అడుగు?




**కైరో:** గాజా యుద్ధానికి ముగింపు పలికే ప్రయత్నాల్లో కీలక పరిణామంగా, హమాస్ తన ఆయుధాలను వదులుకునే ప్రక్రియకు అంగీకరించినట్టు ప్రకటించింది. ఇది సానుకూల పరిణామమే అయినప్పటికీ, వెంటనే అమలయ్యే ఒప్పందం కాదని, అనేక రాజకీయ, భద్రతా పరమైన సవాళ్లు ఎదురవుతాయని అంతర్జాతీయ పరిశీలకులు భావిస్తున్నారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించిన కాల్పుల విరమణ ప్రణాళికలో భాగంగా హమాస్ నిరాయుధీకరణ, ఇజ్రాయెల్ సైనిక ఉపసంహరణ, గాజాలో కొత్త పాలస్తీనియన్ పరిపాలన ఏర్పాటు వంటి అంశాలు ఉన్నాయి. హమాస్ ఒక దశల వారీ ప్రణాళికకు అంగీకరించిందని ఆ సంస్థకు చెందిన అధికారి తెలిపారు. అయితే ఇజ్రాయెల్ కూడా యుద్ధాన్ని నిలిపివేయడం, గాజా నుంచి సైన్యాన్ని ఉపసంహరించుకోవడం వంటి చర్యలు తీసుకోవాలని హమాస్ షరతు పెట్టింది. కాగా, హమాస్‌కు ఆయుధాలను వదులుకోవడం ఒక చారిత్రక మార్పుగా తరువాయి 12లో

# పైవేటు విద్యతో ప్రభుత్వ విద్య పోటీపడాలంటే...

ప్రైవేటు విద్యాసంస్థల దోపిడీనుంచి సామాన్య ప్రజలను కాపాడటం ఎలా? ప్రభుత్వ విద్యను మౌలికవసతులు, బోధన, ఫలితాల విషయంలో ప్రైవేటు విద్యకు దీటుగా నిలపటం ఎలా? ప్రభుత్వం విద్యపై భారీగా వెచ్చిస్తున్నా, అర్హత గల అధ్యాపకులు ప్రభుత్వ స్కూళ్లు, కాలేజీల్లోనే ఉన్నా ప్రభుత్వ విద్య – ప్రాథమిక స్థాయినుంచి కాలేజి స్థాయివరకు ఎందుకు కునారిల్లుతున్నది. దీన్ని ఉద్ధరించటం ఎలా? అన్న సమస్య కొంతకాలంగా రెండు తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలను వేధిస్తున్నది. కొన్ని ఆరంభ చర్యలు తీసుకున్నా, ప్రభుత్వ స్కూళ్లలో నాణ్యమైన విద్య లభిస్తుందనీ, తమ పిల్లల భవిష్యత్‌కు భరోసా ఏర్పడుతుందనే విశ్వాసం తల్లిదండ్రుల్లో కలిగించటంలో వైఫల్యం కొనసాగుతున్నది. తెలంగాణలో స్వయంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి (విద్యాశాఖ ఆయనే నిర్వహిస్తున్నారు), ఆంధ్రప్రదేశ్‌లో విద్యామంత్రి నారా లోకేశ్ నిజంగా గట్టి ప్రయత్నాలు చేస్తున్నారు. ఆరంభ ఫలితాలు సాధించారు కూడా. అయితే ప్రభుత్వ విద్య దుస్థితికి కారణాలను లోతుగా అధ్యయనం చేసి, చిత్తశుద్ధితో దిద్దుబాటు చర్యలు తీసుకోనిదే పరిస్థితిని తిరోముఖం పట్టించి ప్రభుత్వ విద్యపట్ల విశ్వాస పునరుద్ధరణ సాధ్యంకాదు. ప్రభుత్వం నియమించిన ఆకునూరి మురళి కమిషన్ సిఫారసులు ఈ సందర్భంగా ప్రయోజనకరంగా ఉంటాయి.

దేశంలోకి 1990వ దశకం ఆరంభంలో ఆర్థిక సంస్కరణలతోపాటే విద్యారంగం సరళీకరణ, ప్రైవేటీకరణ ప్రభుత్వ విధానంగా అమలులోకి వచ్చింది. అప్పటివరకు నిరుద్యోగ విద్యావంతులు జీవనోపాధిగా ట్యుటోరియల్స్ పద్ధతిలో చెదురుమదురుగా విద్యాసంస్థలు నడుపుతుండేవారు. ఎప్పుడైతే ప్రభుత్వం ఒక విధానంగా ప్రైవేటు విద్యకు ద్వారాలు బార్లా తెరిచిందో, ఇంగ్లీషు మీడియం ఆకర్షణగా ప్రైవేటు విద్యాసంస్థలు ముందు పట్టణ ప్రాంతాల్లో మొదలై క్రమంగా మండలస్థాయి వరకు వ్యాపించాయి. యూనిఫారాలు, టై, బూట్లు, రవాణాకు బస్సులతో అదొక ఆకర్షణగా తయారైంది. ఆర్థిక స్థోమత కలిగిన స్కూళ్ల యజమానులు 10 వ తరగతిలో మంచి ఫలితాలు సాధించివ్యాపారాన్ని పెంచుకునేందుకై అధిక మొత్తాల చెల్లింపుతో రిటైర్డ్, వర్కింగ్ ప్రభుత్వ ఉపాధ్యాయుల సేవలు సంపాదించుకోవటం మొదలైంది. ముమ్మరంగా రుబ్బుడు విద్యతో, వారంవారం పరీక్షలతో మార్కుల ఆర్జనకు పదును పెట్టారు. ఇది ఆర్థికంగా తమకు భారమైనప్పటికీ సామాన్యులు సైతం కడుపుగట్టుకుని తమ పిల్లల్ని కాన్వెంట్ బడులకు పంపటం మొదలుపెట్టారు. ప్రభుత్వ స్కూళ్లు ఎస్‌సి, ఎస్‌టి, కొద్దిమంది బిసిలకే పరిమితమై ప్రాథమిక పాఠశాలలలో విద్యార్థుల సంఖ్య వ్రేళ్లపై లెక్కించదగిన స్థాయికి పడిపోయింది. రెండోవైపున, ప్రపంచీకరణ మోజులో మార్కెట్‌కు అవసరమైన ఇంజనీర్‌ల తయారీకి ఇంటర్ విద్యనుంచి ఇంజనీరింగ్ విద్యవరకు ప్రభుత్వాలు ప్రైవేటు కాలేజీలను ప్రోత్సహించాయి. ప్రభుత్వ విద్యను ఉద్దేశపూర్వకంగానే నిర్లక్ష్యం చేశాయి. దీనితో ఇంటర్ విద్య పూర్తిగా కార్పొరేటీకరణ పొందగా, ప్రధానంగా రాజకీయ నాయకులే వృత్తి విద్య కళాశాలలు నెలకొల్పారు. అవి బతికిబట్టకట్టేందుకు ప్రభుత్వ నాయకత్వం అవసరార్థులకే కాకుండా అందరికీ ఫీజు రీయింబర్స్‌మెంట్ ప్రవేశపెట్టింది. అది ఏటా పెరుగుతూ తడిసిమోపెడై ప్రభుత్వాలకు మోయలేని భారమైంది. రెండోవైపున, వృత్తివిద్యలో నాణ్యత తగ్గింది. పరిశ్రమలతో అనుసంధానం లేనందున మార్కెట్ అవసరాలకు తగిన నైపుణ్యాలు కరవైనాయి.

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రాష్ట్రంలో ప్రభుత్వ విద్య మెరుగుదలకు, ఆకర్షణీయమైన ఫలితాలతో తల్లిదండ్రుల ఆలోచనలో మార్పు తెచ్చి, పిల్లలను ప్రభుత్వ స్కూళ్లవైపు మళ్లించేందుకు వినూత్న ప్రయత్నం చేస్తున్నారు. ఇంటిగ్రేటెడ్ స్కూళ్లు, రెసిడెన్షియల్ స్కూళ్లు నిర్మాణం ఒక పద్ధతి ప్రకారం చేబట్టారు. ఈ సంవత్సరం అటువంటి కొన్ని స్కూళ్లలో 'నో అడ్మిషన్' బోర్డులు పెట్టటం ప్రభుత్వ కృషికి కితాబు. విద్య మెరుగుదల చర్యల్లో మొదటి పార్శ్వం ప్రభుత్వ స్కూలు విద్యను తీర్చిదిద్దటం. నామమాత్రపు విద్యార్థుల సంఖ్యతో స్కూళ్లు నడపటంకన్నా ఒక్కో నియోజకవర్గంలో ఆధునిక వసతులతో స్కూళ్లు ఏర్పాటు చేసి గ్రామీణ విద్యార్థులకు మంచి చదువు అందించటం. దీనిపై కొన్ని విమర్శలున్నా తల్లిదండ్రులను, టీచర్లను మోటివేట్ చేస్తే ఈ ప్రయోగం హర్షించదగిందే. పాఠశాలనుంచి ఇంటర్ కాలేజీలవరకు బ్రేక్‌ఫాస్ట్, మధ్యాహ్నం భోజనం అందించటం మంచి ప్రోత్సాహమే గాని, నాణ్యమైన బోధన, క్రమశిక్షణ అంతకన్నా ముఖ్యం. ఇందుకుగాను ముఖ్యమంత్రి చేస్తున్న మరో ప్రయోగం ఆహ్వానించదగింది. కొందరు ప్రభుత్వ ఉపాధ్యాయులను ఎంపిక చేసి విదేశాలకు విద్యాయాత్రకు పంపుతున్నారు. ప్రపంచ విద్యారంగంలో వస్తున్న మార్పులను స్వయంగా తిలకించటం వారిని మోటివేట్ చేస్తుందని, దానివల్ల విద్యావ్యవస్థ మెరుగవుతుందని ఆయన విశ్వాసం. అలా యాత్రకు వెళ్లి వచ్చిన టీచర్లతో ముఖ్యమంత్రి గురువారం నిర్వహించిన సమావేశంలో నిర్మొహమాటంగా మాట్లాడారు.

ఉపాధ్యాయులు ఎప్పుడూ తమ కోర్కెలపై ప్రభుత్వంతో కొట్లాడటమేకాదు, విద్యను మెరుగుపరచాల్సిన బాధ్యతను ముఖ్యమంత్రి వారిపై పెట్టారు. ప్రతి మండలంలో టీచర్లు సమావేశాలు జరిపి పాఠశాలల్లో వసతుల మెరుగుదలతో పాటు విద్యార్థులను ప్రభుత్వ స్కూలుకు ఆకర్షించేందుకు తీసుకోవలసిన చర్యలు, హేతుబద్ధీకరణ వంటి అంశాలపై డిసెంబర్‌లోగా నివేదికలివ్వాలని కోరారు. వాటిని క్రోడీకరించి వచ్చే విద్యాసంవత్సరం నుంచి అమలు చేసేందుకు తనకు మూడు–నాలుగు మాసాలు సమయం లభిస్తుందన్నారు. ఈ ప్రయత్నం గ్రామీణ విద్యలో ఒక మలుపు కావాలని ఆశించుదాం.



## పౌరులపట్ల పాక్ సైన్యం నిరంకుశత్వం

పిఒకె స్థానిక సంస్థల ఎన్నికల సందర్భంగా జులై 27 నుంచి జరుగుతున్న సైన్యం దాడుల్లో 40 మందికి పైగా ప్రాణాలు కోల్పోయారు. సామాన్య పౌరుల పట్ల పాక్ సైన్యం నిరంకుశంగా ప్రవర్తిస్తోంది. పిఒకెలోని ప్రజలను పాక్ రక్షణశాఖ మంత్రి శత్రువులుగా అభివర్ణించారు. ఆ తర్వాతే వారిపై సైన్యం దాడుల్ని తీవ్రం చేసింది. మరోవైపు భారత్‌ను దెబ్బతీసేందుకు పాక్ గతంలో ముజాహిదీన్లకు శిక్షణ ఇచ్చి, ఆయుధాలు సమకూర్చింది. వారే ఇప్పుడు తమ తుపాకులను సొంత దేశంపై గురిపెట్టారు.

– భారత విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్

# ఆరోగ్యవంతమైన భారత్‌కు ఆధునిక ప్రజారోగ్యచట్టం అత్యవసరం

ప్రజారోగ్యం అనేది కేవలం వ్యాధులకు చికిత్స అందించే వ్యవస్థ కాదు. సమాజం సమిష్టి కృషి ద్వారా వ్యాధులను నివారించడం, ఆయుష్షును పెంచడం, ఆరోగ్యాన్ని ప్రోత్సహించడం అనే శాస్త్రం, కళ. ఈ లక్ష్యాలను సాధించేందుకు ప్రజారోగ్య చట్టం రాష్ట్రం, స్థానిక సంస్థలు, సమాజం కలిసి పనిచేసే విధానాన్ని, అధికారాలను, బాధ్యతలను నిర్దేశిస్తుంది. అదే సమయంలో వ్యక్తిగత స్వేచ్ఛ, గోప్యత, ఆస్తి హక్కులు వంటి మౌలిక హక్కులను రక్షిస్తూ ప్రభుత్వ అధికారాలకు తగిన పరిమితులను కూడా విధిస్తుంది.

**ఆరోగ్య వ్యవస్థకు కనిపించని వెన్నెముక**

అమెరికన్ పబ్లిక్ హెల్త్ అసోసియేషన్, సెంటర్స్ ఫర్ డిసీజ్ కంట్రోల్ అండ్ ప్రివెన్షన్, పాన్ అమెరికన్ హెల్త్ ఆర్గనైజేషన్, ప్రపంచ ఆరోగ్య సంస్థ వంటి సంస్థలు ప్రజారోగ్యానికి అవసరమైన మౌలిక సేవలను నిర్వచించాయి. వ్యాధుల పర్యవేక్షణ, పారిశుద్ధ్యం, ఆహార భద్రత, సురక్షిత తాగునీరు, ఆరోగ్య అవగాహన, వ్యాధి నివారణ వంటి సేవలు సమాజ ఆరోగ్యానికి పునాదిగా నిలుస్తాయి. ఇవి ప్రజలకు ప్రత్యక్షంగా కనిపించకపోయినా ఆరోగ్య వ్యవస్థకు వెన్నెముక వంటివి. ఈ వ్యవస్థలు బలహీనపడితే నివారించగలిగే వ్యాధులు, మరణాలు పెరిగే ప్రమాదం ఉంది. ప్రజారోగ్య ఫలితాలు వైద్యరంగంపైనే ఆధారపడవు. పరిశుభ్రత, తాగునీరు, పర్యావరణం, విద్య, పోషకాహారం, పట్టణ ప్రణాళిక వంటి అనేక రంగాల సమన్వయం అవసరం. అందుకే సమర్థవంతమైన ప్రజారోగ్య పరిపాలనకు చట్టపరమైన బలం అత్యంత కీలకం. ప్రజారోగ్య చట్టాలు ప్రధానంగా రెండు రకాలుగా ఉంటాయి. మౌలిక సదుపాయాల చట్టాలు ప్రజారోగ్య సంస్థల ఏర్పాటు, డేటా సేకరణ, తనిఖీలు, లైసెన్సులు, నియంత్రణ చర్యలకు అధికారాన్ని కల్పిస్తాయి. జోక్య చట్టాలు మైనర్లకు పొగాకు విక్రయాల నిషేధం, ఆహార భద్రత ప్రమాణాలు, అంటువ్యాధుల సమయంలో క్వారంటైన్ వంటి ప్రత్యేక చర్యలకు చట్టబద్ధత కల్పిస్తాయి. భారతదేశంలో ప్రజారోగ్య అత్యవసర పరిస్థితుల నిర్వహణ ఇప్పటికీ పాత చట్టాలు, శిక్షణ పొందిన ప్రజారోగ్య సిబ్బంది కొరత, అమలు లోపాల కారణంగా ఆశించిన స్థాయిలో లేదు.

**రాజ్యాంగం కల్పించిన పునాదులు**

భారత రాజ్యాంగంలోని ఏడవ షెడ్యూల్ ప్రకారం ప్రజారోగ్యానికి సంబంధించిన చట్ట నిర్మాణ అధికారాలు కేంద్రం, రాష్ట్రాల మధ్య విభజించబడ్డాయి. ఆసుపత్రులు, పారిశుద్ధ్యం, తాగునీటి సరఫరా వంటి అంశాలు ప్రధానంగా రాష్ట్రాల పరిధిలో ఉండగా, జనాభా నియంత్రణ, మానసిక ఆరోగ్యం, ఆహార భద్రత, సంక్రమణ వ్యాధుల నియంత్రణ, కార్మిక సంక్షేమం వంటి అంశాలపై కేంద్రం, రాష్ట్రాలు రెండూ చట్టాలు చేయగలవు. రెండు చట్టాల మధ్య విభేదం ఏర్పడితే కేంద్ర చట్టానికే ప్రాధాన్యం ఉంటుంది.

స్వాతంత్ర్యం తర్వాత ప్రజారోగ్య చట్టాల రూపకల్పన ప్రధానంగా రాష్ట్రాల బాధ్యతగా కొనసాగింది. కొన్ని రాష్ట్రాల్లో మాత్రమే ప్రత్యేక ప్రజారోగ్య చట్టాలు అమల్లో ఉన్నాయి. వాటిలో చాలా దశాబ్దాల క్రితం రూపొందించబడినవే. దేశవ్యాప్తంగా ఏకరీతి కోసం కేంద్ర ప్రభుత్వం 1987 మోడల్ పబ్లిక్ హెల్త్ బిల్, 2002 నేషనల్ పబ్లిక్ హెల్త్ బిల్, 2009 నేషనల్ హెల్త్ బిల్ వంటి నమూనా చట్టాలను ప్రతిపాదించింది. ఈ చట్టాలు పారిశుద్ధ్యం, నీటి సరఫరా, మార్కెట్లు, ఆహార భద్రత, సంక్రమణ వ్యాధుల నియంత్రణ వంటి అంశాలను ప్రస్తావించినప్పటికీ, యాంటీ మైక్రోబియల్ రెసిస్టెన్స్, కొత్త అంటువ్యాధులు, వాతావరణ మార్పుల ప్రభావం, పర్యావరణ కాలుష్యం, వేగవంతమైన పట్టణీకరణ వంటి ఆధునిక సవాళ్లను ఎదుర్కొనేంత సమగ్రత వాటిలో లేదు.

**సమగ్ర ప్రజారోగ్య చట్టమే కాలానుగుణ పరిష్కారం**

భారతదేశం ప్రస్తుతం జనాభా మార్పులు, పట్టణీకరణ, పర్యావరణ సంక్షోభం, కొత్త వ్యాధుల ముప్పు వంటి సంక్లిష్ట సవాళ్లను ఎదుర్కొంటోంది. సమాజ సంక్షేమం, వ్యక్తిగత స్వేచ్ఛల మధ్య సమతుల్యతను కాపాడటం సవాలే అయినప్పటికీ, శాస్త్రీయ దృక్పథం, రాజ్యాంగ విలువలు, మానవ హక్కులను సమన్వయం చేసే సమగ్ర ప్రజారోగ్య చట్టం మాత్రమే ఆరోగ్యవంతమైన, సురక్షితమైన, స్థిరమైన భారత నిర్మాణానికి బలమైన పునాది వేయగలదు.



డా ఎం. అఖిల మిత్ర,
ప్రకృతి వైద్యులు, ప్రజారోగ్య సలహాదారులు.

# నవతరం జంతర్‌మంతర్ నిరసనలు ఏమి బోధిస్తున్నాయి?



ఇందిరా జైసింగ్



ప్రతీక్ పట్నాయక్

సుప్రీంకోర్టు సీనియర్ అడ్వొకేట్స్

వారు ఒక పుస్తకం చేత్తో పైకెత్తారు – ఆకాశంలో రంధ్రం పెట్టారు.

ముంబయిలో రోడ్డుకు అడ్డంగా నిలబడి రెండు చేతులతో పోలీసు వ్యాన్‌ను నిలుపు చేసిన యువతి గుర్తుందా? జంతర్‌మంతర్‌లో ఒక యువ మహిళ–అనేక రోజులుగా ఆహారం తినకుండా బక్కచిక్కిన మహిళ– భారత రాజ్యాంగాన్ని తన తలపై పెట్టుకోవడం గుర్తుందా? ఆమె ఆగ్రహంతో కాకుండా ప్రమిదను పైకెత్తిన రీతిలో ఆ పనిచేశారు.

ఆ పుస్తకాన్ని దించండి, మడతపెట్టండి, ఇంటికి వెళ్లండి, ఎన్నడూ రాని రుతువుకోసం వేచి చూడండి, చట్టం తన పని తాను చేసేవరకు ఎదురుచూడండి అని వారికి వారాలపాటు చెప్పారు. అప్పుడు ఒక సాధారణ మధ్యాహ్న సమయంలో మంత్రి రాజీనామా చేశారు. ఆ పుస్తకం కిందకు రాలేదు. మరింత ఎత్తుకు లేచింది. ఆ పుస్తకం (రాజ్యాంగం) పట్ల మా యువతరం అభిమానం పెంచుకున్నారని మనం జంకులేకుండా ప్రపంచానికి చెప్పవచ్చు. ఇది విజయం. రాజీ కాదు. ఎవరో వెనుక ఉండి నడిపిన వెనుకంజ కాదు. పరువు కాపాడుకునే పని అంతకన్నా కాదు. ఒక తప్పును ఎత్తి చూపారు. జవాబు చెప్పటానికి తిరస్కరించిన అధికారం జవాబు చెప్పింది. యువత ఒట్టి చేతులతో దాన్ని సాధించారు.

జన్–జీ(1997–2012 మధ్య జన్మించిన వ్యక్తులు –15–26 సంవత్సరాల వయో బృందంకన్నా పై వయస్సు వారు దీన్ని సగం ఉడికించిన విప్లవం అన్నారు. మేము అంటాం : మీరు, నేను చేసిందేమీ లేదు. మన పూర్వీకులు సాధించారు. వారి వారసత్వం ఫలాలను మన వ్రేళ్ల సందుల గుండా జారవిడుచుకున్నాం. ఈ యువకులవైపు చూసి, వారు ఇంకా ముందుకు వెళ్ళలేదని గొణిగేవారికి మా సమాధానం "మనం వెళ్లామా?". నేడు–రేపు మధ్య దూరం గడియారం లో కొలవబడదు. తాడు సహాయం లేకుండా విశ్వాసం వేసిన గెంతులతో, భయం ఆవహించకమునుపే దానిలోపల వ్యవహరించగలిగిన ధైర్యంతో కొలవబడుతుంది. చరిత్ర కేవలం అభిప్రాయాలతో కాదు, మనుషుల శరీరాలతో నిర్మించబడుతుంది.పరుగుతీయకుండా, తుపాకుల ముందు ధైర్యంగా నిలబడిన దేహాలు దాన్ని నిర్మిస్తాయి. చలి, వర్షాలు లెక్కచేయకుండా వీధుల్లో నిలబడిన దేహాలు చరిత్ర నిర్మిస్తాయి. దేశం సిగ్గుపడే విధంగా చేస్తూ ఆహారం ముట్టని వారు దాన్ని నిర్మిస్తారు.

దొంగలించబడింది కేవలం ఒక పథకం కాదు – అది మన హుందాతనం, ఆత్మగౌరవం; మెరిట్ వాస్తవం, కృషి గౌరవం పొందుతుందనేది యువత విశ్వాసం. మన నష్టాలు యథార్థం. అనేకమంది పౌరసత్వం సందేహంలో పెట్టబడింది. జీవనోపాధులు హరించారు. యువత ఆ నష్టాలనుంచి లేచి వాటిని మెట్లుగా మార్చుకున్నారు. అవమానాన్ని తమ సొంత గొంతుకలతో శక్తిగా మార్చుకున్నారు. ఇది ఎవరి విజయం అనే విషయంలో ఎవరూ తప్పు చేయకూడదు. ఇది విద్యార్థులది తప్ప మనది కాదు. అయితే వారిక్కడికి ఒంటరిగా రాలేదు. మనం మహానుభావుల భుజాలపై నిలబడి ఉన్నాం. వారి పేర్లు చెబుదాం. పిడికెడు ఉప్పు కోసం పాదయాత్రగా సముద్రానికి వెళ్లిన బక్కపలచని మనిషిని గుర్తు చేసుకుందాం. ఉదయాన యావత్ శాసన గ్రంథాన్ని చేబూని ఉన్న సామ్రాజ్యాన్ని రాత్రికి దాని చట్టబద్ధతను కోల్పోయేలా చేశారు.

1970వ దశకంలో, తమది శాశ్వతం అనుకున్న ప్రభుత్వాన్ని కుదిపివేస్తూ తరగతులు బహిష్కరించిన విద్యార్థులను స్ఫురణకు తెచ్చుకుందాం. 2012లో ఒక డిసెంబర్ రాత్రి, తామెన్నడూ కలుసుకోని ఒక మహిళ కోసం కొవ్వొత్తులు చేతబట్టి ఇండియా గేట్‌ను ముంచెత్తిన యువతను, చట్టాన్ని తిరగరాసేవరకు ఇంటికి తిరిగి వెళ్లని ఆ యువతను యాది చేసుకుందాం. ప్రతి దశాబ్దంలో, ప్రతి కూడలి ప్రదేశంలో, యువతకు చెప్పింది ఒక్కటే, 'ఆ గంట (సమయం) తప్పు, పద్ధతి తప్పు, ఇంటికి వెళ్లండి, వేచి చూడండి.' వారి పోరా టం మన పోరాటం, వారి పరిపూర్తికాని భవిష్యత్ ఇప్పుడు మనది. మనల్ని కలిసికట్టు చేస్తున్న బంధనం అదే. అది తప్ప మరేదీ మనకు పట్టదు.

వారు దేన్నీ పట్టించుకోరు అని దేశం కొట్టిపారేసిన తరం అంతా వింటున్నది. వినిపించుకోనిది మనమే.

డాక్టర్ మార్టిన్ లూథర్ కింగ్ వాషింగ్టన్‌లో ఒక సభలో తాను రాసుకున్న ప్రసంగం చదువుతున్నారు. చప్పగా ఉంది. అంతలో ఆయన వెనుకనుంచి మహాలియా జాక్సన్ –"మీ స్వప్నం గూర్చి వారికి చెప్పు మార్టిన్" అని కోరారు. ఆయన చేతిలోని కాగితం పేజీలు పక్కన పెట్టాడు. ఈ క్షణాలు జాగ్రత్తగా ఉండటానికి తిరస్కరించే గొంతుల నుంచి తప్ప జాగ్రత్త వహించే వారి నుంచి ఎన్నడూ రావు. ద్రోహానికి గురైతే, ఈతరం తుపాకీ వద్దకు చేరుతుంది. రాజ్యాంగం ద్వారా చేసిన బోధన కారణంగా వారు తమ ఆగ్రహాన్ని వ్యక్తం చేయటానికి తుపాకీ మీట చేతికి తీసుకోకుండా కొవ్వొత్తులు చేబూనారు. ఈ కారణంగా దుష్యంత్ కుమార్ గేయపాదం ఒకటి అనేక రోజుల పాటు మా బుర్రలు తొలుస్తూనే ఉంది : ఆకాశానికి రంధ్రం చేయలేమని ఎవరంటారు – మిత్రులారా, నిండుమనస్సుతో ఒక రాయి విసరండి! అంటారాయన .



ఉద్యమ సహచరులను తరలిస్తున్న పోలీసు వ్యాన్‌ను ఒంటిచేత్తో ఆపుతున్న యువతి

విజయం ఆచరణ నుండి భిన్నమైంది కాదు, అది ఉచితం కూడా కాదు. ఒక తల్లి మొదటి రోజున స్టీలు టిఫెన్‌తో వచ్చారు, తిరిగి వెళ్లలేదు. పిల్లలను తన సొంత పిల్లలుగా భావించి భోజనం పెట్టారు. మరికొందరు ఒక ఫొటోగ్రాఫ్ చేతబట్టి, ఏ రాజీనామా తొలగించలేని దుఃఖ భారంతో వచ్చారు. అపరిచితులు నిరసనకారులకు ఆహారం ఇచ్చారు. విద్యార్థులు బల్ల పరుపు రాళ్లపై పడుకున్నారు. రాజ్యాంగాన్ని గంటల పాటు ఒక చేతినుంచి మరొకరి చేతికి మార్చుకుంటూ దాని జీవశక్తిని చాటారు.

ఆ తర్వాత, జులై 20న, రాజ్యాంగం చేతబట్టి, అది ఎక్కడైతే స్థిరంగా ఉండాలో ఆ పార్లమెంట్‌కు ప్రదర్శనగా బయలుదేరినపుడు రాజ్యం (ప్రభుత్వం ) తన సమాధానమేమిటో చెప్పింది. వారు గుమికూడకుండా మెట్రోస్టేషన్లు మూసివేసింది. మన ప్రజాస్వామ్య కేంద్రం చుట్టూ ఇంటర్నెట్ నిలుపుచేసింది. నిరాయుధులైన యువకుల నెత్తిన లాఠీలతో మోదింది, వారి దేహాల మీదకు బాష్పవాయువు గోళాలు విసిరింది. తమ ఛాతీపై తామెవరో తెలిపే పేర్లులేకుండా సాధారణ దుస్తుల్లో సాయుధులను గుంపుల్లోకి పంపింది. నిరాహారదీక్ష చేస్తున్న వారిని లాగి బస్సుల్లో పడేసింది. దీన్నంతా దేశం తిలకించింది.

ఇప్పుడు కఠిన వాస్తవం చూద్దాం. ఈ విజయాన్ని వేడుక చేసుకోవటం అంటే సంతృప్తి చెందటాన్ని నిజాయితీతో తిరస్కరించటమే. చరిత్ర విద్యార్థుల పార్లమెంట్ యాత్రను గుర్తుంచుకోదు. ఈ యాత్ర చేసిన చట్టాన్ని గుర్తుంచుకుంటుంది. 1963 నాటి వాషింగ్టన్ మార్టిన్ లూథర్ కింగ్ స్వప్నం వల్లనే గుర్తింపు పొందలేదు. ఆ స్వప్నం పౌరహక్కుల చట్టంగా వ్యక్తీకరణ పొందినందున గుర్తుచేసుకోబడుతుంది. మన దేశంలో మనకూ ఒక రుజువు ఉంది. 2012 డిసెంబర్ నాటి విచారం, ఆగ్రహం ఆ తర్వాత క్రిమినల్ చట్టంలో ప్రతిబింబించింది. ఢిల్లీ సరిహద్దుల్లో సంవత్సరం పాటు రైతుల ఆందోళన వారు వ్యతిరేకించిన చట్టాల రద్దుకు దారి తీసింది. మనదేశం ఇప్పటికీ తన సొంత పౌర హక్కుల చట్టంకోసం– సమానత్వం కలుగజేసే, వివక్ష వ్యతిరేక చట్టం కోసం, రాజ్యాంగం ఇప్పటికే ఇచ్చిన హామీకి జవసత్వాలు చేకూర్చే చట్టం కోసం వేచి చేస్తున్నది.

మూడు రుణాలతో కూడిన అసంపూర్ణ కృషి ఏమిటో మేము స్పష్టం చేయదలిచాము.

ఒకటి, పరీక్ష. ఆస్థాయిలో ప్రశ్నాపత్రం లీకేజీ దురదృష్టం కాదు, అది వ్యవస్థ వైఫల్యం. దానిని నిర్వహిస్తున్న ఏజన్సీ లక్షలాదిమంది భవిష్యత్‌ను క్లరికల్ విషయంగా పరిగణించటాన్ని అనుమతించరాదు. పరీక్ష నిజాయితీని చట్టం ద్వారా అమలు జరపాలి. దానిపై పునఃపరిశీలన ఉండాలి.

రెండు, పోలీస్. జులై 20న జరిగింది ఆర్డర్‌ను(శాంతి–భద్రతను) కాపాడటం కాదు, తద్విరుద్ధం. లాఠీతో ఒక విద్యార్థి తల పగలగొట్టటం నియంత్రణ చర్యకాదు. జనంపైకి బాష్పవాయువు గోళాలు ప్రయోగించటం జనాలను అదుపుచేయటం కాదు. సాధారణ దుస్తుల్లోని వ్యక్తి చట్టాన్ని అమలు చేసే అధికారి కాదు, నకిలీ. కోర్టులు 2018 నుంచీ పదే పదే అడుగుతున్న ప్రామాణిక ఆపరేటింగ్ ప్రొసీజర్‌ను ప్రభుత్వం ఇంతవరకు సమర్పించలేదు. ఆరోజున చేయి పైకెత్తిన ప్రతీ ఆఫీసర్‌పై కేసుపెట్టాలి.

మూడో రుణం, మనం సన్నిహితమైంది, కఠినమైందీ, ఎందుకంటే అది మనం– నలుపు, తెలుపు దుస్తులు ధరించే మనం నెరవేర్చాల్సింది. కోర్టుల్లో అధికారులమైన మనం ఇప్పు డు అభిశంసించాలి. మనం మౌనంగా ఉంటూ ఒక మంత్రి జవాబుదారీ తన్నాన్ని డిమాండ్ చేయటం మంచిగా ఉండదు. విచారణ మొదలు కాకముందే నిరసన ముగిసిపోయేంతగా హక్కు వినియోగం వేచి ఉండాల్సివస్తే న్యాయం చేసినట్లు కాదు. జడ్జీలు, న్యాయసేవకులు తప్ప యజమానులు కాదు. తీర్పు చెప్పండి లేదా తప్పుకోండి. విస్మరణ ఖరీదును మనం చూశాం. సంవత్సరాలు గడిచినప్పటికీ జామియా విద్యార్థుల దృశ్యాలు కళ్లముందు కదలాడుతున్నాయి. పోలీస్ లు వారి లైబ్రరీలోకి చొరబడి, టేబుల్ కింద దూరినవారిని సైతం బాదారు. చట్టం క్రమం ఇంకా కొనసాగుతోంది. ఒక్క అధికారినీ జవాబుదారీ చేయలేదు. ఆ కేసు ఈరోజుకీ కోర్టులో మూలుగుతోంది.

ఒక సంస్థను కాపాడుకోవటమంటే విమర్శనుంచి దాన్ని రక్షించుకోవటం కాదు. దాని ప్రామాణికతను కాపాడాలి. కోర్టును ప్రశ్నించని లాయరు, ప్రభుత్వాన్ని ప్రశ్నించని పౌరుడు , ఓర్మి వహించాలని బోధ చేసే పెద్దలు మన సంస్థల సంరక్షకులు కారు. సంస్థలను పట్టించుకోకుండా యువత వీధుల్లోకి రావటానికి అవే కారణాలు. సంరక్షణ బాధ్యత నిఘా కలిగి ఉండటం తప్ప విధేయత ప్రదర్శించటం కాదు.

ఇప్పుడు ఆకాశంలో రంధ్రం పడింది. దాని గుండా కాంతి ప్రసరిస్తున్నది. అయితే ఆకాశంలోని రంధ్రం దానికదిగా తెరుచుకుని ఉండదు. ఎవరూ దానిపై దృష్టి పెట్టకపోతే అది నెమ్మదిగా మూసుకుంటుంది. రాజీనామాను నిలువెత్తు విగ్రహంగా మార్చటం ద్వారా, ప్రజలు అడిగినప్పుడు అధికారం జవాబు చెప్పేటట్లుగా మీ ధైర్యం శాశ్వత ఆశాభావంగా ఉండేటట్లు మీరు ఆ రంధ్రాన్ని తెరిచి ఉంచండి.

# జానపద కళలకు జీవం పోద్దాం... తెలంగాణ వారసత్వాన్ని పరిరక్షిద్దాం



నాగులపల్లి వెంకటేశ్వరరావు
సెక్రటరీ, మీడియా అకాడమీ ఆఫ్ తెలంగాణ

కళాకారుడు బతికితేనే కళ బతుకుతుంది. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు, భాష, జీవనవిధానం, చరిత్రను భావితరాలకు అందించిన గొప్పవారసత్వ సంపద జానపదకళలు. ఇవి కేవలం వినోద సాధనాలు మాత్రమే కాదు. ప్రజల్లో చైతన్యాన్ని రగిలించే శక్తివంతమైన సమాచార మాధ్యమాలు. ఒకప్పుడు గ్రామీణ సమాజ జీవనంలో విడదీయరాని భాగం గా ఉన్న ఈ కళారూపాలు నేడు ఆధునిక జీవనశైలి ప్రభావంతో కనుమరుగయ్యే ప్రమాదంలోఉన్నాయి.

తెలంగాణ అనగానే ఒగ్గుకథ, బుర్రకథ, హరికథ, పల్లెసుద్దులు, వీధినాటకం, చిందు యక్షగానం, గుస్సాడినృత్యం, పేరిణి శివ తాండవం, డప్పు, కోలాటం, గంగిరెద్దుల ఆట, లంబాడీ నృత్యం, బతుకమ్మ జానపద గీతాలు వంటి అనేక కళారూపాలు గుర్తుకువస్తాయి. ఇవి తెలంగాణ ఆత్మను ప్రతిబింబించే సాంస్కృతిక సంపద. తెలంగాణ ఉద్యమ చరిత్రలో జానపద కళారూపాల పాత్ర అపూర్వమైనది. తొలి దశ నుంచి మలిదశ ఉద్యమం వరకు ఒగ్గుకథ, బుర్రకథ, పల్లెసుద్దులు, వీధినాటకాలు, జానపద గీతాలు ఉద్యమానికి ఊపిరిగా నిలిచాయి. గ్రామగ్రామాన తిరుగుతూ కళాకారులు తెలంగాణ ఆకాంక్షను ప్రజల్లో నింపారు. సభలకు ముందు నిర్వహించిన జానపద ప్రదర్శనలు ప్రజలను ఉద్యమంలో భాగస్వాములను చేశాయి. తెలంగాణ రాష్ట్ర సాధనలో జానపద కళాకారుల సేవలు చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతాయి.

తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత మన జానపద కళలను దేశం కూడా గుర్తించింది. కిన్నెర కళాకారుడు పద్మశ్రీ దర్శనం మొగులయ్య, యక్షగానం కళాకారుడు పద్మశ్రీ గడ్డంసమ్మయ్య, జానపద సంగీత విద్వాంసుడు పద్మశ్రీ దాసరికొండప్ప, సంప్రదాయ కళాకారిణి పద్మశ్రీ దళిపర్తి ఉమామహేశ్వరి వంటి ప్రముఖులకు భారత ప్రభుత్వం పద్మశ్రీ పురస్కారాలు ప్రదానం చేసింది. ఇది తెలంగాణ జానపద కళల గొప్పతనానికినిదర్శనం. అయితే, ఒగ్గు కథలో మహోన్నత స్థానం సంపాదించిన మిద్దె రాములు గారిని కూడా ఈ సందర్భంగా గుర్తుచేసుకోవాలి. ఆయనకు ప్రతిభాపురస్కారం, రాజీవ్ పురస్కారం, హంస అవార్డు వంటి అనేక గౌరవాలు లభించాయి. వాస్తవానికి ఒగ్గు కథకు విశిష్ట సేవలందించిన మరో మహానుభావుడు చుక్క సత్తయ్య 2004లో భారత రాష్ట్రపతి డాక్టర్ ఏ.పి.జె. అబ్దుల్ కలాం చేతుల మీదుగా సంగీత నాటక అకాడమీ పురస్కారం అందుకున్నారు. ఈ ఇద్దరు మహానుభావుల సేవలు తెలంగాణ జానపద కళలకు దేశవ్యాప్త గుర్తింపు తీసుకొచ్చాయి.





హైదరాబాద్‌లోని శిల్పారామంలో పేరిణి వంటి కొన్ని కళారూపాలకు సందర్భానుసారంగా ప్రదర్శనల అవకాశాలు కల్పించడం అభినందనీయం. అయితే, ఇది ఒక్క శిల్పారామానికే పరిమితం కాకుండా రాష్ట్రవ్యాప్తంగా అన్ని జానపద కళారూపాలకు నిరంతర అవకాశాలు కల్పించే విధానాన్ని ప్రభుత్వం రూపొందించాలి.

నేను 2010 నుండి 2013 వరకు ఆంధ్రప్రదేశ్ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీలో ఉపసంచాలకుడు (ఐఇసి)గా పనిచేసిన సమయంలో ప్రతి సంవత్సరం సుమారు రూ.1 కోటిబడ్జెట్‌ను పల్లెసుద్దులు, హరికథ, వీధి నాట కం వంటి జానపద కళారూపాల ద్వారానే హెచ్ఐవీ/ఎయిడ్స్ అవగాహన కార్యక్రమాల కు వినియోగించాం. గ్రామాల్లో ప్రజలు వ్యవసాయపనులు ముగించుకుని విశ్రాంతిగా ఉన్న సమయంలో ఈ కార్యక్రమాలు నిర్వహించేవాళ్లం. ఆ అవగాహన కార్యక్రమాల కారణం గా రెండు సంవత్సరాలలో హెచ్.ఐ. వి. వ్యాప్తి తగ్గింది. స్థానిక భాషలో, స్థానిక కళారూపాల ద్వారా అందించిన సందేశాన్ని ప్రజలు సులభంగా అర్థం చేసుకొని ఆచరణలో పెట్టారు. ప్రభుత్వ లక్ష్యం నెరవేరడంతో పాటు కళాకారులకు ఉపాధి కూడా లభించింది. ఒకే కార్యక్రమంతో ప్రజా చైతన్యం, ప్రభుత్వ ప్రచారం, కళాకారులకు జీవనాధారం, కళల పరిరక్షణ అనే నాలుగు లక్ష్యాలు సాధ్యమయ్యాయి. అంతకు ముందు సమాచార ప్రజా సంబంధాల శాఖ కూడా జిల్లా ప్రజా సంబంధాల అధికారుల ద్వారా ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాల ప్రచారానికి జానపద కళారూపాలను విస్తృతంగా వినియోగించేది. దీంతో ప్రభుత్వ పథకాలు ప్రజలకు చేరడంతో పాటు కళాకారులకు నిరంతర ఉపాధి లభించేది. ఆ విధానం కారణంగా అనేక జానపద కళారూపాలు సజీవంగా నిలిచాయి. నేడు కూడా అదే విధానాన్ని పునరుద్ధరించి, ప్రతి ప్రభుత్వ శాఖ తమ అవగాహన కార్యక్రమాల్లో జానపద కళారూపాలను వినియోగించేలా చర్యలు తీసుకోవాలి. ప్రస్తుతం పట్టణీకరణ, ఉపాధి కోసం వలసలు, యూ ట్యూబ్, ఇన్‌స్టాగ్రామ్, ఇతర డిజిటల్ మాధ్యమాల ప్రభావంతో జానపదకళలకు ఆదరణ తగ్గుతోంది. అనేకమంది కళాకారులు వాచ్‌మెన్‌లు, కూలీలు, డ్రైవర్లు, ఇతర చిన్న ఉద్యోగాల్లో చేరుతున్నారు. వారి పిల్లలు కూడా ఈ కళలను నేర్చుకోవడానికి ఆసక్తి చూపడం లేదు. ఇదే పరిస్థితి కొనసాగితే మన అమూల్యమైన జానపద వారసత్వం భావితరాలకు అందకుండా పోయే ప్రమాదం ఉంది.

కాబట్టి రాష్ట్ర ప్రభుత్వం జానపద కళలను తెలంగాణ సాంస్కృతిక వారసత్వంగా గుర్తించి ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలి. రాష్ట్ర సాంస్కృతిక సారథి, భాషా సాంస్కృతిక శాఖ, సమాచార ప్రజాసంబంధాల శాఖ, పర్యాటక శాఖ, ఆరోగ్యశాఖలు సంయుక్తంగా ప్రతి జిల్లాలో జానపద కళాకారుల నమోదుతో వార్షిక ప్రదర్శనల క్యాలెండర్ రూపొందించాలి. ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రచారం, పాఠశాలలు, కళాశాలలు, పర్యాటక కేంద్రాలు, శిల్పారామం, రాష్ట్ర ఉత్సవాలు, జిల్లా ఉత్సవాల్లో క్రమం తప్పకుండా జానపద కళా ప్రదర్శనలు నిర్వహించాలి. జానపద కళలకు జీవనాధారం కల్పించడం అంటే కేవలం కళాకారులను ఆదుకోవడం మాత్రమే కాదు; తెలంగాణ సంస్కృతిని, చరిత్రను, భాషను, ఆత్మను భావితరాలకు సజీవంగా అందించడం. కళాకారుడు బతికితేనే కళ బతుకుతుంది. కళ బతికితేనే సంస్కృతి బతుకుతుంది. సంస్కృతి బతికితేనే తెలంగాణ తన ప్రత్యేకతను శాశ్వతంగా నిలబెట్టుకోగలదు.

# నాణ్యమైన వైద్య సేవలు

● సిఎస్ సంజయ్ జాజు



ప్రజాపక్షం/హైదరాబాద్: అత్యవసర పరిస్థితుల్లో ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు ఎటువంటి ఆలస్యం లేకుండా తక్షణమే వైద్య సహాయం అందే విధంగా ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు ఆదేశించారు. ఇందుకు 24 గంటల సహాయ వ్యవస్థ, వేగవంతమైన అనుమతి ప్రక్రియ, సంబంధిత ఆసుపత్రులతో సమన్వయాన్ని మరింత బలోపేతం చేయాలని సూచించారు. ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లు, వారి కుటుంబ సభ్యులకు సకాలంలో నాణ్యమైన వైద్యసేవలు అందేలా తెలంగాణ ఉద్యోగుల ఆరోగ్య సంరక్షణ ట్రస్ట్ (టిఇహెచ్‌సిటి) కార్యకలాపాలను మరింత బలోపేతం చేయాలన్నారు. హైదరాబాద్‌లోని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ సచివాలయంలో ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు అధ్యక్షతన శుక్రవారం ట్రస్ట్ సమావేశం జరిగింది. లబ్ధిదారులు ఎదుర్కొంటున్న సమస్యలు తదితర అంశాలపై విస్తృతంగా చర్చించారు. ట్రస్ట్ కార్యకలాపాల నిర్వహణను మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు ఎగ్జిక్యూటివ్ కమిటీతో పాటు అవసరమైన సబ్ కమిటీలను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. అనంతరం సంజయ్ జాజు మాట్లాడుతూ హెల్త్ కేర్ ట్రస్ట్ ఫండ్‌ను సద్వినియోగం చేసుకునేలా కమిటీ తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో ప్రత్యేక ప్రధాన కార్యదర్శి మహేశ్ దత్ ఎక్కా, ముఖ్య కార్యదర్శులు సందీప్ సుల్తానియా, యోగితా రాణా, క్రిస్టియానా జెడ్ చొంగ్తూ, శిఖా గోయల్, హెల్త్‌కేర్ ట్రస్ట్ సిఇఒ జెండగే హనుమంత్ కొండిబా, వివిధ శాఖల కార్యదర్శులు శ్రుతి ఓజా, దివ్య, సిక్తా పట్నాయక్, టిఎన్‌జిఓ సెంట్రల్ యూనియన్ అధ్యక్షులు మారం జగదీశ్వర్, టిజిఒ అధ్యక్షులు ఏలూరి శ్రీనివాస రావు, తెలంగాణ సెక్రెటేరియేట్ అసోసియేషన్ అధ్యక్షులు జి.శ్రీనివాస రెడ్డి, తెలంగాణ డిప్యూటీ కలెక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షులు లచ్చిరెడ్డి, ఎస్‌టియుటిఎస్ రాష్ట్ర అధ్యక్షుడు సదానందంగౌడ్, పిఆర్‌టియు నాయకుడు దామోదర్ రెడ్డి, యూటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు చావారవి, తెలంగాణ రెవె న్యూ అసోసియేషన్ అధ్యక్షులు వంగా రవీందర్‌రెడ్డి, తెలంగాణ రిటైర్డ్ అధికారుల సంఘం మహిళా అధ్యక్షురాలు ఉమాదేవి, ఎస్‌టిఎఫ్ అధ్యక్షులు డి.సైదులు పాల్గొన్నారు.



# మీ సేవలో 'ఫ్యామిలీ సర్టిఫికెట్'

● డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క

ప్రజాపక్షం/హైదరాబాద్ : తెలంగాణ రాష్ట్ర పౌరులు, వారి కుటుంబ సభ్యుల వివరాలతో 'ఫ్యామిలీ సర్టిఫికెట్' అందించనున్నట్టు డిప్యూటీ సిఎం మల్లు భట్టి విక్రమార్క వెల్లడించారు. రాష్ట్రంలోని తహశీల్దార్ కార్యాలయం, మీసేవ కేంద్రానికి వెళ్లి 'ఫ్యామిలీ సర్టిఫికెట్' పొందవచ్చని సూచించారు. ఆరోగ్యశ్రీ, సన్నబియ్యం తదితర పథకాలను లబ్ధి పొందుతున్న రాష్ట్ర కుటుంబ సభ్యులుగా ఉన్న వారి వివరాలకు సంబంధించిన సమాచారాన్ని తహశీల్దార్ కార్యాలయంలో రాష్ట్ర ప్రభుత్వం అందుబాటులో ఉంచిందని స్పష్టం చేశారు. హైదరాబాద్‌లోని మహాత్మా జ్యోతిరావు పూలే ప్రజాభవన్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన ఎస్ఐఆర్ అవగాహన సదస్సులో డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్కతో పాటు రవాణ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, తెలంగాణ రాష్ట్ర మైనారిటీస్ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇనిస్టిట్యూషన్స్ సొసైటీ వైస్ ఛైర్మన్ ఫహీమ్ ఖురేషి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ రాష్ట్రంలో ఉన్నటువంటి ఏ కుటుంబమైన తమకు సంబంధించిన సమాచారం, కుటుంబ సభ్యుల సమాచారం కావాలనుకుంటే తహశీల్దార్ ఆఫీస్, మీసేవ కేంద్రానికి వెళ్లి ఈ 'ఫ్యామిలీ సర్టిఫికెట్' పొందవచ్చని ఆయన చెప్పారు. తద్వారా రాష్ట్రంలో ఏ వ్యవస్థనైనా, ఏ సంస్థనైనా కుటుంబ వివరాలకు సంబంధించి సర్టిఫికెట్ అడిగితే సమాచారం ఇవ్వడానికి ఫ్యామిలీ సర్టిఫికెట్ ఉపయోగకరమని భట్టి విక్రమార్క అన్నారు.

## ఆగస్టు చివరి వారంలో..
# 'ఇందిరమ్మ టవర్స్' నిర్మాణాలకు శ్రీకారం

● మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి

ప్రజాపక్షం/హైదరాబాద్ : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టనున్న 'ఇందిరమ్మ టవర్స్' పథకం కింద తొలి విడత గృహ నిర్మాణ పనులను ఆగస్టు చివరి వారంలో ప్రారంభించనున్నట్లు హౌసింగ్, సమాచార, పౌరసంబంధాలశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. సచివాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ టెండర్ ప్రక్రియ ఇప్పటికే ప్రారంభమైందని, పనులు మొదలుపెట్టేందుకు అన్ని ఏర్పాట్లు సిద్ధం చేశామని తెలిపారు.

**తొలి విడతలో 8 వేల ఇళ్లు**

హైదరాబాద్ నగర పరిధిలో మొత్తం లక్ష ఇళ్ల నిర్మాణమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. ఇందులో భాగంగా ప్రయోగాత్మకంగా మొదటి విడతలో 16 నియోజకవర్గాల్లో ఒక్కో నియోజకవర్గానికి 500 చొప్పున మొత్తం 8 వేల ఇళ్లను నిర్మించనున్నట్లు చెప్పారు. ఇప్పటికే ఈ 16 నియోజకవర్గాలతో పాటు మరో 4 నియోజకవర్గాల్లో కూడా స్థలాల గుర్తింపు ప్రక్రియ పూర్తయిందని, దశలవారీగా అన్ని ఇళ్ల నిర్మాణం పూర్తి చేస్తామన్నారు. చివరికి ఫలక్‌నుమా ప్యాలెస్ సమీపంలో కూడా ఇందిరమ్మ టవర్స్ నిర్మించబోతున్నామని చెప్పారు.

**రూ.40-60 లక్షల విలువైన ఫ్లాట్ ఉచిత రిజిస్ట్రేషన్**

పేద ప్రజలు సైతం నగరంలోని అభివృద్ధి చెందిన ప్రాంతాల్లో గౌరవప్రదమైన జీవితం గడపాలన్నదే ప్రభుత్వ సంకల్పమని మంత్రి స్పష్టం చేశారు. ప్రభుత్వానికి చెందిన వందల కోట్ల విలువైన భూముల్లో టవర్లు నిర్మించి, ప్రతి లబ్ధిదారునికి 20 నుంచి 22 గజాల అన్‌డివైడెడ్ షేర్‌ను ఉచితంగా వారి పేరిట రిజిస్ట్రేషన్ చేస్తామన్నారు.

**ఆగస్టు 10 దరఖాస్తులకు ఆఖరు తేదీ**

లబ్ధిదారుల జీవనోపాధికి ఇబ్బంది కలగకుండా ఏ నియోజకవర్గానికి చెందిన వారు ఆ నియోజకవర్గంలోనే దరఖాస్తు చేసుకోవాలని మంత్రి సూచించారు. దరఖాస్తుల స్వీకరణకు ఆగస్టు 10 చివరి తేదీ అని, గడువు పెంపు ఉండదని స్పష్టం చేశారు. నివాస ధృవీకరణ కోసం ఆధార్‌తోపాటు ఓటర్ ఐడి, డ్రైవింగ్ లైసెన్స్, బ్యాంక్ పాస్‌బుక్ వంటి పత్రాలను కూడా సమర్పించవచ్చు అన్నారు.

**ఈఎండి రూ.10 వేలు 100 శాతం రీఫండ్**

ఇంటి కేటాయింపు ప్రక్రియలో చెల్లించే రూ. 10,000 ఈఎండి సొమ్ముపై ఎలాంటి అపోహలు వద్దని పొంగులేటి స్పష్టం చేశారు. ఒకవేళ ఇల్లు రాకపోతే లేదా అర్హత లభించకపోతే ఆ మొత్తాన్ని 100 శాతం రీఫండ్ చేస్తామన్నారు. యుపిఐ లేదా నెట్ బ్యాంకింగ్ ద్వారా చెల్లించిన ఖాతాలకే నేరుగా ఆ డబ్బులు జమ అవుతాయన్నారు. ప్రతిపక్షాల దుష్ప్రచారాన్ని ప్రజలు నమ్మడం లేదని, ప్రస్తుతం వస్తున్న భారీ దరఖాస్తులే ఈ పథకంపై ప్రజలకు ఉన్న విశ్వాసానికి నిదర్శనమన్నారు.

# ఇంజనీరింగ్ విద్యార్థులపై సిఎం వ్యాఖ్యలు ఉపసంహరించుకోవాలి

ప్రజాపక్షం/హైదరాబాద్ : ఇంజనీరింగ్ విద్యార్థులను అవమానించేలా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను వెంటనే ఉపసంహరించుకోవాలని ఎఐఎస్ఎఫ్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శి కసిరెడ్డి మణికంఠ రెడ్డి, పుట్ట లక్ష్మణ్ డిమాండ్ చేశారు. ఒకవైపు 'జెన్ జీ' యువతకు గౌరవం ఇవ్వాలని, వారి ప్రతిభను వినియోగించుకోవాలని చెబుతూ, మరోవైపు ఇంజినీరింగ్ విద్యార్థులను 'క్రిమినల్ వేస్ట్' అని కించపరిచేలా మాట్లాడటం ఆయన ద్వంద్వ వైఖరికి నిదర్శనమని విమర్శించారు. విద్యాశాఖ బాధ్యతలు కూడా నిర్వహిస్తున్న ముఖ్యమంత్రి విద్యార్థులకు భరోసా కల్పించాల్సింది పోయి, అవమానకర వ్యాఖ్యలు చేయడం సమంజసం కాదన్నారు. ఇంజినీరింగ్ విద్యార్థులు దేశ అభివృద్ధికి అవసరమైన సాంకేతిక నైపుణ్యాలను సంపాదించేందుకు కష్టపడుతున్నారని, అలాంటి విద్యార్థుల మనోభావాలను దెబ్బతీసే వ్యాఖ్యలు చేయడం సరికాదని పేర్కొన్నారు. రాష్ట్రంలోని ఇంజినీరింగ్ కళాశాలల పరిస్థితికి ప్రభుత్వమే బాధ్యత వహించాలని, ఉన్నత విద్యాశాఖ పర్యవేక్షణలో లోపాలు, సరైన తనిఖీలు లేకపోవడం వల్లే ఈ పరిస్థితి ఏర్పడిందని ఆరోపించారు. ముఖ్యమంత్రి తన వ్యాఖ్యలను వెంటనే వెనక్కి తీసుకుని, ఇంజినీరింగ్ విద్యార్థులకు నాణ్యమైన విద్య, మెరుగైన ఉపాధి అవకాశాలు కల్పించే చర్యలు చేపట్టాలని ఎఐఎస్ఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు.

# కాంగ్రెస్ నిర్మించిన వరద కాలువలతోనే ఎల్లంపల్లికి జలకళ

● రైతు సంతోషాన్ని చూసి ప్రతిపక్ష నేతలు ఓర్వలేకపోతున్నారు : మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్




ప్రజాపక్షం/హైదరాబాద్: కాంగ్రెస్ ప్రభుత్వాలు నిర్మించిన వరద కాలువల ద్వారానే శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టుకు వరద జలాలు చేరాయని, దీంతో బిఆర్‌ఎస్ నాయకులు ప్రచారం చేసిన అబద్ధాలు బట్టబయలయ్యాయని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ విమర్శించారు. సిఎల్‌పి మీడియా సెంటర్‌లో శుక్రవారం ఆయన మాట్లాడుతూ భారీ వర్షాలతో ఎల్లంపల్లి ప్రాజెక్టు పూర్తిస్థాయిలో నిండిందని, అక్కడి నుంచి మిడ్ మానేరు, లోయర్ మానేరు సహా దిగువ ప్రాంతాలకు నీటి విడుదలకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. వైఎస్ రాజశేఖర్ రెడ్డి హయాంలో కాంగ్రెస్ ప్రభుత్వం గ్రావిటీ ఆధారిత వరద కాలువలతో ఎల్లంపల్లి ప్రాజెక్టును నిర్మించిందని, అందువల్లే ఎలాంటి ఎత్తిపోతల అవసరం లేకుండానే వరద నీరు సహజసిద్ధంగా ప్రాజెక్టుకు చేరిందని చెప్పారు. కన్నెపల్లి పంప్‌హౌస్ వద్ద మోటార్లు ఆన్ చేయాలంటూ బిఆర్‌ఎస్ నాయకులు చేసిన ప్రచారం వాస్తవాలతో తేలిపోయిందన్నారు. ఈ అంశంపై కెటిటీఆర్, హరీష్ రావు ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. రైతులు సంతోషంగా సాగు పనులు చేపడుతుంటే బిఆర్‌ఎస్ ఓర్వలేకపోతోందని విమర్శించారు. నాగార్జునసాగర్, శ్రీశైలం, శ్రీరాంసాగర్, శ్రీపాద ఎల్లంపల్లి, మిడ్ మానేరు వంటి ప్రధాన సాగునీటి ప్రాజెక్టులు కాంగ్రెస్ ప్రభుత్వాల హయాంలోనే నిర్మితమయ్యాయని, వాటి నాణ్యతపై ఎలాంటి విమర్శలు రాలేదన్నారు. అయితే బిఆర్‌ఎస్ ప్రభుత్వం నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టు నేడు ప్రశ్నార్థకంగా మారిందని ఆరోపించారు. ప్రాణహితచేవెళ్ల ప్రాజెక్టును నిలిపివేసి భారీ ఎత్తిపోతలతో కాళేశ్వరం ప్రాజెక్టును చేపట్టారని, తుమ్మిడిహట్టి వద్ద బ్యారేజీ నిర్మించి ఉంటే సహజ గ్రావిటీ ద్వారానే నీటి సరఫరా జరిగేదని పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా సమృద్ధిగా వర్షాలు కురుస్తుండటంతో ఉత్తర తెలంగాణలో సాగు విస్తీర్ణం పెరిగిందని, రైతు సంక్షేమం, సాగునీటి భద్రతే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని మంత్రి స్పష్టం చేశారు.

# ఎల్లంపల్లి నిండటంతో బిఆర్‌ఎస్ అబద్ధాలు బట్టబయలు

● ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

ప్రజాపక్షం/హైదరాబాద్: కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా మేడిగడ్డ నుంచి నీటిని ఎత్తిపోస్తేనే శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు నిండుతుందంటూ బిఆర్‌ఎస్ నేతలు చేసిన ప్రచారం పూర్తిగా అసత్యమని, తాజా పరిస్థితులతో అది బట్టబయలైందని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. సిఎల్‌పి మీడియా సెంటర్‌లో శుక్రవారం ఆయన మాట్లాడుతూ హరీష్‌రావు, కెటిఆర్‌తోపాటు బిఆర్‌ఎస్ నాయకులు ఎల్లంపల్లి ప్రాజెక్టుపై ప్రజలను తప్పుదోవ పట్టించేలా విషప్రచారం చేశారని విమర్శించారు. అయితే ప్రకృతి వారికే సమాధానం చెప్పిందని పేర్కొన్నారు. త్వరలో ఎల్లంపల్లి నుంచి మిడ్ మానేరు డ్యామ్‌కు నీటి ఎత్తిపోతల ప్రారంభమవుతుందని, అక్కడి నుంచి మల్లన్నసాగర్, కొండపోచమ్మసాగర్‌లకు నీటిని తరలిస్తామని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం నిర్మించిన ఎల్లంపల్లి ప్రాజెక్టు నీటినే బిఆర్‌ఎస్ నేతలు కాళేశ్వరం నీళ్లుగా చెప్పుకోవడం విడ్డూరమని విమర్శించారు. కరవును కూడా రాజకీయంగా ఉపయోగించుకోవాలని బిఆర్‌ఎస్ ప్రయత్నించిందని, కానీ ప్రకృతి ప్రజాపాలనకు అండగా నిలిచిందని అన్నారు. రాష్ట్రంలో వర్షాలు సమృద్ధిగా కురవాలని వేములవాడలో వరుణయాగం నిర్వహిస్తున్నామని ఆది శ్రీనివాస్ తెలిపారు.

# ఊపందుకున్న పంట కుంటల నిర్మాణం

● వర్షపునీటి సంరక్షణకు ప్రభుత్వం పెద్దపీట
● మహిళా సంఘాలు, పంచాయతీల భాగస్వామ్యంతో పనులు

ప్రజాపక్షం/హైదరాబాద్ : రాష్ట్రంలో వర్షపు నీటిని ఒడిసిపట్టి, వ్యవసాయానికి భరోసా కల్పించే లక్ష్యంతో ప్రభుత్వం చేపట్టిన పంట కుంటల నిర్మాణం వేగవంతమైంది. మహిళా సంఘాలు, గ్రామపంచాయతీల సమన్వయంతో పనులను వేగంగా పూర్తి చేసేందుకు ప్రత్యే క చర్యలు తీసుకుంటున్నారు. జూలై 30 నాటికి ఏగ్రేడ్ గ్రామ సమాఖ్యల పరిధిలో నిర్దేశించిన 13,046 పంట కుంటల లక్ష్యంలో ఇప్పటికే 4,348 పనులను 33 శాతం గుర్తించి మంజూరు చేశారు. దీనిద్వారా 9, 930 మంది కూలీలకు ఉపాధి లభిస్తోంది. రాష్ట్రంలోని అన్ని గ్రామపంచాయతీల పరిధిలో మొత్తం 50,000 పంట కుంటలను నిర్మించాలని లక్ష్యంగా నిర్దేశించుకోగా, ఇప్పటివరకు 3,173 పనులు గ్రౌండింగ్ దశకు చేరుకున్నాయి. ఈ పనుల్లో 12,619 మంది కూలీలు భాగస్వాములవుతున్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 6,523 ఏగ్రేడ్ గ్రామ సమాఖ్యల్లో ఒక్కో వివోకు రెండు చొప్పున ఈ కుంటలను కేటాయించారు. పొలాల్లో వర్షపు నీరు వృథాగా బయటకు పోకుండా నిల్వ చేసేందుకు ఈ కుంటలు ఎంతో దోహదపడతాయి. వీటివల్ల పంటలకు అవసరమైనప్పుడు నీటిని అందివ్వడమే కాకుండా, భూగర్భజలాలు పెరిగి వర్షాధార రైతులకు అదనపు ధీమా లభిస్తుంది. నీటి సంరక్షణను ప్రజా ఉద్యమంగా మార్చేందుకు మహిళా సంఘాలను భాగస్వామ్యం చేయడంతో పనుల వేగం, నీటి నిల్వ సామర్థ్యం పెరుగుతుందని అధికారులు భావిస్తున్నారు.

**ప్రతి నీటి బొట్టును ఒడిసిపట్టాలి : మంత్రి సీతక్క**

'వర్షపు నీటిని వృథా చేయకుండా ప్రతి నీటి బొట్టును ఒడిసిపట్టాలి. పంట కుంటలు రైతులకు సాగు నీటి భద్రతను అందిస్తాయి. మహిళా సంఘాలు, గ్రామపంచాయతీలు కలిసికట్టుగా పనిచేసి ఈ నిర్మాణాలను వేగంగా పూర్తి చేయాలి. గ్రామంలో నిర్మించే ప్రతి కుంట భవిష్యత్ తరాలకు నీటి భరోసానిస్తుంది. తెలంగాణను జలసమృద్ధిగా తీర్చిదిద్దడంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి' అని పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క పిలుపునిచ్చారు.

# టూరిస్ట్ బస్సుల పన్ను విధానంలో మార్పులు

● 'ఒకే రాష్ట్రం ఒకే పన్ను విధానం' యోచనలో రవాణా శాఖ



ప్రజాపక్షం/హైదరాబాద్: టూరిస్ట్ బస్సులపై ప్రస్తుతం అమలులో ఉన్న త్రైమాసిక పన్ను విధానాన్ని హేతుబద్ధీకరించే దిశగా తెలంగాణ రవాణా శాఖ చర్యలు ప్రారంభించింది. ఈ మేరకు రవాణా శాఖ కమిషనర్ ఇళంబర్తి, అదనపు రవాణా కమిషనర్ రమేష్, జాయింట్ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ (విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్) చంద్రశేఖర్ గౌడ్ శుక్రవారం టూరిస్ట్ బస్సు యజమానులతో సమావేశమై పన్ను విధానంలో మార్పులపై చర్చించారు. ప్రస్తుతం టూరిస్ట్ బస్సులపై సింగిల్ డిస్ట్రిక్ట్ ట్యాక్స్, టూ డిస్ట్రిక్ట్ ట్యాక్స్, స్టేట్ ట్యాక్స్ అనే మూడు వేర్వేరు స్లాబుల ద్వారా పన్ను వసూలు చేస్తున్నారు. ఈ విధానాన్ని సరళీకరించి, ఆపరేటర్లపై అదనపు పన్ను భారం లేకుండా మూడు స్లాబులను తొలగించి 'ఒక రాష్ట్రం ఒకే పన్ను' విధానాన్ని అమలు చేయాలని అధికారులు ప్రతిపాదించారు. ఈ అంశంపై ఇప్పటికే ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు. కమిటీ నివేదికతో పాటు టూరిస్ట్ బస్సు ఆపరేటర్ల అభిప్రాయాలు, సూచనలను పరిగణనలోకి తీసుకుని తుది నిర్ణయం తీసుకోనున్నట్లు వెల్లడించారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి హాజరైన టూరిస్ట్ బస్సు యజమానులు తమ అభిప్రాయాలు, సూచనలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు.

# మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి కన్నుమూత

● గురువారం అర్ధరాత్రి 12.51 గంటలకు మృతి
● జులై 26న గుండెపోటుతో తీవ్ర అస్వస్థత
● యశోద ఆస్పత్రిలో ఐదురోజులుగా మృత్యువుతో పోరాటం
● పెద్దికి నివాళులు అర్పించిన బిఆర్‌ఎస్ ముఖ్య నాయకులు



ప్రజాపక్షం/హనుమకొండ : కొద్ది రోజులుగా మృత్యువుతో పోరాడిన మలిదశ తెలంగాణ ఉద్యమంలో ఉమ్మడి వరంగల్ జిల్లాలో కీలకపాత్ర పోషించిన ఉద్యమకారుడు వరంగల్ జిల్లా నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి (54) కన్నుమూశారు. గత ఆదివారం హనుమకొండలో పెద్ది సుదర్శన్ రెడ్డి గుండెపోటుకు గురైన విషయం విదితమే. తొలుత హనుమకొండలోని రోహిణి ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స అందజేసిన అనంతరం, మెరుగైన చికిత్స కోసం సికింద్రాబాద్‌లోని యశోద ఆస్పత్రికి తరలించారు. గత ఐదు రోజులుగా మృత్యువుతో పోరాడిన పెద్ది.. పరిస్థితి విషమించడంతో గురువారం అర్ధరాత్రి 12.51 గంటలకు తుదిశ్వాస విడిచినట్టు యశోద ఆస్పత్రి వైద్యులు ప్రకటించారు. పెద్దిని కాపాడేందుకు వైద్యులు తీవ్రంగా ప్రయత్నించినా ఫలితం లేకుండా పోయింది. గత ఆదివారం పెద్ది తీవ్రమైన పల్మనరీ ఎంబోలిజం (ఊపిరితిత్తుల్లో రక్తం గడ్డకట్టడం) బారిన పడ్డారు. దీనివల్ల ఆయన రక్తపోటు ఒక్కసారిగా పడిపోయి (హీమోడైన మిక్ కొల్లాప్స్) షాక్కు గురయ్యారు. మొదట ఆయనను రోహిణి ఆస్పత్రికి తరలించగా, అక్కడ చికిత్స పొందుతున్న సమయంలో గుండె స్పందన ఆగిపోయింది. వైద్యులు సుమారు 45 నిమిషాల పాటు పలుమార్లు సీపీఆర్, ఏసీఎల్ఎస్ చికిత్సలు అందించగా గుండె మళ్లీ కొట్టు కోవడం ప్రారంభించింది. అనంతరం మెరుగైన చికిత్స కోసం సికింద్రాబాద్‌లోని యశోద ఆస్పత్రికి తరలించారు. అయితే గుండె ఆగిపోయిన సమయంలో మెదడుకు ఆక్సిజన్ అందకపోవడంతో సుదర్శన్ రెడ్డి నాడీ వ్యవస్థ తీవ్రంగా దెబ్బతిన్నట్లు వైద్యులు తెలిపారు. ఐదు రోజుల పాటు ఆయన వెంటిలేటర్‌పై చికిత్స పొందినప్పటికీ శబ్దాలకు, స్పర్శకు ఎలాంటి స్పందన చూపించలేక చివరకు ఆయన తుదిశ్వాస విడిచినట్టు వైద్యులు ప్రకటించారు. పెద్దికి భార్య మాజీ జెడ్పీటీసి స్వప్న, కుమారుడు, కుమార్తె ఉన్నారు. తెలంగాణ మలిదశ ఉద్యమంలో కీలకంగా వ్యవహరించిన పెద్దిని కాపాడేందుకు బీఆర్‌ఎస్ అధిష్ఠానం అన్ని ప్రయత్నాలు చేసింది. కాగా, పెద్ది మృతదేహాన్ని శుక్రవారం ఉదయం హైదరాబాద్ నుంచి నర్సంపేటకు తరలించారు. తొలుత హనుమకొండకు తరలించి అదాలత్ లోని అమరవీరుల స్థూపం వద్ద ఉంచి పలువురు నాయకులు, కార్యకర్తలు నివాళులు అర్పించారు. అనంతరం నర్సంపేటకు తరలించగా వేలాది మంది ప్రజలు, కార్యకర్తలు ఆయన అంతిమ యాత్రలో పాల్గొన్నారు.

**పార్టీ ఆవిర్భావం నుంచి కేసీఆర్ వెంటే..**

2001 నుంచి తెలంగాణ రాష్ట్ర సమితి (టీఆర్ఎస్) ఆవిర్భావం తర్వాత ఉద్యమ నేత కెసిఆర్ వెంటే ఉండి పార్టీలో ఉమ్మడి వరంగల్ జిల్లా నుంచి కీలక నేతగా ఎదిగిన పెద్ది సుదర్శన్ రెడ్డి 2001లో జడ్పీటీసీగా గెలుపొందారు. తర్వాత ఉమ్మడి వరంగల్ జిల్లాకు టీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టి గ్రామగ్రామన సమావేశాలు నిర్వహించారు. పార్టీ అధినేత ఇచ్చిన పిలుపు మేరకు ఉద్యమాలలో, పోరాటాలలో చురుకుగా పాల్గొని ఉధృతం చేశారు. అనంతరం 2012లో హనుమకొండలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల మైదానంలో లక్షల మందితో తెలంగాణ గర్జన నిర్వహించి ఓరుగల్లు సత్తా చాటారు. పార్టీ అధినేత కెసిఆర్‌కు విధేయుడిగా ఉంటూ రాష్ట్ర సాధనలో పెద్దన్న పాత్ర పోషించారు. రాష్ట్రం ఆవిర్భావం తర్వాత 2014లో నర్సంపేట నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేసి ఓటమి పాలయ్యారు. 2016లో సివిల్ సప్లై కార్పొరేషన్ చైర్మన్‌గా పదవి చేపట్టి 2018లో నర్సంపేట నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేసి గెలుపొందారు. 2023 ఎన్నికల్లో ఎమ్మెల్యేగా పోటీ చేసి ఓటమిపాలయ్యారు. నాటి నుంచి నేటి వరకు కేసీఆర్ వెన్నంటే నడిచి ఉమ్మడి వరంగల్ జిల్లా ఉద్యమకారులకు బాసటగా నిలిచారు.

**తెలంగాణ వచ్చాకే పెళ్లి... ఉద్యమం కోసం శపథం**

ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పడే వరకు తాను పెళ్లి చేసుకోనని... బ్రహ్మచర్యం పాటిస్తానని ఆయన ప్రతిజ్ఞ చేశారు. సుమారు ఏడు సంవత్సరాల పాటు తన మాటను నిలబెట్టుకున్నారు. 2014లో తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత మాత్రమే తన శపథాన్ని విరమించారు. అనంతరం కుటుంబ సభ్యులు చూసిన స్వప్నను తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి సన్నిధిలో వివాహం చేసుకున్నారు. వారికి నిదర్శన్ రెడ్డి, ధర్మిష్ఠ రెడ్డి అనే ఇద్దరు పిల్లలు ఉన్నారు.

**అధికారిక లాంఛనాలతో అంత్యక్రియలు**
**అధికారులకు సిఎం రేవంత్ రెడ్డి ఆదేశం**

మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి అంత్యక్రియలను పోలీసు లాంఛనాలతో నిర్వహించాలని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. అవసరమైన ఏర్పాట్లు చేయాలని వరంగల్ జిల్లా కలెక్టర్, వరంగల్ పోలీస్ కమిషనర్‌ను ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఆదేశించారు.

పెద్ది సుదర్శన్ రెడ్డి మృతి పట్ల రాష్ట్ర మంత్రులు, పలువురు రాజకీయ పార్టీల నాయకులు, ప్రముఖులు సంతాపాన్ని, ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ప్రజల సమస్యల పరిష్కారానికి అంకితభావంతో పనిచేసిన నాయకుడిగా పెద్ది సుదర్శన్‌రెడ్డి గుర్తుండిపోతారని మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్, సీతక్క, తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. తెలంగాణనే శ్వాసగా, నీతి నిజాయితీతో ప్రజాజీవనం కొనసాగిస్తూ సాగించిన రాజకీయ ప్రస్థానం ఆదర్శప్రాయమని మాజీ మంత్రులు కెటిఆర్, హరీష్‌రావు, కొప్పుల ఈశ్వర్, తలసాని శ్రీనివాస్ యాదవ్, సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి, మాజీ ఎంపిలు బోయినపల్లి వినోద్‌కుమార్, రావుల చంద్రశేఖర్‌రెడ్డి, టిఆర్‌ఎస్ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత అన్నారు.

**పెద్ది సుదర్శన్ రెడ్డి మృతి పట్ల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దిగ్భ్రాంతి**

నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి మృతి పట్ల ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. తెలంగాణ ఉద్యమంలో పెద్ది సుదర్శన్ రెడ్డి పోషించిన పాత్ర చిరస్మరణీయమని సిఎం కొనియాడారు. పెద్ది సుదర్శన్‌రెడ్డి కుటుంబ సభ్యులకు ముఖ్యమంత్రి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

**మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి మృతి బాధాకరం: కూనంనేని సాంబశివరావు**

మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి మృతి పట్ల సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు సంతాపం వ్యక్తం చేశారు. ఆయన చిన్న వయసులోనే గుండెపోటుతో మరణించడం బాధాకరమన్నారు. సుదర్శన్‌రెడ్డి సామాన్య రైతు కుటుంబంలో పుట్టి అంచలంచలుగా రాజకీయంలో ఎదిగారని పేర్కొన్నారు. తెలంగాణ మలిదశ ఉద్యమంలో క్రియాశీల పాత్ర పోషించారని వారు గుర్తు చేశారు. ఆయన మృతి పట్ల సంతాపాన్ని, వారి కుటుంబ సభ్యులకు సానుభూతిని తెలిపారు.

**ఆప్త మిత్రున్ని, ఉద్యమ సహచరున్ని కోల్పోయాను: మాజీ సిఎం కెసిఆర్**

తెలంగాణ ఉద్యమకారుడు, నర్సంపేట మాజీ ఎమ్మెల్యే బిఆర్‌ఎస్ పార్టీ సీనియర్ నేత పెద్ది సుదర్శన్ రెడ్డి మరణం పట్ల పార్టీ అధినేత కెసిఆర్ తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. ఉద్యమ సహచరున్ని, ఆప్త మిత్రున్ని కోల్పోయానని కెసిఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. పెద్ది సుదర్శన్ రెడ్డి కుటుంబ సభ్యులకు, నియోజకవర్గ కార్యకర్తలు అభిమానులకు కెసిఆర్ తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

# ఇంజనీర్లను తక్కువ చేసి మాట్లాడటం బాధ్యతారాహిత్యం

● సిఎం వ్యాఖ్యలను ఖండించిన కేంద్రమంత్రి కిషన్ రెడ్డి

ప్రజాపక్షం/హైదరాబాద్ : రాష్ట్ర విద్యాశాఖ బాధ్యతలను స్వయంగా నిర్వహిస్తున్న తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఇంజనీరింగ్ విద్యార్థులను 'క్రిమినల్ వేస్ట్' అని వ్యాఖ్యానించడం ఆయన బాధ్యతారాహిత్యానికి నిదర్శనమని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డి తీవ్రంగా ఖండించారు. సిఎం హోదాలో ఉన్న వ్యక్తి సమస్యలపై నిర్మాణాత్మక చర్చలు జరిపి మార్పుకు ప్రయత్నించాలి తప్ప, విద్యార్థులను అవమానించడం తగదని గురువారం విడుదల చేసిన ఒక ప్రకటనలో ఆయన అన్నారు. 'క్రిమినల్ వేస్ట్', 'వానాకాలం చదువులు' అని కామెంట్ చేసే ముందు ఆలోచించాలని, జెన్‌జి ఆకాంక్షలకు వ్యతిరేకంగా ప్రవర్తించవద్దన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇంజనీరింగ్ విద్యార్థులకు రూ. 5,000 కోట్లతో సహా మొత్తం రూ. 10,000 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించాల్సి ఉందని కిషన్ రెడ్డి తెలిపారు. ఈ బకాయిలు చెల్లించాలని విద్యార్థులు, యాజమాన్యాలు అడుగుతున్నందుకే, తట్టుకోలేక రేవంత్ రెడ్డి ఫ్రస్ట్రేషన్‌లో విద్యార్థులపై ఇటువంటి వ్యాఖ్యలు చేస్తున్నారని ఆరోపించారు. గతంలోనూ ఫీజు బకాయిలు అడిగితే విజిలెన్స్ విచారణల పేరుతో దాడి చేయించారని, 'తమాషాలు చేస్తే తాట తీస్తాం' అంటూ బెదిరించారని అన్నారు. గతంలో 2015లో నాటి సిఎం కెసిఆర్ కూడా ఇంజనీరింగ్ విద్యార్థుల ప్రమాణాలు బాగోలేవని, 'వానాకాలం చదువులు' అంటూ అసెంబ్లీ సాక్షిగా విద్యార్థులను కించపరిచారన్నారు. 9 ఏళ్లు అధికారంలో ఉన్నా కెసిఆర్ వ్యవస్థలో మార్పు తేలేదని, ఇప్పుడు రేవంత్ రెడ్డి కూడా అదే ధోరణి ప్రదర్శిస్తున్నారని విమర్శించారు.

తెలంగాణ ప్రభుత్వం
ఎగ్జిక్యూటివ్ ఇంజనీరింగ్ కార్యాలయం,
మిషన్ భగీరథ-ఇన్‌ట్రా, డివిజన్-భువనగిరి.
టెండర్ ప్రకటన
e-NIT NO. 01/T3/MB Division Bhongir/2025-26, తేది: 04.08.2026 (షార్ట్ టెండర్)
యాదాద్రి భువనగిరి జిల్లా, యాదగిరిగుట్ట మున్సిపాలిటీ, వార్డు నం. 10లో బోర్‌వెల్ తవ్వకం మరియు సబ్‌మెర్సిబుల్ పంప్సెట్ ఏర్పాటు. అంచనా విలువ: రూ.4.99 లక్షలు, టెండర్ల సమర్పణ ప్రారంభ తేదీ: 04.08.2026 మ.03.00గం.ల నుండి 11.08.2026 మ.03.00 గం.ల వరకు. మరిన్ని వివరాలకు https://tender.telangana.gov.in/లో చూడవచ్చు.
సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్,
ఎంబి సర్కిల్, భువనగిరి.
DIPR R.O. No. : 7070-PP/CL/ADVT/2026-27, Date: 31-07-2026

మల్కాజ్‌గిరి మునిసిపల్ కార్పొరేషన్
ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (M), MMC (HQ) కార్యాలయం, తార్నాక హుడా కాంప్లెక్స్, హైదరాబాద్.
E-mail : eem.mulhq@gmail.com
కొటేషన్ నోటీస్
Quotation Notice No. NIT No. 12/EE/MMC(HQ)/2026-27, Date : 31.07.2026
కింద పేర్కొన్న పని కొరకు పేరున్న సంస్థల నుండి సీల్డ్ కొటేషన్లు ఆహ్వానించబడ్డాయి. ఈ కొటేషన్లు తేదీ 01.08.2026న లేదా అంతకుముందుగా దిగువ సంతకందారుకు అందజేయాల్సిందిగా కోరడమైనది. ఈ కొటేషన్లు తేదీ 01.08.2026 సాయంత్రం 4.00 గంటల వరకు లేదా అంతకు ముందు స్వీకరించబడతాయి. అందిన కొటేషన్లు 4.30 గంటలకు తెరవబడతాయి. ఇతర వివరాలను కార్యాలయ వేళల్లో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (M) గారి నుండి పొందవచ్చు.

| క్ర. సం. | వివరణ | అవసరమైన కొటేషన్ |
|---|---|---|
| 1 | ఫ్యాక్టరీలో తయారు చేయబడిన బాహ్య ఉపరితలాలపై 6 MM దృఢమైన లేయర్‌తో కప్పబడిన 75x50 MM సాలిడ్ వుడ్ పాలిమర్ కాంపోజిట్ (డబ్ల్యుపిసి) సింగిల్ ఎక్స్‌ట్రూడెడ్ డోర్ ఫ్రేమ్‌ను సరఫరా చేసి, అమర్చడం. డోర్‌ఫ్రేమ్‌కు 32 MM /37MM రిబేట్ ఉంటుంది. రివర్స్ ఫార్వర్డ్ స్పీడ్ కంట్రోల్ హ్యాండ్ డ్రిల్లింగ్ మెషిన్‌ను ఉపయోగించి 8x75 MM పొడవుగల MS Star ఫుల్ థ్రెడ్ స్క్రూలతో రెండు నిలువు భాగాలను అడ్డ భాగాలతో కలపాలి. సిద్ధంగా/అమర్చబడిన ఫ్రేమ్‌ను Z Hand fast 300 MM పొడవుగల హోల్డ్ ఫాస్ట్‌ను ఉపయోగించి గోడకు బిగించాలి. TBSC-L.I-17 | Rate / Rmt |

సంబంధిత అధికారి చిరునామా: శ్రీ కె.రమేష్‌బాబు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (M), MMC (HQ), తార్నాక, హైదరాబాద్.
సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (M), మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్ (HQ), తార్నాక.
DIPR R.O. No. : 7081-PP/CL/ADVT/2026-27, Date: 31-07-2026

## ఖాళీ సీట్ల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

**ప్రజాపక్షం/రఘునాథపాలెం :** కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో 2026–27 విద్యా సంవత్సరానికి యంపిసి గ్రూపులో ఖాళీగా ఉన్న ఐదు సీట్ల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు స్పెషల్ ఆఫీసర్ వై. లత శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పదవ తరగతి మార్కుల ఆధారంగా విద్యార్థుల ఎంపిక జరుగుతుందని అర్హత కలిగిన విద్యార్థులు ఇట్టి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. మరిన్ని వివరాలకు కెజిబివి రఘునాథపాలెం ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ ను సంప్రదించాలన్నారు.

## ఆదర్శ కమ్యూనిస్టు ముత్తయ్య



సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్

**ప్రజాపక్షం/చింతకాని:** సిపిఐ నాయకులు బస్వాపురం గ్రామానికి చెందిన బుర్ర ముత్తయ్య శుక్రవారం గుండెపోటుతో మృతిచెందారు.ఆయన మరణవార్త తెలుసుకున్న పార్టీ జిల్లా కార్యదర్శి దండి సురేష్ బస్వాపురం చేరుకొని ముత్తయ్య మృతదేహంపై పార్టీ జెండా కప్పి నివాళులర్పించారు. ఈ సందర్భంగా దండి సురేష్ మాట్లాడుతూ ముత్తయ్య బ్రతికినంతకాలం ఎర్రజెండా ని ఎత్తుకొని పార్టీ అభివృద్ధి కోసం ఎంతగానో కృషిచేశాడన్నారు.ముత్తయ్య కుటుంబానికి పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందన్నారు. నివాళులర్పించిన వారిలో పార్టీ మండల కార్యదర్శి దూసరి గోపాలరావు, సహాయ కార్యదర్శి మార్గం శ్రీను, గ్రామ సర్పంచ్ ఆవుల నర్సింహారావు, శాఖ కార్యదర్శి నర్సింహారావు, ఉపసర్పంచ్ చంద్రకాని నర్సింహారావు, నాయకులు యాలాద్రి, సాల్మన్ రాజ్ తదితరులు పాల్గొన్నారు.

## ‘విబిజి రాంజి’ ఉద్యోగుల ‘పెన్‌డౌన్ షట్‌డౌన్’

**ప్రజాపక్షం/ ఖమ్మం :** పే స్కేల్ అమలు, సేవా నియమాలు, పదోన్నతులు ఇతర డిమాండ్స్‌తో పాటు ఉద్యోగ భద్రతకు సంబంధించి తమకు హక్కులు కల్పించాలని విబి జీ రాంజీ ఉద్యోగులు శుక్రవారం నుంచి జిల్లా వ్యాప్తంగా పెన్‌డౌన్ షట్ డౌన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కలెక్టర్‌కు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా విబి జీ రాంజీ ఉద్యోగుల జాయింట్ యాక్షన్ కమిటీనాయకులు మాట్లాడుతూ రెండు దశాబ్దాలుగా విధులు నిర్వహిస్తున్న నేటికీ పే స్కేల్ అమలు చేయడం లేదని గతంలో పలుమార్లు హామీ ఇచ్చిన ఏ ఒక్క హామీ కూడా నెరవేరలేదన్నారు. సర్వీసు రూల్స్, పదోన్నతులు, ఉద్యోగ భద్రత, ఇతర ఉద్యోగ హక్కులు కూడా కల్పించలేదన్నారు. ఈ పరిస్థితుల్లో తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం పెన్‌డౌన్ షట్‌డౌన్ కార్యక్రమాలను ప్రారంభించామని భవిష్యత్తులో ఆందోళనను మరింత ఉధృతం చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జేఏసి అధ్యక్షులు సిహెచ్ కోటయ్య, నాయకులు కిరణ్ కుమార్, డి. దీపక్, అశోక్‌రావు, సునీల్, వెంకట్రావు, నరేష్, నర్సింహారావు, రమేష్, మధన్ పాల్గొన్నారు.

## పాఠశాల భవనాలు నిర్మించాలని కలెక్టర్‌కు ఎఐఎస్ఎఫ్ వినతి



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ఖమ్మం నగరంలోని 57వ డివిజన్ వికలాంగుల కాలనీ రజక వీధిలోని ప్రైమరీ పాఠశాలకు సొంత భవనాలు నిర్మించాలని కోరుతూ ఏఐఎస్ఎఫ్ జిల్లా సమితి ఆధ్వర్యంలో శుక్రవారం జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్‌కు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు మడుపల్లి లక్ష్మణ్ మాట్లాడుతూ రజక వీధిలోని పాఠశాల పూర్తిగా శిథిలావస్థకు చేరుకుందన్నారు. ఈ పాఠశాలలో చదువుతున్న 60 మంది విద్యార్థులు రెండు కిలో మీటర్ల దూరంలో ఉన్న రమణగుట్టలోని పాఠశాలలో ప్రస్తుతం విద్యాభ్యాసం చేస్తున్నారన్నారు. రజక వీధిలోని పాఠశాలకు నిధులు కేటాయించి భవనాన్ని నిర్మించాలని పలుమార్లు ఆ ప్రాంత వాసులకు అధికారులకు విన్నవించినప్పటికీ ఫలితం లేదన్నారు. రమణగుట్ట పాఠశాలలో కేవలం నాలుగు గదులు మాత్రమే ఉన్నాయని అక్కడ సుమారు 144 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారని అక్కడి విద్యార్థులకే సరైన సౌకర్యాలు లేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. 2016 సంవత్సరం నుండి రజక వీధిలోని పాఠశాలను అద్దె భవనంలోనే నడిపిస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యవర్గ సభ్యులు వెంకీ, నాగశేషు, పవన్, గోపి పాల్గొన్నారు.

## లోతట్టు ప్రాంత ప్రజలను అప్రమత్తం చేయండి

అధికారులకు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశం

**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** భద్రాచలం వద్ద గోదావరి ప్రవాహం పెరుగుతున్న నేపథ్యంలో లో తట్టు ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేయాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు శుక్రవారం అధికారులను ఆదేశించారు. భద్రాచలం వద్ద రెండవ ప్రమాద హెచ్చరిక జారీ చేయడంతో హైదరాబాద్‌లో ఉన్న మంత్రి తు మ్మల నాగేశ్వరరావు చరవాణి ద్వారా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఉన్నతాధికారులతో మాట్లాడా రు. ఎగువన కురుస్తున్న వర్షాల కారణంగా గం ట గంటకు గోదావరి ప్రవాహం పెరుగుతుందని జిల్లా యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలన్నారు.

## సిపిఐ నేతలపై కేసు కొట్టివేత



**ప్రజాపక్షం/ ఖమ్మం :** ఆర్‌టిసి ఉద్యమం సందర్భంగా సిపిఐ నాయకులపై పెట్టిన కేసును ఖమ్మం న్యాయ స్థానం శుక్రవారం కొట్టివేసింది. ఆర్‌టిసి ఉద్యమం సందర్భంగా నమోదైన ఈ కేసులో సిపిఐ నగర కార్యదర్శి ఎస్‌కె జానిమియా, కార్యవర్గ సభ్యులు సిద్దినేని కర్ణకుమార్, శింగు నర్సింహారావు, తాటి వెంకటేశ్వరరావు, సిహెచ్ సీతామహాలక్ష్మి , ఏఐటియుసి నాయకులు గాదె లక్ష్మి నారాయణ, మందా వెంకటేశ్వర్లు, ఏఐఎస్ఎఫ్ నాయకులు ఇటికాల రామకృష్ణ, మడుపల్లి లక్ష్మణ్, సుభాని, సిపిఎం నాయకులు ఎస్‌కె మీరా ఉన్నారు. ఉద్యమ కారుల తరుపున ఓరుగంటి శేషగిరిరావు, రాకేష్, నికిత వాదించారు. ఈ కేసులో ముద్దాయిగా ఉన్న మలినేని శ్యామ్ మరణించారు.

# జాప్యం..శాపం

• సకాలంలో పూర్తికాని సీతారామ • నిధుల కేటాయింపులో వివక్ష • సకాలంలో పూర్తయితే కరువు దూరం



**ప్రజాపక్షం/ఖమ్మం:** గోదావరి జలాలను పంట భూములకు అందించాలన్నది ఖమ్మం ప్రజల చిరకాల కోరిక. ఇందు కోసం అనేక పోరాటాలు, ఆందోళనలు జరిగాయి. ముఖ్యంగా కమ్యూనిస్టు పార్టీ దుమ్ముగూడెం ప్రాజెక్టు సాధన కోసం చారిత్రిక పోరాటాన్ని నిర్వహించింది. కానీ గోదావరి జలాలకు సంబంధించి పాలకులు నిధుల కేటాయింపులో పాటిస్తున్న వివక్ష, నిర్మాణంలో జాప్యం ఇప్పుడు ఉమ్మడి ఖమ్మం జిల్లా రైతాంగానికి శాపంగా మారింది. ఎల్‌నినో ప్రభావంతో వర్షాలు కురవని నేపథ్యంలో సీతారామ ప్రాజెక్టు పూర్తయి ఉంటే జిల్లాలో పరిస్థితి మరో రకంగా ఉండేది. 2018 నాటికి పూర్తి కావాల్సిన ప్రాజెక్టు 2026 నాటికి కూడా పూర్తి కాలేదు. 2025 మార్చిలోనే ట్రయల్ రన్ నిర్వహించిన ఇంత వరకు పూర్తి స్థాయిలో నీటి విడుదల జరగలేదు. కాలువల నిర్మాణాలు జరగాల్సి ఉంది.

**రాజీవ్ సాగర్ స్థానే సీతారామ**

వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ప్రతిపాదిత దుమ్ముగూడెం ప్రాజెక్టును రెండుగా విడగొట్టి ఇందిరా సాగర్, రాజీవ్ సాగర్ పేర్లతో రెండు ఎత్తిపోతల పథకాలను ప్రారంభించారు. 2004లో శంకుస్థాపన జరిగిన ఈ ప్రాజెక్టుకు నిధుల కేటాయింపు లేకపోవడంతో 2014 వరకు బాలారిష్టాలను దాటలేదు. రాష్ట్ర విభజనతో ఇందిరా సాగర్ ఆంధ్రాకు వెళ్లడంతో పరిస్థితి మొదటికొచ్చింది. దీనిపై అప్పటి ఉమ్మడి రాష్ట్రంలో రూ. 2200 కోట్లు ఖర్చు పెట్టారు. తెలంగాణ ఏర్పడిన తర్వాత 2016 ఫిబ్రవరి 16న సీతారామ పేరుతో అప్పటి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు (కేసిఆర్) ప్రాజెక్టుకు శంకుస్థాపన చేశారు. 67 టిఎంసిల నీటిని తరలించేవిధంగా రూ. 7926 కోట్లతో ప్రాజెక్టు నిర్మాణ పనులు ప్రారంభించారు. 2018 నాటికి పూర్తి కావాల్సిన ఈ ప్రాజెక్టు నిధులు సరిపడ కేటాయించకపోవడంతో ఆశించిన స్థాయిలో పనులు జరగలేదు. జాప్యం కారణంగా ప్రాజెక్టు అంచనా వ్యయం పెరుగుతూ వచ్చింది. రూ.13057 కోట్లుగా గత ప్రభుత్వం నిర్ణయించగా ఆ తర్వాత ఇప్పుడు చివరిగా సీతారామ ప్రాజెక్టు నిర్మాణ వ్యయం రూ. 19325 కోట్లుగా మారింది. ప్రాజెక్టు నిర్మాణంలో భాగంగా బిజి కొత్తూరు, కమలాపురం, పూసుగూడెం వద్ద పంపు హౌజ్‌లను నిర్మించారు. తొమ్మిది వేల క్యూసెక్కుల నీటిని తరలించేవిధంగా కాలువలు నిర్మించారు. ఉప కాలువలు, పంట కాలువల నిర్మాణం జరగకపోవడంతో దశాబ్ద కాలం తర్వాత కూడా సీతారామ సాగునీటిని అందించలేని పరిస్థితి ఏర్పడింది. బిఆర్ఎస్ ప్రభుత్వం నిధుల కేటాయింపు సరిగ్గా జరపలేదన్న అపవాదును మూటకట్టుకున్న నేపథ్యంలో కాంగ్రెస్ కూడా సీతారామ పట్ల అదే వైఖరిని అవలంభించింది. ప్రతి సారి మంత్రులు సీతారామ పూర్తి అయినట్లుగా హడావుడి చేస్తున్నారు కానీ అసలు నిధులు వచ్చేసరికి గతమే పునరావృతమవుతుంది. కొత్త ఆయకట్టుతో పాటు స్థిరీకరణతో కలిపి సుమారు ఏడు లక్షల ఎకరాలకు సాగునీటిని అందించే ఈ ప్రాజెక్టు పూర్తయి ఉంటే ఎల్‌నినో సైతం ఖమ్మం జిల్లాను ఏమి చేయలేని పరిస్థితి ఉండేది.

**గోదావరికి పుష్కలంగా నీరు :**

ఐదు దశాబ్దాల కాలంలో ఒకట్రెండు సందర్భాలు మినహాయించి పాత దుమ్ముగూడెం ఆనకట్ట వద్ద గోదావరికి ఎన్నడు నీటి కొరత రాలేదు. దిగువ భాగంలోని తాలిపేరు ప్రాజెక్టు ప్రధాన నీటివనరుగా ఉంది. ఈ ఏడాది ఎల్‌నినో ప్రభావంతో కృష్ణానది వట్టిపోయిన గోదావరి రెండవ ప్రమాద హెచ్చరిక దాటి ప్రవహిస్తుంది. సీతారామ పూర్తయి ఉంటే ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని చెరువులు, కుంటలు, మధ్యతరహా ప్రాజెక్టులు జలంతో కళకళలాడేవి. ఇప్పుడు తలాపునే గోదావరి పారుతున్న వరద నీటిని చూస్తుండటం తప్ప ఏమి చేయలేని పరిస్థితి. సీతారామ ప్రాజెక్టు ఆలోచనకు ముందు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పట్టిసీమ ద్వారా దాదాపు ఏడేళ్లుగా నీటిని తరలిస్తున్నా కరువు కాలంలోనూ తెలంగాణ ప్రభుత్వం చెరువులకు నీటిని తరలించే ప్రయత్నం పూర్తి స్థాయిలో చేయలేకపోయింది. నాగార్జున సాగర్ ఎడమ కాలువ ఆయకట్టు పరిధిలోని రెండున్నర లక్షల ఎకరాలు సహా మొత్తం ఏడున్నర లక్షల ఎకరాలకు సమృద్ధిగా నీరు అందేది. నిధుల కేటాయింపులో వివక్ష, నిర్మాణంలో జాప్యం శాపంగా మారింది.

**లింక్ కెనాల్స్‌పైనే ధ్యాస !**

ఖమ్మంజిల్లాకు చెందిన మంత్రులు ప్రధాన ప్రాజెక్టు కంటే లింక్ కెనాల్స్‌పై ఎందుకో దృష్టిసారిస్తున్నారన్న ఆవేదన రైతుల్లో వ్యక్తమవుతుంది. ప్రాజెక్టు పనులు త్వరితగతిన పూర్తి చేస్తే ఈ లింక్ కెనాల్స్ అవసరం ఉండేది కాదు. మున్నేరు నుంచి పాలేరుకు లింక్ కెనాల్ పేరుతో ఒక కాలువ నిర్మాణం జరుగుతుంది. ఇందుకు రూ. 186 కోట్లు కేటాయించారు. కానీ సీతారామ పూర్తయి నేరుగా పాలేరులోకి గోదావరి జలాలు వస్తే ఈ లింక్ కాలువ అవసరం లేదు. అదేవిధంగా ఏన్కూరు నుంచి రాజీవ్ లింక్ కెనాల్ పేరుతో ఒక కాలువ నిర్మాణం జరిగింది. ఇందుకు రూ. 100 కోట్లు కేటాయించారు. అసలు పాలేరులో గోదావరి జలాల అనుసంధానం జరిగినప్పుడు పాలేరు దిగువన ఉన్న నాగార్జున సాగర్ కాలువ ద్వారా సాగునీటిని అందించే అవకాశం ఉంది. కోట్ల రూపాయలు ఖర్చుపెట్టి నిర్మించిన లింక్ కెనాల్స్ ఒకవేళ సీతారామ పూర్తయితే వ్యర్థమే. ఇక మధిర నియోజక వర్గంలో జవహర్ ఎత్తిపోతల పథకంతో రూ. 600 కోట్లకు పైగా ఖర్చుచేస్తున్నారు. సీతారామ పూర్తయితే నాగార్జున సాగర్ రెండవ జోన్‌లోనే ఉన్న ఎర్రుపాలెం మండలానికి సాగునీటి కొరత ఉండక పోవచ్చు. ఈ లింక్ కెనాల్స్‌పై దృష్టిసారించి అమాత్యులు ప్రధాన కాలువ పనులను విస్మరిస్తున్నారన్న ఆవేదన రైతుల్లో వ్యక్తమవుతుంది.

## ఏజెన్సీ ప్రాంతాల వికాసానికి సమగ్ర కృషి

ప్రజల అవసరాలు సంక్షేమానికి ప్రథమ ప్రాధాన్యత: కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని



**ప్రజాపక్షం/భద్రాద్రికొత్తగూడెం:** ఏజెన్సీ ప్రాంతాల సమగ్ర వికాసానికి మౌళిక సదుపాయాల కల్పనకు నిరంతరం కృషి చేస్తామని కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు తెలిపారు. లక్ష్మీ దేవిపల్లి మండల పరిధిలోని హేమచంద్రాపురం అనిశెట్టిపల్లి గ్రామాల మధ్య గల ముర్రేడు వాగుపై రూ.7 కోట్ల వ్యయంతో నిర్మించతలపెట్టిన హై లెవల్ బ్రిడ్జీ నిర్మాణ పనులకు శుక్రవారం ఆయన శంకుస్థాపన చేశారు. అదేవిధంగా రేగళ్ల ప్రాంతంలోని మున్యాతండా పెద్ద తండా గ్రామాల మధ్య గంగమ్మ గుడి వాగుపై రూ.1.80 కోట్ల అంచనా వ్యయంతో నిర్మించబోయే మరో వై లెవల్ వంతెన నిర్మాణ పనులకు కూడా శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభల్లో ఎమ్మెల్యే మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంతాల్లో గ్రామీణ రవాణా వ్యవస్థను మెరుగుపరచడం, గ్రామాల మధ్య మనుసందానాన్ని పెంచడం అత్యంత కీలకమని పేర్కొన్నారు. వర్షాకాలంలో వాగులు ఉప్పొంగి బాహ్య ప్రపంచంతో సంబంధాలు తెగిపోయే మారుమూల గ్రామీణ ఏజెన్సీ ప్రజల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వంతో పోరాడి నిధులు మంజూరు చేయించామని తెలిపారు. మౌళిక సదుపాయాల కల్పనకు నిధులు సమీకరణలో ఎక్కడా రాజీ పడేది లేదని స్పష్టం చేసారు. ఈ వంతెన నిర్మాణం పూర్తయితే పరిసర గ్రామాల ప్రజలకు సత్వర రవాణా సౌకర్యం అందుబాటులోకి వస్తుందన్నారు. నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్ పాషా, మేయర్ మూడ్ గణేష్, సర్పంచ్ కంగాల అంజలి, మామిళ్ల బాలకృష్ణ, చంద్రగిరి శ్రీనివాస్, ఎంపిడిఓ సుస్మిత, తహశీల్దార్ శిరీష, ఏఇలు రఘురామయ్య, శ్రీకాంత్, బొళ్ల లక్ష్యారెడ్డి, కల్లెం సత్యనారాయణ, తూము చౌదరి, ఏనుగుల అర్జునరావు, జగన్, బలరామ్ నాయక్, ఉపేందర్, పూర్ణ, రాజు, రత్నకుమారి తదితరులు పాల్గొన్నారు.

## పెద్ది మృతి అత్యంత విషాదకరం

మాజీ ఎమ్మెల్యే వీరయ్య ప్రగాఢ సంతాపం



**ప్రజాపక్షం/సత్తుపల్లి:** తెలంగాణ ఉద్యమకారుడు, బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు, ఆత్మీయ మిత్రుడు పెద్ది సుదర్శన్ రెడ్డి అకాల మరణం తనను తీవ్ర దిగ్భ్రాంతికి, విషాదానికి గురిచేసిందని మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న సమయంలో ఆయన ఆరోగ్యంగా కోలుకుని తిరిగి వస్తారనే ఆశతో అందరం ఎదురుచూశామని, కానీ ఆయన ఇక మన మధ్య లేరన్న వార్త ఎంతో బాధాకరమని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో పెద్ది సుదర్శన్ రెడ్డి కీలక పాత్ర పోషించారని, ఉద్యమ స్ఫూర్తిని జీవితాంతం నిలబెట్టిన నిజమైన పోరాట యోధుడిగా ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోతారని అన్నారు. పార్టీ బలోపేతం కోసం అంకితభావంతో పనిచేస్తూ, ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేసిన నాయకుడిగా ఆయన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు.పెద్ది సుదర్శన్ రెడ్డి మరణం బీఆర్ఎస్ పార్టీకి, తెలంగాణ సమాజానికి, ఉద్యమ సహచరులకు తీరని లోటని మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య పేర్కొన్నారు. ఆయన చూపిన సేవా మార్గం, ఉద్యమ నిబద్ధత, నిరాడంబర వ్యక్తిత్వం భావితరాలకు స్ఫూర్తిగా నిలుస్తాయని అన్నారు. పెద్ది సుదర్శన్ రెడ్డి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థిస్తూ, వారి కుటుంబ సభ్యులకు, బంధుమిత్రులకు, అభిమానులకు తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఈ తీవ్ర విషాదాన్ని తట్టుకునే మనోధైర్యాన్ని వారి కుటుంబ సభ్యులకు ప్రసాదించాలని భగవంతుడిని ప్రార్థించారు.

## సమర్థవంతంగా ‘జలసిరి’ అమలు



**ప్రజాపక్షం/తిరుమలాయపాలెం:** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ‘జలసిరి’ కార్యక్రమాన్ని గ్రామస్థాయిలో సమర్థవంతంగా అమలు చేసి, వర్షపు నీటిని సంరక్షించడం ద్వారా భూగర్భ జలాలను పెంపొందించాలని జిల్లా పంచాయతీ రాజ్ అధికారి జి.వినోద్ కుమార్ సూచించారు. మండలంలోని ఏలువారిగూడెం, మేకలతండా, పిండిప్రోలు గ్రామ పంచాయతీలను శుక్రవారం ఎంపీడీఓ ఎస్.కే.సిలార్ సాహెబ్‌తో కలిసి సందర్శించి సర్పంచులకు, పంచాయతీ కార్యదర్శులు ఈజీఎస్ ఫీల్డ్ అసిస్టెంట్‌లతో సమావేశమై మాట్లాడారు. జలసిరి కార్యక్రమం అమలుపై పలు కీలక సూచనలు చేశారు. ప్రతీ గ్రామంలో వర్షపు నీటిని నిల్వ చేయాలని, ప్రతీ ఇంటి ఆవరణలో ఇంకుడు గుంటలు తవ్వి వర్షపు నీటిని భూగర్భంలోకి ఒడిసి పెట్టేలా ప్రజలను చైతన్యపరచాలని సూచించారు. భూగర్భ జలాల మట్టం పెరగడం వల్ల భవిష్యత్‌లో తాగునీటి, సాగునీటి సమస్యలు తగ్గుముఖం పడతాయని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచి చామకూరి రాజు, దేవరం దేవేందర్ రెడ్డి, ఎంపీఓ మీరా, పంచాయతీ కార్యదర్శులు మాధవి, తదితరులు పాల్గొన్నారు.

## గడువులోపు ఓటరు గణన ఫారాన్ని సమర్పించాలి

బిఎల్ఎలు, బిఎల్ఒలకు సహకరించాలి : కలెక్టర్ దివాకర



**ప్రజాపక్షం/ఖమ్మంఅర్బన్ :** ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమంలో ప్రతి ఓటరు గణణ ఫారాన్ని ఆగస్టు మూడు లోపు తప్పనిసరిగా సమర్పించేలా రాజకీయ పార్టీలు సహకరించాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ డా।। పి.శ్రీజ తో కలిసి కలెక్టర్ దివాకర టిఎస్ రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఎస్ఐఆర్ కార్యక్రమంపై నిర్వహించిన సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమం సమర్థవంతంగా కొనసాగుతుందన్నారు. 31967మంది మృతి చెందిన ఓటర్లు, 10060 డబుల్ ఎంట్రీలు, 94వేల మంది శాశ్వతంగా ఇతర ప్రాంతాలకు మారిన ఓటర్లుగా గుర్తించినట్లు తెలిపారు. ఇంకా సుమారు 31వేల మంది ఓటర్లు గణన ప్రక్రియకు స్పందించడం లేదని వీరిలో అధిక సంఖ్యలో ఖమ్మం నగరానికి చెందిన వారు ఉన్నారని తెలిపారు. గణన ఫారాలు పూరించి ఇవ్వని పక్షంలో సంబంధిత ఓటర్ల పేరు ముసాయిదా ఓటరు జాబితా నుంచి తొలగించబడే అవకాశం ఉంటుందని కలెక్టర్ తెలిపారు. ఒకవేళ పేరు ముసాయిదా జాబితాలో లేకపోతే అనంతరం అవసరమైన ధృవపత్రాలతో ఫారం 6 ద్వారా తిరిగి దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుందన్నారు. రాజకీయ పార్టీలు కూడా తమ కార్యకర్తలు తమ మద్ధతుదారులను చైతన్యపరిచి గడువులోగా గణన ఫారాలు సమర్పించేలా చూడాలని కోరారు. జిల్లాలో సుమారు పది లక్షల గణన ఫారాల్లో 42వేల మంది ఓటర్ల మ్యాపింగ్ పూర్తి కాలేదని వారికి భారత ఎన్నికల సంఘం నిర్దేశించిన 11 గుర్తింపు పత్రాల్లో ఏదో ఒకటి సమర్పించేందుకు నోటీసులు జారీ చేయనున్నట్లు తెలిపారు. జిల్లాలో మొత్తం 1460 పోలింగ్ కేంద్రాల్లో 677 కేంద్రాల్లో 100 శాతం గణన ఫారాల డిజిటలైజేషన్ పూర్తయిందని 544 కేంద్రాల్లో 95 శాతం, 158 కేంద్రాల్లో 90 శాతం డిజిటలైజేషన్ పూర్తయిందన్నారు. మిగిలిన పోలింగ్ కేంద్రాల్లో కూడా వంద శాతం డిజిటలైజేషన్ పూర్తి చేసేందుకు కృషి చేస్తున్నారన్నారు. బూత్ స్థాయి ఏజెంట్లు (బిఎల్ఏలు) క్షేత్రస్థాయిలో బూత్ స్థాయి అధికారులకు (బిఎల్‌వోలు) సహకరించి ప్రతి ఓటరు సరైన వివరాలతో గణన ఫారం సమర్పించేలా చూడాలన్నారు. ఆగస్టు మూడున గణన ఫారాల సమర్పణకు చివరి తేది అని, ఆగస్టు 10న ముసాయిదా ఓటరు జాబితా ప్రచురిస్తామని తెలిపారు. సెప్టెంబర్ తొమ్మిది వరకు క్లెయిమ్‌లు, అభ్యంతరాలను స్వీకరించి అక్టోబర్ ఎనిమిది నాటికి వాటిని పరిష్కరించి అక్టోబరు 12న తుది ఓటరు జాబితాను ప్రచురిస్తామని కలెక్టర్ తెలిపారు. ఈ సమావేశంలో ఖమ్మం కార్పోరేషన్ కమిషనర్ అభిషేక్ అగస్త్య, కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్, అసిస్టెంట్ ట్రైనీ కలెక్టర్ పారస్ కుమార్, డిఆర్‌వో సిహెచ్ రామ్మూర్తి, ఆర్డీవో శ్రీనివాస్, వివిధ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

# భయపెడుతున్న గోదావరి వరదలు



• 1986 ఆగష్టు నాటి వరద ఆల్‌టైమ్ రికార్డు • అత్యధిక సార్లు ఆగష్టులోనే ఉప్పొంగిన గోదావరి • 2022 జులైలో వచ్చిన రెండో అతిపెద్ద వరద

**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** గోదావరి పరివాహక ప్రాంత ప్రజానికానికి ఆగష్టు నెలంటే వెన్నులో వణుకు పడుతుంది. 1986వ సం. ఆగష్టు 15న గోదావరికి వచ్చిన వరద కనీవినీ ఎరుగన రీతిలో ప్రాణ, ఆస్తి నష్టాన్ని మిగిల్చింది. ఆ రోజుల్లో 75.06 అడుగుల వరద రాగా ఇప్పటి వరకు అదే ఆల్‌టైమ్ రికార్డు గా నిలిచింది. ఆ తర్వాత 2022 జూలైలో 71.03 అడుగుల రెండో అతి పెద్ద వరద నమోదు కాగా ఆ తర్వాత మూడో అతిపెద్ద వరద 1990 ఆగష్టులో 70.03 అడుగులు వచ్చింది. ప్రతీ ఏటా భద్రాచలం, పినపాక నియోజకవర్గాల గోదావరి పరివాహక ప్రాంతాలను వరదలు కంటిమీద కునుకు లేకుండా చేస్తుంటాయి. నివాస గృహాలన్నీ గోదావరికి అతి సమీపంలో ఉండటంతో 50 అడుగుల వరద రాంగానే అంతా లోతట్టు ప్రాంతాలు కావడంతో మెరక ప్రాంతాలకు తట్టాబుట్ట పిల్లాపాల గోడ్డు గోదతో వెళ్లాల్సి వస్తుంది. 1986లో వచ్చిన గోదావరి వరదలు మహా విషాదాన్నే నింపాయి. గోదావరి తీర ప్రాంతాలు మొత్తం ఆ ప్రళయంలో కొట్టుకుపోయాయి. చూస్తుండగానే ఇళ్లతో పాటు మనుష్యులు పశువులు కొట్టుకుపోతున్నా రక్షించలేని దయనీయ అమానవీయ పరిస్థితి ఎదురైంది. ఆ నాటి స్థితి నుండి కోలుకోవడానికి ఇక్కడి జనాంగానికి కనీసం దశాబ్దకాలం పట్టిందంటే అతిశయోక్తి కాదు. ఆ తర్వాత 2022లో వచ్చిన వరద సైతం ఇబ్బందులు పాలు చేసింది. కరకట్ట నిర్మాణం జరగడంతో భద్రాచలం పట్టణం మునకనుండి బయటపడింది. 1986 నాటి వరద కంటే 2022లో వచ్చిన వరద నాలుగు అడుగులు తక్కువే అయినప్పటికీ 1986 కంటే 2022లో ఎక్కువ భూభాగం మునకకు గురైంది. పోలవరం ప్రాజెక్టు కారణంగా బ్యాక్ వాటర్ ప్రభావంతో ము నక ప్రాంతాలు పెరిగినట్లు నిపుణులు అభిప్రాయపడ్డా రు. ఇదిలా ఉండగా గోదావరికి ప్రధానంగా జూన్, జూలై, ఆగష్టు, సెప్టెంబర్ మాసాల్లో వరదలు వస్తుంటాయి.

**ఆగష్టులోనే ఎక్కువ సార్లు:** 1977 నుండి ఇప్పటి 2020 వరకు 29 సార్లు గోదావరికి ఆగష్టు నెల్లోనే వరదలు వచ్చాయి. 1977లో 49.09 అడుగులు 1979లో 44.07, 1980లో 48, 1981లో 59.09, 1982లో 34.05, 1983లో 63.05, 1984లో 38.08, 1985లో 36.09, 1986లో 75.06, 1988లో 59, 1990లో 70.08, 1991లో 46.03, 1992లో 52.09, 1993లో 37, 1996లో 30, 1999లో 41.01,2000లో 54.06, 2002లో 50,2004లో 37.06,2006లో 66.09, 2007లో 53.7,2008లో 47.03, 2009లో 31, 2010లో 59.07, 2012లో 46.04, 2013లో 61.04,2018లో 50, 2020 ఆగష్టులో 61.06 అడుగుల వరద వచ్చింది. అదే విధంగా జూలై నెల్లో 1976 నుండి ఇప్పటి వరకు 9 సార్లు వరదలు వచ్చాయి. 1987 జూలైలో 35.08 అడుగులు, 1988 జూలైలో 57.03 అడుగులు, 1989 జూలైలో 52.05 అడుగులు 2003 జూలైలో 45.08అ,2016 జూలైలో 52.04అ, 2017 జూలైలో 36.07అ, 2021 జూలైలో 48.06అ, 2022 జూలైలో 71.03అ, 2023 జూలైలో 56.01 అడుగుల వరద వచ్చింది. ఇక జూన్, సెప్టెంబర్, అక్టోబర్ నెలల్లో కలిపి మొత్తంగా 9 సార్లు గోదావరికి వరదలొచ్చాయి. కాగా భద్రాచలం వద్ద 43 అడుగులకు గోదావరి చేరుకుంటే మొదటి ప్రమాద హెచ్చరిక,48 అడుగులకు రెండో, 53 అడుగలకు మూడో ప్రమాద హెచ్చరికను జారీ చేస్తారు.



**రోడ్లపైకి వరద :** ఎగువ ప్రాంతంలో భారీ వర్షాలు కురిస్తే నీరు దిగువనున్న గోదావరిలో కలుస్తోంది. మరో ప్రక్క గోదావరి ఉపనదులైన ఇంద్రావతి, ప్రాణహితలు సైతం ఉప్పొంగటంతో మరింత వరద చేరుతోంది. వరద 43 అడుగుల మొదటి ప్రమాదహెచ్చరిక దాటి ప్రవహిస్తే దుమ్ముగూడెం మండలంలో సుమారు 24 గ్రామాలు ప్రభావానికి గురవుతాయి. మరింత వరద తాకిడి పెరిగితే తూరుబాకవద్ద గోదావరి రోడ్డుపైకి వచ్చి చేరుతుంది. తద్వారా రాకపోకలకు అంతరాయం ఏర్పడుతుంది. భద్రాచలంపట్టణంలోని సుభాష్ నగర్, కొత్తకాలనీ ప్రాంతాలు వరద ముంపుకు గరవుతాయి.

**అప్పటికప్పుడేహడావిడి:** గోదావరి వరదలసందర్భంగా అధికారులు అప్పటికప్పుడే హడావిడి చేస్తుంటారు. ఉన్నతాధికారుల ఆదేశాలతో క్రిందిస్థాయి సిబ్బంది పునరావాసాలు ఏర్పాటు వరదబాధితులకు సదుపాయాలు కల్పిస్తుంటారు. వరదలు తగ్గంగానే బాధితులు వారి ఇళ్లకు అధికారులు వారి యాదావిధి విధులకు ఎవరిదారిని వారు పోతుంటారు. వరద నుండి ప్రజలకు శాశ్వత పరిష్కారం చూపేందుకు ఏ ఒక్క ప్రభుత్వం కూడా చొరవ చూపడం లేదు. ఇన్నేళ్ల పాటు పునరావాస కేంద్రాలు, అందులో సదుపాయాలు, అధికారుల రవాణా ఖర్చులు, జీతభత్యాలు ఇతరత్రా ఖర్చులు లెక్కలు కడితే కొన్ని కోట్లు రూపాయలు అయి ఉంటాయి.

**ఈ పాలకులైనా పట్టించుకోవాలి :** 2022 జూలై గోదావరి వరదల సమయంలో భద్రాచలం వచ్చిన అప్పటి బిఆర్ఎస్ ముఖ్యమంత్రి కేసిఆర్ ప్రజలకు శాశ్వత పరిష్కారం చూపిస్తామని, రూ.100 కోట్లు వెచ్చించి పునరావాస కాలనీలు నిర్మిస్తామని, గోదావరి వరదలు తాకని ప్రాంతాల్లో నివాసాలు కట్టించి తీరుతామని మాటిచ్చినా అది నెరవేర్చలేదు. అదే విధంగా భద్రాచలం వద్ద కూనవరం రోడ్లు అసంపూర్తిగా కరకట్టను కట్టి వదిలేశారు.ఇప్పటి ప్రభుత్వమైనా గోదావరి పరివాహన ప్రాంతాల ప్రజల సమస్యలు పట్టించుకుని శాశ్వత పరిష్కార మార్గాలు చూపాలని ప్రజలు కోరుతున్నారు.

## ఏజెన్సీ పోలీస్ నియామకాల్లో 75 శాతం స్థానిక ఆదివాసుల రిజర్వేషన్ అమలు



**ప్రజాపక్షం/ములుగు:** షెడ్యూల్డ్ ఏరియా పోలీస్‌స్టేషన్‌లో సివిల్ కానిస్టేబుల్ పోస్టులకు జివో నెంబర్ 49 ప్రకారం స్థానిక ఆదివాసులకు 75 శాత రిజర్వేషన్లు 2026 పోలీస్ కానిస్టేబుల్ నియామక నోటిఫికేషన్‌లో స్పష్టంగా పేర్కొని అమలు చేయాలని ఆదివాసీ విద్యార్థి, నిరుద్యోగ, ఉద్యోగి సంఘాల ప్రతినిధులు రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా, శిశు సంక్షేమశాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్కను కోరారు. ఇటీవల తెలంగాణ రాష్ట్ర పోలీస్ నియామక మండలి విడుదల చేసిన 2026 కానిస్టేబుల్ నియమాక నోటిఫికేషన్‌లో షెడ్యూల్డ్ ఏరియా పోలీస్‌స్టేషన్లకు వర్తించే 75 శాతం స్థానిక ఆదివాసుల రిజర్వేషన్ అంశాన్ని స్పష్టంగా ప్రస్తావించలేదని వారు తెలిపారు. గతంలో విడుదలైన 2018, 2022 నియామక నోటిఫికేషన్లలో మాత్రం తెలంగాణ రాష్ట్ర గెజిట్‌లోని జివో నెంబర్ 49ను స్పష్టంగా పొందుపరిచి షెడ్యూల్డ్ ఏరియా రిజర్వేషన్‌ను అమలు చేసినట్లు గుర్తు చేశారు. ఆదిలాబాద్, కొమురం భీమ్ ఆసిఫాబాద్, భద్రాద్రి కొత్తగూడెం, ములుగు తదితర షెడ్యూల్డ్ ఏరియా పోలీస్‌స్టేషన్‌లో గత విధానాన్ని కొనసాగిస్తూ స్థానిక ఆదివాసులకు 75 శాతం రిజర్వేషన్‌లు అమలు చేయాలని వినతిపత్రంలో కోరారు. లేదంటే ఏజెన్సీ ప్రాంతాల ఆదివాసీ యువత ఉద్యోగ అవకాశాలు కోల్పోయే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. వినతిపత్రాన్ని స్వీకరించిన మంత్రి సీతక్క సమస్యను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్ళి తగిన చర్యలు తీసుకునేలా పరిశీలిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ ప్రొఫెసర్ చిడెం కిషోర్ కుమార్, అడ్వకేట్ బట్టా వెంకటేశ్వర్లు, తోలెం కళ్యాణ్, కొమరం మనోజ్ కుమార్, కబ్బాక్ ఆకాశ్‌తో పాటు ఆదివాసీ విద్యార్థి, నిరుద్యోగ, ఉద్యోగి సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

## డిగ్రీ కళాశాలకు భూమి కేటాయించినందుకు మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కు కృతజ్ఞతలు



**ప్రజాపక్షం/హనుమకొండ టౌన్ :** స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గ కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల ఆవరణలో డిగ్రీ కళాశాల నిర్మాణానికి 5ఎకరాల భూమిని కేటాయిస్తూ సంబంధిత అలాట్ మెంట్ కాపీని మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరికి హైదరాబాద్ లోని మినిస్టర్స్ క్వార్టర్స్ లో రాష్ట్ర ఎస్సి, ఎస్టీ, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మ ణ్ అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కడియం శ్రీహరి మంత్రి అడ్లూరి లక్ష్మ ణ్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గ ప్రజలు ఎన్నో ఏళ్లుగా ఎదురు చూస్తున్న డిగ్రీ కళాశాల నిర్మాణానికి మార్గం సుగమం చేసిన మంత్రి అడ్లూరి లక్ష్మ ణ్ గారికి, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గ ప్రజలు ఎల్లప్పుడూ ఋణపడి ఉంటారని తెలిపారు. స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గంలోని నిరుపేద విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు గురుకుల పాఠశాలలు, కస్తూరిభా గాంధీ పాఠశాలలు, మాడల్ స్కూల్లు, యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల, తెలంగాణ పబ్లిక్ స్కూల్తో పాటు డిగ్రీ కళాశాల కూడా అతి త్వరలోనే స్వంత భవనంలో అందుబాటులోకి రానున్నట్లు వెల్లడించారు. స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గ విద్యార్థులకు ఉన్నత ప్రమాణాలతో కూడిన విద్యను అందించడంతో పాటు రానున్న రోజులల్లో స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గాన్ని విద్యా హబ్ తీర్చిదిద్దుతానని పేర్కొన్నారు.

## రైతు సంక్షేమ, ఇళ్ల నిర్మాణం, విద్యపై కలెక్టర్ ప్రత్యేక దృష్టి




**ప్రజాపక్షం/గూడూరు:** రైతులు సంప్రదాయ పంటలపైనే ఆధారపడకుండా పంటల వైవిధ్యీకరణ పంట మార్పిడి విధానాలను అవలబించి అధిక ఆదాయం పొందేలా వ్యవసాయ శాఖ అధికారులు అవగాహన కల్పించాలని మహబూబాబాద్ జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్ సూచించారు. శుక్రవారం కొత్తగూడ మండలంలో పర్యటించిన కలెక్టర్ పలు అభివృద్ధి కార్యక్రమాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి అధికారులు రైతులు అబ్దిదారులు విద్యార్థులతో నేరుగా మాట్లాడారు. పంట మార్పిడి విధానం కార్యక్రమంలో భాగంగా రైతులు బానోత్ బిచ్చ బానోత్ సుమన్ పెలాలను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ప్రాజెక్టు వైవిధ్యీకరణలో భాగంగా చేపడుతున్న కార్యక్రమాల పురోగతిని క్షేత్రస్థాయిలో పరిశీలించిన ఆమె పంటల సాగు విధానం రైతులకు కలుగుతున్న ప్రయోజనాలు వ్యవసాయంలో ఎదురవుతున్న సమస్యలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. పంటల వైవిధ్యీకరణ ద్వారా నేల సారాన్ని కాపాడటంతో పాటు రైతులకు స్థిరమైన ఆదాయం లభించే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంపై సనులను జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఇళ్ల నిర్మాణ పురోగతిని పరిశీలిస్తూ సంబంధిత అధికారుల నుంచి వివరాలు తెలుసుకున్నారు. గురుకులంలో విద్యార్థుల సామర్థ్యాల పరిశీలన కలెక్టర్ స్నేహ శబరిష్ తన పర్యటనలో భాగంగా గాంధీనగర్‌లోని గిరిజన బాలికల గురుకుల పాఠశాలను కూడా సందర్శించారు. పాఠశాలలో విద్యాబోధన విద్యార్థుల అభ్యసన సామర్థ్యం విద్యా ప్రమాణాలను స్వయంగా పరిశీలించారు. విద్యార్థులతో నేరుగా మాట్లాడిన కలెక్టర్ వారి అభిప్రాయాలను తెలుసుకోవడంతో పాటు భవిష్యత్తులో సాధించాలనుకుంటున్న లక్ష్యాలు వాటి కోసం చేపట్టాల్సిన కార్యచరణ ప్రణాళికలపై చర్చించారు. జిల్లా అభివృద్ధిలో ప్రజల భాగస్వామ్యంతో పాటు అధికారులు క్షేత్రస్థాయిలో నిరతరం పర్యవేక్షణ చేయడం ఎంతో కీలకమని ఆమె పేర్కొన్నారు.ఈకార్యక్రమంలో వివిధ శాఖ అధికారులు పాల్గొన్నారు.

## వరికి బదులు ఆరుతడి పంటలు సాగు చేయాలి: కలెక్టర్

**ప్రజాపక్షం/బచ్చన్నపేట:** ఎలోనినో పరిస్థితులు, నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకుని రైతులు వరి సాగుకు బదులుగా పెసర, నువ్వులు, కందులు, మిర్చి, బెండ, తదితర ఆరుతడి పంటల సాగుపై దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా సూచించారు. మండలంలోని ఎద్దుగూడెం గ్రామంలో శుక్రవారం పంట పొలాలను పరిశీలించిన ఆయన రైతులతో నేరుగా మాట్లాడి సాగు పరిస్థితులు, దిగుబడులు, మార్కెట్ అవకాశాలు, ప్రభుత్వ ప్రోత్సాహక పథకాలపై చర్చించారు. సాగు విస్తీర్ణం పెట్టుబడి, ఆశిస్తున్న దిగుబడుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. రైతుల అనుభవాలను ఇతర రైతులకు తెలియజేసి ఆరుతడి పంటల సాగుపై విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు. నీటి వినియోగం తక్కువగా ఉండే పెసర, నువ్వులు, కందులు, మిర్చి, బెండ వంటి పంటలు ప్రస్తుతం ఉన్న వాతావరణ పరిస్థితులకు అనుకూలమన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారి అంబికా సోని, వ్యవసాయశాఖ అధికారులు, గ్రామ సర్పంచ్ అల్వాల నర్సింగరావు, గ్రామస్థులు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

# ఆరోగ్య నియోజక వర్గమే లక్ష్యం





మారుమూల ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందిస్తాం
త్వరలో ఆసుపత్రి పునర్నిర్మాణం
మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు

**ప్రజాపక్షం/మహాదేవపూర్:** మారుమూల ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించి ఆరోగ్య నియోజకవర్గంగా తీర్చిదిద్దుతామని, రాష్ట్ర ప్రభుత్వం ప్రజారోగ్యానికి పెద్దపీట వేస్తోందని రాష్ట్ర ఐటి పరిశ్రమ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. శుక్రవారం మండలకేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో ఐడిబిఐ సహకారంతో ఎంఎన్‌జే ఆసుపత్రి హైదరాబాద్, ఓమేగా ఆసుపత్రి కరీంనగర్ వైద్యులు, వైద్య సిబ్బంది చే ఉచిత క్యాన్సర్, కంటి పరీక్షల వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. అనంతరం ఆసుపత్రిలో నూతనంగా ఏర్పాటు చేసిన వైద్య పరికరాలను మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆసుపత్రి ఆవరణలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతోందని అన్నారు. ప్రజల ఆరోగ్య పరిరక్షణకు, ముఖ్యంగా మహిళలు క్యాన్సర్ వ్యాధి బారిన పడకుండా రాష్ట్ర వ్యాప్తంగా సర్వైకల్ పరీక్షలు నిర్వహణకు ప్రభుత్వం ప్రణాళికలు రూపొందిసోతదని అన్నారు. పేద ప్రజలు వ్యాధులతో ఆర్థికంగా చితికిపోకుండా ఆదిలోనే వ్యాధి నిర్ధారణ చేసుకుని వ్యాధులు లేకుండా ఆరోగ్యంగా ఉండాలనే ఇలాంటి కార్యక్రమాలు చేపడుతున్నామని అన్నారు. మారుమూల ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని ఆసుపత్రిలో పెరిమీటర్, హెల్త్ ఏటిఎం, ఈసీజీ పరికరాలను ఏర్పాటు చేసి వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. హెల్త్ ఏటిఎం ద్వారా 64 వైద్య పరీక్షలను వేగంగా నిర్వహించడానికి అవకాశం ఉంటుందని తెలిపారు. హెల్త్ ఏటిఎం ద్వారా నిర్వహించిన పరీక్షలకు కార్డు ఇస్తారని తద్వారా 5 సంవత్సరాల వరకు రిపోర్టులు భద్రంగా ఉంటాయని అన్నారు. అలాగే కంటి పరీక్షల కోసం ప్రత్యేక యంత్రం, గుండె సంబంధిత సమస్యలను గుర్తించడానికి ఈసీజీ యంత్రాన్ని ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. మహిళలను సర్వైకల్ క్యాన్సర్ నుంచి రక్షించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక కార్యచరణతో ముందుకు సాగుతుందని అన్నారు. మహిళలు తప్పనిసరిగా ఆరోగ్య పరీక్షలు చేయించుకుని వ్యాధిని ప్రారంభ దశలోనే గుర్తిస్తే వైద్య సేవలు పొంది ఆరోగ్యంగా ఉండడానికి అవకాశం ఉంటుందని సూచించారు.రాష్ట్ర ప్రభుత్వం ఆరోగ్యం, విద్య రంగాలకు అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని గ్రామీణ ప్రాంతాల్లో కూడా మెరుగైన వైద్య సేవలు అందించేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.శిథిలావస్థలో ఉన్న ప్రభుత్వ ఆసుపత్రిని ఆధునిక వసతులతో పునర్నిర్మించి ప్రజలకు మరింత మెరుగైన వైద్య సేవలు అందించేలా చర్యలు తీసకుంటుంన్నామని మంత్రి వెల్లడించారు. ప్రజల సౌకర్యార్థం ఆగస్టు 4 న ఎంఎన్‌జే ఆసుపత్రి ఆధ్వర్యంలో మరో ఉచిత ఆరోగ్య శిబిరం నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రతి ఒక్కరూ ఈ ఉచిత ఆరోగ్య శిబిరాన్ని సద్వినియోగ ం చేసుకుని ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని తెలిపారు.ప్రతీ ఇంటికి వెళ్లి ప్రజలకు అవగాహనకల్పించి పరీక్షలు చేయించుకునేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇప్పటి వరకు కాటారం డివిజన్ పరిధిలో 680 మందికి హైదరాబాద్‌లో ఉచిత కంటి ఆపరేషన్లు నిర్వహించి వారికి చూపు ప్రసాదించామని అన్నారు. మంథని నియోజక వ్యాప్తంగా 45 వేల మందికి కంటి చికిత్సలు చేయించినట్లు తెలిపారు. భవిశ్యత్తులో లాంటి ప్రజోపయోగ కార్యక్రమాలను మరింత విస్తృతంగా కొనసాగిస్తామని తెలిపారు. ఈ వైద్య కార్యంపులో భాగస్వాములైన ప్రతి ఒక్కరిని మంత్రి అభినందించారు.అనంతరం వైద్య శిబిరంలో పాల్గొన్న వైద్యులను శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, ట్రైడ్ ప్రమోషన్ కార్పోరేషన్ చైర్మెన్ ఐత ప్రకాష్ రెడ్డి, జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి బధుసూధన్, ఆసుపత్రుల సమన్వయ అధికారి శ్రీకాంత్, జిల్లా గ్రందాలయ సంస్థ చైర్మెన్ కోట రాజబాబు, విబిజి రాంజి రాష్ట్ర సభ్యుడు దండు రమేష్, కాటారం ఆర్డి రవిందర్, శిక్షణా డిప్యూటి కలెక్టర్ నవీన్ రెడ్డి,తహసీల్దార్‌సత్యనారాయణ స్వామి, ఎంపిడిఓ రవీంద్రనాథ్, ఆంకాలజిస్ట్ డాక్టర్ సంతోష్ రెడ్డి, సర్పంచ్ హసీనా బానో అక్బర్ ఖాన్, కాటారం మార్కెట్ కమిటీ చైర్మెన్ పంతకాని తిరుమల సమ్మయ్య, పిఏసిఎస్ చైర్మెన్ తిరుపతి రెడ్డి, ఐడిబిఐ మేనేజర్ చంద్రమౌళీశ్వర్ రెడ్డి, కాళేశ్వరదేవస్థాన ట్రస్టుబోర్డు సభ్యులు పాల్గొన్నారు.

## పెద్ది సుదర్శన్ రెడ్డికి నివాళులర్పించిన తక్కళ్లపల్లి శ్రీనివాసరావు



**ప్రజాపక్షం/నర్సంపేట:** తెలంగాణ ఉద్యమకారుడు,నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి నర్సంపేటలో శుక్రవారం నిర్వహించిన అంతిమయాత్రలో పాల్గొని సిపిఐ నాయకులు ఘనంగా నివాళులర్పించారు. సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు, సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు విజయ్ సారధి, ఎస్ కె బాసు మియా, రాష్ట్ర సమితి సభ్యులు పంజాల రమేష్, నాయకులు దండు లక్ష్మ ణ్, ఎండి అక్బర్, ఉరుసు రాజు, గోవర్ధనా చారి తదితరులు పాల్గొని నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం కోసం కొట్లాడిన నిజమైన, నీకార్సైన ఉద్యమకారుడిని కోల్పోవడం దురదృష్టకరం అని, ఉమ్మడి వరంగల్ జిల్లాలో తెలంగాణ రాష్ట్ర సాధనకు సాగిన ఉద్యమాన్ని గ్రామ గ్రామానికీ చేర్చడంలో పెద్ది సుదర్శన్ రెడ్డి కీలక పాత్ర పోషించారని అన్నారు. పెద్ది సుదర్శన్ రెడ్డి మరణం బాధను కలిగించిందని,వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు

# కాళేశ్వరం వద్ద ఉధృతంగా గోదావరి

మొదటి ప్రమాద హెచ్చరిక స్థాయి దాటి డేంజర్ స్థాయికి చేరువలో వరద
వరద నీటితో మునిగిన పంట భూములు
లోతట్టు గ్రామాల ప్రజలను సురక్షిత కేంద్రాలకు తరలింపు



**ప్రజాపక్షం/కాళేశ్వరం:** గత మూడు రోజులుగా ఎగువలోని తెలంగాణ,మహారాష్ట్ర ప్రాంతాలలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో ప్రముఖ పుణ్య క్షేత్రమైన కాళేశ్వరం త్రివేణి సంగమం వద్ద శుక్రవారం గోదావరి, ప్రాణహిత ఉభయ నదులకు వరద నీరు పోటెత్తి గోదావరిఉగ్ర రూపం దాల్చి ఉరకలేస్తుంది. ఎగువన గోదావరి బేసిన్ ప్రాంతాల్లోని కడెం, శ్రీరాంసాగర్, ఎల్లంపల్లి శ్రీపాద జలాశయాల గేట్లు ఎత్తివేయడంతో పాటు ప్రాణహిత నది ఉప్పొంగి భారీగా వరద నీరు వచ్చి చేరడంతో కాళేశ్వరం పుష్కర ఘాట్ తీరం వద్ద గోదావరి ఉధృత రూపం దాల్చింది. పుష్కర ఘాట్ తీరం వద్ద గోదావరి నీటిమట్టం 12.300 మీటర్ల ఎత్తుకు చేరుకుని మొదటి ప్రమాద హెచ్చరికను దాటి డేంజర్ లెవెల్ స్థాయికి చేరువలో కొనసాగుతుంది. తీరంలోని ప్రధాన, సరస్వతి పుష్కర ఘాట్ల వద్ద భారీ ఎత్తునవరద నీరు చేరి స్నాన ఘట్టాలను ముంచెత్తి జలకళను సంతరించుకుని నిండుకుండలా మారింది. ఉభయ నదుల వరద ఉధృతి సాయంత్రానికల్లా అంతకంతకు పెరిగి ప్రమాద స్థాయిని దాటనుండటంతో అధికార యంత్రాం గం లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాం తాలకు తరలిస్తున్నారు. వాగులు, వంకలు పొంగి పొర్లుతుండటంతో బాహ్య ప్రపంచంతో అనేక గ్రా మాలకు రాకపోకల సంబంధాలు తెగిపోయి జలదిగ్బంధంలో చిక్కుకోగా, గోదావరి పరివాహక ప్రాంతాల పంట భూములను వరద నీరు చేరి ముంచెత్తింది. అధికార యంత్రాంగం ఎప్పటికప్పు డు వరద పరిస్థతులను పరిశీలిస్తూ అప్రమత్తమయ్యారు.

## 1950కి మెసేజ్‌తో ఓటు వివరాలు: కలెక్టర్ రాహుల్ శర్మ

**ప్రజాపక్షం/భూపాలపల్లి:** ఓటు హక్కు నమోదును 1950 నంబర్‌కు మెసేజి చేయడం ద్వారా ఓటు నమోదు వివరాలు తెలుసుకోవడం ఇప్పుడు చాలా సులభమని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. సర్ ప్రక్రియ ముగింపు ఆగస్టు 3న ముగియనున్నదని తెలిపారు. మూడు రోజులు వ్యవధి మాత్రమే ఉన్నందున ప్రతి ఓటరు తమ ఎన్నికల గుర్తింపు కార్డు (ఇపిఐసి) నంబర్‌ను టైప్ చేసి 1950 నంబర్‌కు 'ఎస్ఎమ్ఎస్' పంపడం ద్వారా తమ ఓటు వివరాలను మొబైల్ ఫోన్‌కు సందేశం రూపంలో పొందవచ్చని వివరించారు. ఈ సౌకర్యాన్ని అందరూ వినియోగించుకుని తమ ఓటు హక్కును నిర్ధారించుకోవాలని, అవసరమైతే సవరణలు, నమోదు ప్రక్రియలను సమయానికి పూర్తి చేసుకోవాలని ఆయన సూచించారు. ప్రజలు ఓటు హక్కు విలువను గుర్తించి తప్పనిసరిగా వినియోగించుకోవాలని ఆయన కోరారు.

## ఆదర్శప్రాయుడు అమరజీవి మేకల సర్వయ్యకు నివాళి

సిపిఐ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు నేదునూరి జ్యోతి



**ప్రజాపక్షం/వేలేరు:** సమాజంలో మనిషిని మనిషి దోపిడీ చేయని వ్యవస్థ నిర్మాణం కావాలని భారత కమ్యూనిస్టు పార్టీ నిర్వహిస్తున్న పోరాటాలలో వేలేరు మండలం పీచర గ్రామంలో మేకల సర్వయ్య తన జీవితకాలం ప్రజా పోరాటాలలో పాల్గొన్న ఆదర్శప్రాయుడని సిపిఐ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి, భారత కమ్యూనిస్టు పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు నేదునూరి జ్యోతి తెలిపారు. శుక్రవారం వేలేరు మండలం పీచర గ్రామంలో మేకల సర్వయ్య ఐదవ వర్ధంతి సభకు హాజరై వారు మాట్లాడుతూ భూమి పంచాలని, కూలి పెంచాలని, ధరలు దించాలని పార్టీ ప్రజా సంఘాలలో క్రియాశీలకంగా పాల్గొన్న గొప్ప విప్లవ వీరుడు మేకల సర్వయ్య అని కొనియాడినారు. నేటి తరం సర్వయ్యను ఆదర్శంగా తీసుకొని కేంద్ర రాష్ట్ర ప్రజా వ్యతిరేక విధానాలపై ప్రతిఘటన పోరాటాలకు సన్నద్ధం కావాలని పిలుపునిచ్చారు. కీసర గ్రామంలో దొరల దౌర్జన్యాలను ఎదుర్కొంటూ పోలీసు అరెస్టులను ఎదుర్కొని పేద ప్రజలకు అండగా నిలిచిన సర్వయ్య ఆశయాలను ముందుకు తీసుకెళ్లినప్పుడే ఘనమైన నివాళులు అర్పించిన వాళ్ళం అవుతామని తెలిపారు.సభ ప్రారంభానికి ముందు గ్రామంలో సిపిఐ జెండాను సిపిఐ హనుమకొండ జిల్లా సహాయ కార్యదర్శి మద్దెల ఎల్లేష్ ఆవిష్కరించారు అనంతరం సర్వయ్య స్తూపం వద్ద పూలమాలతో ఘనంగా నివాళులర్పించడం జరిగింది . ఈ కార్యక్రమంలో జిల్లా ఏఐటీయూసీ అధ్యక్ష కార్యదర్శులు వేల్పుల సారంగపాణి,జక్కు రాజు గౌడ్, సిపిఐ కార్యవర్గ సభ్యులు నేదునూరి రాజమౌళి, మునిగాల బిక్షపతి, ఎన్.ఎ స్టాలిన్, కాజీపేట మండల కార్యదర్శి మాలోత్ శంకర్,ధర్మసాగర్ మండల కార్యదర్శి కొట్టే వెంకటేష్, బొట్టు బిక్షపతి, భార్య మేకల గౌరమ్మ, కొడుకులు మేకల శంకర్, మేకల కుమారస్వామి, మేకల రమేష్, కూతురు లక్కీ శారద సురేష్ కోడళ్లు పద్మ, నిర్మల, ప్రియాంక, బంధుమిత్రులు పాల్గొన్నారు.

# మధ్యాహ్న భోజన పథకానికి నిధులు పెంచాలి

మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జంపాల రవీందర్



**ప్రజాపక్షం/ములుగు:** మధ్యాహ్న భోజన పథకానికి ప్రభుత్వం కేటాయిస్తున్న నిధులను పెంచడంతో పాటు కోడిగుడ్లు, గ్యాస్ సిలిండర్లు, నిత్యావసర సరుకులను ప్రభుత్వమే సరఫరా చేయాలని డిమాండ్ చేస్తూ ఏఐటియూసి అనుబంధ మధ్యాహ్న భోజన పథకం వంట కార్మికుల సంఘం ఆధ్వర్యంలో అంబేద్కర్ సెంటర్‌లో శుక్రవారం నిరసన ధర్నా నిర్వహించారు. అనంతరం కలెక్టరేట్ ఏఓ, జిల్లా విద్యాశాఖ అధికారి(డిఈఓ)లకు వినతిపత్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జంపాల రవీందర్ మాట్లాడుతూ ప్రస్తుతం ప్రభుత్వం ఒక కోడిగుడ్డుకు రూ.6 మాత్రమే చెల్లిస్తుండగా, మార్కెట్‌లో దాని ధర రూ.8 వరకు ఉందన్నారు. నిత్యావసర సరుకుల ధరలు విపరీతంగా పెరిగినా, మధ్యాహ్న భోజన పథకానికి ప్రభుత్వం ఇస్తున్న వంట చార్జీలు పెంచకపోవడంతో కార్మికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. గత 20 సంవత్సరాలుగా ఒక్కో విద్యార్థికి ప్రస్తుతం చెల్లిస్తున్న వంట ఖర్చు కనిష్టంగా రూ.6.78, గరిష్టంగా రూ.10.15 మాత్రమే ఉందన్నారు. ఈ మొత్తంతో రోజుకు రెండు కూరలు, వారానికి మూడు సార్లు కోడిగుడ్లు, పప్పులు, గ్యాస్ సిలిండర్ వినియోగంతో నాణ్యమైన భోజనం అందించడం సాధ్యం కాదని పేర్కొన్నారు. వంట చార్జీలు పెంచాలని లేదా అంగన్‌వాడీ కేంద్రాలకు సరుకులు సరఫరా చేస్తున్న విధంగానే మధ్యాహ్న భోజన పథకానికి ప్రభుత్వం నేరుగా కోడిగుడ్లు, గ్యాస్, నిత్యావసర సరుకులను అందించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం గతంలో ఇచ్చిన హామీ మేరకు వేతనాలు పెంచాలని కోరారు. నాణ్యమైన డిమాండ్లు కోరితే తొలగిస్తామంటూ బెదిరించడం సరికాదని, అవసరమైతే తమ పోరాటాన్ని ఢిల్లీ వరకు తీసుకెళ్తామని హెచ్చరించారు. ఈ నిరసనలో ఏఐటియూసి జిల్లా అధ్యక్షుడు బండి నర్సయ్య, ముత్యాల రాజు, సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గడ్డం భారతి, ఉపాధ్యక్షురాలు పోరెడ్డి ప్రమీల, నాయకులు గున్నాల రాజకుమారి సామ సమ్మక్క, సలువాల స్వరూప, కమలక్క, లావణ్య, శ్రీలత, మణక్క, సరోజన, నిర్మలతో పాటు పలువురు వంట కార్మికులు పాల్గొన్నారు.

## జంపన్నవాగులో గల్లంతైన వ్యక్తి కోసం ముమ్మర గాలింపు

**ప్రజాపక్షం/ములుగు:** జంపన్న వాగులో గల్లంతైన వ్యక్తి కోసం పోలీసు, ఎస్‌డిఆర్ఎఫ్, జిల్లా డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్(డిడిఆర్ఎఫ్) బృందాలు ముమ్మరంగా గాలింపు చర్యలు చేపడుతున్నాయి. బుధవారం జంపన్న వాగు ప్రధాన వంతెన నుండి ఊరట్టం వంతెన మధ్య ప్రాంతంలో తన స్నేహితులతో కలిసి ఈతకు దిగిన పీట్ల తిమ్మయ్య(45) ప్రమాదవశాత్తు నీటి ప్రవాహంలో కొట్టుకుపోయారు. తిమ్మయ్య ఘట్‌కేసర్ మండలం కొండాపూర్ గ్రామానికి చెందిన వ్యక్తి కాగా, వృత్తిరీత్యా కారు డ్రైవర్‌గా పనిచేస్తున్నారు. సమాచారం అందుకున్న జిల్లా ఎస్‌పి కేకన్ సుధీర్ రామ్‌నాథ్, ఐపిఎస్ సంఘటన స్థలాన్ని సందర్శించి గాలింపు చర్యలను పరిశీలించారు. ఆయన వెంట ములుగు డిఎస్‌పి అలువాల రవీందర్, పస్రా సీఐ దయాకర్ ఉన్నారు. డిడిఆర్ఎఫ్‌కు చెందిన ఇద్దరు రిజర్వ్ ఇన్స్‌స్పెక్టర్లు, 25 మంది శిక్షణ పొందిన సిబ్బంది ఎస్‌డిఆర్ఎఫ్ బృందాలతో కలిసి జంపన్నవాగు పరిధిలో గాలింపు చేపడుతున్నారు. సుమారు 9 కిలోమీటర్ల మేర వాగు పరిసరాల్లో ఇంచు ఇంచుగా పరిశీలిస్తున్నారు. గల్లంతైన వ్యక్తి ఆచూకీ కోసం, గాలింపు చర్యలు నిరంతరంగా కొనసాగుతున్నాయని అధికారులు తెలిపారు. భారీ వర్షాల సమయంలో వాగులు, నదులు ప్రమాదకరంగా ప్రవహిస్తాయని, ప్రజలు మద్యం సేవించి నీటిలోకి దిగడం, ఈతకు వెళ్ళడం వంటి ప్రమాదకర చర్యలకు దూరగా ఉండాలని జిల్లా పోలీస్ యంత్రాంగం సూచించింది.

# 'నీట మునిగిన రహదారులు'

ఇండ్లలోకి వరద నీరు
అంతర్రాష్ట్ర రాకపోకలకు తీవ్ర అంతరాయం



**ప్రజాపక్షం/వాజేడు:** గత రెండు రోజులుగా ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాల ప్రభావంతో గోదావరి నది ఉగ్రరూపం దాల్చి ప్రవహిస్తోంది. వాగులు, వంకలు పొంగిపొర్లుతూ ములుగు జిల్లాలో పలు ప్రధాన రహదారులను ముంచెత్తాయి. వరద నీరు గ్రామాల్లోకి చొరబడడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటుండగా, అంతర్రాష్ట్ర రాకపోకలు సైతం పూర్తిగా స్తంభించాయి. గోదావరి ఉధృతంగా ప్రవహించడంతో రెండో ప్రమాద హెచ్చరిక అధికారులు జారీ చేశారు.ప్రస్తుతం పేరూరు వద్ద 19,450 మీటర్లకు చేరిందని అధికారులు తెలిపారు. ముంపు ప్రాంతాలను ఏటూరు నాగారం ఐటీడీఏ పీవో లెనిన్ వత్సల్ టొప్పో ప్రాంతాలను పరిశీలించారు. వాజేడు మండల కేంద్రంలోని రామాలయం వీధిలో వరద నీరు ఇండ్లలోకి భారీగా చేరడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇళ్లలోని సామగ్రి నీట మునగడంతో బాధితులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సమాచారం అందుకున్న రెవెన్యూ, పోలీసు, పంచాయతీ అధికారులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. ముంపు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించి పునరావాస కేంద్రాలకు వెళ్లాలని సూచించారు. అయితే వరద బాధితులు మాత్రం అధికారుల విజ్ఞప్తిని నిరాకరించారు. ప్రతి ఏడాది వరదల సమయంలో పునరావాస కేంద్రాలకు తరలించి, ఆ తర్వాత తమ సమస్యలను పూర్తిగా విస్మరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు మంజూరు చేస్తామని ఏళ్లుగా హామీలు ఇస్తున్నప్పటికీ ఇప్పటివరకు అమలు కాలేదని, శాశ్వత పరిష్కారం చూపకుండా ప్రతి ఏడాది అదే హామీలతో కాలం గడుపుతున్నారని బాధితులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మరోవైపు వాజేడు మండల పరిధిలోని చీకుపల్లి వాగు, వద్ద రెండు చోట్ల 163వ జాతీయ రహదారిపై వరద నీరు ప్రవహిస్తుండటంతో తెలంగాణఛత్తీస్‌గఢ్ మధ్య అంతర్రాష్ట్ర రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. రహదారికి ఇరువైపులా భారీ వాహనాలు, ప్రయాణికుల వాహనాలు నిలిచిపోవడంతో వాహనదారులు గంటల తరబడి నిరీక్షించాల్సిన పరిస్థితి ఏర్పడింది. వాజేడు నుండి గుమ్మడి దొడ్డి, పూసూరు, బొమ్మనపల్లి, ఏడ్జెర్లపల్లి పాటు గుమ్మడి దొడ్డి నుండి ఢ్ండి వరకు రోడ్లపై వరద నీరు చేరింది. దీంతో ప్రత్యామ్నాయ మార్గాల్లో ప్రయాణించాల్సి రావడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గుమ్మడిదొడ్డిలో కొన్ని కుటుంబాలను పునరావాస కేంద్రాలకు తరలించారు. చీకుపల్లి వద్ద జాతీయ రహదారి నీట మునగడంతో సుమారు 25 గ్రామాల ప్రజలకు మండల కేంద్రంతో సంబంధాలు తెగిపోయాయి. అత్యవసర వైద్య సేవలు, విద్య, నిత్యావసర అవసరాల కోసం ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు నాటు పడవలను ఏర్పాటు చేసి ప్రజలను వాగు దాటిస్తున్నారు. ఇక నిత్యావసర సరుకుల రవాణా కూడా పూర్తిగా దెబ్బతింది. కూరగాయలు, బియ్యం, ఇతర సరుకులను తెప్పలపై తరలిస్తూ ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. జిల్లా యంత్రాంగం వరద పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ, ప్రజలు అవసరం లేకుండా వరద నీటిలోకి వెళ్ల వద్దని, అధికారుల సూచనలు తప్పనిసరిగా పాటించాలని విజ్ఞప్తి చేసింది. పరిస్థితి సాధారణ స్థితికి చేరుకునే వరకు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు.



## ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజనం తనిఖీ



**ప్రజాపక్షం/మల్లాపూర్:** మండలంలోని పాత దామరాజు పల్లి గ్రామంలో ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని గ్రామ సర్పంచ్ రొండ్ల రాజేశ్వరి రాజారెడ్డి ,ఎంపిడిఒ శ్రీకాంత్ శుక్రవారం తనిఖీ చేశారు. అదే విధంగా అధిక వర్షపాతంతో గోదావరి ఉధృతంగా ప్రవహిస్తుండడంతో గోదావరిని నదిని,గ్రామానికి చెందిన మందపల్లి బాలకిషన్ భారీ వర్షానికి కూలిపోగా సర్పంచ్ తో పాటు సందర్శించి బాధితున్ని పరామర్శించారు.వీరి వెంట, పంచాయతీ కార్యదర్శి సౌజన్య,గ్రామ పంచాయతీ పాలకవర్గ సభ్యులు తదితరులున్నారు.

## కల్యాణలక్ష్మి ,షాదీ ముబారక్ చెక్కులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే



**ప్రజాపక్షం/కోరుట్ల :** కోరుట్ల నియోజకవర్గంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కోరుట్ల మండలానికి చెందిన 29 మంది లబ్ధిదారులకు, రూ.29,03,364/ (ఇరవై తొమ్మిది లక్షల మూడు వేల మూడు వందల అరవై నాలుగు రూపాయలు) విలువగల 29 కళ్యాణలక్ష్మి – షాదీ ముబారక్ చెక్కులను ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ లబ్ధిదారులకు అందజేశారు.ఈ కార్యక్రమంలో దారిశెట్టి రాజేష్,అయిలాపూర్ సర్పంచ్ సందయ్య,బిఆర్ఎస్ నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

## 'ఉపాధి' ఉద్యోగుల పెన్ డౌన్




**ప్రజాపక్షం /పెద్దపల్లి :** పే స్కేల్ అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఉపాధి హామీ పథకం ఉద్యోగులు శుక్రవారం పెన్‌డౌన్, షట్‌డౌన్ నిరసన చేపట్టారు.రాష్ట్ర జెఏసి పిలుపు మేరకు పెద్దపల్లి మండల పరిషత్ కార్యాలయం ఎదుట ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా ఉద్యోగులు మాట్లాడుతూ, ఉపాధి హామీ పథకం అమలులో కీలక పాత్ర పోషిస్తున్నప్పటికీ తమకు తగిన పే స్కేల్, గుర్తింపు కల్పించలేదని ఆవేదన వ్యక్తం చేశారు.ఆర్థిక,సామాజిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని కోరారు. సమస్యలు పరిష్కారమయ్యే వరకు శాంతియుతంగా పెన్‌డౌన్, షట్‌డౌన్ నిరసన కొనసాగిస్తామని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలోఏపిఒ రమేశ్ బాబు,జెఇ రాజయ్య,కంప్యూటర్ ఆపరేటర్ల సంఘం జిల్లా అధ్యక్షురాలు తొడుపునూరు సుజాత,దివ్య,సురేన్,తదితరులు పాల్గొన్నారు.

## 'ఎల్లంపల్లి'ని సందర్శించిన ఎమ్మెల్యే



**ప్రజాపక్షం/అంతర్గాం :** పెద్దపల్లి జిల్లా అంతర్గాం మండలంలోని శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టును రామగుండం ఎమ్మెల్యే మక్కన్‌సింగ్ శుక్రవారం సందర్శించారు. ప్రాజెక్టు వరద ప్రవాహం, దిగువకు విడుదల చేస్తున్న నీటి వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. దిగువన ఉన్న తీర ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేయాలని, ఏలాంటి విపత్తులు తలెత్తకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఎమ్మెల్యే వెంట రామగుండం మేయర్ మహంకాళిస్వామి, కార్పొరేటర్లు, సర్పంచులు, కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.

## 'ఆల్ఫోర్స్'లో గోరింటాకు సంబరాలు



**ప్రజాపక్షం/సుల్తానాబాద్ :** గోరింటాకుతో మగువలకు చిన్నారులకు మరింత అందం తో పాటు గోరింటాకు శరీరానికి చల్లదనంతో పాటు వేడిని తగ్గించడంలో కీలకపాత్ర పోషిస్తుందని ఆల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత నరేందర్ రెడ్డి అన్నారు. శుక్రవారం సుల్తానాబాద్ లోని ఆల్ఫోర్స్ పాఠశాలలో విద్యార్థినీలచే ప్రత్యక్షంగా గోరింటాకు వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అధినేత నరేందర్ రెడ్డి మాట్లాడుతూ ఆషాడ మాసంలో మహిళలంతా సామూహికంగా ప్రత్యక్షంగా జరుపుకునే పండుగ అని,భారతీయ సంస్కృతి సాంప్రదాయాలకు ప్రత్యేకంగా నిలిచే అందమైన వేడుకని అన్నారు. డిజిటల్ యుగంలో మన పండుగలకు ప్రాధాన్యత తగ్గుతున్నప్పటికీ ఆల్ఫోర్స్‌లో విద్యార్థులకు ప్రతి అంశంపై అవగాహన కల్పిస్తున్నామన్నారు.వివాహాలు, శ్రావణమాసం, బతుకమ్మ,వరలక్ష్మీ ,వ్రతం వంటి వేడుకలతో పాటు ప్రతి శుభకార్యాలలో మహిళలు గోరింటాకు పెట్టుకోవడం సాంప్రదాయంగా వస్తుందన్నారు. ఇలాంటి సాంప్రదాయాలు మన కుటుంబ బంధాలను మరింత దృఢ పరుస్తాయని, గోరింటాకు వేడుకలను ప్రతి ఏటా నిర్వహించి మన వారసత్వ భావితరాలకు అందించే గొప్ప కార్యక్రమం అన్నారు.ఈ కార్యక్రమంలో విద్యార్థినీలతో పాటు ప్రిన్సిపాల్, అధ్యాపక బృందం పాల్గొన్నారు.

## గంజాయి కేసులో కానిస్టేబుల్ అరెస్ట్

**ప్రజాపక్షం / కొత్తపల్లి :** కొత్తపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని సీతారాంపూర్‌లోని ఇంట్లో గంజాయి దాచిన ఈగల్ టీమ్ కానిస్టేబుల్ మెడబోయిన నాగరాజును శుక్రవారం కొత్తపల్లి పోలీసులు అరెస్ట్ చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నిందితునికి చిగురుమామిడి మండలం సైదాపూర్ గ్రామానికి చెందిన తోడేటి శ్రీనివాస్ మిత్రుడు. శ్రీనివాస్ కు అదే గ్రామానికి చెందిన శ్రీనివాస్ రెడ్డి అను అతనితో భూతగాదాలు ఉన్నాయి. దానితో నాగరాజు ఇంక కొంత మందితో కలిసి వరంగల్ నుంచి గంజాయి తెప్పించి శ్రీనివాస్ రెడ్డికి చెందిన దుకాణంలో కిలో గంజాయి పెట్టించి అతనిపై చిగురుమామిడి పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేయించారు. మిగిలిన గంజాయిని కానిస్టేబుల్ నాగరాజు సీతారాంపూర్ తను నివాసం ఉంటున్న ఇంటిలో దాచగా కొత్తపల్లి పోలీసులు సమాచారం మేరకు వెళ్లి తనిఖీ చేయగా నాగరాజు వద్ద 370.96 గ్రాముల గంజాయిని పట్టుకోవడం జరిగింది. నిందితునిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏసీపీ విజయ్ కుమార్, కొత్తపల్లి సిఐ బిల్లా కోటేశ్వర్ తెలిపారు.

# బిఆర్ఎస్ ఒక ముగిసిన అధ్యాయం

ఆ పార్టీని ప్రజలు మర్చిపోయారు* డిసిసి అధ్యక్షుడు, చొప్పదండి ఎమ్మెల్యే సత్యం



**ప్రజాపక్షం/కరీంనగర్:** 14 సంవత్సరాలు ఉద్యమం చేసిన పార్టీకి, 9 సంవత్సరాలు ఈ రాష్ట్రాన్ని ఏలిన పార్టీని 2023 సాధారణ ఎన్నికల్లో ప్రతిపక్షానికి పరిమితం చేశారు..పార్లమెంటు ఎన్నికల్లో గుండు సున్నా ఇచ్చారు. పంచాయతీ, మున్సిపల్ ఎన్నికల్లో ఆ పార్టీ పత్తా లేదు. జూబ్లీహిల్స్ కంటోన్మెంట్ ఉప ఎన్నికల్లో బిఆర్ఎస్ స్థానాల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను ప్రజలు గెలిపించి బ్రహ్మరథం పట్టారని.ఈ రాష్ట్రంలో బిఆర్ఎస్ పార్టీ అవసరం లేదని.. 2023 తర్వాత రాష్ట్రంలో బిఆర్ఎస్ ఒక ముగిసిన అధ్యాయమని.. ఆ పార్టీని ప్రజలు మర్చిపోయారని డిసిసి అధ్యక్షుడు, చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు. జిల్లా వ్యాప్తంగా విస్తారంగా కురుస్తున్న వర్షాలతో ప్రజలకు, రైతులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా, సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని, ముఖ్యంగా ఎరువుల పంపిణీ, గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో దెబ్బతిన్న రోడ్ల మరమ్మత్తులు చేపట్టాలని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రాను కలిసి కోరారు. సానుకూలంగా స్పందించిన కలెక్టర్ జిల్లా యంత్రాంగంలోని అన్ని శాఖల అధికారులతో సమన్వయం చేసుకొని చర్యలు తీసుకుంటామన్నారని సత్యం తెలిపారు. అనంతరం మీడియాతో ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా గత రెండు మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలతో రైతులందరూ సంతోషంగా ఉన్నారని, ఎల్ నినో ప్రభావంతో కరువు వస్తుందని ఆందోళన పడ్డ రైతులు ఇప్పుడు సంతోషంగా నాట్లు వేస్తున్నారని తెలిపారు. ఈసారి కరువుతో కాంగ్రెస్ పార్టీ పని అయిపోతుందని రైతులను రెచ్చగొట్టి రాజకీయం చేసి పబ్బం గడుపుదామని బిఆర్ఎస్ నేతలు కలలు కన్నార ని, ఆ కలలు అన్నింటినీ వమ్ము చేస్తూ భగవంతుని ఆశీర్వాదంతో వరుణుడు కరుణించి పుష్కలంగా వర్షాలు కు రుస్తున్నాయని, ఈ వర్షాకాలంలో ఎలాంటి ఇబ్బందు లు లేకుండా దేవుడు అనుగ్రహించడం శుభ పరిణామమన్నారు. ఎంతసేపు ఈ రాష్ట్రంలో వర్షాలు పడద్దని, కాంగ్రెస్ ప్రభుత్వం కూలిపోవాలని బిఆర్ఎస్ నేతలు ఏ దుపుగొట్టు రాజకీయాలు చేశారని, బిఆర్ఎస్ నేతల చె ంప చెల్లుమనిపించేలా సకాలంలో వర్షాలు పడటం రైతులకు ఎంతో ఉపశమనం కలిగించాయన్నారు. ప్రపంచంలోనే గొప్ప ప్రాజెక్టు కట్టామని బిఆర్ఎస్ నేతలు చెప్పుకుంటున్న కాళేశ్వరం కుంగిపోయిన రెండున్నర సంవత్సరాల నుండి కాళేశ్వరం ప్రాజెక్టుకు సంబంధం లేకుండానే నీళ్లు ఇవ్వడం జరిగిందన్నారు. వేల కోట్లు ఖర్చు పెట్టి బిఆర్ఎస్ ప్రభుత్వం కట్టిన ప్రాజెక్టులు ఎందుకు ప నికి రాకుండా పడావు బడ్డాయని, కాంగ్రెస్ పార్టీ హ యాంలో నిర్మించిన శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు నేడు తెల ంగాణ రాష్ట్రానికి జీవాధారయ్యిందన్నారు. కాళేశ్వరం ఒక ఆట్టర్ ఫ్లాప్ ప్రాజెక్టు అని.. కాంగ్రెస్ హయాంలో క ట్టిన శ్రీపాద ఎల్లంపల్లి, శ్రీరాంసాగర్ వరద కాలువ నేడు తెలంగాణ రైతాంగానికి ఉపయోగపడుతున్నాయన్నారు. కొండగట్టు గిరి ప్రదక్షిణ చేయడం వల్లనే అంజనేయ స్వామి ఆశీర్వాదంతో వర్షాలు కురుస్తున్నాయని అన్నారు. గిరి ప్రదక్షిణ చేస్తే వర్షాలు వస్తాయా..నడిస్తే వర్షాలు పడతాయా.. అంటూ బి ఆర్ ఎస్ నేతలు దొంగ ధర్నాలు చేశారని విమర్శించారు. తెలంగాణ ప్రజల నాశనాన్ని కోరుకునే బిఆర్ఎస్ నేతలు స్పైడర్ సినిమాలో విలన్ సూర్య క్యారెక్టర్ రోల్ పోషిస్తూ సైకో శాడిస్ట్ లాగా బిఆర్ఎస్ నేతలు ప్రవర్తిస్తున్నారని ఆరోపించారు. కలెక్టర్ ను కలిసిన వారిలో జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు పురుమల్ల మనోహర్, జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు ముత్యం శంకర్, తదితరులు ఉన్నారు.

## చెరువుల భద్రతకు చర్యలు

జగిత్యాల జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్



**ప్రజాపక్షం/ఎండపెల్లి :** వర్షాకాలంలో వరద ముప్పు ను తప్పించేందుకు చెరువుల వద్ద భద్రతా పరమైన అన్ని చర్యలు చేబడుతున్నట్లు జగిత్యాల జిల్లా కలెక్టర్ సత్య ప్రసాద్ పేర్కొన్నారు. జగిత్యాల జిల్లా వెల్గటూరు మండలంలో ఇటీవల భారీ వర్షపాతం నమోదవడంతో స్థంబంపల్లి గ్రామ పరిధిలోని పెద్దచెరువుకు అధిక వరద ప్రవాహం చేరింది. చెరువు తూము కు ఆనుకుని గతంలో ఏర్పడిన సింక్ హోల్ ప్రాం తంలో పరిస్థితిని జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ శుక్రవారం పర్యవేక్షించారు.భారీ వరదల నేపథ్యంలో సాండ్‌బ్యాగ్స్ దెబ్బతిని చెరువు కట్టకు నష్టం జరిగే అవకాశం ఉన్నందున రైతులకు ఇబ్బంది కలుగకుండా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.ఈ మేరకు జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ పెద్దచెరువును సందర్శించి పరిస్థితిని ప్రత్యక్షంగా పరిశీలించారు. అధికారుల నుండి వివరాలు తెలుసుకొని,చెరువు భద్రతకు అవసరమైన అన్ని జాగ్రత్తలు కొనసాగించాలని సూచించారు.జూలై 30 సాయంత్రం నుంచి వర్షాలు తగ్గుముఖం పట్టడంతో పాటు, జూలై 3 1 నాటికి చెరువుకు వస్తున్న వరద ప్రవాహం కూ డా పూర్తిగా తగ్గిందన్నారు. ప్రస్తుతం చెరువు క ట్ట, తూముకు ఎలాంటి ముప్పు లేదని స్పష్టం చే శారు.అయితే,భవిష్యత్తులో ఇలాంటి పరిస్థితులు తలెత్తకుండా శాశ్వత రక్షణ చర్యలు చేపట్టేందు కు అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు.ఈ పరిశీలనలో జగిత్యాలఆర్‌డిఒ మధు సూదన్,తహసీల్దార్ శ్రీనివాస్ ఉన్నారు.

## డీజిల్ ఆటో కార్మికుల సంక్షేమానికి కృషి

మాజీ మంత్రి జీవన్‌రెడ్డి



**ప్రజాపక్షం/జగిత్యాల టౌన్:** ప్రభుత్వం డీజిల్ ఆటో కార్మికుల సంక్షేమానికి కృషి చేయాలని మాజీ మంత్రి జీవన్ రెడ్డి పేర్కొన్నారుజగిత్యాల జిల్లా కేంద్రంలోని దేవిశ్రీ గార్డెన్స్‌లో శుక్రవారం నిర్వహించిన డీజిల్ ఆటో సంక్షేమ సంఘం నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార మహోత్సవంలో మాజీ మంత్రి టి. జీవన్‌రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన సంఘం అధ్యక్షుడు ద్యావరా శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి అయూబ్ పాషా, గౌరవ అధ్యక్షుడు బొల్లి శేఖర్, ముఖ్య సలహాదారులు కొండూ శ్రీనివాస్‌రావు, ముజీబ్ లతీఫ్, ఉపాధ్యక్షుడు ఎస్‌కే అలీమ్,న్యాయ సలహాదారులుగా బాధ్యతలు స్వీకరించిన రాచకొండ శ్రీరాములు, తునికి మధుసూదన్‌తో పాటు నూతన కార్యవర్గ సభ్యులను జీవన్ రెడ్డి శాలువాలతో సత్కరించి అభినందించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆటో యూనియన్‌తో తనకున్న సుదీర్ఘ అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. డీజిల్ ఆటో కార్మికుల సమస్యల పరిష్కారానికి సంఘం ఐక్యంగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ప్రస్తుతం ఆర్టీఏ నిబంధనలు మరింత కఠినంగా అమలవుతున్న నేపథ్యంలో ప్రతి ఆటో డ్రైవర్ తప్పనిసరిగా డ్రైవింగ్ లైసెన్స్, వాహనానికి సంబంధించిన అన్ని పత్రాలను సక్రమంగా నిర్వహించుకోవాలని సూచించారు. ప్రభుత్వం ఆటో కార్మికులకు అన్ని రకాల సౌకర్యం కల్పించాలని పేర్కొన్నారు. సంఘం బలోపేతంతోనే ఆటో కార్మికుల హక్కులు పరిరక్షించబడతాయని పేర్కొన్న జీవన్‌రెడ్డి, కార్మికుల సంక్షేమానికి తన సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఆటో యూనియన్ నాయకులు, సభ్యులు, ప్రజాప్రతినిధులు,పెద్ద సంఖ్యలో ఆటో కార్మికులు పాల్గొన్నారు.

## రామగిరి ఖిల్లాలో 250 ఎకరాల్లో ఇండస్ట్రియల్ పార్కు

ఖిల్లా రహదారి పనులపైనా దృష్టి

పర్యటనకు అధికారుల ఏర్పాట్లు



**ప్రజాపక్షం/రామగిరి :** రామగిరి మండలం రత్నాపూర్ గ్రామ పంచాయితీ పరిధిలోని రామగిరి ఖిల్లా ప్రాంతంలో ఐటి శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు పర్యటన కు రంగం సిద్ధమైంది. త్వరలో మేడిపల్లి శివారులోని రామగిరి ఖిల్లా ప్రాంతంలో ఇండస్ట్రియల్ పార్క్‌కు కేటాయించిన భూములను ఆయన పరిశీలించనున్నారు. గ్రామ పంచాయతీ పరిధిలోని మేడిపల్లి ప్రాంతంలో సుమారు 250 ఎకరాలలో ఏర్పాటు చేయనున్న పరిశ్రమలు, ఇండస్ట్రియల్ పార్కు సంబంధించిన పనులను మంత్రి పరిశీలించనున్నారు. ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటుకు సంబంధించి స్థల పరిస్థితులు, మౌలిక వసతులు, అభివృద్ధి పనులపై పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష ఆధ్వర్యంలో అధికారులతో మంత్రి సమీక్షించనున్నట్లు తెలుస్తోంది. అలాగే రత్నాపూర్ గ్రామం నుంచి ఖిల్లా ప్రాంతానికి వెళ్లే రహదారి పనుల పురోగతిని కూడా మంత్రి పరిశీలించనున్నారు. స్థానిక సర్పంచ్ పల్లె ప్రతిమ ఆధ్వర్యంలో పరిశ్రమలు ఏర్పాటు చేయనున్న ప్రాంతంలో చదును చేసే పనులు చేపట్టారు.ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటు ద్వారా రత్నాపూర్, రామగిరి మండలంతో పాటు పరిసర ప్రాంతాల్లో పారిశ్రామిక అభివృద్ధికి ఊతం లభిస్తుందని స్థానికులు భావిస్తున్నారు.పరిశ్రమలు అందుబాటులోకి వస్తే స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు పెరిగే అవకాశం ఉందని గ్రామస్థులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.మంత్రి పర్యటన నేపథ్యంలో సంబంధిత శాఖల అధికారులు అవసరమైన ఏర్పాట్లను ముమ్మరం చేశారు.సర్పంచ్ పల్లె ప్రతిమపివీరావు, తహసీల్దార్ పర్నంది సుమన్,ఎంపిడీఓ బద్రి శైలజ రాణి,ఎంపీఓ మూల సమ్మిరెడ్డి, విద్యుత్ ఏడిఈ వంగల వెంకటనారాయణ,సబ్ ఇంజినీర్ కుమ్మరికుంట సతీష్, ఆర్.ఐ కే. మహేష్, ఇండస్ట్రియల్ జే.ఈ సృజన్, కాంట్రాక్టర్ నిశాంత్, సెక్రటరీ గంగుల సంతోష్,జీపీఓ పెరుకు.వెంకటేశ్వర్లు,విద్యుత్ లైన్ మెన్ బంగారు శివ కుమార్,గుండా చందన్ పాల్గొన్నారు.

## ఎల్ నినో ప్రభావంపై అవగాహన

ప్రత్యామ్నాయ పంటలను ప్రోత్సహించాలి* ప్రతీ ప్రభుత్వ కార్యాలయం ఆవరణలో ఇంకుడు గుంతల ఏర్పాట్లు * ఇందిరమ్మ ఇండ్లు వేగంగా పూర్తి *టెలీ కాన్ఫరెన్స్ ద్వారా అధికారులతో జిల్లా కలెక్టర్ సమీక్ష



**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల :** ఎల్ నినో ప్రభావంపై ప్రజలు, రైతులకు అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. ఎల్ నినో ప్రభావం, ప్రత్యామ్నాయ పంటలు, తెలంగాణ జలసిరి పనులు, ఇందిరమ్మ ఇండ్ల పురోగతిపై వ్యవసాయ, ఉద్యానవన, జిల్లా గ్రామీణ అభివృద్ధి శాఖ, హౌసింగ్ ఎఇలు, ఎంపిడిఒలతో జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ శుక్రవారం ఉదయం టెలీ కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లాలోని అన్ని మండలాల వ్యవసాయ శాఖ అధికారులతో సాగు విస్తీర్ణం, ప్రస్తుతం ఏ ఏ పంటలు వేశారో ఆరా తీశారు. అన్ని మండలాల్లో భూగర్భ జలాల పరిస్థితిపై వ్యవసాయ శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. కావలసిన అన్ని విత్తనాలు, మొక్కలు వ్యవసాయ, ఉద్యానవన శాఖ అధికారులు సంయుక్తంగా అందుబాటులో ఉండేలా చూడాలని ఆదేశించారు. ప్రణాళిక ప్రకారం రైతులకు అవగాహన సమావేశాలు మరిన్ని నిర్వహించాలని స్పష్టం చేశారు.

**ప్రతీ కార్యాలయంలో ఉండాలి..**

ఎల్ నినో ప్రభావం నేపథ్యంలో తెలంగాణ జలసిరి కింద జిల్లాలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, రెసిడెన్షియల్, ఇతర విద్యాలయాల్లో ఇంకుడు గుంతలు తప్పనిసరిగా ఉండాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. ఈ మేరకు ప్రతిపాదనలు సిద్ధం చేసి.. పనులు మొదలు పెట్టాలని సూచించారు. ప్రతి గ్రామ పంచాయతీ, మున్సిపాలిటీ పరిధిలో అన్ని భవనాలు, ఇండ్లలో ఇంకుడు గుంతలు నిర్మించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నూతన భవనాల అనుమతిలో ఇంకుడు గుంతలు ఉంటేనే పర్మిషన్ ఇవ్వాలని స్పష్టం చేశారు. ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా పంట కుంటలు (పామ్ పాండ్), ఊట కుంట (పర్కొలేషన్ ట్యాంక్) పూర్తి చేయాలని ఆదేశించారు. వాన నీటిని సంరక్షిస్తే భవిష్యత్ లో ఎంతో మేలు చేకూరుతుందని, భూగర్భ జలాలు వృద్ధి చెందుతాయని తెలిపారు.

**లక్ష్యాలను సాధించేలా చర్యలు చేపట్టాలి..**

ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను వేగవంతం చేయాలని హౌసింగ్ అధికారులను జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. ఈ టెలీ కాన్ఫరెన్స్ లో హౌసింగ్ పీడీ వెంకట మాధవరావు, డీఆర్డీఓ లక్ష్మీ నారాయణ, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి అఫ్జల్ బేగం, జిల్లా పంచాయతీ అధికారి జయశీల అధికారులు ఉన్నారు.

## ఇంకుడు గుంతలు తప్పనిసరి : కలెక్టర్



**ప్రజాపక్షం/పెద్దపల్లి :** జిల్లాలో పట్టణ ప్రాంతాల్లో వర్షపు నీటి సంరక్షణ, భూగర్భ జలాల పెంపు, పారిశుద్ధ్య నిర్వహణకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష అధికారులను ఆదేశించారు.శుక్రవారం సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ అరుణ శ్రీ తో కలిసి మున్సిపల్ కమిషనర్లతో నిర్వహించిన పట్టణ పరిపాలన సమీక్ష సమావేశంలో జిల్లా కలెక్టర్ పలు కీలక సూచనలు చేశారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ జల శక్తి జన భాగిదారి కార్యక్రమంలో భాగంగా వర్షపు నీటిని ఒడిసిపట్టి భూగర్భ జలాలను పెంచేందుకు ప్రతి ఇంటిలో తప్పనిసరిగా ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకునేలా ప్రజల్లో అవగాహన కల్పించాలని సూచించారు.అన్ని ప్రాంతాల్లో ఇకపై కొత్తగా నిర్మించే ప్రతి ఇంటికి ఇంకుడు గుంత (సోక్‌పిట్) తప్పనిసరిగా ఉండాలని, ఇంకుడు గుంత లేని ఇళ్లకు ఇంటి నంబర్,తాగునీటి నల్లా కనెక్షన్ మంజూరు చేయబోమని స్పష్టం చేశారు. కొత్తగా ఇళ్ల నిర్మాణం చేపట్టే ప్రతి ఒక్కరూ ఈ నిబంధనను తప్పనిసరిగా పాటించాలని సూచించారు.ఇప్పటికే నిర్మించబడిన ఇళ్లలో కూడా వీలైనంత మేర ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసేందుకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాలని మున్సిపల్ కమిషనర్లను ఆదేశించారు. పట్టణ ప్రాంతాల్లోని ప్రతి వార్డు పరిధిలో వచ్చే నెల రోజుల్లో కనీసం 30 ఇంకుడు గుంతలు నిర్మించేలా వార్డు అధికారులు స్థానిక ప్రజాప్రతినిధులతో సమన్వయం చేసుకొని కార్యాచరణ రూపొందించాలని సూచించారు.ప్రతి ప్రభుత్వ కార్యాలయంలో తప్పనిసరిగా సోక్‌పిట్‌లు ఏర్పాటు చేయాలని, వర్షపు నీటిని భూగర్భంలోకి ఇంకించే చర్యలు చేపట్టాలని ఆదేశించారు.రహదారులపై ఎక్కడా నీరు నిల్వ ఉండకుండా చర్యలు చేపట్టాలని, దోమల వ్యాప్తిని అరికట్టేందుకు ప్రత్యేక డ్రైవ్‌లు నిర్వహించాలని ఆదేశించారు.తాగునీటి నాణ్యతను క్రమం తప్పకుండా పరీక్షిస్తూ ప్రజలకు సురక్షితమైన తాగునీరు అందేలా చూడాలని,ప్రజారోగ్యానికి భంగం కలిగించే పరిస్థితులు ఎక్కడా తలెత్తకుండా మున్సిపల్ అధికారులు నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని సూచించారు.ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్లు ,సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## బాల కార్మికుల వ్యవస్థ నిర్మూలనకు కృషి : సిపి



**ప్రజాపక్షం/సిద్దిపేట ప్రతినిధి:** సిద్దిపేట పోలీసు కమిషనరేట్ పరిధిలో ఆపరేషన్ ముస్కాన్ 2026లో మొత్తం 83 మంది చిన్నారులను రక్షించి, బాల కార్మికులను పనిలో పెట్టుకున్న 17 మంది యాజమానులపై కేసు నమోదు చేసినట్లు జిల్లా సీపీ రష్మి పెరుమాళ్ తెలిపారు. రక్షించిన చిన్నారులకు వైద్య పరీక్షలు, కౌన్సిలింగ్ నిర్వహించి చైల్డ్ వెల్ఫేర్ కమిటిలకు అప్పగించిన్నట్లు తెలిపారు. పోలీసు శాఖతో మహిళ శాఖ, కార్మిక శాఖ, జిల్లా బాలల పరిరకణ యూనిట్ చైల్డ్ వెల్ఫేర్ కమిటి స్వచ్ఛంద సంస్థల సమన్వయంతో హోటళ్లు, దాబాలు, పరిశ్రమలు, వర్క్ షాప్‌లు, గ్యారేజీలు, ఇటుక బట్టీలు వ్యాపార సంస్థల తదితర ప్రాంతాల్లో విస్తృతంగా తనిఖీ చేపట్టి 37 మంది ఇతర రాష్ట్రాలకు చెందిన గుర్తించిన్నట్లు తెలిపారు. బాల కార్మిక వ్యవస్థ నిర్మూళనకు ప్రజలు సహకరించాలని బాలకార్మికులు కనిపిస్తే వెంటనే 112/110 లేదా 1098కు సమాచారం ఇవ్వాలని కమిషనర్ రష్మి తెలిపారు.

# ఎమ్మెల్యేపై ప్రేమ ఉంటే రైతులను నిండా ముంచుతారా?

రైస్ మిల్లర్లపై మరోసారి ఘాటు వ్యాఖ్యలు చేసిన బిజెపి నేత సురేష్ రెడ్డి



**ప్రజాపక్షం/సుల్తానాబాద్ :** రైతులను నిండా ముంచి వందల కోట్లు వెనకేసుకున్న రైస్ మిల్లులపై బిజెపి నేత సురేష్ రెడ్డి మరోసారి నిప్పులు చెరిగారు.ఇటీవల పెద్దపల్లిలో ధాన్యం కొనుగోళ్లు, సీఎంఆర్ ధాన్యం తరలింపు అంశంలో 700 కోట్ల స్కామ్ జరిగిందని ఆధారాలతో సహా బయటపెట్టిన సురేష్ రెడ్డి తాజాగా కొన్ని రైస్ మిల్లులపై మళ్ళీ సంచలన ఆరోపణలు చేశారు. తనకు అవగాహన లేదంటూ సోషల్ మీడియాలో పోస్ట్ పెట్టిన రైస్ మిల్ అసోసియేషన్ సభ్యులపై సురేష్ రెడ్డి నిప్పులు ఘాటు గా విమర్శలు చేశారు. పెద్దపల్లి ఎమ్మెల్యే విజయ రమణారావు మీద రైస్ మిల్లర్లకు ప్రేమ ఉంటే.. రైతులను నిండా ముంచుతారా అని ప్రశ్నించారు. సివిల్ సప్లై అధికారులు,రైస్ మిల్లర్లు,గోదాం నిర్వాహకులు చేసిన అవినీతిని తాను బయట పెడితే కొందరు రైస్ మిల్లర్లకు ఎందుకంత నొప్పి అంటూ ఆయన ప్రశ్నించారు. ఎమ్మెల్యే విజయ రమణారావుకు దమ్ముంటే పెద్దపల్లి నియోజకవర్గంలోని రైస్ మిల్లులో జరిగిన కుంభకోణాలపై విజిలెన్స్ ఎంక్వైరీ నిర్వహించి దొంగలపై కఠిన చర్యలు తీసుకునే దమ్ముందా అని సవాల్ విసిరారు. పెద్దపల్లి నియోజకవర్గంలో కొనుగోలు జరిపిన మొదటి రోజు మాత్రమే బస్తాకు నలభై కిలోలు తూకం వేశారని, రెండో రోజు నుంచి ఒక బస్తాకు రెండు కిలోలు అదనంగా తూకం వేశారని సురేష్ రెడ్డి విమర్శించారు. పెద్దపల్లి నియోజకవర్గంలో ధాన్యం కొనుగోళ్లలో రైతులను నిండా ముంచలేదంటూ ఎమ్మెల్యే సహా కొందరు రైస్ మిల్లర్లు పబ్లిసిటీ చేస్తున్నారని, కానీ రెండో రోజు నుంచే క్వింటాలకు మూడు నాలుగు కిలోలు అదనంగా తూకం వేసి రైతులను నిండా ముంచారని తన దగ్గర వీడియోలు కూడా ఉన్నాయని సురేష్ రెడ్డి అన్నారు. ఓవైపు రైతులను మరోవైపు ప్రభుత్వాన్ని నిండా ముంచి డబ్బులను ఎక్కడెక్కడ కొందరు రైస్ మిల్లర్లు పెట్టుబడులు పెట్టారో తనకు తెలుసు అని అన్నారు. ఎమ్మెల్యేకు వకల్తా పుచ్చుకొని కొందరు రైస్ మిల్లర్లు మాట్లాడటం సిగ్గుచేటని తెలిపారు. ధాన్యం కొనుగోళ్లలో అవకతవకలు జరగలేదని రైతుల దగ్గర అదనపు తూకం వేయలేదని రైస్ మిల్లర్ అసోసియేషన్ సభ్యులు నిరూపించగలరా అంటూ సవాల్ విసిరారు. రైస్ మిల్ అసోసియేషన్ లోని ఓ ముఖ్య సభ్యుడి గ్రామానికి వెళ్దామని అక్కడి రైతుల మధ్యలే చర్చ పెడదామని సవాల్ విసిరారు. రాజకీయాల్లోకి తాను దొంగ దందాలు చేయడానికి రాలేదని తనతో ఎమ్మెల్యే లాగా రహస్య డీల్స్ చేద్దాం అంటే కుదరదు అని సురేష్ రెడ్డి అన్నారు. పెద్దపల్లి నియోజకవర్గంలో జరిగిన ధాన్యం కుంభకోణంపై త్వరలోనే సిబిఐ, ఈడీ ని కలుస్తానని, ఆధారాలతో సహా కుంభకోణాన్ని బట్ట బయలు చేసి చర్యలు తీసుకునే వరకు పోరాడుతానని సురేష్ రెడ్డి అన్నారు. ధాన్యం కుంభకోణం విషయంలో కానీ రైతుల విషయంలో తన జోలికి వస్తే రోజుకు ఆధారంతో ప్రజల ముందుకు వస్తానంటూ హెచ్చరించారు.ఎమ్మెల్యే విజయరమణారావుకు దమ్ముంటే పెద్దపల్లి లో జరిగిన అనేక అవకతవకలపై విజిలెన్స్ విచారణకు ఆదేశాలు ఇచ్చేలా ప్రభుత్వాన్ని కోరాలని సవాలు విసిరారు. త్వరలోనే మరో ఆధారంతో ప్రజల ముందుకు వస్తానని సురేష్ రెడ్డి అన్నారు.ఈకార్యక్రమంలో సుల్తానాబాద్ మండల బిజెపి అధ్యక్షులు కందుల శ్రీనివాస్,ప్రధానకార్యదర్శులు కోట నాగేశ్వర్, కొల్లూరి సంతోష్ కుమార్, కొమ్మిడి రాజేందర్ రెడ్డి, బండారి లత,ఎర్రం సంతోష్ రెడ్డి,మల్క భాగ్యలక్ష్మి , వలస సాయి కిరణ్ , పాల్గొన్నారు.

# థానేలో కుప్పకూలిన శిథిల భవనం

**10 మంది సమాధి**
**శిథిలాల కింద మరికొంత మంది**
**కొనసాగుతున్న సహాయక చర్యలు**



**థానె :** మహారాష్ట్రలో విషాదన ఘటన సంభవించింది. థానే జిల్లా భివండిలో శిథిలావస్థలో ఉన్న నాలుగు అంతస్తుల భవనం కుప్పకూలింది. ఈ ఘటనలో పది మంది భూ సమాధి అయ్యారు. ముగ్గురికి గాయాలు కాగా, మరి కొంత మంది కూడా శిథిలాల కింద చిక్కుకు పోయారు. వారిని రక్షించేందుకు ప్రయత్నాలు కొనసాగుతున్నాయని అధికారులు తెలిపారు. అయితే కుప్పకూలిన భవనాన్ని ఇంతకు ముందే ప్రమాదకర భవనాల్లో ఒకటిగా స్థానిక మున్సిపల్ అధికారులు గుర్తించడం గమనార్హం. పవర్‌లూమ్ పట్టణంలోని బాలాజీ నగర్ ప్రాంతంలో ఉన్న కోహినూర్ భవనంలో కొంత భాగం గురువారం రాత్రి 11.20 గంటలకు కూలిపోయిందని అధికారులు చెప్పారు. భివండి నిజాంపూర్ నగర మున్సిపల్ కార్పొరేషన్ (బిఎన్‌సిఎంసి) ఈ భవనాన్ని 2020 సెప్టెంబర్‌లో ప్రమాదకరంగా గుర్తించిందని, చివరకు ఈ ఏడాది జూన్ 5న ఖాళీ చేయమని నోటీసులు జారీ చేసి, తదుపరి విద్యుత్, నీటి సరఫరాను నిలిపివేసినట్లు తెలిపింది. అయినప్పటికీ, యజమానులు మున్సిపాలిటీ నుంచి ఎటువంటి అనుమతి పొందకుండానే నిర్మాణ మరమ్మతు పనులను ప్రారంభించారు. ఈ చట్ట విరుద్ధమైన మరమ్మతు పనులలో పాల్గొన్న కాంట్రాక్టర్‌పై కఠినమైన శిక్షా చర్యలు, క్రిమినల్ విచారణ చేపట్టాలని మున్సిపల్ కమిషనర్ ఆదేశించారు. ఈ ఘటనపై విచారం వ్యక్తం చేసిన ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవిస్, కేసు నమోదు చేసి దోషులపై కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. భవనంలో మరమ్మతు పనులు జరుగుతుండగా ఈ ఘటన జరిగిందని ఉప ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే తెలిపారు. భివండిలో భవనం కూలి తొమ్మిది మంది మరణించారని, ఘటనా స్థలంలో గాలింపు, సహాయక చర్యలు కొనసాగుతున్నాయని, మహారాష్ట్ర విపత్తు నిర్వహణ శాఖ మంత్రి గిరీష్ మహాజన్ తెలిపారు. ఆ నిర్మాణంలో ప్రతి అంతస్తులో 12 గదుల చొప్పున మొత్తం 48 గదులు ఉన్నాయి. గురువారం రాత్రి 9 గంటల ప్రాంతంలో, భవనం నుండి పెద్ద పగుళ్ల శబ్దాలు వినిపించాయని నివాసితులు చెప్పారని ఒక అధికారి తెలిపారు. విపత్తు జరిగిందనే భయంతో, స్థానికులు వెంటనే అనేక కుటుంబాలను ఇతర ప్రాంతాలకు తరలించడంలో సహాయపడ్డారు. అయితే, కొంతమంది నివాసితులు ఇంకా బయటకు వస్తుండగానే, భవనంలోని 'బి' వింగ్ కూలిపోయిందని ఆయన చెప్పారు. జాతీయ విపత్తు ప్రతిస్పందన దళం, థానే విపత్తు ప్రతిస్పందన దళం , స్థానిక అగ్నిమాపక దళం బృందాలు సహాయక చర్యను ప్రారంభించారు. ఒక శునక దళం, నాలుగు అగ్నిమాపక యంత్రాలు, రెండు అంబులెన్సులు, భారీ మట్టితవ్వే యంత్రాలను కూడా రంగంలోకి దించారు. ఒక మహిళ తనను మృత్యు కోరల నుండి కాపాడినందుకు కృతజ్ఞతలు తెలిపింది. కేవలం కొన్ని అడుగుల దూరంలోనే తన తల్లిదండ్రులు ఆత్రంగా తన పేరు పెట్టి పిలుస్తుండగా, బురద, చిత్తడి నేల కింద చిక్కుకుపోయిన ఆ భయానక అనుభవాన్ని ఆమె గుర్తుచేసుకుంది. నివాసితులు పదే పదే హెచ్చరించినప్పటికీ మరమ్మతులు సరిగ్గా జరగడం లేదని ఆ మహిళ ఆరోపించింది. చాలా మంది నివాసితులు తమ ఒంటిపై ఉన్న బట్టలు తప్ప మరేమీ మిగల్లేదు. మరణించిన తొమ్మిది మందిలో షమీమ్ షేక్ (32), రంజీత్ సింగ్ (45), మిరాజ్ రసూల్ షేక్ (34), సంతోష్ కుమార్ పాండే (42), షమీమ్ అన్సారీ (30)లను గుర్తించినట్లు అధికారులు తెలిపారు.

# 'పిఎం-కిసాన్' మరో ఐదేళ్లు పొడిగింపు

**రూ. 3.15 లక్షల కోట్లు కేటాయింపు**
**'ప్రధానమంత్రి సూర్య సరోవర్ యోజన'కు రూ. 5,070 కోట్లు**
**రూ.84,084 కోట్ల విలువైన 'సముద్ర మంథన్' ప్రాజెక్టుకు కేంద్ర కేబినెట్ ఆమోదం**




**న్యూఢిల్లీ :** దేశంలోని రైతులకు నిరంతర ఆర్థిక భరోసా కల్పించే పిఎం–కిసాన్ పథకాన్ని కేంద్ర ప్రభుత్వం మరో ఐదేళ్లు పొడిగించింది. ఈ మేరకు మంత్రి మండలి సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు. దేశ సమగ్ర అభివృద్ధి, సంక్షేమానికి ఉద్దేశించిన పలు కీలక ప్రతిపాదనలకు కూడా కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపింది. శుక్రవారం ప్రధాని నరేంద్ర మోదీ అధ్యక్షతన జరిగిన కేబినెట్ సమావేశం దాదాపు రూ.4.51 లక్షల కోట్ల భారీ వ్యయంతో కూడిన వివిధ అభివృద్ధి ప్రాజెక్టులు, సంక్షేమ పథకాలకు పచ్చజెండా ఊపింది. పిఎం–కిసాన్ పథకాన్ని 2030–31 ఆర్థిక సంవత్సరం వరకు పొడిగించేందుకు ఆమోదం తెలిపింది. ఇందుకోసం రూ.3,15,614 కోట్ల నిధులను కేటాయించినట్లు కేంద్ర సమాచార ప్రసార శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ వెల్లడించారు. 2019 ఫిబ్రవరి 24న ప్రారంభమైన ఈ కేంద్ర ప్రాయోజిత పథకం కింద అర్హత కలిగిన ప్రతి రైతు కుటుంబానికి ఏడాదికి రూ.6000 ఆర్థిక సహాయం అందుతోంది. ఈ నిధులను నేరుగా లబ్ధిదారుల బ్యాంక్ ఖాతాల్లోకి డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్ విధానంలో ప్రతి నాలుగు నెలలకొకసారి రూ.2000 చొప్పున మొత్తం జమ చేస్తున్నారు. పిఎం కిసాన్ పథకం ద్వారా ఇప్పటివరకు 23 విడతల్లో మొత్తం 4.47 లక్షల కోట్లకు పైగా ఆర్థిక సాయాన్ని అందించింది. ఈ పథకం అమలుపై నీతి ఆయోగ్ జరిపిన అధ్యయనంలో ఆసక్తికర అంశాలు వెల్లడయ్యాయి. దాదాపు 92 శాతం మంది లబ్ధిదారులు ఈ నగదును నేరుగా వ్యవసాయ పెట్టుబడుల కోసమే వినియోగిస్తున్నారని, తద్వారా 85 శాతం మంది రైతుల వ్యవసాయ ఆదాయం మెరుగుపడటమే కాకుండా అప్పుల కోసం ఇతరులపై ఆధారపడటం కూడా తగ్గిందని నివేదిక స్పష్టం చేసింది.

**ఇంధన రంగాన్ని ప్రోత్సహించేందుకు 'సూర్య సరోవర్ యోజన'**

పునరుత్పాదక ఇంధన రంగాన్ని మరింత ప్రోత్సహించేందుకు రూ.5,070 కోట్లతో 'ప్రధానమంత్రి సూర్య సరోవర్ యోజన'కు కేబినెట్ ఆమోదం తెలిపింది. జలాశయాలు, పారిశ్రామిక చెరువులపై సోలార్ ప్లాంట్ల నిర్మాణమే లక్ష్యంగా ఈ పథకాన్ని రూపొందించారు. ప్రస్తుతం ఉన్న 700 మెగావాట్ల ఫ్లోటింగ్ సోలార్ సామర్థ్యాన్ని 5,000 మెగావాట్లకు పెంచనున్నారు. 10,000 మెగావాట్ల సామర్థ్యంతో ఎనర్జీ స్టోరేజ్ సిస్టమ్‌లను అందుబాటులోకి తీసుకురానున్నారు. 2026–27 నుంచి 2030–31 వరకు ప్రాజెక్టులను అమలులోకి తీసుకురానుండగా, 2032–33 వరకు కేంద్రం ఆర్థిక సహకారం అందించనుంది. ప్రాజెక్టు సాధ్యాసాధ్యాల అధ్యయనానికి ఒక్కో ప్రాజెక్టుకు 50 లక్షల వరకు, అలాగే నిర్మాణ దశలో ప్రతి మెగావాట్‌కు కోటి చొప్పున కేంద్రం ఆర్థిక సహాయం చేయనుంది. ఈ పథకం ద్వారా ఏటా సుమారు కోటి టన్నుల కర్బన ఉద్గారాలు తగ్గనున్నాయి. దాదాపు 16,000 నుంచి 17,000 మందికి ప్రత్యక్ష ఉపాధి లభించడమే కాకుండా దేశీయ సోలార్, బ్యాటరీ తయారీ రంగానికి భారీ ఊతం లభించనుంది. సముద్ర వనరుల పరిశోధన, వినియోగం దిశగా చేపడుతున్న రూ.84,084 కోట్ల విలువైన 'సముద్ర మంథన్' ప్రాజెక్టును కేంద్ర కేబినెట్ ఆమోదించింది. క్రీడారంగాన్ని ప్రోత్సహించడానికి ఖేలో ఇండియా, జాతీయ క్రీడా ఫెడరేషన్ పథకానికి రూ.36, 441 కోట్లు మంజూరు చేశారు. రవాణా మౌలిక సదుపాయాలను మెరుగుపరచేందుకు ట్విన్ ట్యూబ్ సొరంగాల నిర్మాణాలకు గాను రూ.9,779 కోట్లు కేటాయిస్తూ కేంద్ర కేబినెట్ కీలక నిర్ణయం తీసుకుంది.

## జనన, మరణాల సవరణ బిల్లుకు లోక్‌సభ ఆమోదం

**న్యూఢిల్లీ :** విద్యార్థులు, యువత జులై 20న నిర్వహించిన 'పార్లమెంట్ మార్చ్' సందర్భంగా విద్యార్థులపై పోలీసుల అణచివేతకు నిరసనగా ప్రతిపక్షాలు ఆందోళన చేస్తున్న నేపథ్యంలో జనన మరణాల నమోదు (సవరణ) బిల్లు, 2026ను లోక్‌సభ శుక్రవారం ఎలాంటి చర్చ లేకుండానే ఆమోదించింది. శుక్రవారం ఉదయం సభ ప్రారంభమైన కొద్ది నిమిషాలకే సభ వాయిదా పడింది. ఆ తరువాత మధ్యాహ్నం బిజెపి ఎంపి దిలీప్ సైకియా అధ్యక్షతన సభ తిరిగి సమావేశం కాగా, బిల్లును పరిశీలన, ఆమోదం కోసం చేపట్టారు. ప్రతిపక్ష సభ్యులు నినాదాలు చేస్తుండగా, వారిలో పలువురు హోం మంత్రి అమిత్ షా సభకు హాజరు కావాలని డిమాండ్ చేస్తూ వెల్‌లోకి దూసుకెళ్లగా, ఈ బిల్లు మూజువాణి ఓటుతో ఆమోదం పొందింది. ముఖ్యమైన బిల్లుపై ప్రభుత్వం చర్చను కోరుకుంటోందని చెబుతూ, చర్చలో పాల్గొనడానికి ప్రతిపక్షాలు నిరాకరించడంపై పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు అసంతృప్తి వ్యక్తం చేశారు. 'ఇది దురదృష్టకరం. దయచేసి భవిష్యత్తులో ఇలా పునరావృతం చేయవద్దు. మిమ్మల్ని పార్లమెంటుకు పంపిన ప్రజలే మీ నుండి సమాధానాలు కోరుకుంటారు' అని రిజిజు అన్నారు. భవిష్యత్తు చట్టాలపై అంతరాయాలు సృష్టించకుండా చర్చలలో పాల్గొనాలని ఆయన ప్రతిపక్ష సభ్యులను కోరారు. ప్రతిపక్ష సభ్యుల సహకారం లేకుండా బిల్లును ఆమోదించాల్సి రావడం దురదృష్టకరమని సైకియా కూడా అన్నారు. బిల్లు ఆమోదం పొందిన వెంటనే సభ ఆగస్టు 3వ తేదీకి వాయిదా పడింది. ప్రస్తుత సమావేశాల్లో ఇప్పటివరకు రెండు బిల్లులు — 'ప్రజా పరీక్షల (అక్రమ పద్ధతుల నివారణ) సవరణ బిల్లు, 2026', 'దేశ గౌరవానికి అవమానాల నివారణ (సవరణ) బిల్లు, 2026' (వందేమాతరం బిల్లు) పార్లమెంటు ఉభయ సభల ఆమోదం పొందాయి. 'జనన మరణాల నమోదు (సవరణ) బిల్లు, 2026' ప్రస్తుతం రాజ్యసభ ఆమోదం కోసం వేచి ఉంది. సభ కార్యకలాపాల సమయంలో, 'రాజ్యాంగ (130వ సవరణ) బిల్లు, 2025'ను పరిశీలిస్తున్న సంయుక్త పార్లమెంటరీ కమిటీకి అధ్యక్షత వహిస్తున్న బిజెపి ఎంపి అపరాజిత సారంగికి, ఆ కమిటీ నివేదిక సమర్పణ గడువును శీతాకాల సమావేశాల చివరి వారంలోని మొదటి రోజు వరకు పొడిగించే అవకాశం కల్పించారు.

## దేశ భవిష్యత్తు కంటే ప్రధాని చర్మం ప్రకాశవంతం

**మోదీపై సిజెపి వ్యస్థాపకుడు అభిజీత్ దీప్కే వ్యంగ్యాస్త్రాలు**

**న్యూఢిల్లీ :** పార్లమెంట్‌లో పేపర్ లీక్ నియంత్రణ బిల్లు ఆమోదం పొందడంపై హర్షం వ్యక్తం చేస్తూ ప్రధాని మోదీ విడుదల చేసిన సెల్ఫీ స్టైల్ వీడియోపై, కాక్రోచ్ జనతా పార్టీ (సిజెపి) వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే తనదైన శైలిలో విమర్శలు గుప్పించారు. 'దేశ భవిష్యత్తు కంటే ప్రధాని మోదీ చర్మం చాలా ప్రకాశవంతంగా ఉంది' అంటూ వ్యంగ్యాస్త్రాలు సంధించారు. పార్లమెంట్‌లో పబ్లిక్ ఎగ్జామినేషన్స్ (ప్రివెన్షన్ ఆఫ్ అన్‌ఫెయిర్ మీన్స్) అమెండ్‌మెంట్ బిల్లు, 2026 ఆమోదం పొందింది. దీనిపై హర్షం వ్యక్తం చేస్తూ ప్రధాని మోదీ ఇన్‌స్టాగ్రామ్‌లో ఓ సెల్ఫీ స్టైల్ వీడియో విడుదల చేశారు. పేపర్ లీకేజీ అంశంపై ప్రధాని మోదీ విడుదల చేసిన నాలుగో సెల్ఫీ వీడియో ఇది. దీనిపైనే అభిజీత్ దీప్కే తాజాగా విమర్శలు గుప్పించారు. 'దేశ భవిష్యత్తు కంటే ప్రధాని మోదీ చర్మం చాలా ప్రకాశవంతంగా ఉంది. మోదీ రాజకీయాలు వదిలేసి సోషల్ మీడియా ఇన్‌ఫ్లూయెన్సర్‌గా మారాలని నేను అనుకుంటున్నాను. ఆయన అందులో చాలా బాగా రాణిస్తున్నారు. ఆయన ప్రధానమంత్రి కుర్చీ వదిలి, ఇన్‌ఫ్లూయెన్సర్‌గా మారాలి. ప్రధానమంత్రి పనిని వేరొకరికి వదిలేయాలి' అని అభిజీత్ దీప్కే అన్నారు. బుధవారం మహారాష్ట్రలోని తన స్వగ్రామంలో విలేకరులతో మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. అలాగే 'నరేంద్ర మోదీ 3 రోజు క్రితం ఫాస్ట్ ట్రాక్ కోర్టులు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. దీనితో ప్రజలు చాలా సంతోషించారు. కానీ ఏం జరిగింది? సిబిఐ తరఫు న్యాయవాది హాజరు కాకపోవడంతో మొదటి విచారణే వాయిదా పడింది. కాబట్టి మీరు ఎలాంటి చట్టాలనైనా చేయవచ్చు. కానీ వాటిని అమలు చేసే వ్యక్తులు మంచివారు కానంత వరకు ఆ చట్టాల వల్ల ప్రయోజనం ఏమిటి?' అని అభిజీత్ దీప్కే ప్రశ్నించారు.

# ఏ మాత్రం సిగ్గు ఉన్నా... అమిత్ షాతో రాజీనామా చేయించాలి

**ప్రధాని మోదీకి కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున ఖర్గే డిమాండ్**



**న్యూఢిల్లీ :** విద్యార్థులపై ఎఫ్‌ఐఆర్‌లు నమోదు చేయడం, వారిని బలవంతంగా నిర్బంధించడం ద్వారా కేంద్రం కక్షపూరిత ధోరణితో వ్యవహరిస్తోందని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే శుక్రవారం ఆరోపించారు. హోం మంత్రి అమిత్ షా చేత రాజీనామా చేయించాలని ఆయన ప్రధాని నరేంద్ర మోదీని డిమాండ్ చేశారు. తమపై ఎటువంటి చర్యలు తీసుకోరనే షరతుపై యువత ఆందోళనను విరమించుకున్నారని, కానీ ఇప్పుడు బిజెపి ప్రభుత్వాలు తమ మాటను నిలబెట్టుకోలేదని ఖర్గే ఆరోపించారు. నరేంద్ర మోదీ గారూ, 10 రోజుల క్రితం మీ ప్రభుత్వం లాఠీలు, బ్యాటన్లు, పెల్లెట్ గన్‌లను ఉపయోగించి యువతపై ఉక్కుపాదం మోపిందని ఖర్గే దుయ్యబట్టారు. జూలై 20న జరిగిన 'సంసద్ చలో' ర్యాలీలో, దేశంలోని ఇతర ప్రాంతాల్లో నీట్ పేపర్ లీక్ వ్యవహారంపై నిరసన తెలుపుతున్న విద్యార్థులపై భద్రతా దళాలు జరిపిన దాడులను ఆయన ఈ సందర్భంగా ప్రస్తావించారు.'ఇప్పుడు విద్యార్థులు తమ నిరసనను విరమించుకున్నప్పటికీ, వారిపై ఎఫ్‌ఐఆర్‌లు నమోదు చేయడం, బలవంతంగా నిర్బంధించడం ద్వారా కక్షపూరితంగా వ్యవహరిస్తున్నారు' అని ఖర్గే ఎక్స్ వేదికగా ఆరోపించారు. యువతకు చెందిన సోషల్ మీడియా ఖాతాలను బ్లాక్ చేస్తున్నారని, అలాగే యువతుల వ్యక్తిగత వివరాలను బహిర్గతం చేయడం వంటి చర్యలకు పాల్పడుతున్నారని కాంగ్రెస్ అధ్యక్షుడు పేర్కొన్నారు. హోం మంత్రి అమిత్ షా పార్లమెంటు సభలోకి అడుగు పెట్టకపోవడం, బాధ్యతాయుతమైన ప్రకటన చేయడానికి వెనుకడుగు వేయడం అనేది ఆయన అహంకారానికి నిదర్శనమని ఖర్గే విమర్శించారు. పరువు కాపాడుకోవడానికి, ఇమేజ్‌ను రక్షించుకోవడానికి చేసే ఇటువంటి ఎత్తుగడలు ఇకపై పనిచేయవని, మీ గురించి వాస్తవం యువతకు అర్థమైపోయిందన్నారు. ఏ మాత్రం సిగ్గు మిగిలి ఉన్నా, అమిత్ షా చేత రాజీనామా చేయించండి అని కాంగ్రెస్ అధినేత డిమాండ్ చేశారు.

**మోదీ రీల్స్ చేయడంలో బిజీగా ఉన్నారు!**

మరోవైపు కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ ప్రధాని మోదీపై తనదైన రీతిలో సెటైర్లు వేశారు. 'ఓ వైపు ప్రధాని మోదీ రీల్స్ చేయడంలో బిజీగా ఉంటే, మరోవైపు పేపర్ లీక్ అయ్యింది' అని ఎద్దేవా చేశారు. 'ప్రధాని మోదీ రీల్స్‌మేకింగ్ నైపుణ్యాలను మెరుగుపరుచుకోవడంలో నిరంతరం బిజీగా ఉన్నారు. మోదీ ప్రభుత్వం ఫాస్ట్ ట్రాక్ కోర్టులకు సంబంధించిన కండితుడుపు చట్టాన్ని పార్లమెంట్‌లో ఆమోదించింది. ఈ తరుణంలోనే దేశంలో మరో పేపర్ లీక్ వార్త వెలుగులోకి వచ్చింది. ఈసారి మాజీ విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ స్వరాష్ట్రమైన ఒడిశాలో ఈ ఘటన జరిగింది. జులై 27న ఒడిశా యూనివర్సిటీ ఆఫ్ హెల్త్ సైన్సెస్‌కి చెందన పీజీ పరీక్ష జరుగుతుండగానే, దానికి సంబంధించిన ప్రశ్నాపత్రం వాట్సాప్‌లో సర్క్యులేట్ అయినట్లు తేలింది. ఈ వ్యవహారంపై కాంగ్రెస్ పార్టీ తన స్థిరమైన వైఖరిని స్పష్టం చేసింది. 2024లో అయినా లేదా ఇప్పుడు 2026లో అయినా కాంగ్రెస్ వాదన ఒక్కటే. కేవలం పేపర్ లీకేజీలకు కఠినమైన శిక్షలను చట్టబద్ధం చేయడం, కోర్టులను ఫాస్ట్ ట్రాక్ కోర్టులుగా ప్రకటించడం ఇక ఎంత మాత్రం సరిపోదు. మన విద్యావ్యవస్థలో పేరుకుపోయిన వ్యాపార ధోరణి, అవినీతిపై మనం మరింత విస్తృతమైన, నిజాయితీతో కూడిన చర్చ జరపాల్సిన అవసరం ఉంది. దేశంలో జరిగిన విద్యార్థి ఉద్యమం అసలు ఆశయం కూడా ఇదే. మోదీ ప్రభుత్వం ఈ ఆశయాన్ని కచ్చితంగా గౌరవించాలి' అని జైరాం రమేశ్ అన్నారు.

# 'జెన్ జీ'ని బెదిరిస్తున్నారు!

**ప్రధాని నరేంద్ర మోదీ, హోంమంత్రి అమిత్ షాపై రాహుల్‌గాంధీ ధ్వజం**



**న్యూఢిల్లీ :** ప్రధాని నరేంద్ర మోదీ, హోంమంత్రి అమిత్ షాపై ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. వీరిద్దరూ 'జెన్ జీ'ని బెదిరిస్తున్నారని ఆరోపించారు. వారిద్దరూ భారతదేశ గతం అని, దేశ భవిష్యత్తు విషయంలో వారు ఎలా వ్యవహరిస్తున్నారనే దానిపై జాగ్రత్తగా ఉండాలని సూచించారు. విద్యార్థి నిరసనకారులపై ఎఫ్‌ఐఆర్‌లు నమోదు చేయడం, వారి సోషల్ మీడియా ఖాతాలను తొలగించడం వెనుక మోదీ, షాలు ఉన్నారని లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు ఆరోపించారు. జెన్ జెడ్‌ను బెదిరించి ప్రధాని మోదీ, అమిత్ షా మౌనంగా ఉంచలేరని, మొదట వారి ఎముకలు విరిచారు, ఇప్పుడు ఎఫ్‌ఐఆర్ నమోదు చేసి, వారి ఖాతాలను తొలగిస్తున్నారు అని మండిపడ్డారు. పేపర్ లీక్‌ల బెడదను ఎదుర్కోవడానికి కేంద్ర, రాష్ట్ర స్థాయిలలో విద్యా వ్యవస్థలో సమగ్ర సంస్కరణలు తీసుకురావడం అవసరమని, పిల్లల భవిష్యత్తుతో ఆడుకుంటున్న ముఠాలపై ఎలాంటి కనికరం చూపబోమని గురువారం మోదీ చెప్పిన తర్వాత ఈ వ్యాఖ్యలు వచ్చాయి. పేపర్ లీక్ నిరోధక చట్టాన్ని సవరించడానికి పార్లమెంట్ బిల్లును ఆమోదించిన కొద్దిసేపటికే ఇన్‌స్టాగ్రామ్‌లో ప్రధానమంత్రి వీడియాఓ సందేశమిచ్చారు. వివిధ పరీక్షలలో జరిగే లీకులు విద్యార్థులకు మాత్రమే కాకుండా కేంద్రానికి, అనేక రాష్ట్రాలకు కూడా ఒక పెద్ద సవాలుగా మారాయన్నారు. కేంద్రం, అనేక రాష్ట్రాలు చాలా సంవత్సరాలుగా పేపర్ లీక్ సమస్యను ఎదుర్కొంటున్నాయని, ఈ ముప్పు వివిధ పరీక్షలకు హాజరయ్యే పిల్లల భవిష్యత్తును ప్రమాదంలో పడేసిందన్నారు. అందువల్ల, ఈ సమస్యను పరిష్కరించడానికి విద్యా వ్యవస్థలో సమగ్ర మార్పులు తీసుకురావడం అవసరమైమని ప్రధానమంత్రి అన్నారు. బుధవారం లోక్‌సభలో, గురువారం రాజ్యసభలో ఆమోదం పొందిన యాంటీపేపర్ లీక్ బిల్లును ప్రస్తావిస్తూ, వాగ్దానం చేసినట్లుగా ఈ సమస్యను పరిష్కరించడానికి ఇప్పుడు ఒక బలమైన చట్టం అమల్లోకి వచ్చిందని మోదీ అన్నారు. పేపర్ లీక్ ముఠాలను, పేపర్ లీక్ మాఫియాను, పిల్లల భవిష్యత్తుతో ఆడుకునే వారిని వదిలిపెట్టబోమని ప్రధానమంత్రి అన్నారు. పరీక్షల ప్రక్రియను బలోపేతం చేయడానికి, అవకతవకలను నివారించడానికి ఒక టాస్క్ ఫోర్స్‌ను ఏర్పాటు చేశామని, ఫాస్ట్‌ట్రాక్ కోర్టులను ఏర్పాటు చేస్తున్నామని, రాష్ట్రాల నుంచి సూచనలు తీసుకుంటున్నామని కూడా మోదీ తెలిపారు. పేపర్ లీక్‌లపై కఠినమైన శిక్షలను ప్రవేశపెట్టడం ద్వారా 2024 యాంటీపేపర్ లీక్ చట్టాన్ని సవరించడానికి ఉద్దేశించిన 'ది పబ్లిక్ ఎగ్జామినేషన్ (ప్రివెన్షన్ ఆఫ్ అన్‌ఫెయిర్ మీన్స్) అమెండ్‌మెంట్ బిల్లు, 2026'ను పార్లమెంట్ గురువారం ఆమోదించింది. ఈ బిల్లు రాజ్యసభలో ఆమోదం పొందింది.

## కేంద్ర మంత్రి జితేంద్రసింగ్‌పై కాంగ్రెస్ హక్కుల ఉల్లంఘన తీర్మానం నోటీసు

**న్యూఢిల్లీ :** విద్యార్థులనిరసనల సమయంలో 'ఎటువంటి కాల్పులు జరుగలేదు' అని కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్ చేసిన వ్యాఖ్యలపై హక్కుల ఉల్లంఘన తీర్మానం ప్రవేశపెట్టేందుకు కాంగ్రెస్ ఎంపి కెసి.వేణుగోపాల్ శుక్రవారం నోటీస్ సమర్పించారు. జితేంద్రసింగ్ ఉద్దేశపూర్వకంగా తప్పుడు సమాచారం ఇచ్చి సభను తప్పుదోవ పట్టించారని వేణుగోపాల్ ఆరోపించారు. లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాకు సమర్పించిన ఒక లేఖలో పబ్లిక్ ఎగ్జామినేషన్స్ (ప్రివెన్షన్ ఆఫ్ అన్‌ఫెయిర్ మీన్స్) అమెండ్‌మెంట్ బిలు, 2026పై జరిగిన చర్చ సందర్భంగా జులై 29న సభలో జితేంద్రసింగ్ చేసిన ప్రకటనకు సంబంధించి తాను హక్కుల పరిరక్షణ అంశాన్ని లేవనెత్తాలని అనుకుంటున్నట్లు వేణుగోపాల్ పేర్కొన్నారు. డాక్టర్ జితేంద్ర సింగ్ దీనికి సమాధానమిస్తూ 'అసలు కాల్పులు జరపలేదని, భాష్పవాయువును ఉపయోగించారని పదేపదే స్పష్టం చేయబడింది. కాబట్టి అసలు కాల్పులు జరగనప్పుడు, ఆదేశం ఇచ్చే ప్రశ్నే తలెత్తదు' అని మంత్రి జితేంద్రసింగ్ వ్యాఖ్యల ఆంగ్ల అనువాదాన్ని అందిస్తూ వేణుగోపాల్ వివరించారు. దీనిపై, సంస్థాగత వ్యవహారాల ఇన్‌చార్జి, కాంగ్రెస్ ప్రధానకార్యదర్శి అయిన కెసి.వేణుగోపాల్ స్పందిస్తూ, ఈ ప్రకటన క్షేత్ర స్థాయి వాస్తవాలకు పూర్తిగా విరుద్ధంగా ఉందని నొక్కిచెప్పారు. 'మంత్రి వాదనలకు విరుద్ధంగా కాల్పులు జరిగాయి. గాయపడిన వ్యక్తి ఇప్పటికీ చికిత్స పొందుతున్నాడు. ఈ సమాచారం బహిరంగంగా అందుబాటులోఉంది. ఎటువంటి కాల్పులు జరగలేదని మంత్రి సభలో చెప్పడం ద్వారా మంత్రి తెలిసి, ఉద్దేశపూర్వకంగా పార్లమెంట్‌కు తప్పుడు సమాచారం ఇచ్చి సభను తప్పుదోవ పట్టించారు 'అని కాంగ్రెస్ ఎంపి తెలిపారు. సభను తప్పుదారి పట్టించడమనేది హక్కుల ఉల్లంఘన, సభాధిక్కారం కిందకు వస్తుందనేది సుస్పష్టమైన విషయమని వేణుగోపాల్ ఆ లేఖలో పేర్కొన్నారు. దేశంలోని అత్యున్నత సభలో వాస్తవాలను రికార్డులో ఉంచడానికి ముందు ఒక మంత్రి వాటిని సరిచూసుకోవాలి' అని ఆ లేఖలో తెలిపారు. అందువల్ల, మంత్రిపై విశేషాధికార ఉల్లంఘన చర్యలను ప్రారంభించి, ఈ విషయాన్ని 'సమగ్ర పరిశీలన, అవసరమైన చర్య'గా హక్కుల పరిరక్షణ కమిటీకి నివేదించవలసిందిగా నేను మిమ్మల్ని అభ్యర్థిస్తున్నాను' అని కాంగ్రెస్ ఎంపి కెసి.వేణుగోపాల్ లోక్‌సభ స్పీకర్ ఓంబిర్లాకు రాసిని లేఖలో తెలియజేశారు. విద్యార్థుల శాంతియుత నిరసనలకు ప్రతిస్పందనగా కాల్పులు జరగలేదని పార్లమెంట్‌లో నిస్సిగ్గుగా అబద్ధం చెప్పినందుకు జితేంద్రసింగ్‌పై హక్కుల ఉల్లంఘన తీర్మానం కింద తాను ఒక నోటీస్ సమర్పించినట్లు వేణుగోపాల్ తన 'ఎక్స్' పోస్ట్‌లో పేర్కొన్నారు.పార్లమెంట్‌లో ఇలాంటి స్పష్టమైన అబద్ధాలతో ప్రభుత్వం తప్పించుకోలేదని, మంత్రిపై చర్య తీసుకోవాలని వేణుగోపాల్ డిమాండ్ చేశారు.

# 45 లక్షల ఓట్ల తొలగింపు

- ఏపీ ముసాయిదా ఓటర్ల జాబితా విడుదల చేసిన ఈసీ
- శాశ్వత వలసదారులు, మరణించిన, డూప్లికేట్ ఓట్లను తీసివేసినట్లు వెల్లడి
- పేర్ల నమోదు, అభ్యంతరాలకు ఆగస్టు 30 వరకు అవకాశం
- అక్టోబర్ 3న ఓటర్ల తుది జాబితాను ప్రచురించనున్న ఈసీ



**అమరావతి:** రాష్ట్ర ఓటర్ల జాబితాలో భారీ మార్పులు చోటుచేసుకున్నాయి. రాష్ట్రంలో ప్రత్యేక సమగ్ర సవరణ(ఎస్‌ఐఆర్) అనంతరం రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు 45 లక్షల మంది ఓటర్ల పేర్లను తొలగిస్తూ ఈసీ ముసాయిదా ఓటర్ల జాబితాను విడుదల చేసింది.175 శాసనసభ నియోజకవర్గాల వారీగా ముసాయిదా ఓటర్ల జాబితా వివరాలను రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి (సీఈవో) వివేక్ శుక్రవారం మీడియాకు వెల్లడించారు. మరణించిన వారు, శాశ్వతంగా వేరే ప్రాంతాలకు వలస వెళ్లిన వారు, ఒకటి కంటే ఎక్కువ చోట్ల ఓటు హక్కు కలిగి ఉన్న వారి పేర్లను ఈ జాబితా నుంచి తొలగించినట్లు పేర్కొన్నారు. తొలగించిన ఓట్లలో శాశ్వతంగా చిరునామా మారిన లేదా అందుబాటులో లేని వారు 22.30 లక్షల మంది ఉన్నారు. మరణించిన వారివి 15.22 లక్షల ఓట్లు కాగా, రెండు లేదా అంతకంటే ఎక్కువ చోట్ల ఓటు హక్కు నమోదు చేసుకున్న 7.37 లక్షల మంది ఓట్లను కూడా తొలగించారు. ఈ సవరణ ప్రక్రియను జూన్ 15 నుంచి జులై 24 వరకు రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాల్లో నిర్వహించారు. ఈ సవరణ ప్రక్రియలో భాగంగా రాష్ట్రంలోని మొత్తం 4,16,27,694 మంది ఓటర్లకు గాను 3.71 కోట్ల మంది (89.22%) నుంచి బూత్ లెవల్ అధికారులు (బీఎల్‌ఓలు) ఎన్యూమరేషన్ ఫారాలను సేకరించారు. మిగిలిన 44.89 లక్షల మంది ఓటర్లు వారి చిరునామాలో అందుబాటులో లేకపోవడం, ఇతర రాష్ట్రాలకు వలస వెళ్లడం, ఫారాలు సమర్పించకపోవడం లేదా ఓటరుగా నమోదు చేసుకోవడానికి ఇష్టపడకపోవడం వంటి కారణాల వల్ల వారి వివరాలను సేకరించలేకపోయినట్లు సీఈఓ వివరించారు. అయితే, జాబితా నుంచి పేర్లు తొలగిపోయిన అర్హులైన ఓటర్లు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని వివేక్ యాదవ్ స్పష్టం చేశారు. అలాంటి వారు తమ ఓటు హక్కును తిరిగి పొందేందుకు అవకాశం కల్పించారు. శుక్రవారం ఆగస్టు 30 వరకు అభ్యంతరాలు, క్లెయిమ్‌లను స్వీకరిస్తారు. అర్హులైన వారు నిర్దేశిత డిక్లరేషన్ ఫారంతో పాటు ఫారం6ను సమర్పించి, తమ పేరును తిరిగి ఓటర్ల జాబితాలో చేర్చుకోవచ్చు. ఒకటి కంటే ఎక్కువ చోట్ల ఓట్లు ఉన్న వారి పేరును వారు కోరుకున్న ఒక్క చోట మాత్రమే ఉంచుతారు.


**SHRIRAM Finance — వాహనముల బహిరంగ వేలం ప్రకటన**

సమస్త ప్రజానీకానికి తెలియజేయునది ఏమనగా ఈ క్రింది వాహనములు వాయిదాలు సకాలంలో చెల్లించని కారణంగా స్వాధీన పరుచుకున్న వాహనములు ఉన్నవి ఉన్నట్లుగా వేలం ద్వారా విక్రయించుటకు నిర్ణయించనైనది.

| S.No | VEHICLE NO | Customer Name | MAKE & MODEL | YEAR |
|---|---|---|---|---|
| 1 | TS27T 1698 | Tarigoppula Kanakaraju | TATA ACE | 2018 |
| 2 | TG27 7287 | Jeedi Niranjan | ZEST 1.3L XE QUADRAJET 75PS DIESEL 5 SEATER | 2017 |
| 3 | TS24T 0085 | Mandha Saritha | CHEVROLET TAVERA NEO-P | 2016 |
| 4 | TS36TA 4156 | Hari Chityala | TATA INTRA V50 BS6 | 2023 |
| 5 | TS34T 1069 | Maraboina Kavitha | AL DOST | 2017 |
| 6 | TS12UC 1562 | Ramesh Kothapeta | CHEVROLET TAVERA NEO-P | 2014 |
| 7 | TG27T 0029 | Murali Gugulothu | TATA INTRA V30 BS6 | 2024 |
| 8 | TS04UB 0643 | Panjala Ramesh | CHEVROLET TAVERA NEO-P | 2015 |
| 9 | TS27T 1193 | Ravi Kumar Devaraboina | JOHN DEERE 5036 C | 2017 |
| 10 | TS10UD 2829 | Kalla Sai Kumar | AL BADA DOST i4 BS6 | 2023 |

AUCTION DATE : 01-08-2026
VENUE : SHRIRAM AUTOMALL INDIA LTD, PUNNEL CROSS ROAD, BOLLIKUNTA, WARANGAL
గమనిక : ప్రకటన తేది నుండి బండి అమ్ముడు అయే వరకు వర్తించును
SHRIRAM FINANCE LIMITED
H.No.6-2-7/35-B, 3rd Floor, Hyderabad Raod, Jangaon. Cell - 9000014364 , 98499 11793



**CHANGE OF NAME**
I, **ERAGALA YELLESH,** (old Name), H.No. 11-156, Naglur, Hyderabad, Medchal. has changed as **EARAGALA YELLESHA, S/o. NARSIMHA EARAGALA** (New Name) for all purposes.

**CHANGE OF NAME**
I, **SHEEREEM BEGUM, D/o. GHOUSE KHAN,** (old Name) H.No. 6-46, Dundigal Village, Quthbullapur Mandal, Medchal -Malkajgiri Dist., Telangana State, has changed as **SHIREEN BEGUM, W/o. MOHAMMED ASIF ULLAH** (New Name) for all purposes.



**కెనరా బ్యాంక్** — చైతన్యపురి బ్రాంచ్, ఇం.నెం.1-1-904, సిద్ధార్థ్ నగర్, ఫాతిమా కాంప్లెక్స్ దగ్గర, హన్మకొండ, వరంగల్ - 506 004.

**ఇ-వేలం అమ్మకపు ప్రకటన**

ఇ- వేలం తేది & సమయం: 28.08.2026, ఉ.11.30 గం.ల నుండి మ.12.30 గం.ల వరకు (అమ్మకము ముగిసేవరకు ప్రతి 5 ని॥లకు ఒకసారి అపరిమిత పొడగింపుతో) బయానా డిపాజిట్ ఆఖరి తేది తేది: 27.08.2026న సా॥ 5.00 గం॥లకు

సెక్యూరిటైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 క్రింద మరియు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 నందలి రూల్ 8(6)లోని నిబంధనలతో చదవబడుతూ స్థిరాస్తుల అమ్మకము కొరకు ఇ-వేలము అమ్మకపు ప్రకటన.
ఈ నోటీసు ద్వారా ప్రత్యేకించి రుణగ్రహీత(లు) మరియు హామీదారు(లు) మరియు సాధారణ ప్రజానీకమునకు తెలియజేయడమేమనగా క్రింద తెలిపిన స్థిరాస్తిని సెక్యూర్డ్ క్రెడిటార్‌కు తనఖా/కుదువ పెట్టగా వాటిని చైతన్యపురి బ్రాంచ్ యొక్క అధీకృత అధికారి ద్వారా నిర్మాణాత్మకముగా/ భౌతికముగా స్వాధీనము చేసుకొని అనంతరం బకాయిల వసూలు కొరకు కెనరా బ్యాంక్, చైతన్యపురి బ్రాంచ్ (ఇంతకు ముందు కాజీపేట్) వారికి చెందవలసిన బకాయి మొత్తం రూ.36,76,871.13 (రూపాయలు ముప్పై ఆరు లక్షల డెబ్బై ఆరు వేల ఎనిమిది వందల డెబ్బై ఒక్కటి మరియు పైసలు పదమూడు మాత్రమే) (తేది: 20.09.2021 నాటికి ఒప్పంద బకాయిలు)లను వసూలు చేసుకొనుటకు క్రింద తెలిపిన ఆస్తులను "ఎక్కడ ఎలా వుందో, ఏది ఎలా ఉందో, ఏదైతే ఎలా ఉందో, అది అలానే ప్రాతిపదికన" తేది: 28.08.2026న అమ్మబడును.

రుణగ్రహీత(లు) పేరు మరియు చిరునామా : మెస్సర్స్ నోబెల్ ఎంటర్‌ప్రైజెస్ ప్రొప్రైటర్ ఖాజా మహమూదుల్ అబిదీన్, ఇంటి నం. 35-3-26/ఎ, తౌడు ఫ్యాక్టరీ దగ్గర, మెయిన్ రోడ్, గోపాల్‌పూర్ హన్మకొండ-506001. ప్రొప్రైటర్ : శ్రీ ఖాజా మహమూదుల్ తండ్రి జఫారూల్ అబిదీన్ ఖాజా, హెచ్.నెం. 11-23-1781/1 ఎల్.బి. నగర్, వరంగల్-506002, హామీదారు : శ్రీ మొహమ్మద్ జాఫర్ ఖాన్ తండ్రి రషీద్ అహ్మద్ ఖాన్, ఇంటి నం. 17-7-163, కరీమాబాద్, వరంగల్-506002
ఆస్తి వివరణ మరియు పూర్తి వివరములు: వరంగల్ సిటీ, మట్వాడ, షేర్‌పురా వీధిలో 164 చ.గ.ల విస్తీర్ణం గల స్థలం (పాత ఇంటి నం. 13/1090; కొత్త ఇంటి నం. 13-8-43/44). సరిహద్దులు: తూర్పు: కొనుగోలుదారుని ఇంటి నం. (13-8-45), పడమర: 14' వెడల్పు రోడ్డు, ఉత్తరం: 14' వెడల్పు రోడ్డు, దక్షిణం: సయ్యద్ గౌసుద్దీన్ గారి ఇంటి నం. (13-8-41 & 13-8-42) మరియు ఫెరోజ్ అథర్ గారి ఇంటి నం. (13-8-39).

రిజర్వు ధర : రూ.12,05,000/- ధరావత్తు సొమ్ము (ఇ.ఎం.డి) రూ.1,20,500/-

*బ్యాంక్‌కు తెలిసినంత వరకు తాకట్టు రుణభారములు ఏమీ లేవు. వేలమును ఆన్‌లైన్ పోర్టల్ https://ebkray.in/ ద్వారా నిర్వహించబడును
రిజర్వు ధరలో 10% బయానా మొత్తాన్ని మొత్తాన్ని E-వ్యాలెట్ of M/s PSB Alliance Private Limited, BAANKNET యొక్క portal లో లేదా సదరు చలాన్‌లో పేర్కొన్న ఖాతా వివరాలలో RTGS/NEFT ద్వారా బయానా డిపాజిట్ చేయుటకు దానిలో చలాన్ జనరేట్ చేయుట ద్వారా డిపాజిట్ చేయవలెను.
బిడ్డింగ్ ప్రాసెస్ మాన్యువల్, బిడ్డర్ రిజిస్ట్రేషన్ మరియు బయానా చెల్లింపు కొరకు దర్శించండి ఆన్‌లైన్ పోర్టల్ వెబ్‌సైట్ https://ebkray.in/ సంప్రదించండి. 8291220220, E-mail : support.ebkray@psballiance.com
అమ్మకం యొక్క సవివరమైన నియమ నిబంధనల కొరకు కెనరా బ్యాంక్ వెబ్‌సైట్: (www.canarabank.com)లో ఏర్పాటు చేసిన ఇ-వేలం లింక్‌ను రిఫర్ చేయవలెను లేదా బ్రాంచ్ మేనేజర్ కెనరా బ్యాంక్, చైతన్యపురి, ఫోన్ నెం.7382932273, వారిని ఏపని రోజులోనైనా కార్యాలయ పనివేళల్లో సంప్రదించవచ్చును.
తేది: 27.07.2026, ప్రదేశము: హన్మకొండ — సం/- అధీకృత అధికారి/ కెనరా బ్యాంక్

## మధ్య ప్రాచ్యంలో కొనసాగుతున్న ఉద్రిక్తత



**టెహ్రాన్:** ఇరాన్–అమెరికా మధ్య ఉద్రిక్తతలు ఇంకా కొనసాగుతున్నాయి. ఇటీవల జరిగిన సైనిక ఘర్షణల తర్వాత పర్షియన్ గల్ఫ్ ప్రాంతంలో పరిస్థితులు మరింత సమస్యాత్మకంగా మారాయి. ప్రపంచ చమురు సరఫరాలో కీలక పాత్ర పోషించే 'హోర్ముజ్ జల సంధి' వద్ద నౌకలను లక్ష్యంగా చేసుకున్నామని ఇరాన్ ప్రకటించింది. అలాగే అమెరికా సైనిక స్థావరాలపై డ్రోన్లతో దాడులు నిర్వహించినట్లు కూడా పేర్కొంది. ఈ ఆరోపణలపై అమెరికా అధికారికంగా పూర్తి స్థాయి స్పందన ఇవ్వకపోయినా, తన సైనిక అప్రమత్తతను పెంచినట్లు అంతర్జాతీయ వర్గాలు చెబుతున్నాయి. ఇదే సమయంలో ఎర్ర సముద్రంలో వాణిజ్య నౌకల రాకపోకలను భద్రపరచేందుకు సౌదీ అరేబియా యెమెన్‌లోని హౌతీ తిరుగుబాటు దళాలపై విస్తృత స్థాయి సైనిక చర్యలకు సిద్ధమవుతున్నట్లు సమాచారం. హౌతీలకు ఇరాన్ మద్దతు ఉండని అమెరికా, సౌదీ అరేబియా చాలా కాలంగా ఆరోపిస్తున్నాయి. ఎర్ర సముద్ర మార్గం ఆసియా–యూరప్ వాణిజ్యానికి అత్యంత కీలకమైనది కావడంతో అక్కడ ఉద్రిక్తతలు పెరిగితే ప్రపంచ సరఫరా వ్యవస్థ, చమురు ధరలు, సముద్ర రవాణా వ్యయాలపై ప్రభావం పడే అవకాశం ఉంది. ఉద్రిక్తతలను తగ్గించేందుకు ఖతర్, ఒమాన్ వంటి దేశాలు దౌత్యపరమైన ప్రయత్నాలు కొనసాగిస్తున్నాయి. అయితే ఇప్పటివరకు ఏ పక్షమూ తన వైఖరిలో గణనీయమైన మార్పు చూపకపోవడంతో చర్చల్లో స్పష్టమైన పురోగతి కనిపించడం లేదు. ఫలితంగా మధ్యప్రాచ్యంలో భద్రతా పరిస్థితి ఇంకా అనిశ్చితంగానే కొనసాగుతోంది.

## పాక్‌లో గని ప్రమాదం..
# 34 మంది కార్మికులు మృతి



**కరాచీ:** పాకిస్థాన్‌లోని బలూచిస్థాన్ ప్రావిన్స్‌లో ఘోర గని ప్రమాదం చోటుచేసుకుంది. క్వెట్టా సమీపంలోని 'సోరాంజ్' బొగ్గు గనుల ప్రాంతంలో మీథేన్ వాయువు పేలడంతో కనీసం 34 మంది కార్మికులు మృతి చెందగా, మరో డజనుకుపైగా కార్మికులు ఇంకా గనిలో చిక్కుకుపోయారు. గురువారం షిఫ్ట్ మారుతున్న సమయంలో సుమారు 4,000 అడుగుల లోతులో ఈ పేలుడు సంభవించింది. పేలుడు ధాటికి అగ్నిప్రమాదం చెలరేగడంతో పాటు గని లోపలి భాగాలు కూలిపోవడంతో పలువురు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. సహాయక బృందాలు ఇప్పటివరకు 34 మృతదేహాలను వెలికితీశాయి. 22 మందిని రక్షించి, సజీవంగా బయటకు తీసుకొచ్చాయి. వారిని వెంటనే వైద్య సేవల నిమిత్తం సమీపంలోని ఆసుపత్రులకు తరలించారు. మీథేన్ వాయువు అధికంగా పేరుకుపోవడమే ఈ ప్రమాదానికి కారణమని పాకిస్థాన్ ఆల్ పాకిస్థాన్ కోల్ మైనర్స్ అసోసియేషన్ తెలిపింది. ఇంత లోతులో పేలుళ్లు జరిగినప్పుడు ప్రవేశ, నిష్క్రమణ మార్గాలు ధ్వంసమవుతాయని, అందువల్ల ప్రాణాలతో బయటపడే అవకాశాలు చాలా తక్కువగా ఉంటాయని అధికారులు చెప్పారు. కాగా, ఈ ఘటనతో పాకిస్థాన్‌లోని బొగ్గు గనుల భద్రతపై మరోసారి ప్రశ్నలు తలెత్తాయి. అనేక ప్రైవేట్ గని యజమానులు భద్రతా నిబంధనలను పాటించడం లేదని, గ్యాస్ పర్యవేక్షణ వ్యవస్థలు, తగిన గాలి ప్రసరణ, రక్షణ పరికరాలు లేకుండానే కార్మికులను పనిచేయిస్తున్నారని కార్మిక సంఘాలు చాలా కాలంగా ఆరోపిస్తున్నాయి. మృతుల కుటుంబాలకు ఒక్కొక్కరికి 5 లక్షల పాకిస్థానీ రూపాయలు, గాయపడిన వారికి 3 లక్షల పాకిస్థానీ రూపాయలు చొప్పున పరిహారం ప్రకటించిన బలూచిస్థాన్ ప్రభుత్వం, ప్రమాదంపై సమగ్ర విచారణ జరిపి గని భద్రతా ప్రమాణాలను పునఃసమీక్షిస్తామని వెల్లడించింది. బలూచిస్థాన్‌లో నిరుద్యోగం, పేదరికం అధికంగా ఉండటంతో వేలాది మంది ప్రమాదాలు తెలిసినా బొగ్గు గనులపైనే జీవనోపాధి కోసం ఆధారపడుతున్నారు.

## భారత్–భూటాన్ మధ్య కీలక ఒప్పందాలు



**థింపూ:** భారత్–భూటాన్ మధ్య అభివృద్ధి భాగస్వామ్యానికి మరింత బలం చేకూర్చే దిశగా ఇరు దేశాలు కీలక ఒప్పందాలు కుదుర్చుకున్నాయి. థింపూలో జరిగిన ఐదో ద్వైపాక్షిక అభివృద్ధి సహకార చర్చల్లో విదేశాంగ కార్యదర్శులు విక్రమ్ మిశ్రి, దాషో పెమా లెక్టుప్ దోర్జీ పాల్గొని, భూటాన్ 13వ పంచవర్ష ప్రణాళిక (2024–29) కింద భారత్ అందిస్తున్న అభివృద్ధి సహాయంపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా భూటాన్ అభివృద్ధి కార్యక్రమాలకు మద్దతుగా రూ.4,000 కోట్ల రాయితీ రుణం అందించే ఒప్పందంపై సంతకాలు జరిగాయి. అలాగే వైద్య విద్య, పరిశోధన రంగాల్లో సహకారం పెంచేందుకు 'ఆల్ ఇండియా ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్', భూటాన్‌లోని 'ఖేసర్ గ్యాల్పో వైద్య విజ్ఞాన విశ్వవిద్యాలయం' మధ్య అవగాహన ఒప్పందం కుదిరింది. భూటాన్ 13వ పంచవర్ష ప్రణాళిక కోసం భారత్ ఇప్పటికే రూ.10,000 కోట్ల ఆర్థిక సహాయాన్ని ప్రకటించింది. ఇందులో మౌలిక సదుపాయాలు, ఆరోగ్యం, వ్యవసాయం, పట్టణాభివృద్ధి, విపత్తు నిర్వహణ వంటి రంగాల్లో చేపట్టే ప్రాజెక్టులు ఉన్నాయి. కాగా, ఈ సమావేశంలో, రూ.332 కోట్ల విలువైన మరో 12 కొత్త అభివృద్ధి ప్రాజెక్టులకు ఆమోదం లభించింది. దీంతో ప్రస్తుత ప్రణాళిక కాలంలో భారత్ మద్దతుతో ఆమోదం పొందిన ప్రాజెక్టుల సంఖ్య 82కు చేరింది. అదనంగా, థింపూలో భారత్ నిధులతో నిర్మించిన రెండు పర్యావరణ పార్కులను వర్చువల్‌గా ప్రారంభించారు. భూటాన్‌లో హరిత రవాణాను ప్రోత్సహించేందుకు 45 ఎలక్ట్రిక్ వాహనాలను కూడా భారత్ ఆ దేశ ప్రభుత్వానికి అందించింది. దశాబ్దాలుగా భూటాన్‌కు అతిపెద్ద అభివృద్ధి భాగస్వామిగా ఉన్న భారత్, మౌలిక సదుపాయాలు, విద్య, ఆరోగ్యం, అనుసంధానం, సామర్థ్యాభివృద్ధి వంటి రంగాల్లో నిరంతరం ఆర్థిక, సాంకేతిక సహాయాన్ని అందిస్తోంది. ఈ తాజా ఒప్పందాలు ఇరు దేశాల మధ్య ఉన్న సన్నిహిత వ్యూహాత్మక, ఆర్థిక సంబంధాలను మరింత బలోపేతం చేయనున్నాయని అధికారులు పేర్కొన్నారు.

## ఎఐ దుర్వినియోగాన్ని అరికట్టడానికి ఇయు కఠిన చర్యలు



**బ్రస్సెల్స్:** కృత్రిమ మేధ (ఎఐ) వేగంగా అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో దాని దుర్వినియోగాన్ని అరికట్టేందుకు యూరోపియన్ యూనియన్ (ఇయు) కఠిన చర్యలకు శ్రీకారం చుట్టింది. బ్రస్సెల్స్‌లో ప్రత్యేక పర్యవేక్షణ బృందాన్ని ఏర్పాటు చేసి, ప్రపంచవ్యాప్తంగా పనిచేస్తున్న ఎఐ సంస్థల కార్యకలాపాలను నిశితంగా పరిశీలించాలని నిర్ణయించింది. ఆగస్టు 2 నుంచి అమల్లోకి రానున్న ఎఐ చట్టం ప్రకారం, ఎఐతో రూపొందించిన చిత్రాలు, వీడియోలు, చాట్‌బాట్ సమాధానాలు వంటి కంటెంట్‌పై స్పష్టమైన లేబుల్ లేదా డిజిటల్ వాటర్ మార్క్ తప్పనిసరిగా ఉండాలి. దీంతో వినియోగదారులు నిజమైన కంటెంట్‌కు, ఎఐ సృష్టించిన కంటెంట్‌కు మధ్య తేడాను గుర్తించగలుగుతారు. డీప్‌ఫేక్ వీడియోలు, అశ్లీల చిత్రాల తయారీ, సైబర్ దాడులు, ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రచారం, ప్రజాస్వామ్య వ్యవస్థలకు ముప్పు కలిగించే ఎఐ వినియోగాన్ని అరికట్టడం వంటివి ఈ కొత్త నిబంధనల ప్రధాన లక్ష్యం. రసాయన, జీవ, అణు సంబంధిత ప్రమాదాలకు దారితీసే ఎఐ వినియోగం, మానవ హక్కులకు భంగం కలిగించే చర్యలు కూడా ఈ చట్టం పరిధిలోకి వస్తాయి. దీని అమలును పర్యవేక్షించేందుకు యూరోపియన్ కమిషన్ తన ఎఐ కార్యాలయాన్ని విస్తరించి మరో 38 మంది నిపుణులను నియమించింది. వీరు ఓపెన్‌ఎఐ, డీప్‌సీక్ వంటి అంతర్జాతీయ ఎఐ సంస్థలతో పాటు ఇతర కంపెనీల కార్యకలాపాలను కూడా పరిశీలిస్తారు. అక్రమాలు జరిగాయని అనుమానం వస్తే సంస్థల నుంచి వివరాలు కోరడం, ఉద్యోగులను విచారించడం, సాంకేతిక నిపుణుల నుంచి రహస్య సమాచారాన్ని స్వీకరించడం వంటి అధికారాలు ఈ బృందానికి ఉంటాయి. ఎఐ చట్టాన్ని ఉల్లంఘించిన సంస్థలకు భారీ జరిమానాలు విధించడంతో పాటు అవసరమైతే యూరోపియన్ మార్కెట్‌లో కార్యకలాపాలను నిషేధించే అధికారం కూడా ఇయుకి ఉంది. సాంకేతిక రంగంలో అమెరికా, చైనా ఆధిపత్యానికి ప్రత్యామ్నాయంగా స్వతంత్ర ఎఐ వ్యవస్థను నిర్మించడమేగాక. ప్రజల భద్రత, విశ్వసనీయతను కాపాడడమే ఈ చర్యల ప్రధాన ఉద్దేశమని యూరోపియన్ యూనియన్ వెల్లడించింది.


## జపాన్ భూకంప మృతులు
# 34కు చేరిక



**కుమమొటో:** జపాన్ నైరుతి ప్రాంతంలో 7.1 తీవ్రతతో సంభవించిన భూకంపం కారణంగా మరణించిన వారి సంఖ్య 34కు చేరింది. మరొకరు కూడా మృతి చెందినట్టు వచ్చిన వార్తలపై అధికారులు ఇంకా దర్యాప్తు చేస్తున్నారు. మంగళవారం క్యుషూ ద్వీపాన్ని కుదిపేసిన ఈ భూకంపం వల్ల ఎన్నో భవనాలు కూలిపోగా, కర్మాగారాల నిర్మాణాలు ధ్వంసమైన విషయం తెలిసిందే. ఇప్పటివరకు 80 మందికిపైగా గాయపడగా, వారిలో ఐదుగురి పరిస్థితి విషమంగా ఉంది. భూకంపం సమయంలో కుమమోటో ప్రాంతంలోని కషిమా పట్టణంలో ఉన్న ఏయాన్ మాల్‌లో వేలాది మంది షాపింగ్ చేస్తున్నారు. ప్రమాదాన్ని గుర్తించిన యాజమాన్యం దాదాపు 3,000 మంది వినియోగదారులను పార్కింగ్ ప్రాంతానికి సురక్షితంగా తరలించింది. అయితే మాల్‌లోని మరో భాగంలో పనిచేస్తున్న సిబ్బంది బయటకు రాకముందే భారీ పేలుడు సంభవించింది. ఆ పేలుడు అనంతరం రెండో అంతస్తు కూలిపోవడంతో పలువురు శిథిలాల కింద చిక్కుకుపోయారు. అక్కడ ఇప్పటివరకు ఏడుగురు మృతి చెందగా, 11 మందిని సజీవంగా రక్షించారు. ఇంకా ఎంతమంది గల్లంతయ్యారో అధికారులు వెల్లడించలేదు. అదే సమయంలో యత్సుషిరో ప్రాంతంలోని నిప్పాన్ పేపర్ ఇండస్ట్రీస్ కర్మాగారంలో భూకంపం కారణంగా పొగ గొట్టం కూలిపోయింది. అక్కడ 11 మందిని రక్షించగా, తొమ్మిది మంది ప్రాణాలు కోల్పోయారు. భూకంప ప్రభావంతో ఇంకా 3,500కుపైగా ఇళ్లకు విద్యుత్ సరఫరా పునరుద్ధరించాల్సి ఉంది. దాదాపు 9,000 మంది సహాయ శిబిరాల్లో ఆశ్రయం పొందుతున్నారు. తీవ్ర వేసవి వేడి కారణంగా శిబిరాల్లో ఉన్నవారికి అనారోగ్య సమస్యలు తలెత్తకుండా అదనపు విద్యుత్ సౌకర్యాలు, ఎయిర్ కండిషనింగ్ ఏర్పాట్లు చేస్తున్నారు. శిథిలాల కింద చిక్కుకున్నవారి కోసం సహాయక బృందాలు ఇంకా గాలింపు చర్యలు కొనసాగిస్తున్నాయి.

## సియూటలో వలసదారుల తొక్కిసలాట

### 18 మంది మృతి



**సియూట:** మొరాకో సరిహద్దుకు ఆనుకుని ఉన్న స్పెయిన్ భూభాగం సియూటలోకి వేలాది మంది వలసదారులు ఒక్కసారిగా ప్రవేశించేందుకు ప్రయత్నించడంతో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. ఈ ఘటనలో కనీసం 18 మంది వలసదారులు మృతి చెందగా, భారీ సంఖ్యలో గాయపడ్డారు. పరిస్థితి అదుపు తప్పడంతో స్పెయిన్ ప్రభుత్వం సైన్యాన్ని రంగంలోకి దించి భద్రతను కట్టుదిట్టం చేసింది. మృతుల్లో చాలామంది సముద్ర మార్గంలో ఈదుకుంటూ స్పెయిన్ భూభాగానికి చేరే ప్రయత్నంలో మునిగిపోయారు. మరికొందరు టరాజల్ బీచ్ వద్ద ఉన్న సరిహద్దు అడ్డంకిని దాటే క్రమంలో జరిగిన తొక్కిసలాటలో ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటనను స్పెయిన్ సివిల్ గార్డ్ ప్రతినిధులు 'తీవ్రమైన మానవతా సంక్షోభం'గా అభివర్ణించారు. సుమారు 60,000 మంది వలసదారులు, వారిలో తల్లిదండ్రులు లేని చిన్నారులు కూడా ఉండడంతో, వారికి ఆశ్రయం లేక పార్కులు, రహదారుల పక్కనే రాత్రి గడపాల్సిన పరిస్థితి ఏర్పడింది. కొందరు స్పెయిన్‌లోకి ప్రవేశించగా, మరికొందరు తిరిగి మొరాకో వైపు వెళ్లేందుకు ప్రయత్నిస్తున్నట్లు ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. ఇంత పెద్ద సంఖ్యలో వలసదారులు ఒక్కసారిగా సరిహద్దు దాటేందుకు ఎందుకు ప్రయత్నించారనే విషయం ఇంకా స్పష్టంగా తెలియరాలేదు. ఈ ఘటనపై మొరాకో ప్రభుత్వం అధికారికంగా స్పందించలేదు. పరిస్థితిని సమీక్షించేందుకు స్పెయిన్ ప్రధానమంత్రి పెడ్రో సాంచెజ్, అంతర్గత వ్యవహారాల మంత్రి ఫెర్నాండో గ్రాండేమార్లాస్కా స్యూటాను సందర్శించారు. ఈ సంఘటనతో యూరప్‌లో అక్రమ వలసలు, సరిహద్దు భద్రత, శరణార్థుల సంక్షేమంపై మరోసారి తీవ్ర చర్చ మొదలైంది.

## టామ్‌కామ్‌దే బాధ్యత

(మొదటి పేజీ తరువాయి)

పాటు వివిధ దేశాలకు చెందిన శిక్షకులను రప్పించాలని సిఎం సూచించారు. యూనివర్సిటీ ప్రాంగణంలో రీలొకేటెడ్ చెట్లను నాటాలని సిఎం సూచించారు. ఉన్నత విద్యకు వెళ్లే విద్యార్థులకు ఓవర్సీస్ స్కాలర్‌షిప్‌లు ఇచ్చినట్లే, బ్లూ కాలర్ జాబ్‌లకు శిక్షణ పొందేవారందరికీ స్కాలర్‌షిప్‌లు ఇచ్చే అంశంపై అధ్యయనం చేయాలని అధికారులను సిఎం ఆదేశించారు.

**ఎటిసి విద్యార్థులకు పెద్ద కంపెనీల్లో ఇంటర్న్‌షిప్**

ప్రభుత్వ ఇంజినీరింగ్ కళాశాలలు, ఐటిఐలు, ఎటిసిలు, పాలిటెక్నిక్ కళాశాలల్లో చదివే విద్యార్థులకు పెద్ద కంపెనీల్లో ఇంటర్న్‌షిప్ చేసే అవకాశం కల్పించాలని సిఎం రేవంత్ రెడ్డి అన్నారు. ఓ వైపు చదువుకుంటూనే, మరో వైపు ఇంటర్న్‌షిప్ చేయడం ద్వారా వారికి స్టైఫండ్ లభిస్తుందని, భవిష్యత్‌లో చేపట్టనున్న ఉద్యోగానికి సంబంధించిన నైపుణ్యాలు నేర్చుకుంటారన్నారు. ఎటిసిలలో ఈవి సర్వీసులకు సంబంధించిన కోర్సులు, డ్రోన్ టెక్నాలజీ కోర్సులు ప్రవేశ పెట్టాలని సిఎం సూచించారు. ఈవీల వాడకం విపరీతంగా పెరిగిన నేపథ్యంలో వాటి సర్వీసింగ్ చేయగలిగిన వారు అవసరమన్నారు. వ్యవసాయంలో డ్రోన్ల వినియోగం భారీగా పెరుగుతున్నందున డ్రోన్ టెక్నాలజీ కోర్సు ఉండాలని సిఎం సూచించారు. దేశీయంగానూ, విదేశాల్లోనూ నర్సుల సేవలకు భారీ డిమాండ్ ఉందని సిఎం రేవంత్ రెడ్డి అన్నారు. పలు అభివృద్ధి చెందిన దేశాల్లో వృద్ధుల సంఖ్య పెరుగుతుండడంతో ఇంటికో నర్సు డిమాండ్ ఉందన్నారు. పెరుగుతున్న డిమాండ్‌కు అనుగుణంగా నర్సింగ్ కళాశాలలకు అనుమతులు ఇస్తున్నట్లు సిఎం తెలిపారు. సమావేశంలో సిఎం ప్రిన్సిపల్ సెక్రటరీ ఎన్.శ్రీధర్, 'శక్తి' కార్యదర్శి హరిచందన, ఉపాధి, శిక్షణ డైరెక్టర్ నిర్మలా కాంతి వెస్లీ, యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

## థర్మల్ కేంద్రాలకు
# బొగ్గు కొరత లేకుండా చర్యలు

### సిఎండి డాక్టర్ బుద్ధప్రకాష్ జ్యోతి ఆదేశాలు



**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాష్ట్రంలో విద్యుత్ అవసరాలు పెరుగుతున్న నేపథ్యంలో రా ష్ట్ర థర్మల్ విద్యుత్ కేంద్రాలకు నిరంతరాయంగా బొగ్గు సరఫరా చేసేందుకు సింగరేణి సంస్థ పూర్తిస్థాయిలో సంసిద్ధంగా ఉందని సిఎండి డాక్టర్ బుద్ధ ప్రకాష్ జ్యోతి తెలిపారు థర్మల్ విద్యుత్ కేంద్రాల డిమాండ్ మేరకు రోజుకు 28 నుంచి 32 రేక్‌ల ద్వారా నాణ్యమైన బొగ్గు సరఫరా చేయాలని అన్ని ఏరియాల జనరల్ మేనేజర్లకు ఆదేశాలు జారీ చేశారు. హైదరాబాద్‌లోని సింగరేణి భవన్ నుంచి శుక్రవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని ఏరియాల జనరల్ మేనేజర్లతో బొగ్గు ఉత్పత్తి, రవాణా, ఓవర్ బర్డెన్ తొలగింపు, నాణ్యత అంశాలపై నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. వర్షాల కారణం గా ఓపెన్‌కాస్ట్ గనుల ఉత్పత్తిపై కొంత ప్రభావం పడినా, ముందస్తు జాగ్రత్తలతో నిర్దేశిత ఉత్పత్తి లక్ష్యాలను తప్పకుండా సాధించాలని సూచించారు. అదే సమయంలో వర్షాకాలంలో భూగర్భ గనుల ఉత్పత్తిని పెంచేందుకు ప్రత్యేక కార్యాచరణ అమలు చేయాలన్నారు. రాష్ట్ర విద్యుత్ అవసరాలకు తొలి ప్రాధాన్యం ఇస్తూ థర్మల్ విద్యుత్ కేంద్రాలకు 7580 శాతం బొగ్గును సరఫరా చేస్తున్నట్లు సిఎండి తెలిపారు. వర్షాకాలంలో గోదావరి పరివాహక ప్రాంతాల్లో వరద ముప్పును దృష్టిలో ఉంచుకుని, స్థానిక ప్రభుత్వ యంత్రాంగంతో సమన్వయం చేసుకుని సింగరేణి రెస్క్యూ బృందా లు, ఇతర విభాగాల అధికారులు వెంటనే సహాయక చర్యల్లో పాల్గొనే విధంగా సిద్ధం గా ఉండాలని ఆదేశించారు. బొగ్గు ఉత్పత్తికి అనుగుణంగా అన్ని ఓపెన్‌కాస్ట్ గనుల్లో లక్ష్య సాధనపై ప్రత్యేక దృష్టి సారించాలని, ఈ ఆర్థిక సంవత్సర లక్ష్యాలను పూర్తి చేయడంతో పాటు భవిష్యత్తులో 70 మిలియన్ టన్నుల ఉత్పత్తి లక్ష్యాన్ని, 500 మిలియన్ క్యూబిక్ మీటర్ల ఓవర్ బర్డెన్ తొలగింపు లక్ష్యాన్ని చేరుకునేందుకు కొత్త గనులకు అవసరమైన వివిధ అనుమతుల సాధన ప్రక్రియను ఇప్పటి నుంచే వేగవంతం చేయాలని సూచించారు. సమావేశంలో డైరెక్ట ర్లు ఎల్.వి.సూర్యనారాయణ , కె.వెంకటేశ్వర్లు , గౌతమ్ పోట్రు, ఎం.తిరుమలరావు , ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ బి.వెంకన్న, జిఎం టి.శ్రీనివాస్ పాల్గొన్నారు.

## ఆగస్టులోనూ లోటు

(మొదటి పేజీ తరువాయి)

35.4 శాతంగా ఉండేది. అయితే, జులైలో మంచి వర్షపాతం నమోదవ్వడం కారణంగా ఈ వర్షపాత లోటు తగ్గిందని డాక్టర్ మహాపాత్ర తెలిపారు. 'జులై నెల సాధారణ సగటు వర్షపాతం 280.5 మి.మీ కాగా, ఈ ఏడాది దేశంలో 283.3 మి.మీ వర్షపాతం నమోదైంది. అయితే, దీనికి ప్రధానంగా రెండు కారణాలు ఉన్నాయి. బంగాళాఖాతంలో నాలుగు అల్పపీడన వ్యవస్థలు ఏర్పడ్డాయి. వాటిలో రెండు తీవ్రతరం చెంది వాయుగుండాలుగా మారాయి' అని ఆయన పేర్కొన్నారు. జులై మొదటి వారంలో గాలి, మేఘాల కదలికల వ్యవస్థ (ఎంజెఒ) భారతదేశానికి అనుకూలమైన దశలో ఉండటం వల్ల దక్షిణ భారతం మీదుగా రుతుపవన మేఘాలు ఉత్తరం వైపు విస్తరించి భారీ వర్షాలు పడ్డాయి. అయితే జులై చివరి భాగంలో ఇది ప్రతికూలంగా మారింది. కాగా, భారత వాతావరణ శాఖ వెల్లడించిన వివరాల ప్రకారం, గత ఐదేళ్లలో అత్యధిక సంఖ్యలో 'అత్యంత భారీ వర్షపాత' సంఘటనలు (204.5 మి.మీ కంటే ఎక్కువ వర్షపాతం) కూడా ఈ జులైలోనే నమోదయ్యాయి. ఇవి ప్రధానంగా ఒడిశా, గుజరాత్, మహారాష్ట్రల్లో కేంద్రీకృతమై ఉన్నాయని డాక్టర్ మహాపాత్ర పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా చూస్తే ఈ ఏడాది జులైలో సాధారణం కంటే కొంచెం ఎక్కువ వర్షపాతం నమోదైనప్పటికీ, దక్షిణ ద్వీపకల్ప ప్రాంతంలో మాత్రం 1901 తర్వాత లోటు వర్షపాతం నమోదైంది.

**ఆ రాష్ట్రాల్లో భారీ వర్షాలు**

ఇదిలా ఉండగా, కేరళ, అసోం, అరుణాచల్ ప్రదేశ్, ఇతర ఈశాన్య రాష్ట్రాలతో సహా దేశంలోని పలు ప్రాంతాలకు వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసింది. రానున్న రోజుల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది. ఉరుములతో కూడిన వర్షాలు, ఆకస్మిక వరదలు, కొండచరియలు విరిగిపడే ప్రమాదం ఉందని హెచ్చరించింది. రుతుపవన కాలంలో పలు రాష్ట్రాలు వరదలు, కొండచరియలు విరిగిపడే ప్రమాదాలతో సతమతమవుతున్న తరుణంలో ఈ తాజా హెచ్చరికలు వెలువడ్డాయి.

## ఉగ్ర గోదావరి

(మొదటి పేజీ తరువాయి)

తెలుస్తోంది. గోదావరి భద్రాచలం వద్ద 53 అడుగులకు చేరుకుంటే చివరి ప్రమాదహెచ్చరికను జారీ చేస్తారు. ఇదిలా ఉండగా ఎగువ ప్రాంతాలు చాలా వరకు జలమయం అవుతున్నాయి. దుమ్ముగూడెం మండలంలోని సున్నంబట్టి, తూరుబాక ప్రాంతాల్లో గోదావరి వరద నీరు ప్రధాన రహదారిపైకి చేరుకోవడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. గోదావరి 51 అడుగులకు చేరుకుంటే దుమ్ముగూడెం మండంలోని గంగోలు, బూర్గంపాడు మండలంలోని నాగినేనిప్రోలు రెడ్డిపాలెం భద్రాచలం సమీపంలోని ఆంధ్రప్రదేశ్ సరిహద్దు ప్రాంతం ఎటపాక, గుండాల ప్రధానరహదార్లపైకి నీరు చేరుతుంది. భద్రాచలంవద్ద గోదావరి ఉధృతి పరిస్థితిని ఎంఎల్‌ఏ డా.తెల్లం వెంకట్రావు జిల్లా కలెక్టర్ అంకిత్ ఎస్‌పి రోహిత్ రాజ్ సబ్ కలెక్టర్ మినాళ్ శ్రేష్ఠ తదితరులు పరిశీలించారు. చర్ల మండలం వీరాపురం ఇసుక ర్యాంపు కూలీలు, ఇసుక లారీల డ్రైవర్లు గోదావరిలో చిక్కుకుపోయారు. ఒక్కసారిగా గోదావరి వరద ర్యాంపును చుట్టుముట్టడంతో భయాందోళనకు గురి కావడంతో రెవెన్యూ, పోలీస్ అధికారులు ఐదు గంటల పాటు శ్రమించి జేసిబిల సహాయంతో వారిని రక్షించారు. ఎన్ఎండిసి అధికారులు ఇసుక సైట్ తెరిచి ఉంచడంతో లారీలు పెద్ద ఎత్తున అక్కడికి చేరుకున్నట్లు తెలుస్తోంది. గోదావరి వరద ఉధృతంగా ప్రవహిస్తుంటే అధికారులకు సోయి లేకుండా పోయిందని పలువురు విమర్శిస్తున్నారు. కూలీలు, లారీల డ్రైవర్లు బయట పడ్డప్పటికీ సుమారు 40 లారీల వరకు ఇసుక ర్యాంపులోనే ఉన్నాయి. గోదావరి వరద మరింత పెరిగితే ఆ లారీలు మొత్తం గోదావరిలో కొట్టుకుపోయే, ఇసుకలో కూరుకుపోయే ప్రమాముంది.

## సిఎస్‌కు ఆదేశం

(మొదటి పేజీ తరువాయి)

ప్రజల్లో విశ్వాసం కొనసాగాలంటే కోర్టు ఆదేశాలను ధిక్కరించిన అధికారిని అదే బాధ్యతల్లో కొనసాగించడం సరికాదని పేర్కొంటూ రంగనాథ్‌ను వెంటనే ప్రస్తుత పదవి నుంచి రిలీవ్ చేసి మరో అధికారిని నియమించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని ఆదేశించింది. గ్రీకు పురాణంలోని 'హైడ్రా'ను ప్రస్తావిస్తూ చట్టానికి అతీతంగా ఏ ప్రభుత్వ వ్యవస్థా వ్యవహరించలేదని కోర్టు వ్యాఖ్యానించింది. లోతుకుంట భూముల వ్యవహారంలో కోర్టుకు ఇచ్చిన హామీని ఉల్లంఘించి హైడ్రా అధికారులు భూమిలోకి ప్రవేశించి నిర్మాణాలు తొలగించడాన్ని ఉద్దేశపూర్వక ధిక్కరణగా తేల్చింది. రెవెన్యూ అధికారుల ఆదేశాల మేరకే చర్యలు చేపట్టామని చేసిన వాదనకు ఆధారాలు లేవని పేర్కొంది. హైడ్రా కమిషనర్‌పై ఇప్పటికే 62 కోర్టు ధిక్కరణ కేసులు పెండింగ్‌లో ఉన్నాయని కూడా తీర్పులో నమోదు చేసింది.

## వారంపాటు వర్షాలు

(మొదటి పేజీ తరువాయి)

బుధవారం వరకు రాష్ట్రంలోని పలు జిల్లాల్లో అక్కడక్కడ ఇదే తరహా వర్షాలు కొనసాగే అవకాశం ఉందన్నారు. ఇదే సమయంలో రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో బలమైన ఉపరితల గాలులు అక్కడక్కడ వీచే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. రైతులు, వాహనదారులు, బహిరంగ ప్రదేశాల్లో పనిచేసే వారు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. వచ్చే బుధ, గురు, శుక్రవారం వరకు రాష్ట్రంలోని కొన్ని ప్రాంతాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉన్నప్పటికీ, ఈ రెండు రోజులకు ప్రత్యేక వాతావరణ హెచ్చరికలు ఏవీ జారీ చేయలేదన్నారు. కాగా తూర్పు విదర్భ, దానికి ఆనుకుని ఉన్న పశ్చిమ మధ్య ఛత్తీస్‌గఢ్ ప్రాంతాలపై ఏర్పడిన వాయుగుండం గత 6 గంటల్లో గంటకు 15 కి.మీ వేగంతో పశ్చిమ, వాయువ్య దిశగా కదిలింది. శుక్రవారం ఇది పశ్చిమ విదర్భ, దానికి ఆనుకుని ఉన్న దక్షిణ మధ్యప్రదేశ్ ప్రాంతాల్లో వద్ద కేంద్రీకృతమై ఉంది. ఇది అమరావతి (మహారాష్ట్ర)కు తూర్పుఈశాన్యంగా 50 కి.మీ, వార్ధా (మహారాష్ట్ర)కు వాయువ్యంగా 60 కి.మీ, బేతుల్ (మధ్యప్రదేశ్)కు దక్షిణ, ఆగ్నేయంగా 90 కి.మీ, ఖాండ్వా (మధ్యప్రదేశ్)కు తూర్పుఆగ్నేయంగా 210 కి.మీ, ఖర్గోన్ (మధ్యప్రదేశ్)కు తూర్పుఆగ్నేయంగా 280 కి.మీ దూరంలో ఉంది. రాబోయే 24 గంటల్లో ఇది విదర్భ, దక్షిణ మధ్యప్రదేశ్, దానికి ఆనుకుని ఉన్న మధ్య మహారాష్ట్ర మీదుగా పశ్చిమ, వాయువ్య దిశగా కదిలి, తీవ్ర అల్పపీడన ప్రాంతంగా బలహీనపడే అవకాశం ఉందని అధికారులు చెప్పారు. సముద్ర మట్టంలో రుతుపవన ద్రోణి జైసల్మేర్, ఉదయపూర్, ఇండోర్, వాయుగుండం కేంద్రం, గోపాల్పూర్ మీదుగా ఆగ్నేయంగా మధ్య బంగాళాఖాతం వరకు విస్తరించిందన్నారు.

## పార్లమెంట్ వద్ద స్కిట్

(మొదటి పేజీ తరువాయి)

సేకరించారు. సమాజ్‌వాదీ పార్టీ ఎంపి రుచి వీరా (మోరదాబాద్), అవధేశ్ ప్రసాద్ (అయోధ్య) కూడా ఈ స్కిట్‌లో నటించారు. లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ అతిథి పాత్రలో కనిపించారు. ఆయన కొంత మొత్తాన్ని హుండీలో వేశారు. ఎఐసిసి అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, ప్రియాంక గాంధీ కూడా తమ వంతుగా విరాళాలు ఇచ్చారు. అలా పలువురు ఎంపిలు ఇచ్చిన విరాళాలతో ఆ సన్యాసి ఉడాయిస్తాడు. అది గమనించిన ఎంపిలు అతడిని పట్టుకొన్ని దేహశుద్ధి చేసినట్లు నటిస్తారు. అక్కడితో స్కిట్ ముగుస్తుంది. 'అమిత్ షా సదన్ సే గాయబ్ క్యూ?' అని రాసి ఉన్న ఒక పెద్ద బ్యానర్ వెనుక నిలబడి, ప్రియాంక గాంధీ వాద్రా, సమాజ్‌వాదీ పార్టీకి చెందిన అవధేష్ ప్రసాద్, ధర్మేంద్ర యాదవ్, జార్ఖండ్ ముక్తి మోర్చాకు చెందిన మహువా మాఝీ తదితరులు ఈ నిరసనలో పాల్గొన్నారు. నీట్ పేపర్ లీక్‌పై విద్యార్థులు జరిపిన నిరసనల సందర్భంగా, విరాళాల దొంగతనం, విద్యార్థులపై క్రూరమైన బలప్రయోగం వంటి ఆరోపణలపై ప్రభుత్వాన్ని నిలదీస్తామని ఇండియా కూటమి పేర్కొంది. ఇదిలా ఉండగా, విన్నూత్ స్కిట్‌పై సమాజ్‌వాదీ పార్టీ ఎంపి ధర్మేంద్ర యాదవ్ మాట్లాడుతూ..' ఎన్‌డిఎ ప్రభుత్వ హయాంలో ప్రతిష్మాత్మకంగా నిర్మించిన అయోధ్య రామాలయంలో విరాళాల చోరీ జరిగింది. దీనిపై చర్చ చేపట్టాలని విపక్షాలు డిమాండ్ చేస్తూనే ఉన్నాయి. ఇన్నాళ్లూ నీట్ పేపర్ లీక్ అంశంపై ఉభయసభల్లోనూ ఆందోళనలు రేగడంతో ఈ విషయం చర్చకు రాలేదు. దీనిపై చర్చ చేపట్టాలని నేను కూడా పార్లమెంట్ ప్రారంభమైన రోజు నుంచి నోటీసులు ఇస్తూనే ఉన్నాను. కానీ, ప్రభుత్వం నుంచి స్పందన లేదు. అందుకే, పప్పు యాదవ్ ఆలోచనతో ఈ స్కిట్ చేశాం' అని అన్నారు. లోక్‌సభలో పప్పు యాదవ్ కాషాయ వస్త్రధారణ అందరి దృష్టిని ఆకర్షించింది. దీనిపై స్పీకర్ ఓం బిర్లా ఒకింత అసహనం వ్యక్తం చేశారు. సభకు ఇలా రావడం సరికాదన్నారు.

## ప్రతిష్టంభన

(మొదటి పేజీ తరువాయి)

సభ ముందు ఉంచినప్పుడు, ప్రతిపక్ష నాయకుడు మల్లికార్జున్ ఖర్గేను మాట్లాడటానికి అనుమతించాలని డిమాండ్ చేస్తూ పలువురు ప్రతిపక్ష సభ్యులు లేచి నిలబడ్డారు. అయితే ప్రతిపక్షం ఇంకా ఎమర్జెన్సీ మోడ్‌లోనే ఉందని చైర్మన్ సి.పి. రాధాకృష్ణన్ విమర్శించారు. 'మీరు ఈ రోజు వరకు ఎమర్జెన్సీ మోడ్‌లోనే ఉన్నారు. అందరూ వినాలని మీరు కోరుకుంటారు, కానీ మీరు ఎవరి మాట వినరు. ఇది నియంతృత్వం. మీరు ప్రజాస్వామ్య విలువలకు విలువ ఇవ్వాలనుకోవడం లేదు' అని చైర్మన్ అన్నారు. తరువాత చైర్మన్ సి.పి. రాధాకృష్ణన్ ఖర్గేను మాట్లాడటానికి అనుమతించారు, కానీ ప్రతిపక్ష నాయకుడు రూల్ 267 కింద కొన్ని అంశాలను లేవనెత్తడానికి ప్రయత్నించడంతో, ఆ నిబంధన కింద ఎలాంటి నోటీసులను స్వీకరించబోమన్నారు. అయోధ్య రామ మందిరం నిధుల చోరీ, భూసేకరణలో అవకతవకలు జరిగాయన్న ఆరోపణలకు సంబంధించి రూల్ 267 కింద ప్రతిపక్ష నేత నోటీసు ఇచ్చారు. పేపర్ లీక్‌లపై ప్రతిపక్ష ఎంపిలు ప్రభుత్వాన్ని విమర్శిస్తూ నినాదాలు చేశారు. హోం మంత్రి అమిత్ షా సభకు రావాలని కూడా వారు డిమాండ్ చేశారు. అయితే, జీరో అవర్‌తో హోం మంత్రికి ఏం సంబంధం? అని చైర్మన్ అన్నారు. ప్రతిపక్ష సభ్యులు నినాదాలు కొనసాగిస్తుండగా, కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ జోక్యం చేసుకుని చౌకబారు రాజకీయాలకు పాల్పడుతున్నారని, సభ గౌరవంతో ఆడుకుంటున్నారని ఆరోపించారు. జీరో అవర్‌లో సభ్యులు తమ అంశాలను లేవనెత్తడానికి చైర్మన్ అనుమతించినప్పటికీ, రామ మందిరంలో విరాళాల దొంగతనం జరిగిందన్న ఆరోపణలకు వ్యతిరేకంగా సహా ప్రతిపక్షం నినాదాలు కొనసాగించింది. విరాళాలు దొంగిలించే వారి ప్రభుత్వం సాగదు, విరాళాలు దొంగిలించేవారు గద్దె దిగాలి వంటి నినాదాలను ప్రతిపక్ష ఎంపిలు చేశారు. ఆ గందరగోళం మధ్య చైర్మన్ సభను మరుసటి రోజుకు వాయిదా వేశారు.

**లోక్‌సభలో రెండవ వారమూ సాగని ప్రశ్నోత్తరాలు**

నీట్ పేపర్ లీక్, రామ మందిర విరాళాల చోరీ ఆరోపణలపై ప్రతిపక్షాలు చేస్తున్న నినాదాల కారణంగా, లోక్‌సభలో శుక్రవారం ప్రశ్నోత్తరాల సమయం వరుసగా రెండో వారం కూడా పూర్తి కాలేదు. లోక్‌సభలో ప్రశ్నోత్తరాల సమయం ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జరుగుతుంది. ఈ సమయంలో మంత్రులు మౌఖికంగా సమాధానాలు ఇవ్వడానికి 20 వరకు ప్రశ్నలు ఉంటాయి. జూలై 20న వర్షాకాల సమావేశాలు ప్రారంభమైనప్పటి నుంచి, ప్రశ్నోత్తరాల సమయంలో సభ 10 నిమిషాలకు మించి పనిచేయలేకపోతోంది. ప్రశ్నోత్తరాల సమయం సజావుగా సాగేందుకు అనుమతించాలని స్పీకర్ ఓం బిర్లా ప్రతిపక్ష సభ్యులను పదేపదే కోరారు. ఇది ప్రభుత్వాన్ని జవాబుదారీగా నిలబెట్టడానికి ఎంపిలకు సహాయపడుతుందని ఆయన అన్నారు. ప్రతిపక్ష సభ్యులు ముందస్తు ప్రణాళికతో అంతరాయాలు కలిగిస్తున్నారని బిర్లా తరచుగా విచారం వ్యక్తం చేశారు. పేపర్ లీక్ నిరోధక చట్టాన్ని సవరించే బిల్లుపై లోక్‌సభ 10 గంటల పాటు సుదీర్ఘంగా చర్చించినప్పటికీ, సభ్యులు ప్రజా ప్రాముఖ్యత గల విషయాలను లేవనెత్తే ప్రశ్నోత్తరాల సమయాన్ని గానీ, జీరో అవర్‌ను గానీ నిర్వహించలేకపోయింది. గురువారం నాడు, ప్రతిపక్ష సభ్యులు నినాదాలు చేస్తుండగా జరిగిన సంక్షిప్త చర్చ అనంతరం, జాతీయ గేయం వందేమాతరంను అగౌరవపరచడాన్ని శిక్షార్హమైన నేరంగా పరిగణించే బిల్లును కూడా సభ ఆమోదించింది.

# ఫిట్‌నెస్ పాస్.. శ్రీలంక సిరీస్‌కు బుమ్రా

శ్రీలంక పర్యటనకు ముందే భారత జట్టుకు గుడ్ న్యూస్, ఇంగ్లండ్ పర్యటనలో గాయపడిన ప్రధాన పేసర్ జస్ప్రీత్ బుమ్రా తిరిగి జట్టులోకి వచ్చేస్తున్నాడు. గాయం నుంచి కోలుకున్న ఈ యార్కర్ కింగ్ ఫిట్‌నెస్ పరీక్షలో పాసయ్యాడు. దాంతో, త్వరలో లంకతో జరుగబోయే రెండు టెస్టుల సిరీస్‌కు బుమ్రా అందుబాటులో ఉంటాడని విశ్వసనీయ వర్గాలు చెబుతున్నాయి. పొరుగుదేశమైన లంకకు శుభ్మన్ గిల్ సారథ్యంలోని టీమిండియా ఆగస్టులో వెళ్లనుంది. పని ఒత్తిడి కారణంగా తరచూ గాయపడుతున్న జస్ప్రీత్ బుమ్రా ఫిట్‌నెస్ టెస్టులో పాసయ్యాడు. ఇంగ్లండ్‌తో వన్డే సిరీస్ సమయంలో గాయపడిన బుమ్రా.. బెంగళూరులోని బిసిసిఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో కోలుకున్నాడు. ఫిట్‌నెస్ పరీక్షలో పాసైన అతడు శ్రీలంక పర్యటనకు సిద్ధమవుతు



న్నాడని సమాచారం. దాంతో, ఇప్పటికే స్క్వాడ్‌కు ఎంపికైన బుమ్రా సిరీస్‌లో ఆడడం దాదాపు ఖరారైన నేపథ్యంలో భారత జట్టుకు పేస్ బౌలింగ్ కష్టాలకు తెరపడనుంది. ఆగస్టులో శుభ్మన్ సారథ్యంలోని భారత జట్టు లంకకు వెళ్లనుంది. అక్కడ ఆగస్టు 15 వ తేదీన గాలే స్టేడియంలో మొదటి టెస్టు.. ఆపై ఆగస్టు 23న కొలంబోలో రెండో టెస్టులో ఇరుజట్లు తలపడనున్నాయి. ప్రస్తుతం ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ ర్యాంకింగ్స్‌లో 5వ స్థానంలో ఉన్న గిల్ సేన.. ఈ రెండు మ్యాచుల్లో గెలిచినా టాప్2లోకి వచ్చే అవకాశాలు తక్కువే.

**భారత టెస్టు స్క్వాడ్ :** శుభ్మన్ గిల్(కెప్టెన్), కేఎల్ రాహుల్(వైస్ కెప్టెన్), యశస్వీ జైస్వాల్, రిషభ్ పంత్(వికెట్ కీపర్), సాయి సుదర్శన్, ధ్రువ్ జురెల్(వికెట్ కీపర్), రవీంద్ర జడేజా, కుల్దీప్ యాదవ్, మానవ్ సుతార్, సిరాజ్, ప్రసిధ్ కృష్ణ, గుర్నూర్ బ్రార్, దేవ్దత్ పడిక్కల్, సరాన్ష్ జైన్.

# కామన్వెల్త్ క్రీడల్లో భారత పతకాల సంఖ్య 17

### లవ్ప్రీత్ సింగ్‌కు సిల్వర్.. డిస్కస్ త్రోలో సీమకు కాంస్యం

గ్లాస్గో కామన్వెల్త్ గేమ్స్ 8వ రోజు భారత్‌కు రెండు పతకాలు దక్కాయి. భారత వెయిలిఫ్టర్ లవ్ప్రీత్ సింగ్ సిల్వర్ మెడల్ సాధించగా.. డిస్కస్ త్రోయర్ సీమ కాంస్య పతకాన్ని గెలుచుకుంది. దాంతో భారత్ పతకాల సంఖ్య 17కి చేరింది. ఇందులో 3 స్వర్ణాలతో పాటు 10 రజతాలు, 4 కాంస్యాలు ఉన్నాయి.

పురుషుల 110 కేజీల వెయిట్లిఫ్టింగ్‌లో లవ్ప్రీత్ సింగ్ 388 కేజీల బరువు ఎత్తి తృటిలో స్వర్ణాన్ని కోల్పోయాడు. స్నాచ్ విభాగంలో 176 కేజీల బరువు ఎత్తి కామన్‌వెల్త్‌లో నయా రికార్డ్ నమోదు చేశాడు. క్లీన్ అండ్ జర్క్ విభాగంలో 212 కేజీలు ఎత్తాడు. న్యూజిలాండ్‌కు చెందిన డేవిడ్ ఆండ్రూ లిట్టి క్లీన్ అండ్ జర్క్లో 223 కేజీలు సరికొత్త రికార్డుతో మొత్తం 389 కేజీలు ఎత్తి స్వర్ణం సొంతం చేసుకున్నాడు. ఒక్క కేజీ తేడాతో గోల్ మెడల్‌ను సొంతం చేసుకున్నాడు.

లవ్ప్రీత్ సింగ్ రజతంతో భారత వెయిట్ లిఫ్టింగ్ బృందం ఒక స్వర్ణం, 6 రజతాలు, ఒక కాంస్యంతో సహా మొత్తం 8 పతకాలు సాధించింది. మహిళల డిస్కస్ త్రోయర్ విభాగంలో సీమ డిస్కస్ను 58.65 మీటర్ల దూరం విసిరింది. ఈ ఈవెంట్లో జమైకాకు చెందిన సమంత హాల్ 61.66 మీటర్ల దూరం విసిరి స్వర్ణం సాధించింది. కెనడాకు చెందిన జూలియా డంక్స్ 60.67 మీటర్ల త్రో సాయంతో సిల్వర్ గెలుచుకుంది. మరో





భారత ప్లేయర్ నిధిరాణి 57.10 మీటర్లతో నాలుగో స్థానంలో నిలిచి తృటిలో పతకాన్ని కోల్పోయింది. గతంలో బర్మింగ్హామ్ కామన్వెల్త్ గేమ్స్లో కాంస్య పతకం గెలుచుకున్న లవ్ప్రీత్ సింగ్ ఈ సారి సిల్వర్ మెడల్ సాధించాడు. కామన్వెల్త్ గేమ్స్లో 8వ రోజు నాటికి భారత్ మెడల్స్ 9వ స్థానంలో నిలిచింది.

**కామన్వెల్త్ టీటీ చాంప్ భారత్...** ప్రతిష్టాత్మక కామన్వెల్త్ టెన్నిస్ చాంపియన్‌షిప్‌లో భారత్ క్లీన్‌స్వీప్ చేసింది. ఫైనల్లో భారత పురుషుల, మహిళల జట్లు మలేషియాను ఓడించి టైటిల్ నెగ్గాయి. టైటిల్ పోరులో మెన్స్ టీమ్ 3–2తో నెగ్గగా అమ్మాయిల జట్టు 3–0తో మలేషియాపై ఏకపక్ష విజయం సాధించి చాంపియన్‌గా నిలిచింది.



# సైన్స్

## సొంత గ్రహాన్నే మింగేసిన నక్షత్రం!

సూర్యుడిని పోలిన ఒక నక్షత్రం తన చుట్టూ పరిభ్రమిస్తున్న గ్రహాన్ని పూర్తిగా మింగేసిన అరుదైన సంఘటనకు శాస్త్రవేత్తలు స్పష్టమైన ఆధారాలను గుర్తించారు. ఈ ఘటన తర్వాత ఆ నక్షత్రంలో అసాధారణంగా అధిక స్థాయిలో 'లిథియం' మూలకం కనిపించడంతో, గ్రహాన్ని మింగిన 'రసాయనిక ఆనవాలు'గా దానిని పరిశోధకులు భావిస్తున్నారు. సాధారణంగా సూర్యుడి వంటి నక్షత్రాల్లో లిథియం క్రమంగా నశిస్తూ ఉంటుంది. అయితే ఈ నక్షత్రంలో ఒక్కసారిగా లిథియం పరిమాణం పెరగడం, ఒక గ్రహం నక్షత్రంలో కలిసిపోయిన తర్వాత దాని పదార్థం నక్షత్రంలో మిళితమైందనే సంకేతంగా శాస్త్రవేత్తలు విశ్లేషిస్తున్నారు. ఇలాంటి సంఘటనలు నక్షత్రాలు, గ్రహాల పరిణామ క్రమాన్ని అర్థం చేసుకోవడంలో ఎంతో కీలకమని పరిశోధకులు చెబుతున్నారు. ఒక నక్షత్రం వయసు పెరిగే కొద్దీ దాని పరిమాణం విస్తరించి, సమీపంలో ఉన్న గ్రహాలను తనలోకి లాగుకునే అవకాశం ఉంటుందని ఇప్పటికే భావిస్తున్నారు. తాజా పరిశోధన ఆ సిద్ధాంతానికి మరింత బలమైన ఆధారాలను అందించింది. ఈ ఆవిష్కరణ ద్వారా గ్రహ వ్యవస్థల జీవన చక్రం, నక్షత్రాల పరిణామం, భవిష్యత్తులో సౌర కుటుంబాల గమ్యం వంటి అంశాలపై మరింత లోతైన అవగాహన పొందే అవకాశం ఉందని శాస్త్రవేత్తలు పేర్కొంటున్నారు.




## మళ్లీ మేల్కొన్న 'హొరైజన్స్'

అమెరికా అంతరిక్ష పరిశోధనా సంస్థ నాసాకు చెందిన న్యూ హొరైజన్స్ అంతరిక్ష నౌక భూమికి దాదాపు 6 బిలియన్ మైళ్లు (సుమారు 9.7 బిలియన్ కిలోమీటర్లు) దూరంలో ఉండి, 321 రోజుల హైబర్నేషన్ (నిద్రావస్థ) తర్వాత మళ్లీ విజయవంతంగా పనిచేయడం ప్రారంభించింది. హైబర్నేషన్ అంటే విద్యుత్‌ను ఆదా చేయడానికి అవసరం లేని పరికరాలను తాత్కాలికంగా నిలిపివేసే విధానం. ఈ నౌక 2026 జూన్ 23న మేల్కొని, తన వ్యవస్థలన్నీ సక్రమంగా పనిచేస్తున్నాయని భూమికి రేడియో సంకేతం పంపింది. అంత దూరం నుంచి పంపిన ఆ సంకేతం భూమికి చేరడానికి 8 గంటల 52 నిమిషాలు పట్టింది. ఈ సంకేతాన్ని నాసా డీప్ స్పేస్ నెట్‌వర్క్ ద్వారా స్వీకరించింది. న్యూ హొరైజన్స్ 2015లో ప్లూటో గ్రహాన్ని అత్యంత సమీపంగా చేరుకొని, ఆ మరుగుజ్జు గ్రహానికి సంబంధించిన తొలి స్పష్టమైన చిత్రాలు, విలువైన శాస్త్రీయ సమాచారాన్ని ప్రపంచానికి అందించింది. అనంతరం 2019లో కైపర్ బెల్ట్‌లోని ఆరోకోత్ అనే ఖగోళ వస్తువును సమీపం నుంచి పరిశీలించి మరో చరిత్ర సృష్టించింది. నిద్రావస్థలో ఉన్నప్పటికీ, నౌకలోని ప్లాస్మా సెన్సార్, డస్ట్ డిటెక్టర్ వంటి కీలక పరికరాలు పనిచేస్తూనే ఉన్నాయి. వీటి ద్వారా కైపర్ బెల్ట్‌లోని ధూళి కణాలు, అంతరిక్ష వాతావరణానికి సంబంధించిన కీలక సమాచారాన్ని సేకరించాయి. ఇప్పుడు మళ్లీ చురుకుగా మారిన ఈ అంతరిక్ష నౌక ఇప్పటివరకు సేకరించిన సమాచారాన్ని భూమికి పంపడంతో పాటు, తన పరికరాల పనితీరును పరీక్షించి, సూర్యుని ప్రభావం విస్తరించిన బయటి హీలియోస్ఫియర్ ప్రాంతంపై కొత్త పరిశోధనలు ప్రారంభించనుంది. ప్రస్తుతం కైపర్ బెల్ట్‌లో క్రియాశీలంగా శాస్త్రీయ పరిశోధనలు కొనసాగిస్తున్న ఏకైక అంతరిక్ష నౌక న్యూ హొరైజన్స్ మాత్రమే. సౌర కుటుంబం అంచుల్లో దాగి ఉన్న ఎన్నో రహస్యాలను వెలికితీయడంలో ఇది శాస్త్రవేత్తలకు అమూల్యమైన సమాచారాన్ని అందిస్తోంది.



## గాజులా కనిపించే సోలార్ కిటికీలు

ఇంటి కిటికీలు సాధారణ గాజులా కనిపిస్తూనే, అదే సమయంలో సూర్యకాంతి నుంచి విద్యుత్‌ను ఉత్పత్తి చేస్తే ఎలా ఉంటుంది? ఇదే పారదర్శక లేదా 'అదృశ్య' సౌర కిటికీల వెనుక ఉన్న వినూత్న సాంకేతికత. ఈ కిటికీలు మనకళ్లకు కనిపించే కాంతిని యథావిధిగా లోపలికి అనుమతిస్తూనే, సూర్యకాంతిలోని అతినీలలోహిత, పరారుణ కిరణాలను గ్రహించి వాటిలోని శక్తిని విద్యుత్‌గా మారుస్తాయి. సాంప్రదాయ సౌర ఫలకాలతో పోలిస్తే ఇవి పారదర్శక ఫొటోవోల్టాయిక్ పదార్థాలతో తయారవుతాయి. ప్రస్తుతం ఇవి సాధారణ సోలార్ ప్యానెల్‌లంత విద్యుత్ ఉత్పత్తి చేయలేకపోయినా, భవనాల గాజు ఉపరితలాలనే విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలుగా మార్చగల సామర్థ్యమే వాటి ప్రధాన ప్రయోజనం. కార్యాలయాలు, అపార్ట్‌మెంట్లలో విస్తారంగా ఉన్న గాజు కిటికీలను ఈ సాంకేతికతతో వినియోగిస్తే, భవనాలు తమవిద్యుత్ అవసరాల్లో గణనీయమైన భాగాన్ని స్వయంగా ఉత్పత్తి చేసుకునే అవకాశం ఉంటుంది. పరిశోధకుల అభిప్రాయం ప్రకారం, ఈ సాంకేతికత భవిష్యత్తులో శక్తి సామర్థ్యం ఎక్కువగా ఉండే పర్యావరణహిత భవనాల నిర్మాణానికి కీలకంగా మారవచ్చు. అప్పుడు కిటికీలు కేవలం వెలుతురును లోపలికి అనుమతించే గాజుపలకలు మాత్రమే కాకుండా, రోజంతా నిశ్శబ్దంగా విద్యుత్‌ను ఉత్పత్తి చేసే శక్తి



కేంద్రాలుగా పనిచేస్తాయి. దీనివల్ల కార్బన్ ఉద్గారాలు తగ్గుతాయి. అయితే, ఈ సాంకేతికత ఇంకా పరిశోధన, అభివృద్ధి దశలోనే ఉంది. వాణిజ్యపరంగా విస్తృతంగా అందుబాటులోకి రావడానికి మరికొంత సమయం పట్టే అవకాశం ఉన్నప్పటికీ, భవిష్యత్తులో సౌరశక్తి వినియోగంలో ఇది ఒక కీలక మార్పుకు శ్రీకారం చుడుతుందని శాస్త్రవేత్తలు భావిస్తున్నారు.

# కేంద్రప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలపై సమరశంఖం పూరించాలి

### సామాన్యుల నడ్డి విరుస్తున్న ధరలు
### జెన్ జి ఉద్యమం ఓ మైలురాయి
### 6 నుంచి ప్రజాచైతన్య యాత్రలు
### సెప్టెంబర్ 1న ఛలో ఢిల్లీ
### సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని

**ప్రజాపక్షం/భద్రాద్రికొత్తగూడెం :** కేంద్ర ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలపై రాజీలేని పోరాటాలు నిర్వహించేందుకు పార్టీ శ్రేణులు సిద్ధం కావాలని సిపిఐ రాష్ట్రకార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు పిలుపునిచ్చారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యవర్గ సభ్యులు, మండల, పట్టణ కార్యదర్శులు, ప్రజాసంఘాల జిల్లా బాధ్యుల సమావేశం శుక్రవారం పాల్వంచలోని సిపిఐ కార్యాలయం సిఆర్ భవన్‌లో జరిగింది. సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరై కూనంనేని మాట్లాడుతూ కేంద్ర పాలకులు అనుసరిస్తున్న విధానాల వల్ల సామాన్య ప్రజలు, కార్మికులు, రైతులు తీవ్రఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. నిత్యావసరాల ధరలను అరికట్టడంలో కేంద్రం విఫలమైందన్నారు. జంతర్ మంతర్ వద్ద యువత చేపట్టిన పోరాటం చారిత్రాత్మకమైనదని, నిర్బంధాలకు బెదరకుండా ప్రజాస్వామ్యబద్ధంగా పోరాడి తమ




డిమాండ్లను సాధించుకున్న యువత పట్టుదలను ఆయన కొనియాడారు. దేశయువత పోరాటానికి కేంద్రప్రభుత్వం దిగిరాక తప్పలేదని, జెన్ జి ఉద్యమం చరిత్రలో ఒకమైలురాయి కూనంనేని అన్నారు. కేంద్రం అవలంభిస్తున్న విధానాలపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు, వారిని చైతన్య పరిచేందుకు రాష్ట్రవ్యాప్తంగా ఆగస్టు 6 నుండి 14 వరకు ప్రజా చైతన్యయాత్రలు, సెప్టెంబర్ 1న ఛలో ఢిల్లీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కూనంనేని తెలిపారు. సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె.సాబీర్‌పాషా మాట్లాడుతూ సీతారామ, సీతమ్మదార ప్రాజెక్టుల ద్వారా రైతాంగానికి సాగు జలాలు అందించాలని, పాల్వంచ కేంద్రంలో 800మెగావాట్ల విద్యుత్ కేంద్రాలను నిర్మించాలని డిమాండ్ చేశారు. జిల్లాలో జరిగే సిపిఐ ప్రజాచైతన్య యాత్రలో పార్టీశ్రేణులు పాల్గొనాలని కోరారు. కంచర్ల జమలయ్య అధ్యక్షతన జరిగిన సమావేశంలో ముత్యాల విశ్వనాథం, మేయర్ మూడ్ గణేష్, నరాటి ప్రసాద్‌రెడ్డి, పుల్లారెడ్డి, ఎస్‌డి. సలీమ్, సలిగంటి శ్రీనివాస్, చంద్ర నరేంద్ర, మున్నా లక్ష్మీ కుమారి, అడుసుమిల్లి సాయిబాబా, వీశంశెట్టి పూర్ణచంద్రరావు, రేసు ఎల్లయ్య, వాసిరెడ్డి మురళీ, ఉప్పుశెట్టి రాహుల్, కందుల భాస్కర్, దేవరకొండ శంకర్, ఎస్‌కె. ఫహీమ్, మువ్వ వెంకటేశ్వర్లుతో పార్టీ ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

# ఒసి డిప్ సైడ్ బ్లాక్ సింగరేణికి అప్పగించాలి

### ఎఐటియుసి డిమాండ్
### మణుగూరులో ఆందోళన, రాస్తారోకో

**ప్రజాపక్షం/మణుగూరు :** డిప్ సైడ్ బ్లాక్ సింగరేణి కేటాయించకపోతే పెద్దఎత్తున ఆందోళన నిర్వహిస్తామని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఎఐటియుసి) రాష్ట్ర అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య, కార్యదర్శి కొరిమి రాజకుమార్, అదనపు డిప్యూటీ జనరల్ సెక్రటరీ మిర్యాల రంగయ్య హెచ్చరించారు. శుక్రవారం మణుగూరు ప్రధాన రహదారి సిపిఐ కార్యాలయం ఎదుట సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్(ఎఐటియుసి), సిపిఐ నాయకులు పెద్దఎత్తున జెండాలు చేత పట్టుకొని 'సేవ్ మణుగూరు', ఒసి టు డిప్ సైడ్ బ్లాక్ సింగరేణి కేటాయించాలంటూ పెద్ద ఎత్తున ప్రధాన రహదారిపై ఆందోళన నిర్వహించారు. ధర్నాతో భారీగా ట్రాఫిక్ స్తంభించడంతో మణుగూరు సిఐ నాగబాబు, ఎస్ఐ పోలీసులు రాస్తారోకో జరిగే ప్రాంతానికి వచ్చి బలవంతంగా నాయకులను తరలించారు. దీంతో పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ సిపిఐ కార్యాలయం నుండి అంబేద్కర్ సెంటర్ వరకు పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు వాసిరెడ్డి సీతారామయ్య, కొరిమి రాజకుమార్, డిప్యూటీ జనరల్ సెక్రెటరీ మిరియాల రంగయ్య మాట్లాడుతూ ఒసి టు డిప్ సైడ్ బ్లాక్ ను సింగరేణి కాకుండా జెన్‌కోకు అప్ప చెప్పాలని ప్రభుత్వం




చూస్తుందని ఆరోపించారు. దీనివలన సింగరేణి కార్మికులు పూర్తిస్థాయిలో నష్టపోయే ప్రమాదం ఉందని, సింగరేణి కేటాయిస్తే సింగరేణి ద్వారా జెన్‌కోకు బొగ్గు సరఫరా చేసుకోవచ్చని, దీనివలన కార్మికులకు ఉపయోగకరంగా ఉంటుందన్నారు. ఈ ప్రాంతంలో డిసైడ్ బ్లాక్ సింగరేణి కేటాయిస్తే సింగరేణి పది సంవత్సరాల మనుగడ కొనసాగుతుందన్నారు. దీని వలన ప్రత్యక్షంగా, పరోక్షంగా ఈ ప్రాంతంలో సింగరేణి కార్మికులతో పాటు కాంట్రాక్టు కార్మికులు, లారీ ఓనర్స్, లారీ డ్రైవర్స్, గుమస్తాలు, బొగ్గు ముఠా కార్మికులు, ఇలా ప్రత్యక్షంగా పరోక్షంగా సుమారు పదివేల కుటుంబాలు ఉపాధి దొరుకుతుందన్నారు. కమిషన్లకు కక్కుర్తి పడి సింగరేణి బ్లాకులను ప్రైవేటుపరం చేయాలని చూస్తున్నారని ఆరోపించారు. రాష్ట్రానికి కొంగు బంగారమైన సింగరేణి బ్లాకులను ప్రైవేటుపరం కాకుండా ముఖ్యమంత్రి దృష్టి సారించాలని కోరారు. కార్యక్రమంలో సింగరేణి కాలనీ వర్కర్స్ యూనియన్ బ్రాంచ్ కార్యదర్శి వై.రామ్‌గోపాల్, సిపిఐ పట్టణ కార్యదర్శి దుర్గ్యాల సుధాకర్, మండల కార్యదర్శి జక్కుల రాజబాబు, నాయకులు జంగం మోహన్‌రావు, ఎడారి రమేష్, సోందే కుటుంబరావు, సింగరేణి నాయకులు రామనరసయ్య, మేకల ఈశ్వర్, అదెర్ల సురేందర్, ఇమాముద్దీన్, శనిగరపు కుమారస్వామి, ఆవుల నాగరాజు, సాయి, కిషోర్ బాబు, యాకూబ్ శివయ్య, సందీప్, కందిమల్ల రామయ్య, గడ్డం వెంకటేశ్వర్లు, తోట రమేష్, చింతల దశరథం, వేర్పుల నరేష్, ఎస్‌కె.సర్వర్, ఎస్‌డి.ఓమర్, సర్పంచ్ చీదం ఉషారాణి, ఉపసర్పంచ్ పులిగల రమేష్, బోలగాని సమ్మక్క, తేనేటి నారాయణ, కొత్తపల్లి సీతారాములు, వార్డుమెంబర్ వజ్రా వెంకటేశ్వర్లు, ఆధార్ల రాములు, కోటి, యాకూబ్, వీరమల్లుతో పాటు యూనియన్‌నాయకులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

# ప్రజలను చైతన్యపరిచే లక్ష్యంతో పాదయాత్ర

### సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు ఎం.బాల నరసింహ్మా

**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్:** ప్రజా సమస్యలను గ్రామాల స్థాయిలో తెలుసుకుని వాటి పరిష్కారం కోసం ప్రజలను చైతన్యపరిచే లక్ష్యంతో ఆగస్టు 6 నుండి 14 వరకు నాగర్‌కర్నూల్ నియోజకవర్గ వ్యాప్తంగా పాదయాత్రలు నిర్వహించనున్నట్లు సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు ఎం.బాలనరసింహ్మ తెలిపారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని లక్ష్మీ నాచారి భవన్‌లో సిపిఐ నియోజకవర్గస్థాయి కార్యకర్తల సమావేశం పి.కృష్ణాజీ అధ్యక్షతన నిర్వహించారు. సమావేశానికి ముఖ్య అతిథిగా బాల నరసింహ్మ హాజరై మాట్లాడుతూ ప్రజా సమస్యలను గ్రామాల స్థాయిలో తెలుసుకుని వాటి పరిష్కారం కోసం ప్రజలను చైతన్యపరిచే లక్ష్యంతో పాదయాత్రలు చేపడుతున్నట్లు తెలిపారు. నీట్ పేపర్ లీకేజీపై ఉద్యమం చేసిన విద్యార్థులు, యువతపై చేసిన వ్యాఖ్యల నేపథ్యంలో బిజెపి ఎంపి కంగనా రనౌత్ పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రామ మందిర నిధుల వ్యవహారంపై కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. కేంద్ర ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని విమర్శించారు. సిపిఐ



జిల్లా కార్యదర్శి ఎస్ఎండి ఫయాజ్ మాట్లాడుతూ కేంద్రప్రభుత్వ వైఫల్యాలలతో పాటు రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల సమయంలో ప్రకటించిన ఆరు గ్యారెంటీలలో చాలాహామీలు ఇంకా అమలు కాలేదన్నారు. ఈఅంశాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ గ్రామాల్లో పాదయాత్రలు నిర్వహిస్తామని తెలిపారు. గ్రామాల్లో తాగునీరు, ఉపాధి, విద్య, వైద్యం, సంక్షేమ పథకాల అమలుపై ప్రజల సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారం కోసం ఉద్యమాలు కొనసాగిస్తామన్నారు. పాదయాత్రల ద్వారా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజావ్యతిరేక విధానాలను ఎండగడతామని, ప్రజలను సంఘటితం చేసి సమస్యల పరిష్కారం కోసం పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని తెలిపారు. సమావేశంలో సిపిఐ రాష్ట్ర కంట్రోల్ కమిషనర్ సభ్యులు హెచ్ ఆనంద్‌జీ, సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు వార్ల వెంకటయ్య, కే.కేశవులుగౌడ్, సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు మర్యాద వెంకటయ్య, మారేడు శివ శంకర్, సూర్య శంకర్ గౌడ్, దాసరి బాలమురళీకృష్ణ, తెలకపల్లి మండల కార్యదర్శి వి.రవీందర్, తాడూరు మండల కార్యదర్శి ఎండి, కుతుబుద్దీన్, మండల సహాయ కార్యదర్శి ఈర్ల భూపేష్, మధుగౌడ్, మండ లనాయకులు ఉషమ్మ, సాయిలు, గొర్ల సత్యం, చిన్నపాగ శ్రీనివాసులు, చెన్నయ్య, బుగ్గ స్వామి, కొత్త రామస్వామి, తదితరులు పాల్గొన్నారు.

# బిజెపి ప్రభుత్వానిది నియంతృత్వ పాలన

### సిపిఐ తెలంగాణ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఇటి.నర్సింహ్మా

**ప్రజాపక్షం/సంగారెడ్డి :** కేంద్రంలో బిజెపి ప్రభుత్వం నియంతృత్వ పాలన చేస్తుందని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యాదర్శి ఇటి.నర్సింహ్మా ఆరోపించారు. ప్రశ్నించిన వారిపై అన్ని రకాల దాడులు చేస్తున్నారన్నారు. సిపిఐ జిల్లా కౌన్సిల్ సమావేశం సంగారెడ్డి జిల్లా కార్యాలయంలో జిల్లా సహాయ కార్యదర్శి ఎస్.ఆనంద్ అధ్యక్షతన శుక్రవారం జరిగింది. సమావేశానిక ముఖ్య అతిథి ఇటి.నర్సింహ్మా హాజరై మాట్లాడుతూ బిజెపి అధికారంలోకి రాకముందు నరేంద్ర మోదీ సంవత్సరానికి 2 కోట్ల ఉద్యోగాలు, విదేశాల్లో మగ్గుతున్న నల్లధనాన్ని వెనక్కి తెచ్చి జనధన్ ఖాతాలో రూ.15 లక్షలు వేస్తానని, పెట్రోల్, డిజిల్, గ్యాస్ నిత్యావసర వస్తువుల ధరలు తగిస్తానని, ప్రజా శ్రేయస్సు కొరకు పనిచేస్తానని పలు రకాల హామీలిచ్చి, అధికారం చేపట్టాక ఇచ్చిన హామీలను అమలు చేయకుండా, దేశ సంపదను తన మిత్రులైన ఆదాని, అంబానీలకు దోచి పెడ్తున్నారని ఆరోపించారు. ప్రజల శ్రేయస్సు కొరకు పని చేయకుండా కార్పొరేట్ల ఆదాయం పెంచేందుకు మోదీ




పనిచేస్తున్నారని విమర్శించారు. దేశ నడిబొడ్డున తమ హక్కుల కొరకు పోరాడిన విద్యార్థులపై పోలీసు, ఆర్ఎస్ఎస్ గుండాలతో దాడులు చేయించారని, మహిళలపై కూడా లాఠీచార్జీ చేయించారన్నారు. ఈ దాడులు బిజెపి ప్రభుత్వ నియంతృత్వానికి నిదర్శనమన్నారు. లాఠీచార్జికి పూర్తి బాధ్యత ప్రధాని నరేంద్రమోదీ, బిజెపి ఎంపి కంగానారనౌత్ తమ హక్కుల సాధనకు పోరాటం చేసిన జెన్‌జీ యువతపై నోరు పారేసుకోవడం సిగ్గుచేటన్నారు. మోదీ ప్రభుత్వం దేశంలో నిత్యావసర, చమురు, ధరలను పెంచుతూ పేద, మధ్య, సామాన్య తరగతి ప్రజల నడ్డి విరుస్తుందన్నారు. బిజెపి ప్రభుత్వం దేశంలో మీడియాను, పత్రికలను, చివరికి సిబిఐ, కోర్టులను కూడా తమ ఆధీనంలో ఉంచుకొని దేశాన్ని తమ ఇష్టానుసారంగా ఏలుతూ రాజ్యాంగాని నిర్వీర్యం చేస్తూ భవిష్యతు లేకుండా చేస్తున్నారన్నారు. ఈ విధానాలను నిరసిస్తూ ప్రజలను చైతన్యం చేయాల్సిన సమయం ఆసన్నమయిందని, రాష్ట్రవ్యాప్తంగా ఆగస్టు 6 నుండి 14 వరకు ప్రజా చైతన్యయాత్రలు నిర్వహిస్తున్నట్లు ఇటి.నర్సింహా తెలిపారు. సమావేశంలో సిపిఐ జిల్లా కార్యదర్శి సయ్యద్ జలాలుద్దీన్, జిల్లా సహాయ కార్యదర్శి ఎం.ఎ.రహెమాన్, నాయకులు నర్సింలు, అజహార్, దత్తురెడ్డి, అశోక్, సతీష్, లక్ష్మి, రూబినా, సయ్యద్, సమద్ తదితరులు పాల్గొన్నారు.



## ఆగస్టు 15లోపు 'కురుమ కార్పొరేషన్' ఏర్పాటు

హామీ ఇచ్చిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

సిఎంను కలిసిన ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య, మాజీ ఎమ్మెల్సీ ఎగ్గే మల్లేశం

**ప్రజాపక్షం/యాదాద్రి :** తెలంగాణ రాష్ట్రంలో కురుమ సామాజిక వర్గం ఎన్నో సంవత్సరాలుగా ఎదురుచూస్తున్న 'కురుమ కార్పొరేషన్' ఏర్పాటుకు మార్గం సుగమమైంది. ఆగస్టు 15వ తేదీలోపు రాష్ట్రంలో కురుమ కార్పొరేషన్ను ఏర్పాటు చేస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టమైన హామీ ఇచ్చారని రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య వెల్లడించారు. శుక్రవారం కురుమ సంఘం రాష్ట్ర చైర్మన్, మాజీ ఎమ్మెల్సీ ఎగ్గే మల్లేశంతో కలిసి ఐలయ్య హైదరాబాద్లో ముఖ్యమంత్రిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సీఎంను శాలువాతో ఘనంగా సత్కరించారు. అనంతరం కురుమ సామాజిక వర్గానికి సంబంధించిన పలు కీలక అంశాలపై సీఎంతో వారు సుదీర్ఘంగా చర్చించారు. ప్రధానంగా కురుమల అభివృద్ధి కోసం ప్రత్యేక కార్పొరేషన్ ఆవశ్యకతను సీఎం దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై సానుకూలంగా స్పందించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి.. వచ్చే ఆగస్టు 15వ తేదీలోపు కురుమ కార్పొరేషన్ను ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చినట్లు ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య మీడియాకు వెల్లడించారు. కార్పొరేషన్ ఏర్పాటుపై ముఖ్యమంత్రి ఇచ్చిన హామీ పట్ల కురుమ సమాజంలో సర్వత్రా హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయని నేతలు పేర్కొన్నారు. ఎన్నో ఏళ్ల తమ ఆకాంక్ష నెరవేరబోతుండటం పట్ల కురుమ కులస్తుల పక్షాన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి బీర్ల అయిలయ్య, ఎగ్గే మల్లేశం ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## విద్యార్థులకు నాణ్యమైన విద్య, పోషకాహారం

మిర్యాలగూడ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** పట్టణంలోని సాంఘిక సంక్షేమ ఎస్సీ బాలుర గురుకుల పాఠశాలను మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి శుక్రవారం ఆకస్మికంగా సందర్శించారు. ఎంఈఓ, పాఠశాల స్పెషల్ ఆఫీసర్ తో కలిసి పాఠశాలలోని విద్యా బోధన, మౌలిక వసతులు, పరిశుభ్రత, విద్యార్థులకు అందిస్తున్న సౌకర్యాలను పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో వారి విద్యాభ్యాసం, ఎదురవుతున్న సమస్యలు, ఆహార నాణ్యత, ఫుడ్ మెనూ తదితర అంశాలపై అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేసి ఆహార నాణ్యతను పరిశీలించారు.ఈ సందర్భంగా పాఠశాల యాజమాన్యానికి పలు సూచనలు చేస్తూ, విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రభుత్వం నిర్దేశించిన ప్రమాణాలకు అనుగుణంగా నాణ్యమైన, పోషకాహారంతో కూడిన భోజనాన్ని ప్రతి రోజూ అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## గంజాయి గుట్టురట్టు

దుర్గాపురం స్టేజీ వద్ద ఇద్దరు అరెస్ట్, మరో నిందితుడు పరారీ

2కిలోల గంజాయి, పల్సర్‌బైక్, సెల్‌ఫోన్ స్వాధీనం



**ప్రజాపక్షం/కోదాడ:** మత్తు పదార్థాల అక్రమరవాణ, విక్రయాలపై కోదాడ పోలీసులు మరోసారి ఉక్కుపాదం మోపారు. పట్టణ శివారులోని దుర్గాపురం స్టేజీ వద్ద గంజాయి విక్రయాలకు పాల్పడుతున్న ఇద్దరు వ్యక్తులను పోలీసులు అదుపులోకి తీసుకోగా, మరో నిందితుడు పరారీలో ఉన్నారు. నిందితుల వద్ద రెండు కిలోల గంజాయి, పల్సర్ బైక్‌ను, ఒక సెల్‌ఫోన్ స్వాదీనం చేసుకున్నట్లు కోదాడ డిఎస్‌పి శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను శుక్రవారం కోదాడ పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన వెల్లడించారు. విశ్వసనీయ సమాచారం మేరకు పోలీసులు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి దుర్గాపురం స్టేజీ వద్ద తనిఖీలు నిర్వహించగా గంజాయి విక్రయిస్తున్న ఇద్దరిని రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నట్లు చెప్పారు. ఈ ఘటనలో మరో వ్యక్తి పరారిలో ఉండగా అతడిని పట్టుకునేందుకు ప్రత్యేక బృందాలు గాలింపు చర్యలుచేపట్టినట్లు వివరించారు. ఈ గంజాయి కేసును చాకచక్యంగా పట్టుకున్న పట్టణ సిఐశివశంకర్, ఎస్ఐ అజయ్‌కుమార్, క్రైమ్ పార్టీ సిబ్బంది లోకేష్, నవీన్, శివ లను అభినందించారు.

## నేడు ఎఐటియుసి జిల్లా మహాసభలు




**ప్రజాపక్షం/సూర్యాపేటటౌన్:** ఎఐటియుసి సూర్యాపేట జిల్లా మూడో మహాసభల ఏర్పాట్లను ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల శ్రీనివాసరావు పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ జిల్లా మహాసభలకు ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్. బాలరాజు, సిపిఐ ఎమ్మెల్సీ, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నెల్లికంటి సత్యం, ఎఐటియుసి రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి ఎం. నర్సింహా, సిపిఐ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు పాల్గొంటారని ఆయన తెలిపారు. జిల్లా నుంచి అధిక సంఖ్యలో కార్మికులు హాజరుకావాలని పిలుపునిచ్చారు. ఈ ఏర్పాట్లలో ఎఐటియుసి గౌరవ సలహాదారులు చామల అశోక్‌కుమార్, సిపిఐ పట్టణ కార్యదర్శి బూర వెంకటేశ్వర్లు, రాజారాం, సాయిబాబా, శ్రీకాంత్, సైదులు పాల్గొన్నారు.

## నూతన ఎస్ఐకి సన్మానం

**ప్రజాపక్షం/అనంతగిరి:** మండల నూతన ఎస్ఐగా బాధ్యతలు స్వీకరించిన ఏడుకొండలని అనంతగిరి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ముస్కు శ్రీనివాసరెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. నూతన ఎస్ఐ ఏడుకొండలు నాయకత్వంలో స్థానిక పోలీస్ శాఖ, ప్రజాప్రతినిధులు ప్రజలను సమన్వయంతో అనంతగిరి మండలంలో శాంతిభద్రతల మరింత బలోపేతం కావాలన్నారు. కొండపల్లి వాసు, బుర్ర పుల్లారెడ్డి, బుర్ర నర్సింహారెడ్డి, ముత్తినేని కోటేశ్వరరావు, ముస్కు మధుసూదన్‌రెడ్డి పాల్గొన్నారు.

### యువత, నిరుద్యోగుల జీవితాలతో

# కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చెలగాటం

ఖాళీల భర్తీ, ఉద్యోగాల కోసం యువత సంఘటితం కావాలి : ఎఐవైఎఫ్




**ప్రజాపక్షం/డిండి:** నిరుద్యోగ యువత జీవితాలతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చెలగాటమాడుతున్నాయని, దేశ వ్యాప్తంగా ఉన్న ఉద్యోగ ఖాళీల భర్తీకి, ఉద్యోగ హక్కుల కోసం యువత సంఘటితం కావాలని అఖిల భారత యువజన సమాఖ్య తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కల్లూరు ధర్మేంద్ర అన్నారు. శుక్రవారం ఏఐవైఎఫ్ డిండి మండల 15వ మహాసభ స్థానిక యెలకుర్తి జైపాల్ గార్డెన్‌లో ఏఐవైఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు ఎనమల్ల నవీన్ అధ్యక్షతన జరిగింది. మహాసభ ప్రారంభానికి ముందు ఏఐవైఎఫ్ జెండాను జిల్లా కార్యదర్శి తీర్పారి వెంకటేశ్వర్లు ఎగరవేశారు. అనంతరం జరిగిన మహాసభలో ఏఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధర్మేంద్ర మాట్లాడుతూ దేశంలో నిరుద్యోగం రోజురోజుకూ పెరుగుతున్నా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు శాశ్వత ఉద్యగోల భర్తీపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని అన్నారు. ప్రభుత్వ శాఖల్లో భారీ సంఖ్యలో ఖాళీలు ఉన్నప్పటికి నియమాకాలు సకాలంలో పూర్తికావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. డిండి మండలంలో యువత ప్రధానంగా నిరుద్యోగం, స్థానిక పరిశ్రమల కొరత, వలసలు, నైపుణ్య శిక్షణా కేంద్రాల లేని, ప్రభుత్వ విద్యా సంస్థల్లో మౌలిక వసతుల కొరత వంటి సమస్యలను ఎదుర్కొంటున్నారని అన్నారు. ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ సమస్యల పరిష్కారం కోసం యువత సంఘటితమై ఉద్యమించాల్సిన అవసరం ఉందని, సెప్టెంబర్ 8, 9, 10 తేదిలలో యాదగిరిగుట్టలో జరిగే ఏఐవైఎఫ్ తెలంగాణ రాష్ట్ర 3వ మహాసభల్లో ఉపాధి, విద్య, వైద్యం, ప్రభుత్వ ఖాళీల భర్తీ, యువత హక్కులు తదితర అంశాలపై తీర్మానాలు చేసి భవిష్యత్ పోరాట కార్యాచరణను రూపొందిస్తామని అన్నారు. ఈ మహాసభలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు తూం బుచ్చిరెడ్డి, జిల్లా రైతు సంఘం అధ్యక్షులు మైనోద్దీన్, సిపిఐ డిండి మండల కార్యదర్శి కనకాచారి, సహాయ కార్యదర్శులు శైలేష్, విజేందర్‌రెడ్డి, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ప్రేమ్‌కుమార్, ఏఐవైఎఫ్ జిల్లా కోశాధికారి ఉదయ్, డివిజన్ అధ్యక్షులు వినయ్, మండల అధ్యక్ష, కార్యదర్శులు నరేష్, కోశాధికారి మధుకర్, సభ్యులు వెంకటేష్, శివ, అనిల్, ప్రవీణ్, నాగార్జున్ పాల్గొన్నారు.

## గత సంవత్సరం కంటే అడ్మిషన్స్ పెరిగాయా?

మోడల్ స్కూల్ విద్యార్థుల సంఖ్యపై కలెక్టర్ ఆరా



**ప్రజాపక్షం/తుర్కపల్లి :** యాదాద్రి భువనగిరి జిల్లా తుర్కపల్లి మండలం రాంపూర్ తండాలో ఉన్న ప్రభుత్వ కస్తూరిభా గాంధీ బాలికల విద్యాలయం, పి ఎం మోడల్ స్కూల్,కాలేజీ, మండల ప్రాథమిక పాఠశాల అంగన్వాడీ సెంటర్ లను జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి తనిఖీ చేశారు.కేజీబివిలో విద్యార్థుల సంఖ్య ఎంత,గత సంవత్సరం కంటే ఈ విద్యా సంవత్సరం అడ్మిషన్స్ పెరిగాయా అని అడిగి తెలుసుకున్నారు. ఎంత మంది టీచర్స్ ఉన్నారు. అందరు రెగ్యులర్ గా వస్తున్నారా అని అడిగారు.స్కూల్ లో కిచెన్, స్టోర్ రూమ్ లు పరిశుభ్రంగా ఉన్నాయా లేవా, స్టోర్ లో కూరగాయలు ఫ్రెష్ గా ఉన్నాయా, ఎగ్స్, ఆయిల్ పాకెట్స్ ఎక్స్‌పైరీ డేట్ ఉన్నాయా లేవా అని పరిశీలించారు.విద్యార్థులతో రోజు మెనూ ప్రకారం ఫుడ్ పెడుతున్నారా లేదా, ఈ వారంలో చికెన్ పెట్టారా రుచికరంగా ఉంటున్నాయా అని అడిగి తెలుసుకున్నారు. ఆర్‌బిఎస్‌కే టీం వాళ్ళు ఈ సంవత్సరం వచ్చి టెస్ట్‌లు చేసారా లేదా అని, అందులో రక్తహీనత ఉన్న విద్యార్థులు ఎంత మంది ఉన్నారు అని అడిగి తెలుసుకున్నారు. కేజీబీవీ, మోడల్ స్కూల్ కాలేజీ లలో 14 ఏళ్ల లోపు బాలికలకే హెచ్‌పీవీ వ్యాక్సిన్ పై అవగాహన కల్పిస్తూ 100% చేయించాలని డిఈఓ కి ఆదేశించారు. అంగన్వాడి సెంటర్ సెంటర్లో ఎంతమంది చిన్నారులు ఉన్నారు, అందులో సామ్ అండ్ మామ్ లో ఎవరైనా పిల్లలు ఉన్నారా అని అంగన్వాడి టీచర్ ని అడిగి తెలుసుకున్నారు. మామ్ లో ఉన్న పిల్లలకి ఏం ఫుడ్ పెడుతున్నారు అని,పిల్లలకి ఏమేమి నేర్పిస్తున్నారు ఆట వస్తువులు ఉన్నాయా లేవా అని అడిగారు. ఈ సంవత్సరంలో కొత్తగా ఏమైనా అడ్మిషన్లు వచ్చాయా గ్రామంలో ఎంతమంది పిల్లలే ఉన్నారా అని అడిగారు. విద్యార్థుల ఉజ్వల భవిష్యత్ కొరకు వారికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని ఆదేశించారు.

## నకిలీ డిఎపి తయారీదారులు అరెస్ట్

పోలీసుల అదుపులో ఆరుగురు

మిగిలిన ఇద్దరిని కూడా పట్టుకుంటాం

కోదాడ డిఎస్‌పి శ్రీనివాసరెడ్డి



**ప్రజాపక్షం/హుజూర్‌నగర్:** నకిలీ డిఎపి అడుగు మందు తయారు చేసి అమాయకులైన రైతులను మోసం చేస్తూ అమ్ముతున్న ముఠా గుట్టురట్టు చేశారు మఠంపల్లి పోలీసులు. తెలంగాణ రాష్ట్రంలో అడుగు మందు డిఎపి కొరత ఉన్న విషయాన్ని అదునుగా చేసుకుని రైతులను మోసం చేయాలనే ఉద్దేశ్యంతో కొంతమంది వ్యక్తులు ముఠాగా ఏర్పడి ఈ నకిలీ దందాకు తెరలేపారు. శుక్రవారం కోదాడ డిఎస్‌పి శ్రీనివాసరెడ్డి హుజూర్‌నగర్‌లో విలేకరుల సమావేశంలో కేసు వివరాలను వెల్లడించారు. ఈనెల 15వ తేదీన సూర్యాపేట జిల్లా మఠంపల్లి మండల వ్యవసాయ అధికారి బొలిశెట్టి శ్రీనివాస్‌కు వచ్చిన సమాచారం మేరకు మఠంపల్లి పోలీసులతో కలిసి మండంలోని రఘునాథపాలెం గ్రామంలో తనిఖీలు నిర్వహించగా కొండేటి పిచ్చిరెడ్డి అనే వ్యాపారి దగ్గర నకిలీ డిఎపి కట్టలను స్వాదీనం చేసుకున్నారు. ఈ నేరానికి సంబంధించి కేసు నమోదు చేసి హుజూర్‌నగర్ సిఐ చరమందరాజు, మఠంపల్లి ఎస్ఐ ప్రవీణ్‌కుమార్, మేళ్లచెరువు ఎస్ఐ నవీన్, ఎఎస్ఐ బలరాంరెడ్డి, శంభయ్య, నాగరాజు ఆధ్వర్యంలో విచారణ జరపగా వీస్తుపోయే నిజాలు బయటపడ్డాయి. రఘునాథపాలెం గ్రామానికి చెందిన కొండేటి పిచ్చిరెడ్డితో పాటు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు చెందిన 8 మంది ముఠాగా ఏర్పడి నకిలీ డిఎపి మందు దందాకు తెరలేపినట్లు విచారణలో తెలిసింది. హైద్రాబాద్ నగరంలో పెద్ద అంబర్‌పేట పరిధిలోని అబ్దుల్లాపూర్ మేట్‌లో గోదాం ఏర్పాటు చేసుకుని అక్కడ కోట్ల రూపాయల విలువ కలిగిన నకిలీ డిఎపి అడుగు మందు బస్తాలను తయారు చేస్తున్నట్లు విచారణలో తేలింది. ఈ ముఠాకు సంబంధించి 8 మందిని నిందితుల్లో ఆరుగురిని పట్టుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. వీరితో పాటు ఒక డిసిఎం వాహనం, ఒక మారుతి ఎర్టిగా కారు, ఐదు సెల్ ఫోన్లు, వివిధ కంపెనీలకు చెందిన లేబుల్ కలిగిన నకిలీ డిఎపి బస్తాలు, నకిలీ ఎరువు మందులు తయారు చేయడానికి వాడిన మిషన్, నకిలీ పాస్పెట్, దాదాపు రెండుకోట్ల విలువైన సామాగ్రిని పట్టుబడి చేసి స్వాదీనం చేసుకుని వారిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. పరారిలో ఇద్దరు నిందితులను త్వరలో పట్టుకుని తగిన చర్యలు తీసుకుంటామని డిఎస్‌పి శ్రీనివాసరెడ్డి తెలిపారు. రైతులు రాష్ట్ర వ్యవసాయ అధికారులు సూచించిన డీలర్ల వద్ద మాత్రమే ఎరువులను కొనుగోలు చేసి ఆర్థికంగా శారీరకంగా నష్టపోవద్దని కోరారు. ఈ కార్యక్రమంలో సిఐ చరమందరాజు, ఎస్ఐలు ప్రవీణ్‌కుమార్, నవీన్‌కుమార్, హనుమాన్‌నాయక్ సిబ్బంది పాల్గొన్నారు.

## విధులను నిర్లక్ష్యం చేస్తే చర్యలు

అడిషనల్ కలెక్టర్ హెచ్చరిక



**ప్రజాపక్షం/రామన్నపేట :** స్థానిక సంస్థల గౌరవ అడిషనల్ కలెక్టర్ భాస్కర్ రావు శుక్రవారం రామన్నపేట మండలంలో ఆకస్మికంగా పర్యటించారు.ఈ పర్యటనలో భాగంగా ఆయన జనంపల్లి రెసిడెన్షియల్ హాస్టల్, మండల కేంద్రంలోని ఏరియా ఆసుపత్రి, ఎంపీడీఓ కార్యాలయాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి, అధికారుల పనితీరుపై ఆగ్రహం వ్యక్తం చేయడంతో పాటు పలు కీలక సూచనలు చేశారు. ముందుగా జనంపల్లి రెసిడెన్షియల్ హాస్టల్ను సందర్శించిన అడిషనల్ కలెక్టర్, అక్కడ నెలకొన్న కోతుల సమస్యపై ఆరా తీశారు. కోతుల బెడద లేకుండా తక్షణ చర్యలు తీసుకోవాలని సూచించారు. హాస్టల్ చుట్టూ ఉన్న సోలార్ ఫెన్సింగ్‌కు తక్షణమే మరమ్మతులు చేపట్టాలని, దీనికి సంబంధించి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని పంచాయతీ రాజ్ ఏఈని ఆదేశించారు. అలాగే, విద్యార్థులకు ఎలాంటి తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చూడాలని మిషన్ భగీరథ ఏఈకి స్పష్టం చేశారు. హాస్టల్ పక్కనే ఉన్న రైతు భూమిలో పెరిగి ప్రమాదకరంగా మారిన చెట్టును తక్షణమే తొలగించాలని స్థానిక పంచాయతీ కార్యదర్శికి సూచించారు. అనంతరం ఏరియా ఆసుపత్రిని తనిఖీ చేసిన ఆయన, రోగులకు అందుతున్న వైద్య సేవలను అడిగి తెలుసుకున్నారు. తనిఖీ సమయంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ అందుబాటులో లేకపోవడాన్ని గమనించి తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. విధి నిర్వహణలో బాధ్యతారాహిత్యంగా వ్యవహరించిన సూపరింటెండెంట్ తీరుపై ఉన్నతాధికారులకు సమాచారం అందించినట్లు తెలిపారు. ఈ ఆకస్మిక తనిఖీ కార్యక్రమంలో ఎంపీడీఓ ఆవుల రాములు, ఏఈలు ఆశిష్ రాఘవ, సందీప్, పంచాయతీ కార్యదర్శులు సైదిరెడ్డి, అయ్యప్ప రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## పోలీస్ కానిస్టేబుల్ రిక్రూట్‌మెంట్‌లో నిరుద్యోగ యువతకు అన్యాయం

యాదాద్రి భువనగిరి జిల్లా ఎఐవైఎఫ్ కార్యదర్శి పేరబోయిన మహేందర్



**ప్రజాపక్షం/మోటకొండూరు :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ప్రకటించిన పోలీస్ రిక్రూట్మెంట్ యాదాద్రి భువనగిరి జిల్లాకు ఖాళీలు లేవని ప్రకటించడం సరైన విధానం కాదని ఏఐవైఎఫ్ యాదాద్రి భువనగిరి జిల్లా కార్యదర్శి వీరబోయిన మహేందర్, యాదాద్రి భువనగిరి జిల్లా సిపిఐ సహాయ కార్యదర్శి బోలగాని సత్యనారాయణ లు ఆరోపించారు. ఆయన శుక్రవారం మోటకొండూర్ మండల కేంద్రంలో అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) మూటకొండూర్ మండల నిర్మాణ మహాసభ బీరకాయల మధు అధ్యక్షతన జరిగిన సమావేశంలో మాట్లాడుతూ పోలీసు రిక్రూట్మెంట్ నోటిఫికేషన్‌లో కోడ్ నెంబర్ 21 సివిల్ కానిస్టేబుల్, కోడ్ నెంబర్ 22 ఏఆర్ కానిస్టేబుల్ జాబితాలో యాదాద్రి భువనగిరి జిల్లా (ఖాళీలు)లేకపోవడం వల్ల జిల్లాకు సంబంధించిన నిరుద్యోగుల్లో ఆందోళన మొదలైందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం 2021 డిసెంబర్ 317 జీవో ప్రకారం యాదాద్రి భువనగిరి జిల్లా, రాచకొండ పరిధిలో ఉండేదని, నల్గొండ, సూర్యాపేట ఇతర జిల్లాలకు చెందిన పలువురు కానిస్టేబుళ్లు యాదాద్రి జిల్లాలో విధులకు కేటాయించబడ్డారని ఈ కేటాయింపు పారదర్శకంగా జరగలేదన్నారు. సెప్టెంబర్ 8 9 10 తేదీలలో యాదగిరిగుట్టలో జరిగే అఖిల భారత యువజన సమాఖ్య ఏఐవైఎఫ్ రాష్ట్ర 3వ మహాసభలు, యువజన ప్రదర్శనను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

నూతన కమిటీ ఏర్పాటు : ఏఐవైఎఫ్ మోటకొండూరు మండల శాఖ అధ్యక్షులుగా బీరకాయల మధు, ప్రధాన కార్యదర్శిగా గొట్టిపాముల సునీల్ కుమార్, సహాయ కార్యదర్శిగా దేవల్ల కృష్ణ, కోశాధికారిగా పల్లె ప్రవీణ్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ మహాసభలో సిపిఐ మండల కార్యదర్శి గాదెగాని మాణిక్యం, సహాయ కార్యదర్శి ఆలేటి బాలరాజ్, ఏఐవైఎఫ్ నాయకులు ఆలేటి సాయికుమార్, రేగు పాండు తదితరులు పాల్గొన్నారు.

## ముద్ర రుణాలతో ఆర్థికంగా ఎదగాలి

నల్లగొండ జిల్లా కలెక్టర్ చంద్రశేఖర్ పిలుపు



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** జిల్లాలోని చేనేత కళాకారులు కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న ముద్ర రుణాలను సద్వినియోగం చేసుకుని స్వయం ఉపాధిని విస్తరించడంతో పాటు ఆర్థికంగా మరింత బలోపేతం కావాలని జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్ పిలుపునిచ్చారు.శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా చేనేత కళాకారులకు ముద్ర రుణాలపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు.చేనేతకు ప్రభుత్వం అండచేనేత రంగం జిల్లాకు ప్రత్యేక గుర్తింపు తీసుకువచ్చే రంగమని,చేనేత కళాకారుల అభివృద్ధికి ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా నిలుస్తోందన్నారు.అర్హులైన ప్రతి చేనేత కార్మికుడు ముద్ర రుణాలను వినియోగించుకుని తమ వృత్తిని విస్తరించి, ఆదాయాన్ని పెంచుకోవాలని సూచించారు.ముద్ర పథకం కింద రూ.50 వేల నుంచి రూ.10 లక్షల వరకు రుణాలు అందుబాటులో ఉన్నాయని, వ్యక్తిగతంగా, సంఘాలుగా లేదా క్లస్టర్ల రూపంలో కూడా ఈ రుణాలను పొందే అవకాశం ఉందన్నారు.ఆగస్టు 7న జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా జిల్లాలోని చేనేత కళాకారుల సమస్యలను ప్రత్యేకంగా పరిశీలించి, సాధ్యమైనంత వరకు పరిష్కరిస్తామని కలెక్టర్ హామీ ఇచ్చారు.ఈ సందర్భంగా చండూరు మాజీ జడ్‌పిటీసీ కర్నాటి వెంకటేశం చేనేత రంగ సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకురాగా,వాటిని పరిష్కరిస్తామని కలెక్టర్ హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల ఇంచార్జ్ అదనపు కలెక్టర్ ప్రేమ్ కరణ్ రెడ్డి,చేనేత శాఖ సహాయ సంచాలకులు గోవిందయ్య, లీడ్ బ్యాంక్ మేనేజర్ శ్రామిక్ తదితరులు పాల్గొన్నారు.



## జాతీయ ఒబిసి మహాసభలు విజయవంతం చేయాలి

ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం పిలుపు

**ప్రజాపక్షం/చండూరు:** ఆగస్టు 7న బెంగుళూరులో జరుగనున్న జాతీయ ఓబీసీ మహాసభలు విజయవంతం చేయాలని కోరుతూ ముద్రించిన వాల్ పోస్టర్‌ను గురువారం చండూరులో ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం బీసీయువజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అనంత చంద్రశేఖర్ గౌడ్ ,బీసీ సంఘం నాయకులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా ఓబీసీల సామాజిక ,విద్యా , రాజకీయ హక్కుల సాధన కోసం నిర్వహిస్తున్న ఈ మహాసభలను విజయవంతం చేయాలని ఓబీసీ సంఘం నాయకులకు పిలుపునిచ్చారు. దేశ వ్యాప్తంగా నిర్వహించే జనగణనలో ఓబీసీ కుల గణనను తప్పనిసరిగా చేపట్టాలని ,మహిళా రిజర్వేషన్ బిల్లులో ఓబీసీ మహిళలకు ప్రత్యేక సబ్ కోటా కేటాయించాలని, జనాభా నిష్పత్తి ప్రకారం ఓబీసీలకు రిజర్వేషన్ల శాతం పెంచాలని డిమాండ్ చేశారు. పార్లమెంట్ ,అసెంబ్లీ , ఇతర చట్టసభల్లో ఓబీసీలకు తగిన రాజకీయ ప్రాతినిధ్యం కల్పించే విధంగా రాజకీయ రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీసీ యువజన సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అనంత చంద్రశేఖర్ గౌడ్ , బీసీ సంఘం బీసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు నల్ల మధు యాదవ్ ,మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ దోటి సుజాత దోటివెంటేశ్ యాదవ్ ,సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు నల్పరాజు రామలింగయ్య , సిపిఐ చండూరు మండల కార్యదర్శి నల్పరాజు సతీష్ కుమార్ పాల్గొన్నారు.

## మహిళల హక్కుల కోసం పోరాటాలు ఉధృతం : ఎన్‌ఎఫ్‌ఐడబ్ల్యు




**ప్రజాపక్షం/భువనగిరి :** కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణలో అధికారంలోకి రాక ముందు మహిళలకు వివాహ సందర్భంగా కళ్యాణలక్ష్మి తో పాటు తులం బంగారం ఇస్తామని కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీని ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని భారత జాతీయ మహిళా సమాఖ్య (ఎన్‌ఎఫ్‌ఐడబ్ల్యు) జిల్లా అధ్యక్షురాలు సోమన సవిత డిమాండ్ చేశారు. శుక్రవారం భువనగిరిలో జరిగిన భారత జాతీయ మహిళా సమాఖ్య మండల 3 మహాసభ సందర్భంగా ఏర్పాటు చేసిన సంఘం జెండాను జిల్లా అధ్యక్షురాలు సోమన సబిత ఆవిష్కరించిన అనంతరం మాట్లాడుతూ ఎన్నికల సమయంలో మహిళలకు అనేక హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం వాటి అమలులో తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శిస్తోందని విమర్శించారు. ముఖ్యంగా తులం బంగారం హామీ ఇప్పటికీ అమలు కాకపోవడంతో ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు చెందిన మహిళలు, యువతులు తీవ్ర నిరాశకు గురవుతున్నారని అన్నారు. పార్లమెంట్, శాసనసభల్లో కూడా మహిళలకు తగిన ప్రాతినిధ్యం కల్పించేలా 33 శాతం రిజర్వేషన్ను వెంటనే అమలు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. ముంతాజ్ బేగం అధ్యక్షతన జరిగిన మహాసభలో దొంతి నిర్మల, బీరకాయల లక్ష్మమ్మ, జిన్నా రాజమణి, ఆడెపు శోభ, చాట్ల శారద, ఇట్టేబోయిన అరుణ, పరుశ పుష్ప, ఇట్టేబోయిన లలిత, అండాలు, వాణి, కృష్ణ వేణి, తదితరులు పాల్గొన్నారు.

## కస్తూర్బా జిసిడిఒ,ఎంఇఒ అరుంధతిని విధుల నుండి తొలగించాలి

నిర్లక్ష్యం కారణంగా విద్యార్థులు ఇబ్బందులు: ఎఐఎస్ఎఫ్

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** కస్తూర్బా గాంధీ గురుకుల పాఠశాలల జిల్లా జిసిడిఓ,ఎంఈఓ గా విధులు నిర్వహిస్తున్నఅరుంధతిని వెంటనే ఉద్యోగం నుండి తొలగించాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ముదిగొండ మురళి కృష్ణ ఉన్నత అధికారులను డిమాండ్ చేశారు.నల్లగొండ పట్టణంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, అరుంధతి కస్తూర్బా గాంధీ పాఠశాలలను సరిగా పర్యవేక్షణ చేయడం లేదని,దీనివల్ల పాఠశాలలు అస్తవ్యస్తంగా తయారయ్యాయని ఆరోపించారు. విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నా ఏ విషయాన్ని పట్టించుకోవడం లేదన్నారు.ప్రైవేటు స్కూళ్ల ఫీజులపై నిర్లక్ష్యంనల్లగొండ మండల విద్యాశాఖ అధికారిగా విధులు నిర్వహిస్తూ ప్రైవేటు పాఠశాలల్లో విచ్చలవిడిగా ఫీజులు పెంచుతున్నా, పుస్తకాలు అధిక ధరలకు అమ్ముతున్నా ఎన్ని ఫిర్యాదులు చేసినా పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. పూర్తిగా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండటం వల్ల విద్యార్థులు, తల్లిదండ్రులు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విలేకరుల సమావేశంలో పట్టణ నాయకులు అరవిందు,అనిల్, శ్రవణ్,శివ, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

## డిజిటలైజేషన్ వేగవంతం చేయండి



ప్రజాపక్షం/ఆసిఫాబాద్ రూరల్ : ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో భాగంగా ఎన్యుమరేషన్ ఫారాల డిజిటలైజేషన్ ప్రక్రియను త్వరగా పూర్తి చేసేలా రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకరించాలని జిల్లా కలెక్టర్ కె.హరిత కోరారు. శుక్రవారం సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.జిల్లాలో ఇప్పటివరకు 90 శాతం డిజిటలైజేషన్ ప్రక్రియ పూర్తయిందని తెలిపారు. పట్టణ ప్రాంతాలపై రాజకీయ పార్టీల ప్రతినిధులు ప్రత్యేక దృష్టి సారించి పూరించిన ఎన్యుమరేషన్ ఫారాలను బూత్ స్థాయి అధికారులకు అందేలా చొరవ తీసుకోవాలని సూచించారు. ఎన్నికల సంఘం గడువును ఆగస్టు 3వ తేదీ వరకు పొడిగించినప్పటికీ, ప్రక్రియను ముందే పూర్తి చేసేలా కృషి చేయాలన్నారు.జిల్లా రెవెన్యూ అధికారి దాసరి వేణు, ఆసిఫాబాద్ రాజస్వ మండల అధికారి లోకేశ్వర్ రావు, ఎన్నికల విభాగం అధికారులు, ప్రతినిధులు పాల్గొన్నారు.

## దెబ్బతిన్న పంటలు పరిశీలించిన డిఎఒ



ప్రజాపక్షం/పెంచికలపేట్: గత రెండు రోజులుగా కురిసిన భారీ వర్షాల కారణంగా అగర్గూడ గ్రామ శివారులో దెబ్బతిన్న పంట పొలాలను జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వెంకటీ శుక్రవారం పరిశీలించారు. వ్యవసాయ అధికారి రామకృష్ణ, గ్రామ సర్పంచ్ అల్లూరి రాజేశ్వరి, వ్యవసాయ విస్తరణ అధికారి వంశీతో కలిసి క్షేత్రస్థాయిలో నష్టాన్ని పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు.ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనల ప్రకారం పంట నష్టాన్ని అంచనా వేసి ఉన్నతాధికారులకు నివేదిక అందజేస్తామని తెలిపారు. రైతులకు తగిన సహాయ చర్యలు అందేలా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. బాధిత రైతులు తమకు జరిగిన నష్టాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. స్థానిక రైతులు, పంచాయతీ ప్రతినిధులు పాల్గొన్నారు.

## అర్ధరాత్రి రెచ్చిపోయిన దొంగలు

హుండీలు పగులగొట్టి నగదు చోరీ



ప్రజాపక్షం/శివ్వంపేట: శివ్వంపేట మండలం గూడూరు గ్రామంలోని శ్రీగురుపీఠంలో గల సాయిబాబా, దత్తాత్రేయమహాస్వాముల దేవాలయాల్లో గురువారం అర్ధరాత్రి గుర్తుతెలియని దుండగులు చోరీకి పాల్పడ్డారు. శుక్రవారం ఉదయం ఆలయ సూపర్వైజర్ సత్యనారాయణగౌడ్ ఆలయానికి రాగా దేవాలయం హుండీలు, డోర్లు పగలగొట్టి ఉన్నాయని వెంటనే విషయాన్ని ఆలయ చైర్మన్ శివకుమార్గౌడ్ తో పాటు పోలీసులకు సమాచారం అందించారు. ఆలయానికి చేరుకున్న ఎస్ఐ మధుకర్రెడ్డి సీసీ ఫుటేజీలతో పాటు పరిసరాలను పరిశీలించారు. క్లూస్ టీం సిబ్బంది చేరుకొని ఆధారాలు సేకరించారు. సూపర్వైజర్ సత్యనారాయణగౌడ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

## మోకాళ్లలోతు వాగు దాటి..

## గిరిజన గూడెలలో శ్రీహరి రావు!

ఇళ్లు కోల్పోయిన బాధితురాలిని పరామర్శ

11 ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి హామీ



ప్రజాపక్షం/మామడ : మండలం తోటిగూడ గ్రామపంచాయతీ పరిధిలోని మల్లాపూర్ ఆదివాసీ గిరిజన గూడెం.. అక్కడికి చేరుకోవాలంటే వాహనాలు వెళ్లవు. వాగులు, ఒర్రెలు దాటి దాదాపు ఐదు కిలోమీటర్లు కాలినడకన ప్రయాణించాల్సిందే. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు గిరిజన మహిళ సీడం గంగుబాయి ఇల్లు కూలిపోయింది. ఈ విషయం తెలుసుకున్న కాంగ్రెస్ పార్టీ నిర్మల్ నియోజకవర్గ ఇంచార్జి కూచాడి శ్రీహరి రావు శుక్రవారం ఎలాంటి హడావుడి లేకుండా కాలినడకన బయలుదేరి, మోకాళ్ల లోతు వాగులు, ఒర్రెలను దాటి మల్లాపూర్ గూడెం చేరుకున్నారు. ఇల్లు కోల్పోయిన గంగుబాయిని పరామర్శించి ధైర్యం చెప్పారు. గూడెంలోని 11 ఆదివాసీ గిరిజన కుటుంబాలకు ప్రభుత్వ తరఫున ఇందిరమ్మ ఇండ్లు మంజూరు అయ్యేలా కృషి చేస్తానని, గూడెంలో త్రీఫేస్ విద్యుత్తు కోసం జిల్లా కలెక్టర్, విద్యుత్ శాఖ అధికారులతో మాట్లాడుతానని హామీ ఇచ్చారు. తోటి గూడ సర్పంచ్ మోతీబాయి భీమ్రావు,గాయిద్ పల్లి సర్పంచ్ రాథోడ్ సోనియా,వాస్తాపూర్ సర్పంచ్ భూమ్రెడ్డి, సర్పంచ్ భీమేష్,మాజీ ఎంపిపి జైసింగ్,కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రాథోడ్ సంతోష్తో పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## నిరుపేదలకు మెరుగైన వైద్యం అందాలి

అదనపు కలెక్టర్ నగేష్

ప్రజాపక్షం/మెదక్ : నిరుపేదలకు మెరుగైన వైద్యం అందాలని జిల్లా అదనపు కలెక్టర్ నగేష్ అన్నారు. శుక్రవారం మెదక్ పట్టణంలోని ప్రభుత్వ జనరల్ హాస్పిటల్ను అదనపు కలెక్టర్ నగేష్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. రోగుల గదులను, వంట గదులను, భోజన శాలను పరిశీలించారు. రోగులతో ముచ్చటించారు. వైద్య సేవలపై ఆరా తీశారు. వైద్యుల అటెండెన్స్ ను చూశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోగులకు మెరుగైన వసతులు కల్పించి, చుట్టు ఉన్న పరిసరాలను పరిశుభ్రం చేయాలన్నారు. నాణ్యమైన భోజనాన్ని అందించాలని వైద్య అధికారులకు సూచించారు. డాక్టర్స్ అందరూ అందుబాటులో ఉండాలన్నారు. ప్రిన్సిపాల్ నితిన్ కాబ్ర, శాకాధిపతి రవీంద్ర కుమార్, రేడియాలజిస్ట్ శారదా దేవి, ఆర్ ఎంఓ శైలజ, శ్రీవిద్య, ప్రియాంక, నిర్మల,అధికారులు, పాల్గొన్నారు.



## కడెం ప్రాజెక్టు పరిసర ప్రాంతాల ప్రజలు

# అప్రమత్తంగా ఉండాలి

కలెక్టర్ భవేశ్ మిశ్రా



ప్రజాపక్షం/నిర్మల్ రూరల్ : జిల్లాలో కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో కడెం ప్రాజెక్టు పరిసర ప్రాంతాల ప్రజల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆయన కడెం ప్రాజెక్టును ఆకస్మికంగా సందర్శించి పరిస్థితిని ప్రత్యక్షంగా పరిశీలించారు.ఈ సందర్భంగా ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి మట్టం, ప్రస్తుత నీటి నిల్వ, ఇన్ఫ్లో, ఔట్ఫ్లో వివరాలను ఇరిగేషన్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. జిల్లాలో గత రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలు,రానున్న రోజుల్లోనూ వర్షాలు కొనసాగే అవకాశాన్ని దృష్టిలో ఉంచుకుని అధికారులు అప్రమత్తంగా ఉండి పరిస్థితులను ఎప్పటికప్పుడు సమీక్షించాలని సూచించారు. ప్రాజెక్టు దిగువ ప్రాంతాల గ్రామాల ప్రజలకు నీటి విడుదలకు సంబంధించిన సమాచారాన్ని ముందుగానే అందించి అప్రమత్తం చేయాలని సూచించారు. ప్రాజెక్టు అధికారులు నిరంతరం అందుబాటులో ఉంటూ నీటి మట్టం, ప్రవాహ పరిస్థితులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని ఆదేశించారు.ప్రాజెక్టు గేట్లు, నీటి ప్రవాహ ప్రాంతాలు, ఇతర ప్రమాదకర ప్రాంతాల్లోకి అనధికార వ్యక్తులు ఎవరూ ప్రవేశించకుండా కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టాలని కలెక్టర్ సూచించారు. భవిష్యత్ అవసరాలు, వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ప్రాజెక్టులో నీటి నిర్వహణను ప్రణాళికాబద్ధంగా చేపట్టాలని అధికారులకు సూచించారు.అనంతరం ఖానాపూర్ పట్టణంలోని హైటెక్ సిటీ మైనారిటీ వసతి గృహానికి వెళ్లే మార్గంలో భారీ వర్షాలకు దెబ్బతిన్న రహదారిని కలెక్టర్ పరిశీలించారు. వసతి గృహ విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా నిత్యావసర వస్తువులు, అవసరమైన సామగ్రిని నిరంతరం అందించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని శాఖల అధికారులు క్షేత్ర స్థాయిలో అందుబాటులో ఉంటూ సహాయక చర్యలను వేగవంతం చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు.ఈ పర్యటనలో ఖానాపూర్ మున్సిపల్ చైర్ పర్సన్ అంకం మౌనిక,నీటిపారుదల శాఖ అధికారులు జగదీష్,రాజేంద్ర ప్రసాద్, ప్రవీణ్ కుమార్, వీరన్న,మున్సిపల్ కమిషనర్ సుందర్ సింగ్,తహశీల్దార్లు ఖాజా మొయినుద్దీన్, సుజాత,ఎంపీడీఓ రాధా రాథోడ్, అధికారులు, పాల్గొన్నారు.

## వర్షాల వల్ల ఇబ్బందులు కలగకుండా

# ముందస్తు చర్యలు చేపట్టాలి

పంటల సాగులో రైతులు సమతుల్యత పాటించాలి

రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి



ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ : భారీ వర్షాల దృష్ట్యా ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి అధికారులను ఆదేశించారు.శుక్రవారం సాయంత్రం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్మల్, ఆదిలాబాద్ జిల్లాల ఉన్నతాధికారులతో ప్రాజెక్టుల నీటి నిల్వలు, దెబ్బతిన్న రహదారులు, పంటల సాగు మరియు సీఎంఆర్ డెలివరీ ప్రక్రియపై సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, దెబ్బతిన్న రహదారులు, వంతెనలకు వెంటనే మరమ్మతులు చేపట్టి, తాగునీటి సమస్య రాకుండా చూడాలని సూచించారు.ఎల్ నినో ప్రభావంతో రానున్న రోజుల్లో వర్షపాతం తగ్గే అవకాశమున్నందున, వరికి బదులుగా ఆయిల్ పామ్, కంది, నువ్వులు, పత్తి వంటి ప్రత్యామ్నాయ పంటలను ప్రోత్సహించాలని వ్యవసాయ అధికారులకు తెలిపారు. పంట మార్పిడికి అవసరమైన విత్తనాల సరఫరాకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. అలాగే, సీఎంఆర్ సేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలని ఆదేశించారు.నిర్మల్ జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా మాట్లాడుతూ, ఇటీవలి వర్షాలతో ప్రాజెక్టులు నిండాయని,రహదారుల మరమ్మతులు ముమ్మరంగా సాగుతున్నాయని తెలిపారు. జిల్లా కలెక్టర్ రాజర్షి షా మాట్లాడుతూ, లోటు వర్షపాతం 6 శాతానికి తగ్గిందని, జిల్లాలోని 17 మండలాలు సాధారణ స్థితికి వచ్చాయని వివరించారు. జిల్లాలో 5.93 లక్షల ఎకరాల్లో పంటలు సాగయ్యాయని తెలిపారు. జిల్లా ఎస్పి జానకి షర్మిల,అదనపు కలెక్టర్లు వెంకటేశ్వర్లు, రాజేశ్వర్, కిషోర్ కుమార్, డిఆర్వో రాథోడ్ రమేష్, డిఎస్పి శ్రీనివాస్ రెడ్డి,పాల్గొన్నారు.

## ప్రాణహిత వద్ద వరద పరిస్థితిని పరిశీలించిన కలెక్టర్



ప్రజాపక్షం/కౌటాల : భారీ వర్షాల నేపథ్యంలో మండలంలోని తుమ్మిడిహెట్టి వద్ద ప్రాణహిత నది వరద పరిస్థితులను జిల్లా కలెక్టర్ హరిత శుక్రవారం సందర్శించి పరిశీలించారు. నదిలో నీటి ప్రవాహాన్ని గమనించిన కలెక్టర్ అధికారులతో సమీక్ష నిర్వహించి, ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. పరివాహక ప్రాంత ప్రజలు నదికి సమీపంలోకి వెళ్లకుండా భద్రతా చర్యలు తీసుకోవాలని సూచించారు. మార్గమధ్యలో వ్యవసాయ పొలాలను సందర్శించిన కలెక్టర్ వరి నాట్లు వేస్తున్న రైతు కూలీలతో మాట్లాడారు. సాగు పరిస్థితులు, వర్షాల ప్రభావం, రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రైతులు వర్షాలపైనే ఆధారపడకుండా ఆరుతడి పంటలను సాగు చేయాలని, సాంకేతిక సూచనలు పాటించాలని తెలిపారు. రైతులతో ఆప్యాయంగా ముచ్చటించి సమస్యలు తెలుసుకున్న కలెక్టర్ను స్థానికులు అభినందించారు.స్థానిక అధికారులు, పాల్గొన్నారు.

## భారీ వర్షాలతో అధికారులు అప్రమత్తంగా ఉండాలి

- వాగులు, వంకలు, కాజ్వేల వద్ద భద్రతా చర్యలు
- లోతట్టు ప్రాంతాలు గుర్తించి పునరావాస కేంద్రాలు సిద్ధం చేయాలి

కలెక్టర్ ప్రతీక్ జైన్

ప్రజాపక్షం/సంగారెడ్డి : రాష్ట్రంలో కొనసాగుతున్న వాతావరణ మార్పులు భారత వాతావరణ శాఖ హెచ్చరిక నేపథ్యంలో వచ్చే వారంలో కూడా భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నందున జిల్లాలోని అన్ని శాఖల అధికారులు పూర్తి అప్రమత్తతతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ ఆదేశించారు. ప్రజల ప్రాణ ,ఆస్తి నష్టం జరగకుండా ముందుస్తు చర్యలు చేపట్టాలని జిల్లా నుంచి గ్రామ స్థాయి వరకు విపత్తు నిర్వహణ వ్యవస్థను పటిష్టంగా సిద్దం చేయాలని సూచించారు. శుక్రవారం కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి అడిషనల్ కలెక్టర్లు సంగీత ,పాండుతో కలిసి రెవెన్యూ డివిజన్ అధికారులు ,తహసీల్దారులు, ఎంపిడీవోలు, మండల ప్రత్యేక అధికారులు ,మున్సిపల్ కమీషనర్లు ,స్టేషన్ హౌస్ ఆఫీసర్లు ,పంచాయతీరాజ్ ,ఆర్ అండ్బి ,ఇరిగేషన్ ,విద్యుత్ , ఆర్ డబ్ల్యూ ఎస్ వైద్య ఆరోగ్య వ్యవసాయ ,పశుసంవర్ధక,విద్య ,మత్స్య, పోలీస్ తదతర శాఖల అధికారలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లాలో నమోదైన వర్షపాతం, రానున్న రోజుల వర్ష సూచనలు తీసుకోవాల్సిన ముందస్తు చర్యలపై సమగ్రంగా సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మండల ప్రత్యేక అధికారి ,తహసీల్దార్ ఎంపిడిఒ ,పోలీస్ అధికారులు, మున్సిపల్ కమీషనర్లు తదితరులు సమన్వయ కమిటీలు ఏర్పాటు చేసి స్థానిక పరిస్థితులను నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. పరిస్థితులను ఎప్పటికప్పుడు ప్రజలకు తెలియజేస్తూ మీడియా ద్వారా హెచ్చరికలు జారీ చేయాలని చెప్పారు. జిల్లాలోని అన్ని లోతట్టు ప్రాంతాలను గుర్తించి అవసరమైన చోట పునరావాస కేంద్రాలను సిద్ధం చేయాలని ఆదేశించారు.వాగులు, వంకలు, చెరువులు, కుంటలు, కాలువల నీటి ప్రవాహాన్ని ఇరిగేషన్ అ ధికారులు నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. అవసరమైన చోట పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేసి ఎలాంటి ప్రమాదాలు జరగకుండా చూడాలని తెలిపారు.. క్షేత్ర స్థాయిలో వరదలు, ఇతర నష్టాలుసంభవించిన వెంటనే సంబందిత అధికారులు జిల్లా యం త్రాంగానికి సమాచారం అం దించి అత్యవసర చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రభుత్వ ప్రైవేటు ఆస్తులకు నష్టం జరగకుండా ముందస్తు కార్యాచరణ ప్రణాళికతో సిద్దంగా ఉండాలని సూచించారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలను చూసి రైతులు అదిక నీరు ఆవసరమయ్యే పంటల సాగు చేయకుండా భూ గర్బ జలాల లభ్యత ఎల్నివో ప్రభావం దృష్టిలో ఉంచుకొని తక్కువ నీటితో తక్కువ కాలంలో అధిక దిగుబడిని ఇచ్చే ప్రత్యామ్నాయ పంటలను సాగు చేసేలా రైతులను ప్రొత్సహించాలని తెలిపారు.ఈ వీడియో కాన్ఫరెన్స్లో అడిషనల్ కలెక్టర్లు సంగీత, పాండు, జెడ్పీ, సిఇఒ జానకిరెడ్డి, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.



## రూ.కోట్లు తిని బియ్యం ఎగవేస్తే ఊరుకునేది లేదు

ఎఫ్సిఐ, డిసిఎస్ఓ, డిఎం అధికారులకు ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి తీవ్ర హెచ్చరిక!

రికవరీ చేయకపోతే

ధాన్యపు మిల్లులు జప్తు!

ప్రజా పక్షం/నిర్మల్: కర్షకుల చెమట చుక్కలతో పండిన ధాన్యాన్ని నమ్ముకుని, ప్రభుత్వం ఇచ్చే మర ఆడించిన బియ్యం బాధ్యతల విషయంలో కొందరు మిల్లు యజమానులు సాగిస్తున్న అక్రమాలకు చరమగీతం పాడేందుకు పౌరసరఫరాల శాఖ సమర శంఖం పూరించింది.ఆదిలాబాద్ మరియు నిర్మల్ జిల్లాల ఇన్ ఛార్జ్, ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లాల ఉన్నతాధికారులతో అత్యున్నత స్థాయి సమీక్షా సమావేశం ఏర్పాటు చేశారు.వేల కోట్ల రూపాయల విలువైన బియ్యాన్ని మర ఆడించి ఇవ్వకుండా ఎగవేత ధోరణి ప్రదర్శిస్తున్న వారిపై ఉన్నతాధికారులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇకపై ఉపేక్షించే ప్రసక్తే లేదని,సెప్టెంబరు ఆఖరు నాటికి 100 శాతం బియ్యం రికవరీ చేసి తీరాలని అధికారులకు స్పష్టమైన దిశానిర్దేశం చేశారు. బకాయిలు చెల్లించని వారి ఆస్తులను వెంటనే జప్తు చేసి, బహిరంగ వేలం వేయడమే కాకుండా వారి బ్యాంకు హామీ పత్రాలను రద్దు చేయాలని ఆదేశించడం ఇప్పుడు జిల్లా ధాన్యం మిల్లింగ్ రంగంలో తీవ్ర ప్రకంపనలు సృష్టిస్తోంది.యాసంగి కాలంలో సేకరించిన ధాన్యానికి సంబంధించి భారతీయ ఆహార సంస్థ (ఎఫ్సిఐ) కేటాయింపుల ప్రకారం ఉడకబెట్టిన బియ్యం 23,972 మెట్రిక్ టన్నులు, పచ్చి బియ్యం 24,383 మెట్రిక్ టన్నులు కలిపి మొత్తం 48,359 మెట్రిక్ టన్నుల బియ్యాన్ని త్వరితగతిన లభ్యమయ్యేలా చూసి అందించాలని స్పష్టం చేశారు. జిల్లాలో గత వానాకాలం గానూ ఏకంగా రూ.270 కోట్ల విలువైన 1,13,495 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేసినప్పటికీ, కొందరు యజమానులు సకాలంలో బియ్యం ఇవ్వకుండా కాలయాపన చేయడంపై తీవ్రంగా పరిగణించారు.పౌరసరఫరాల శాఖ అధికారుల తీరుపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. ఎఫ్ సి ఐ, డి సి ఎస్ ఓ, డిఎం అధికారులు ఎంతో బాధ్యతాయుతంగా విధులను నిర్వహించాలని, విధి నిర్వహణలో ఏ చిన్న తప్పులు చేసినా ఏమాత్రం సహించేది లేదని హెచ్చరించారు. జిల్లా పాలనాధికారి భువేష్ మిశ్రా, జిల్లా రక్షణాధికారి జానకి షర్మిల,స్థానిక సంస్థల పాలనాధికారి వెంకటేశ్వరరావు, జిల్లా పౌరసరఫరాల అధికారి (డిసిఎస్ఓ), పౌరసరఫరాల సంస్థ జిల్లా నిర్వహణాధికారి (డిఎం)లు ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.




## కిసాన్నగర్లో ఆస్పత్రి తనిఖీ

జిల్లా వైద్యాధికారి రాజశ్రీ

ప్రజాపక్షం/బాల్కొండ : వర్షాకాలం దృష్ట్యా సీజనల్ వ్యాధులుపెరుగుతున్న నేపథ్యంలో జిల్లా వైద్యాధికారి రాజశ్రీ శుక్రవారం కిసాన్నగర్ పీహెచ్సీని ఆకస్మికంగాతనిఖీ చేసి ఆస్పత్రిలోని ఫార్మసీ, ల్యాబ్,హెచ్ఐవి వ్యాక్సినేషన్ సెంటర్లను పరిశీలంచి రోగులకందిస్తున్న వైద్య సేవలు, మందుల నిల్వ పరీక్షల వివరాలు రికార్డులనుక్షుణ్ణంగా పరిశీలించారు. వర్షాకాలంలో తీసుకోవల్సిన జాగ్రత్తలపై వివరించారు. క్రమం తప్పకుండా శుభ్రత పాటించాలని, పేద రోగులకు నాణ్యమైన వైద్యమందించటమే లక్ష్యమని అందులో ఎటువంటి నిర్లక్ష్యం ఉండకూడదని స్పష్టం చేశారు. సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించి ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. తనిఖీల్లో వైద్యులు సిబ్బంది పాల్గొన్నారు.



## రాయిన్ పల్లి ప్రాజెక్ట్ కెనాల్ కూలిపోవడం ప్రభుత్వ నిర్లక్ష్యమే

మాజీ డిప్యూటీ స్పీకర్ పద్మా దేవేందర్ రెడ్డి

ప్రజాపక్షం/మెదక్ : మెదక్ మండలం రాయిన్పల్లి ప్రాజెక్ట్ డిస్ట్రిబ్యూషన్ కెనాల్ కూలిపోవడంతో పాటు చెరువు కట్టకు భారీ గండి పడటంతో ఏడు గ్రామాల ప్రజలు, రైతులు ఆందోళన చెందుతున్నారని మాజీ డిప్యూటీ స్పీకర్ పద్మా దేవేందర్ రెడ్డి అన్నారు. శుక్రవారం ఘటనాస్థలిని బీఆర్ఎస్ నాయకులతో కలిసి పరిశీలించిన ఆమె, గత ఏడాది వరదల అనంతరం శాశ్వత మరమ్మతులు చేపట్టకపోవడమే ఈ పరిస్థితికి కారణమని ఆరోపించారు. సుమారు 2,500 ఎకరాలకు సాగునీరు అందించే ఈ కాల్వ దెబ్బతినడంతో రైతులకు తీవ్ర నష్టం వాటిల్లే ప్రమాదం ఉందన్నారు. మండల అధ్యక్షుడు అంజా గౌడ్, మాజీ మున్సిపల్ చైర్మన్ మల్లికార్జున్ గౌడ్, నాయకులు కిష్టయ్య, జీవన్ రావు, మామిళ్ళ ఆంజనేయులు, నరేందర్, దుర్గయ్య,వీరస్వామి తో తదితరులు ఉన్నారు.

## ప్రభుత్వ ఆసుప్రతిలో మెరుగైన వైద్యం అందిచాలి

బిసి సంక్షేమ అభివృద్ధి అధికారి ఉపేంద్ర

ప్రజాపక్షం/రేగోడు : దక్ జిల్లా రేగోడ్ మండలంలో ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందుతున్నాయని జిల్లా బీసీ సంక్షేమ అభివృద్ధి అధికారి ఉపేంద్ర అన్నారు కలెక్టర్ ఆదేశాల మేరుకు శుక్రవారం రేగోడ్ ప్రభుత్వ ఆసుపత్రి లో వసతుల పై ఆరా తీశారు ఆసుపత్రి లో సౌకర్యాలు మెరుగు పరచాల్సి ఉందని ఆసుపత్రికి వచ్చే రోగులకు వసతి సౌకర్యాలు అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రి సమస్యల పై పూర్తి వివరాలను జిల్లా కలెక్టర్కి నివేదిలను ఇస్తామని తెలిపారు.జిల్లాలో గురుకుల పాఠశాలలు విజయవంతగా నడుస్లున్నాయని అన్నారు. రేగోడ్ బిసి హాస్టల్ భవనం శిథిలావస్థకు చేరడంతో విద్యార్థులు లేక రద్దు చేయడం జరిగిందన్నారు. ఎంపిడిఒ శ్రీనివాస్ వైద్యాధికారి ఝాన్సీ ఎంపిహెచ్ ఓ ఈశ్వర్ గౌడ్ ఫార్మసిస్ట్ రవీందర్ పార్వతి ఉన్నారు.

## చిన్నపాటి వర్షానికే చెరువులా కెజివిబి ప్రాంగణం

- భయాందోళనలో విద్యార్థినులు!
- పాఠశాల చుట్టూ జలదిగ్బంధం
- పట్టించుకోని ప్రజాప్రతినిధులు

ప్రజాపక్షం/మావలః ఆదిలాబాద్ పట్టణంలోని బంగారిగూడ కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయం (కేజీబీవీ) చిన్నపాటి వర్షానికే జలదిగ్బంధంలో చిక్కుకుంటోంది. ఇటీవల కురిసిన వర్షానికి నీరు బయటకు వెళ్లేదారిలేక భవనం చుట్టూ పెద్ద ఎత్తున నిలిచిపోయి చెరువును తలపిస్తోంది. దీంతో పాఠశాల లోపలికి వెళ్లేందుకు, బయటకు వచ్చేందుకు విద్యార్థినులు, ఉపాధ్యాయులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. రోజుల తరబడి వర్షపు నీరు నిల్వ ఉండటంతో ప్రాంగణమంతా దుర్వాసన వెదజల్లుతోంది. నీటి వల్ల దోమలు విపరీతంగా విజృంభించడమే కాకుండా, రాత్రి వేళల్లో విషసర్పాలు, కీటకాలు సంచరిస్తుండటంతో హాస్టల్లో ఉంటున్న విద్యార్థినులు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు. నీటి నిల్వ వల్ల డెంగ్యూ, మలేరియా వంటి సీజనల్ వ్యాధులు ప్రబలి విద్యార్థినులు తీవ్ర అనారోగ్యం పాలయ్యే ప్రమాదం పొంచి ఉందని ఆందోళన చెందుతున్నారు. సమస్య తీవ్రంగా ఉన్నప్పటీకీ స్థానిక నాయకులు, సంబంధిత అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని స్థానికులు, విద్యార్థుల తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు తక్షణమే స్పందించి నిలిచిన వర్షపు నీటిని మోటార్ల ద్వారా బయటకు పంపించి, భవిష్యత్తులో నీరు నిలువకుండా శాశ్వత డ్రైనేజీ వ్యవస్థను ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు.



## విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించాలి

కలెక్టర్ కె. హరిత

ప్రజాపక్షం/వాంకిడి : సంక్షేమ వసతి గృహాల్లో చదువుతున్న విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామని జిల్లా కలెక్టర్ కె.హరిత తెలిపారు. వాంకిడి మండల కేంద్రంలో ఒకే భవనంలో కొనసాగుతున్న ఎస్సి, బిసి వసతి గృహాలను శుక్రవారం కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. భోజన వసతి, పారిశుద్ధ్యం, ఇతర పరిస్థితులను క్షుణ్ణంగా పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఒకే భవనంలో రెండు వసతి గృహాలు నడపడం వల్ల ఇబ్బందులు వస్తున్నందున, బిసి వసతి గృహాన్ని వేరే అద్దె భవనంలోకి తరలించాలని ఆదేశించారు. భవనాల నిర్మాణం కోసం రాష్ట్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపుతామన్నారు. వంటగది, గదుల్లో వర్షపు నీరు రాకుండా తక్షణమే మరమ్మతులు చేయాలన్నారు. వసతి గృహాల నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.బిసి వసతి గృహ సంక్షేమాధికారి మధుకర్, సిబ్బంది పాల్గొన్నారు.



ప్రజాపక్షం
Telugu National Daily
ఖమ్మం
శనివారం
01-08-2026
www.prajapaksham.in

‘ హీరో విజయ్ దేవరకొండ 10 ఏళ్ల అద్భుతమైన కెరీర్‌ను కంప్లీట్ చేసుకున్నారు. ఆయన సోలో హీరోగా నటించిన తొలి సినిమా 'పెళ్లి చూపులు'. 2016 లో రిలీజైంది. అప్పటికే 'ఎవడే సుబ్రహ్మణ్యం' సినిమాలో నటించి విజయ్ పేరు తెచ్చుకున్నారు . ’


# రీల్

## ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా 'క్రేజీ కళ్యాణం'




నరేష్ వికె, అనుపమ పరమేశ్వరన్, తరుణ్ భాస్కర్, రాజ్ వెడ్స్ రాంబాయి ఫేమ్ అఖిల్ ఉడ్డెమారి ప్రధాన పాత్రల్లో నటిస్తున్న సినిమా 'క్రేజీ కళ్యాణం'. ఈ చిత్రాన్ని యూరో సినిమాస్ బ్యానర్‌పై ప్రొడక్షన్ నెం. 2గా ప్యాషనేట్ ప్రొడ్యూసర్ బూనమ్ జగన్ మోహన్ రెడ్డి నిర్మిస్తున్నారు. దర్శకుడు బద్దిప్ప గాజులు రూపొందిస్తున్నారు. 'క్రేజీ కళ్యాణం' సినిమా టీజర్ రిలీజ్ అనౌన్స్ మెంట్ చేశారు. 1న ఈ సినిమా టీజర్ విడుదల చేయబోతున్నట్లు ప్రకటించారు. పెళ్లి చుట్టూ సాగే ఆసక్తికరమైన కథతో ఆద్యంతం వినోదాత్మకంగా సాగే చిత్రమిది. తెలంగాణలోని పలు గ్రామీణ ప్రాంతాల్లో 'క్రేజీ కళ్యాణం' సినిమా చిత్రీకరణ జరిపారు. సురేష్ బొబ్బిలి 'క్రేజీ కళ్యాణం' సినిమాకు సంగీతాన్ని అందిస్తున్నారు. 1న రిలీజ్ కాబోతున్న టీజర్ హోల్ సమ్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కుతున్న ఈ సినిమాపై మరింత క్రేజ్ పెంచబోతోంది. నరేష్ వికె, అనుపమ పరమేశ్వరన్, తరుణ్ భాస్కర్, అఖిల్ ఉడ్డెమారి, తదితరులు నటిస్తున్నారు. ఈ చిత్రానికి కాస్ట్యూమ్ డిజైనర్ జె.గాయత్రి దేవి, ఆర్ట్ డైరెక్టర్ సాయి కదిర, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ అఖిల్ సాయి శ్రీమూర్తి, కొరియోగ్రాఫర్ ఈశ్వర్ పెంటి, యాక్షన్ డ్రాగన్ ప్రకాష్, లిరిక్స్ గోరటి వెంకన్న, చైతన్య ప్రసాద్, కాసర్ల శ్యామ్, ఎడిటర్ శ్రావణ్ కటికనేని, డిఓపి శ్యామ్ దూపాటి, మ్యూజిక్ సురేష్ బొబ్బిలి.

## పదేళ్ల సినీ ప్రయాణం



హీరో విజయ్ దేవరకొండ 10 ఏళ్ల అద్భుతమైన కెరీర్‌ను కంప్లీట్ చేసుకున్నారు. ఆయన సోలో హీరోగా నటించిన తొలి సినిమా 'పెళ్లి చూపులు'. 2016 లో రిలీజైంది. అప్పటికే 'ఎవడే సుబ్రహ్మణ్యం' సినిమాతో సోలో హీరోగా అరంగేట్రం చేశారు. మొదటి చిత్రంతోనే ప్రేక్షకుల ప్రేమాభిమానాలు సంపాదించుకుని, బాక్సాఫీస్ వద్ద పెద్ద హిట్ కొట్టారు. ఈ సినిమా విజయంతో ఆయన వెనుదిరిగి చూసుకోవాల్సిన అవసరం రాలేదు. టాక్సీవాలా, అర్జున్ రెడ్డి, గీత గోవిందం, ఫ్యామిలీ స్టార్, ఖుషి, కింగ్‌డమ్ ఇలా..వరుసగా సక్సెస్ ఫుల్ సినిమాలు చేస్తూ పాన్ ఇండియా స్టార్ గా ఎదిగారు. ప్రభాస్ కల్కి సినిమాలో అర్జునుడి పాత్రలో స్పెషల్ అప్పియరెన్స్ ఇచ్చారు. భారీ చిత్రాలు చేస్తూ పాన్ ఇండియా స్థాయిలో తెలుగు సినిమా రెస్పాన్స్ పెరగడంలో తన వంతు కృషి చేస్తున్నారు. ఎలాంటి బ్యాక్ గ్రౌండ్ లేకుండా చిన్న సినిమాతో కెరీర్ మొదలుపెట్టి పెద్ద స్టార్‌గా ఎదిగిన విజయ్ ప్రస్థానం ఎంతోమంది కొత్త వాళ్లకు ఇన్‌స్పిరేషన్ గా నిలుస్తోంది. మరో హీరో చూడనంత వెర్సటైల్ కెరీర్ చూశారు. రౌడీ వేర్ బ్రాండ్ తో ఒక వ్యాపారవేత్తగా సక్సెస్ ఫుల్ గా కొనసాగుతూనే, ది దేవరకొండ ఫౌండేషన్‌తో పేద మధ్య తరగతి వారికి సహాయ కార్యక్రమాలు చేస్తున్నారు. ఇటీవల మహబూబ్ నగర్ జిల్లాలో ప్రతిభ గల 180 మంది పేద విద్యార్థులకు స్కాలర్ షిప్స్ అందించారు. ఈ సినిమా డిసెంబర్‌లో రిలీజ్‌కు రెడీ అవుతోంది. మైత్రీ మూవీ మేకర్స్, టీ సిరీస్ నిర్మాణంలో రాహుల్ సంకృత్యన్ దర్శకత్వంలో రణబాలి సినిమాలో నటిస్తున్నారు విజయ్. భారీ పాన్ ఇండియా ప్రాజెక్ట్‌గా మూవీ లవర్స్ దృష్టిని ఆకర్షిస్తోన్న రణబాలి సెప్టెంబర్ 11న రిలీజ్ కాబోతోంది. ఇక విజయ్ సినిమాల్లో మోస్ట్ అవేటెడ్ గా మారుతోంది వైరా ఎంటర్‌టైన్‌మెంట్స్, దర్శకుడు శౌర్యువ్‌తో చేస్తున్న సినిమా. ఈ చిత్రానికి పలువురు పేరున్న హాలీవుడ్ టెక్నీషియన్స్ పనిచేస్తుండటం విశేషం. ఇప్పుడు విజయ్ చేస్తున్న ఈ మూడు సినిమాలు స్టార్ గా ఆయనను మరింత గొప్ప స్థాయికి చేరుస్తాయనే అంచనాలు ఏర్పడుతున్నాయి.

## 'ఐ యామ్ గేమ్' ట్రైలర్ రిలీజ్



దుల్కర్ సల్మాన్ ప్రతిష్టాత్మక చిత్రం 'ఐ యామ్ గేమ్' ట్రైలర్ విడుదలైంది. జూనియర్ ఎన్‌టిఆర్ ట్రైలర్‌ని లాంచ్ చేశారు. ఈ సందర్భగా సోషల్ మీడియాలో స్పెషల్ పోస్ట్ పెట్టారు. ఐయామ్‌గేమ్ ట్రైలర్లోని ఆ ఫైర్ వైబ్ నాకు బాగా నచ్చింది. మొదటి నుంచి చివరి వరకు ఎంతో గ్రిప్పింగ్‌గా, ఎంగేజింగ్‌గా సాగింది. నా సోదరుడు దుల్కర్ మరో స్పెషల్ మూవీతో వస్తున్నారని నమ్మకం కలిగింది. తనకి మంచి ఫలితాన్ని ఇవ్వాలని కోరుకుంటున్నాను. అతనితో పాటు మొత్తం చిత్ర బృందానికి నా హృదయపూర్వక శుభాకాంక్షలు అని జూనియర్ ఎన్‌టిఆర్ సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. ఈ చిత్రం ఆగస్టు 20న ఓణం కానుకగా ప్రపంచ వ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది. దుల్కర్ సల్మాన్ వేఫేరర్ ఫిలిమ్స్ బ్యానర్‌పై తెరకెక్కిన ఈ భారీ బడ్జెట్ ఫాంటసీ థ్రిల్లర్, ఆయన కెరీర్లోనే అత్యంత భారీ చిత్రంగా రూపొందుతోంది. ఈ చిత్రానికి నహాస్ హిదాయత్ దర్శకత్వం వహిస్తున్నారు. దుల్కర్ సల్మాన్, జోమ్ వర్గీస్ వేఫేరర్ ఫిలిమ్స్ బ్యానర్‌పై నిర్మిస్తున్న ఈ చిత్రానికి సాజిర్ బాబా, ఇస్మాయిల్ అబూబక్కర్, బిలాల్ మొయిదు స్క్రీన్‌ప్లే అందించగా, సాజిర్ బాబా, ఆదర్శ్ సుకుమారన్, షబాస్ రషీద్ సంభాషణలు రాశారు.దక్షిణ భారతదేశంలోని 100కు పైగా లొకేషన్లలో చిత్రీకరించిన 'ఐ యామ్ గేమ్', ఈ ఏడాది అత్యంత ఆసక్తిగా ఎదురుచూస్తున్న చిత్రాల్లో ఒకటిగా నిలిచింది. ఈ చిత్ర సంగీత హక్కులను జీ మ్యూజిక్ సొంతం చేసుకోగా, జేక్స్ బిజోయ్ సంగీతం అందించారు. యాక్షన్ సీక్వెన్స్‌లను అన్బరివ్ మాస్టర్స్ కొరియోగ్రఫీ చేశారు. దుల్కర్ సల్మాన్ కెరీర్లో 40వ చిత్రంగా తెరకెక్కుతున్న ఈ భారీ బడ్జెట్ యాక్షన్ థ్రిల్లర్లో ఆంటోనీ వర్గీస్, తమిళ నటుడుదర్శకుడు మిస్కిన్, కాయదు లోహర్, కథిర్, పార్థ్ తివారీ, తమిళ నటి సంయుక్త విశ్వనాథన్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. 'ఐ యామ్ గేమ్' మలయాళం, తెలుగు, తమిళం, హిందీ, కన్నడ భాషల్లో పాన్ ఇండియా చిత్రంగా ఆగస్టు 20న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది.

## 7న వస్తున్న 'అమ్మా.. నాకు ఆ అబ్బాయి కావాలి'



జిఎస్ఆర్ మూవీ మేకర్స్ పతాకంపై పవన్ మహావీర్ ను హీరోగా పరిచయం చేస్తూ... ప్రముఖ మహిళా వ్యాపారవేత్త శైలజ రెడ్డి నిర్మించిన విభిన్న ప్రేమకథా చిత్రం 'అమ్మా... నాకు ఆ అబ్బాయి కావాలి'. లండన్‌లో వైద్య విద్య అభ్యసిస్తున్న పవన్ మహావీర్ ఈ చిత్రంలో హీరోగా నటించడం విశేషం. శివాల ప్రభాకర్ దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో వర్షిక, సుహానా హీరోయిన్‌లుగా నటిస్తున్నారు. సుమన్, రావు రమేష్, రాజీవ్ కనకాల, సత్య కృష్ణ, సుజాత తదితరులు కీలక పాత్రలు పోషించారు. ఈ చిత్రం ఆగస్టు 7న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా ఈ చిత్రంలో కీలక పాత్ర పోషించిన సీనియర్ హీరో ప్రత్యేక మీడియా సమావేశం నిర్వహించారు. నిర్మాత జి. శైలజరెడ్డి మాట్లాడుతూ 'అమ్మా... నాకు ఆ అబ్బాయి కావాలి అద్భుతంగా వచ్చేందుకు సహకరించిన మా సీనియర్ హీరో సుమన్ కి ప్రత్యేక కృతజ్ఞతలు. ఈ చిత్రాన్ని 7న విడుదల చేస్తున్నాం. అందరూ ఆదరించాలని కోరుకుంటున్నాం అని అన్నారు. సీనియర్ హీరో సుమన్ మాట్లాడుతూ 'అమ్మా... నాకు ఆ అబ్బాయి కావాలి' లో నేను ఒక ముఖ్య పాత్ర పోషించాను. సినిమా చాలా బాగా వచ్చింది. పవన్ మహావీర్ కు ఇది పరిచయచిత్రమంటే నాకే నమ్మబుద్ధి కాలేదు. అలాగే నిర్మాత శైలజ రెడ్డి కూడా పదిపదిహేను సినిమాలు తీసిన అనుభవజ్ఞురాలైన నిర్మాతలా ప్రాజెక్ట్ ను అద్భుతంగా హ్యాండిల్ చేశారు. కోడి రామకృష్ణ దర్శకత్వంలో నేను హీరోగా నటించిన పలు చిత్రాలకు కోడైరెక్టర్‌గా పనిచేసిన శివాల ప్రభాకర్ ఈ చిత్రాన్ని చాలా గొప్పగా తీర్చిదిద్దారు అన్నారు




## 'సుధీర్స్ జోకర్'లో గాయత్రీ దేవిగా అభిరామి

సుడిగాలి సుధీర్ హీరోగా నటిస్తున్న కొత్త సినిమా 'సుధీర్స్ జోకర్'. బిగ్ బాస్ ఫేమ్ అయేషా ఈ చిత్రంతో హీరోయిన్ గా పరిచయం కాబోతోంది. ఈ చిత్రంలో అభిరామి, మురళీ శర్మ, అజయ్ ఘోష్, రమేష్ ఇందిరా, విష్ణు ఓయ్, మురళీధర్ గౌడ్ ఇతర కీలక పాత్రల్లో కనిపించనున్నారు. 'పరదా' లాంటి విభిన్నమైన చిత్రం తర్వాత ఆనంద మీడియా బ్యానర్ పై ప్రొడ్యూసర్స్ శ్రీనివాసులు పి.వి. విజయ్ డొంకాడ, శ్రీధర్ మక్కువ నిర్మిస్తున్నారు. పీఎస్ సునీల్ పుప్పాల దర్శకత్వం వహిస్తున్నారు. ఈ చిత్రంలోని ఓ కీలక పాత్రలో ప్రముఖ నటి అభిరామి నటిస్తున్నట్లు ప్రకటించారు. 'సుధీర్స్ జోకర్' సినిమాలో అభిరామి గాయత్రీ దేవి పాత్రలో ప్రేక్షకుల్ని అలరించబోతోంది. ఈ అనౌన్స్ మెంట్ సందర్భంగా అభిరామి పోషిస్తున్న గాయత్రీ దేవి క్యారెక్టర్ ఫస్ట్ లుక్ పోస్టర్ రిలీజ్ చేశారు. ఇటీవల రిలీజ్ చేసిన 'సుధీర్స్ జోకర్' మూవీ బ్యాంగర్‌కు హ్యూజ్ రెస్పాన్స్ దక్కింది. ఒక ఇంట్రెస్టింగ్ కమర్షియల్ ఎంటర్ టైనర్ చూడబోతున్నామనే ఎక్స్ పెక్టేషన్స్ ఈ మూవీపై ఏర్పడుతున్నాయి. ఈ చిత్రానికి ఎడిటర్ ధర్మేంద్ర కాకర్ల, సినిమాటోగ్రఫీ అహ్మద్ షెరీఫ్, మ్యూజిక్ లియోన్ జేమ్స్.

## 'నేను ప్రేమికుడ్ని' ఫస్ట్ లుక్ విడుదల



ఆల్మైటి క్రియేషన్స్ బ్యానర్ లో శ్రీ వి చిన్న శ్రీశైలం యాదవ్ సమర్పణలో వడిగేపల్లి కృష్ణ నిర్మాతగా వి రమేష్ యాదవ్, కాకర్లమూడి రామకృష్ణ సహ నిర్మాతలుగా రామ్ భారధరం దర్శకత్వంలో దేవరపల్లి రేవంత్, ఎల్సా ఘోస్ హీరో హీరోయిన్లు గా తెరకెక్కుతున్న చిత్రం నేను ప్రేమికుడ్ని. ఈ చిత్రం ఫస్ట్ లుక్ విడుదల కార్యక్రమం హైదరాబాద్ లో గ్రాండ్ గా జరిగింది ఈ కార్యక్రమానికి ప్రముఖ దర్శకుడు కోదండరామిరెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేసి నేను ప్రేమికుడ్ని ఫస్ట్ లుక్ విడుదల చేశారు. ఈ సందర్భంగా కోదండరామిరెడ్డి మాట్లాడుతూ 'మంచి కాన్సెప్ట్ తో రాబోతున్న ఈ సినిమా తప్పకుండా విజయం సాధించాలి అన్నారు. హీరో రేవంత్ దేవరపల్లి మాట్లాడుతూ 'లవ్, హారర్ ఎలిమెంట్స్ తో రాబోతున్న మా సినిమా ఫస్ట్ లుక్ కోదండరామిరెడ్డి విడుదల చెయ్యడం సంతోషంగా ఉంది. త్వరలో మా సినిమా ప్రేక్షకుల ముందుకు రాబోతోంది, నేను ప్రేమికుడ్ని సినిమా అందరికి నచ్చే ఫ్యామిలీ సినిమా అవుతుంది అన్నారు. సహ నిర్మాత రమేష్ యాదవ్ మాట్లాడుతూ ఈ చిత్రం మంచి కథతో తెరకెక్కించారని అన్నారు. టైటిల్ కూడా ఇప్పటి జనరేషన్ కు తగ్గట్టుగా పెట్టారని అన్నారు. తప్పకుండ ఈ చిత్రం సక్సెస్ అవుతుందనే నమ్మకం ఉందన్నారు. కోదండరాంరెడ్డి ట్రైలర్ విడుదల చేయడం సంతోషంగా ఉన్నదని చెప్పారు. ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ ప్రసాద్ ఈదర, ఎడిటర్ నందమూరి హరి, ఆర్ట్ విజయకృష్ణ, ఫైట్స్ అవినాష్, డాన్స్ బండ్ల రామారావు.

## మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావుపై 'లైంగిక దాడి కేసు'

### పెళ్లి పేరుతో యువ జర్నలిస్టుతో కలిసి ఉన్న వైనం

**ప్రజాపక్షం / హైదరాబాద్:** పెళ్లి చేసుకుంటానని నమ్మించి నాలుగేళ్ల పాటు లైంగికంగా వాడుకున్నాడని ఆరోపిస్తూ ఓ మాజీ ఎమ్మెల్యేపై యువ జర్నలిస్టు ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేశారు. బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావుపై భారతీయ న్యాయ సంహిత (బిఎన్‌ఎస్) సెక్షన్ 69, 351(2) కింద ఎఫ్‌ఐఆర్ నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.పోలీసుల రిమాండ్ నివేదికలో పేర్కొన్న వివరాల ప్రకారం.. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు చెందిన 22 ఏళ్ల యువతి మీడియా రంగంలో పనిచేస్తోంది. 2022లో ఇంటర్వ్యూ నిమిత్తం మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావును కలిసిన సమయంలో పరిచయం ఏర్పడిందని, అనంతరం యూట్యూబ్ ఛానల్ ఏర్పాటు చేస్తానని చెప్పి తనను దగ్గర చేసుకున్నాడని ఆమె ఫిర్యాదులో పేర్కొంది. ఆ తర్వాత పెళ్లి చేసుకుంటానని హామీ ఇచ్చి అమీర్‌పేట్‌లోని ఓ ఫ్లాట్‌లో తనతో సహజీవనం చేశాడని, హైదరాబాద్‌కు వచ్చిన ప్రతిసారీ అక్కడే ఉండేవాడని తెలిపింది. ఈ క్రమంలో తన వ్యక్తిగత ఫొటోలు తీసి, వాటితో బ్లాక్‌మెయిల్ చేస్తూ పలుమార్లు లైంగికంగా వేధించాడని ఆరోపించింది. 2025 మధ్య వరకు ఈ సంబంధం కొనసాగిందని పేర్కొంది.అలాగే రియల్ ఎస్టేట్ పెట్టుబడి పేరుతో తన వద్ద నుంచి రూ.4 లక్షలు తీసుకుని తిరిగి ఇవ్వకుండా మోసం చేశాడని, తర్వాత తనను పూర్తిగా దూరం పెట్టాడని ఫిర్యాదులో వెల్లడించింది. అనంతరం తన స్నేహితులతో కూడా తనకు తెలియకుండా సంబంధాలు కొనసాగించాడని ఆరోపించింది. 2026లో తన ఆరోగ్య, ఆర్థిక సమస్యల నేపథ్యంలో సన్నిహితుల ద్వారా మాజీ ఎమ్మెల్యే అనుచరులతో చర్చలు జరిగాయని, ఈ క్రమంలో తన ఖాతాలో రూ.8.50 లక్షలు జమయ్యాయని తెలిపింది. అయితే డబ్బు తిరిగి రావడం తన ప్రధాన ఉద్దేశం కాదని, పెళ్లి పేరుతో మోసం చేసి లైంగికంగా దోపిడీ చేయడమే అసలు అంశమని ఫిర్యాదులో స్పష్టం చేసింది. తనకు లేదా తన కుటుంబ సభ్యులకు ఎలాంటి బెదిరింపులు రాకుండా రక్షణ కల్పించాలని కూడా పోలీసులను కోరింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు ఎస్ఐ నర్సింగ్‌రావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## ఆయిల్ పామ్ కంపెనీలకు మంత్రి తుమ్మల వార్నింగ్

### లక్ష్యాలు చేరకపోతే కఠిన చర్యలు.. అవసరమైతే కంపెనీల తొలగింపు



**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాష్ట్రంలో ఆయిల్ పామ్ సాగు విస్తరణలో నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్న కంపెనీలపై కఠిన చర్యలు తీసుకుంటామని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు హెచ్చరించారు. ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను సాధించడంలో విఫలమైతే జిల్లాల కేటాయింపులను తగ్గించడం, అవసరమైతే కంపెనీలను పూర్తిగా తొలగించడానికైనా వెనుకాడబోమని స్పష్టం చేశారు. రాష్ట్ర సచివాలయంలో శుక్రవారం ఆయిల్ పామ్ కంపెనీల ప్రతినిధులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో మంత్రి మాట్లాడుతూ ఈ ఏడాది 85 వేల ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగు లక్ష్యంగా పెట్టుకోగా ఇప్పటి వరకు కేవలం 17,090 ఎకరాల్లో మాత్రమే సాగు నమోదైందని, ఇది తీవ్ర నిరాశ కలిగించే విషయమన్నారు. రైతులు ముందుకు వస్తున్నా కంపెనీలు అలసత్వం ప్రదర్శించడం ఆమోదయోగ్యం కాదని ఆగ్రహం వ్యక్తం చేశారు. పనితీరు సరిగా లేని పలు కంపెనీలకు ఇప్పటికే పలుమార్లు నోటీసులు జారీ చేసినప్పటికీ పరిస్థితిలో మార్పు కనిపించలేదని తెలిపారు. మెరుగైన పనితీరు చూపని కంపెనీల పరిధిలోని జిల్లాలను తగ్గించి సమర్థవంతంగా పనిచేసే సంస్థలకు అప్పగిస్తామని, ప్రభుత్వ సంస్థ ఆయిల్ ఫెడ్‌కూ ఎలాంటి మినహాయింపు ఉండదని స్పష్టం చేశారు.ఆగస్టు నెలలో మొక్కల కొరత రాకుండా అవసరమైతే ఇతర కంపెనీల నుంచి మొక్కలు కొనుగోలు చేసి రైతులకు వెంటనే అందించాలని ఆదేశించారు. అలాగే క్షేత్రస్థాయిలో రైతులకు సాంకేతిక సహాయం అందించడంతో పాటు నిర్మాణంలో ఉన్న ఆయిల్ పామ్ ప్రాసెసింగ్ యూనిట్లను నిర్ణీత గడువులో పూర్తి చేసి రైతులకు అందుబాటులోకి తీసుకురావాలని కంపెనీల ప్రతినిధులకు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సూచించారు.

## గోదావరి వరదపై అప్రమత్తంగా ఉండాలి

### ముందస్తు చర్యలకు మంత్రి పొంగులేటి ఆదేశం

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** వరుసగా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా భద్రాచలం వద్ద గోదావరి నదికి వరద ఉద్ధృతి పెరుగుతున్న నేపథ్యంలో, పరివాహక ప్రాంత ప్రజల భద్రతకు ఎలాంటి లోటు లేకుండా అన్ని ముందస్తు చర్యలు చేపట్టాలని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి అధికారులను ఆదేశించారు. శుక్రవారం సాయంత్రం ఖమ్మం జిల్లా కలెక్టర్ టి.ఎస్. దివాకరతో మంత్రి టెలిఫోన్‌లో మాట్లాడారు. గోదావరి వరద పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షించాలని, భద్రాచలం వద్ద నీటిమట్టం వేగంగా పెరుగుతున్న దృష్ట్యా నదీ పరివాహక, లోతట్టు ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేయాలని ఆదేశించారు. ప్రజల ప్రాణ భద్రతకు అత్యున్నత ప్రాధాన్యం ఇవ్వాలని, అవసరమైతే వరద ముప్పు ఉన్న గ్రామాల ప్రజలను ముందుగానే సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు అన్ని ఏర్పాట్లు సిద్ధంగా ఉంచాలన్నారు. పునరావాస కేంద్రాల్లో తాగునీరు, ఆహారం, వైద్య సేవలు, విద్యుత్, పారిశుద్ధ్యం వంటి మౌలిక వసతులన్ని అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా యంత్రాంగంతో పాటు రెవెన్యూ, పోలీసు, అగ్నిమాపక, ఎన్‌డిఆర్‌ఎఫ్, ఎస్‌డిఆర్‌ఎఫ్ బృందాలు సమన్వయంతో పనిచేస్తూ పరిస్థితిని నిరంతరం పర్యవేక్షించాలన్నారు. ప్రజలకు ఎప్పటికప్పుడు హెచ్చరికలు జారీ చేస్తూ, నిర్లక్ష్యానికి తావివ్వకుండా అవగాహన కల్పించాలన్నారు. జలాశయాలకు భారీగా వరద నీరు చేరుతున్న నేపథ్యంలో ప్రాజెక్టుల పరిస్థితిని అధికారులు నిరంతరం పర్యవేక్షిస్తూ, దిగువ ప్రాంత ప్రజలకు ముందస్తు సమాచారం అందించాలని సూచించారు. పరివాహక ప్రాంత ప్రజలు అధికారుల సూచనలను తప్పనిసరిగా పాటించాలని, వదంతులను నమ్మకుండా అప్రమత్తంగా ఉండాలని మంత్రి శ్రీనివాస రెడ్డి విజ్ఞప్తి చేశారు. ప్రజల ప్రాణ, ఆస్తుల రక్షణకు రాష్ట్ర ప్రభుత్వం అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటుందన్నారు. భద్రాచలం వద్ద గోదావరి నది ఉగ్రరూపం దాల్చడంతో మూడో ప్రమాద హెచ్చరిక జారీ చేసినట్లు కలెక్టర్ మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఎగువ నుంచి వస్తున్న భారీ వరదతో మధ్యాహ్నానికి నీటి మట్టం 48 అడుగులకు చేరుకుందని, 11,44,507 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నట్లు తెలిపారు.

## టిమ్స్‌కు మర్రి చెన్నారెడ్డి పేరు

(మొదటి పేజీ తరువాయి)

ఇన్‌చార్జ్ డైరక్టర్‌గా ప్రభుత్వం నియమించింది. ప్రస్తుతం గాంధీ హాస్పిటల్ సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న అడిషనల్ డిఎంఈ డాక్టర్ ఎన్.వాణిని మెడికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్‌గా నియమించింది. కాగా వాణికి గతంలోనూ డీఎంఈగా కొంతకాలం పనిచేసిన అనుభవం ఉంది. జాతీయ నాయకుడు, తెలంగాణ అభివృద్ధికి ఎంతో కృషి చేసిన డాక్టర్ మర్రి చెన్నారెడ్డి అందించిన సేవలు చిరస్మరణీయమని ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ అన్నారు. ఒక వైద్యునిగా, రాజకీయ నాయకునిగా, రాష్ట్ర ముఖ్యమంత్రిగా, గవర్నర్‌గా ఆయన జీవితాంతం ప్రజల కోసం పనిచేశారని గుర్తు చేశారు. అలాంటి వ్యక్తి పేరును సనత్‌నగర్ టిమ్స్‌కు పెట్టుకోవడం సంతోషంగా ఉందన్నారు.

నరేంద్ర కుమార్‌కు ఉన్న సుదీర్ఘ అనుభవాన్ని సనత్‌నగర్ టిమ్స్ నిర్మాణాత్మక దశలో ఉపయోగించుకోవాలనే ఉద్దేశంతో ఆయనకు ఇన్‌చార్జ్ డైరక్టర్గా బాధ్యతలు అప్పగించామని మంత్రి దామోదర రాజనర్సింహ తెలిపారు. టిమ్స్‌ను అత్యున్నత ప్రమాణాలతో కూడిన సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌గా తీర్చిదిద్ది, వీలైనంత త్వరగా ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడంపైన ప్రభుత్వం ప్రత్యేక దృష్టి కేంద్రీకరించిందని వివరించారు.

## మరోసారి 'సర్' పొడిగింపు

(మొదటి పేజీ తరువాయి)

ఇప్పటివరకు 77.12 శాతం సర్వే ప్రక్రియ పూర్తయినట్లు ఎన్నికల సంఘం వెల్లడించింది. అయితే హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్‌మల్కాజిగిరి వంటి పట్టణ జిల్లాల్లో ప్రక్రియ మందకొడిగా సాగుతోంది. హైదరాబాద్‌లో 56.31 శాతం, రంగారెడ్డిలో 63.43 శాతం, మేడ్చల్‌మల్కాజిగిరిలో 61.37 శాతం మాత్రమే పూర్తయినట్లు తెలుస్తోంది. ఈ జిల్లాల్లో నెమ్మదిగా సాగుతున్న సర్వేయే గడువు పొడిగింపునకు ప్రధాన కారణంగా చెబుతున్నారు.

**బిఎల్‌ఓల ఇంటింటి సర్వే**

ఈ ప్రక్రియలో భాగంగా బూత్ స్థాయి అధికారులు (బిఎల్‌ఓలు) ఇంటింటికీ వెళ్లి ఓటర్ల వివరాలను క్షేత్రస్థాయిలో సరిచూస్తున్నారు. ప్రస్తుతం ఉన్న ఓటర్లను నిర్ధారించడం, నకిలీ ఓట్లను గుర్తించడం, మరణించిన లేదా వేరే ప్రాంతాలకు వలస వెళ్లిన వారి పేర్లను తొలగించడం, అర్హులైన కొత్త ఓటర్లను చేర్చడం వంటి బాధ్యతలను వీరు నిర్వర్తిస్తున్నారు.

### సవరించిన ఎస్ఐఆర్ షెడ్యూల్ ఇలా ఉంది..

ఎన్యూమరేషన్ ఫారమ్‌ల సమర్పణకు చివరి తేదీ : ఆగస్టు 10
పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ, పునర్వ్యవస్థీకరణ : ఆగస్టు 10
ముసాయిదా ఓటరు జాబితాల ప్రచురణ : ఆగస్టు 17
క్లెయిములు, అభ్యంతరాల స్వీకరణ : ఆగస్టు 17 నుంచి సెప్టెంబర్ 16
క్లెయిములు, అభ్యంతరాల పరిష్కారం : ఆగస్టు 17 నుంచి అక్టోబర్ 15 వరకు
తుది ఓటరు జాబితాల ప్రచురణ : అక్టోబర్ 19.

## కోల్‌కతాకు తస్లీమా నస్రీన్

(మొదటి పేజీ తరువాయి)

రచనలపై జరిగిన హింసాత్మక నిరసనల కారణంగా నవంబర్ 27న నగరాన్ని విడిచి వెళ్లవలసి వచ్చినప్పటి నుండి, ఆమె ఇక్కడకు తిరిగి రావడం కోల్‌కతాకు ఇది ఆమె మొదటి పర్యటన. బంగ్లాదేశ్ నుంచి బహిష్కరణకు గురైన తర్వాత, తనకు సొంత ఇంటిలా అత్యంత సన్నిహితమైనదిగా ఆమె తరచుగా అభివర్ణించే ఈ ప్రదేశానికి తెరపడింది. తస్లీమా నస్రీన్ రవీంద్ర సదన్‌లో జరిగే ఛాందసవాద వ్యతిరేక సాహిత్య కార్యక్రమంలో ఆమె తన కవిత్వాన్ని పఠించి, అనంతరం తొలిసారిగాబహిరంగంగా కనిపించనున్నారు. ముఖ్యమంత్రి సువేందు అధికారి, ప్రముఖ రచయిత శిర్షేందు ముఖోపాధ్యాయ తదితరులు కూడా ఈ కార్యక్రమానికి హాజరుకానున్నారు. అయితే, దీనిని ఒక సాహిత్య సమావేశంగా తలపెట్టబడినప్పటికీ, పశ్చిమబెంగాల్‌లో బిజెపి ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొన్ని నెలల తర్వాత భావ ప్రకటనా స్వేచ్ఛ, లౌకికవాదం, మతపరమైన సున్నితత్వాల పట్ల రాష్ట్ర ప్రభుత్వం వైఖరిపై చర్చలు మళ్లీ మొదలవుతున్న తరుణంలో జరిగే ఈ కార్యక్రమం అనివార్యంగా రాజకీయ ప్రాధాన్యతను సంతరించుకుంది.తన పర్యటనకు ముందు, కోల్‌కతాకు తిరిగి రావడం 'నా సొంత దేశానికి తిరిగి వచ్చినట్లు అనిపిస్తోంది' అని తస్లీమా నస్రీన్ 'పిటిఐ'కి తెలిపారు. నేను నా సొంత దేశానికి తిరిగి వస్తున్నట్లు భావిస్తున్నాను. బెంగాల్ నా హృదయంలో ఉన్నదూ సరిహద్దుతోగానీ, ముళ్ల కంచెతో గానీ విభజించబడలేదు. బెంగాల్ తూర్పు భాగానికి నాకు తలుపు ఇంకా మూసే ఉంది. ప్రస్తుతానికి బెంగాల్‌లోని ఈ భాగమే నా ఇల్లు' అని ఆమె తెలిపారు. తాను ఆనందంతో పాటు, బాధతో కూడా ఇక్కడకు తిరిగి వస్తున్నానని తస్లీమా చెప్పారు. శనివారం నాటి కార్యక్రమం ఒక రాజకీయ వేదికగా ఉపయోగపడటానికే కాకుండా మత ఛాందసవాదానికి రచయిత్రి తస్లీమా నస్రీన్ జీవితకాలం పాటించిన వ్యతిరేకతను గౌరవించడానికి, భావ ప్రకటనా స్వేచ్ఛ సూత్రాన్ని పునరుద్ఘాటించడానికి ఉద్దేశించినదని నిర్వాహకులు స్పష్టం చేశారు.

## హమాస్ ఓకె

(మొదటి పేజీ తరువాయి)

భావిస్తున్నారు. 1987లో ఏర్పడినప్పటి నుంచి ఈ సంస్థ ఇజ్రాయెల్‌పై సాయుధ పోరాటాన్ని తన ప్రధాన సిద్ధాంతంగా కొనసాగిస్తోంది. రాకెట్లు, యాంటీ ట్యాంక్ క్షిపణులు, పేలుడు పదార్థాలు, సొరంగాల వ్యవస్థ వంటి వాటిని తన సైనిక సామర్థ్యంలో కీలక భాగంగా భావిస్తోంది. అందువల్ల ఆయుధాలను వదులుకోవడం హమాస్ అంతర్గతంగా కూడా పెద్ద నిర్ణయంగా మారనుంది. ఒప్పందం ప్రకారం గాజాలో పనిచేసే పోలీసు బలగాల వద్ద ఉన్న ఆయుధాలను అమెరికా మద్దతుతో ఏర్పడే పాలస్తీనియన్ సాంకేతిక కమిటీకి అప్పగించాలి. ఆ తర్వాత భారీ ఆయుధాలు, ఆయుధ తయారీ కేంద్రాలు, సొరంగాల వ్యవస్థను నిర్వీర్యం చేసే ప్రక్రియ ప్రారంభమవుతుంది. ఈ ప్రక్రియ అంతర్జాతీయ స్థిరీకరణ బలగాల రాకడ, ఇజ్రాయెల్ సైన్యం దశలవారీ ఉపసంహరణలతో అనుసంధానమై ఉంటుంది. అయితే ఇజ్రాయెల్ ఈ ఒప్పందంపై ఇంకా జాగ్రత్తగా ఉంది. హమాస్ నిజంగా ఆయుధాలను వదులుతుందా? లేక గాజాపై తన నియంత్రణను పూర్తిగా వదులుకుంటుందా? అనే విషయంలో ఇజ్రాయెల్‌కు అనుమానాలు ఉన్నాయి. ఇజ్రాయెల్ అధికారులు స్పష్టం చేసిన ప్రకారం, హమాస్ పూర్తిగా నిరాయుధీకరణకు లోబడే వరకు గాజాలో తాము నియంత్రిస్తున్న ప్రాంతాల నుంచి వెనక్కి వెళ్లబోమని చెబుతున్నారు. అమెరికా, టర్కీ, ఈజిప్ట్, ఖతర్ ఈ ఒప్పందానికి మధ్యవర్తులుగా వ్యవహరిస్తున్నాయి. అయితే హమాస్ వద్ద ఉన్న భారీ ఆయుధాలు, సొరంగాల నిర్మూలనకు నెలల నుంచి సంవత్సరాల సమయం పట్టే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. కొందరు అమెరికా అధికారులు ఈ ప్రక్రియకు 200 నుంచి 350 రోజుల వరకు సమయం పట్టవచ్చని పేర్కొన్నారు. 2023 అక్టోబర్ 7న హమాస్ ఇజ్రాయెల్‌పై దాడి చేయడంతో ప్రారంభమైన ఈ యుద్ధంలో వేలాది మంది ప్రాణాలు కోల్పోయారు. ఇజ్రాయెల్ ప్రతీకార దాడుల్లో గాజాలో భారీ ప్రాణనష్టం, మౌలిక సదుపాయాల విధ్వంసం జరిగింది. ప్రస్తుతం ప్రతిపాదించిన ఒప్పందం యుద్ధానికి ముగింపు దిశగా ఒక అవకాశం కల్పిస్తున్నప్పటికీ, దాని విజయవంతమైన అమలు హమాస్, ఇజ్రాయెల్, అంతర్జాతీయ మధ్యవర్తుల మధ్య నమ్మకం, సహకారంపై వంటి కీలక అంశాలపై ఆధారపడి ఉంటుంది.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at Plot No 302, Venkata Sai Towers, Nehrunagar, KHAMMAM 507 002 Telangana State. RNI TELTEL /2018/76759, **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com